
# ఋతవాణి



# ప్రార్థన

ఓ, ప్రభూ ! మానవ జీవనమునకు నీవే లక్ష్యమవు,

మా కోరికలు ఆత్మోన్నతికి ప్రతిబంధకములై యున్నవి,

నీవే మా ఏకైక స్వామివి – ఇష్టదైవమవు,

నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.

# నా ఆవేదన

ప్రతి యొక్కనికి తనదైన బాధా దుఃఖముల కథ కలదు. నాకును నాది యున్నది. కాని, దాని స్వభావమే వేఱు, అదృష్టము వరించినపుడు మా గురుపాద సాన్నిధ్యము నాకు లభించి, వారి యిచ్ఛకు నన్ను నేను సంపూర్ణముగా సమర్పించుకొంటిని. అనతి కాలములోనే నాలో నొక విచిత్ర మానసికస్థితి ఏర్పడి, చాలా కాలము సాగెను. తదనంతరము నాలో దుస్సహ భావమొకటి ఉత్పన్నమై కొనసాగెను. అది అచిరకాలమునందే ఒక విధమైన తపనగాను, ఆవేదనగాను వృద్ధిచెందను. కొంత కాలమునకు దాని వలని బాధ లెంత తీవ్రతరము లాయెనన ఆధ్యాత్మికతతో సంబంధములేని యితరుల కెవరికైనను అట్టి స్థితి సంభవించి యుండిన వారాత్మహత్యకు తలపడి యుండెడి వారు. కాని, 'నీ యిచ్ఛానుసారమే అగు గాక' అను భావము నాలో లోతుగా నాటుకొని పోయి యుండి, నాకు దానిని సహించుటకు వలయు ధైర్యోపశమనముల నిచ్చెను.

ఆవేదనా కాంక్ష, ప్రగాఢ వాంఛ లేక తపన – ఎవ్వరే విధముగ పిలుచుట కిష్టపడినను – నా హృదయమున కెంత ప్రీతి పాత్రమైపోయినదనగా నేను దానికై వేల జన్మలు త్యాగము చేయుటకైనను వెనుదీయను. ఏ సంతోషము ఆనందము ఎన్నడును దేనికి సాటిరావో అట్టి ఆవేదన నాలో తిరిగి జనించవలెనని ఆకాంక్షింతును. అది సాటిలేనిది. ఎవరైనను దానికై స్వర్గ సౌఖ్యము సహితము త్యజించుటకు ఉత్సహింతురు. దీనిని ప్రజలు ఉన్మత్తావేశస్థితి యని అపార్థము చేసుకొన వచ్చునని నా భయము. కాని, ప్రియ సోదరులారా! ఆకలిగొన్న వానికి కావలసినది ఆహారము. నా నిర్మాణ సర్వస్వ మావిధముననే తీర్చబడినది. ఈ కారణముననే ఈ ఆవేదన మీ అందరిలోను జనించవలెనని, నేను ఆసక్తితో ఆకాంక్షింతును. ఇది నాకు కూడ సంతృప్తికి మూలము. ఈ విషయమున నన్ను సంతృప్తునిగా జేయ జూచుట మీ కర్తవ్యాంశము కాదా? నాయందు భక్తి ఏ లవలేశమున్న వాడైనను నా జీవిత కృషి, తపనములకు ప్రతిఫలముగ నాకు శాంతిని ఉపశమనమును కలిగించునట్టి దానిని చేపట్టుటకు సహజముగానే ఉత్సహించును. అది సాధకుని ప్రాథమిక ధర్మములలో నొకటి.

లోకులు శాంతినే కాంక్షితురు. అందువలన, వారిని లక్ష్యానుభవమునకై తపనతో కూడిన ఆకాంక్షను చేపట్టునట్లు ప్రేరేపించుటెట్లు ? ఇట్టి తపన యందలి యాకర్షణ శాంతి యందలి యాకర్షణ కంటె కడుంగడు గొప్పదని నేను నమ్మకముగా చెప్పగలను. జనులు పేర్కొను శాంతి నిస్సందేహముగా నొక ఉన్నత సిద్ధియే కావచ్చును. దీని రుచినే ధ్యాన కాలమున అభ్యాసి యనుభవించును. కాని, దీనికి కేంద్రస్థానమొకటి యుండవలెనని యిది వెల్లడి చేయును. తాపము పరాకాష్ఠనందు కొన్నప్పుడు అది శాంతి యొక్క ప్రారంభమును సూచించును. అది అట్లే ఉండవచ్చును. లేకున్న ఆవేదనా తపనముల ననుభవించుటకు గాక శాంతి నిశ్చలతలను సాధించుటకై తామాధ్యాత్మిక క్షేత్రమున అడుగిడినట్లు చెప్పుకొనుట కెవరైనను ముందుకు వత్తురని నా భయము. వారి దృక్పథములో వారు సరి కావచ్చును. అయితే, నా దృక్పథములో మొదటిది, కేవలము భగవంతుని మీదనే ఎవరి దృష్టి స్థిరముగా స్థాపితమైయున్నదో వారికే అని చెప్పుదును. రెండవది, పారవశ్య జనిత మనదగిన సంతోషానుభవమునే కోరుకొను వారికి, ఇది పొందుట అంత కష్టసాధ్యము గాదు. కాని, మఱి యొకటిదయిన ఆవేదనను సాధించుట నిజమునకు శైశవ క్రీడ కాదు. అందఱి కంటె గొప్పఋషులు దాని కొఱకై నిరంతరము

తపించుచునే గతించిరి. వారిలో చాలమంది 'శాంతి'ని చవిచూచి యుందురు. అయితే దేని ప్రకాశరేణువు కొఱకై శాంతి నిశ్చలతా స్థితుల వేయింటినైన సమ్మతముగా పరిత్యజించ వచ్చునో అట్టి దానినిప్పుడు చవి చూడనిండు. ఇదియే అసాధారణ దివ్యపురుషులను ప్రపంచములోనికి తీసికొని వచ్చుటకు తోడ్పడు నిర్మాణమునకు పునాది. మానవసేవ చేయుటకది బహుశ అత్యుత్తమ మార్గమని కూడ నేను చెప్పవచ్చును. ఈ మార్గము ననుసరించువాడు జయమునందక తప్పదు. సాధకుని పురోగమన మార్గమును నిరాటంక పరచుటకు గ్రంథులను విడదీయుట యందిది అత్యంతముగా తోడ్పడును.

నా యొద్దకు ఆధ్యాత్మిక శిక్షణకై వచ్చువారిలో అత్యధికులు శాంతిని పొంద నాసక్తి గలవారుగానే కనుపట్టుచున్నారు. వారి కాంక్ష నెఱవేర్చుటకు నేను సమ్మతించవలసి వచ్చుచున్నది. ఆ విధమైన తపనతో కూడిన ఆవేదనను పొందవలెనను నాసక్తి వాస్తవముగా గల సాధకుల దృష్టాంతములు నా ముందు అరుదుగానే ఉన్నవి. ఏది గ్రహణశక్తికతీతమో, ఎక్కడ దానికి వైరుధ్యమన్న దేదియు లేదో, వాస్తవమున కదియే యదార్థ శాంతి స్థితి, దీనిని 'శాంతికే శాంతి' యని గాని, 'శాంతిసార'మని గాని – అంత సరిగా కాకపోయినను – రమారమిగా నిర్దేశించ వచ్చును. దీనికొక కవి యిట్లనుచున్నాడు :

***दर्दका हदसे गुजरना है दवा हो जाना ।***

బాధ తీవ్రతాపరిమితుల నతిక్రమించినపుడు దానికదియే మందమగును.

నా వేదనా గాథ సంగ్రహముగా నిదియే. దీనిని నేను బహుశః బాధతో కూడిన మాటలలో వివరించి యుండవచ్చును. మీకు మీరే వేదనా సాగరమగునంతగా మీ హృదయములు దీనితో నిండి వెల్లువలైనపుడు మాత్రమే నా శ్రమ ఫలమును నేను పొందుదును. అప్పుడది ఏమగును? ఆవేదన గాదు, తపన గాదు; సంయోగము గాదు, వియోగము గాదు; శాంతికాదు, తద్విరుద్ధముగాదు! మనము దేనికొఱకు వేదనను పెంపొందించు కొంటిమో అది యిదియే. నా హృదయాంతరాళమునుండి వెలువడిన నా యీ పలుకులు ఆశించిన ప్రభావమును మీ అందఱి యందును కలుగజేయుగాక! ఇది యేమాత్రము కష్టముగాదని విశ్వసనీయముగా చెప్పగలను. ఏలయన దైవీయ మార్గమున కష్టమైన దేదియును లేదు. దీనికి కావలసిన దంతయు ఏకాగ్రతతో కూడిన దృఢ సంకల్ప మొక్కటియే. అప్పుడు నీ వన్వేషించునది సమస్తము నీకతి సమీపముగా నున్నట్లు, నీలోనే యున్నట్లు గమనింతువు. అంతేకాదు, నీ వన్వేషించునది వాస్తవమనకు నీవే. దీనికి కావలసినది మార్గ మధ్యమున గల కలుపు మొక్కలను, పొదలను మాడ్చి వేయగల మండుచున్న హృదయ మొక్కటే. నీవు యదార్థమున ఏది గానున్నావో అది నుండవలసియున్నది. వేదన దానికి నిదర్శనము. తపన దానికి పూర్వ సూచన.

నేనా స్థితి యందు నలుబది దినములకు పైగా నుండి పోయితిని. తదనంతరము దాని దశ మాఱి, యదియొక విచిత్రమైన తపనాత్మక దుస్సహ భావముతో కూడిన ఆంతరిక శాంతిరూపము దాల్చినది. అది నిర్విరామముగా సుమారిరువది రెండేండ్లు కొనసాగినది. క్లుప్తముగా, నా అభ్యాస కాలమంతయు ప్రతి యొక్కరు ఆశించెడి శాంతి నిశ్చలతలకు మారుగా, ఆవేదనాత్మక తపనతోడనే గడచిపోయినది. అయితే, అది కేవలము నావంతుమాత్రమాయెను; నా సహచరులలో నే యొక్కరును అందేమాత్రమును పాలుపంచు కొనలేదు. దానికొఱకు నా హృదయమున నేనొక విచిత్రాకర్షణ కలిగి యుంటిని. అదియొక వేదనా తపన స్థితి అని తలచి శాంతియొక్క భావమును నేను అపార్థము చేసికొని యుండవచ్చుననుట కొంతవఱకు సంభవమే. కాని, కాలమిప్పుడు మాఱి, ప్రతి యొక్కరు శాంతి యందలి

వాస్తవికార్థమును సంపూర్తిగ గ్రహించి యుండుటచేత వారు దాని వైపు మనసు మొగ్గు చూపగా, దానినే ఆకాంక్షింతురు. అట్టి సంకల్పము నా మనసులో ఏ కాలమందును ఉదయించలేదు. ఇట్లు, నాకు 'శాంతి'ని ప్రసాదింపుమని నా గురుదేవుని ప్రేరేపించితినని, నా పేరుకు మచ్చ తెచ్చుకొనుట తప్పినది. నాకేది లభించనదియో అది నాకొక వరము. అందులకు నేను నా పరమ గురువర్యునకు అత్యంత కృతజ్ఞుడను.

అట్టి భావనను మన హృదయమున పెంపొందింపగల విధానము మన మిప్పుడాలోచింతము. అందులకు ఈ విషయమున సహాయపడు అంశము లన్నింటితోపాటు, మన పురోభివృద్ధి నడ్డగించు తదితరములను గూడ గణనకు తీసికొనవలెను. ఒక జీవిత కాలపుటనుభవముతో నేను కనుగొన్న దానిని బట్టి మార్గమునందు మిక్కిలి గొప్ప ప్రతి బంధకము మన పక్షపాత దురభిమాన భావములవలన కల్గుచున్నది. దీనినొక విధమైన అహంకారమని యించుమించుగా భావించవచ్చును. ఇది యెల్లరకు తెలిసిన అనేక రూపములలో నున్నది. నా ఉద్దేశము విశదీకరించుటకు నేనొక దృష్టాంతము గైకొందును. ఒక రాజు తాను రాజునని భావించుచు దానినే ప్రతిక్షణము పునశ్చరణము కావించిన అతడు తన చుట్టును ఘనత్వ స్థూలత్వ ఆవరణములను అధికాధికముగా చేర్చుకొనుచున్నాడని భావము. ఆ సందర్భములో ప్రతియొక్కరు నతనికి దురహంకారమును, డాంబికమును ఆపాదించుచుందురు. అది మితిమీఱినపుడాతడు రెండవ రావణాసురునిగా పరివర్తనము చెందును. వానికి గల అనేక శిరములతో బాటు స్వీయ మూర్ఖపు దురహంకారమునకు సంకేత రూపమగు గార్దభ శిర మొకటి అతనికి ఉండెను. ఇతరులే అతనిని ప్రభువుగా గౌరవింప వలయును కాని, నిజమునకు రాజు తనకు తానే యట్లనుకొనరాదు. తన మేరకు తాను సౌజన్యము, కారుణ్యము కలిగి, దుర్బలులకు దరిద్రులకు సహాయకుడై యుండవలసియున్నది. అప్పుడే అతడు తన ప్రజల సంపూర్ణ గౌరవము సంపాదింప జాలియుండును. అణకువగల వానిగా, తక్కువ వానిగా తనను తాను భావించుకొన్నప్పుడే ఎవ్వడైనను ఘనతకెక్కును, అహంకరము సాధింప జాలనిది అణకువ సాధించును. అందుచేత నొకడు తాను అధికుడుగాని, అల్పుడుగాని, కులీనుడుగాని, కులహీనుడు గాని; బ్రాహ్మణుడు గాని, శూద్రుడు గాని తన సౌశీల్యము నెన్నడును ఎడబాయరాదు. దైవము ఏ కులమునకు, మతమునకు, సంఘమునకు గాని చెందదు. కావున మనుజునకు మనుజునకు మధ్య ఆ ప్రాతిపదికపై విభేదముండరాదు. ఇది దివ్య గుణము. దీనిని తమయందే మిళితము కావించు కొనుటకు ప్రతియొక్కరు తప్పక ప్రయత్నించవలెను. అట్లుగాక దీనులను, అల్పులను ద్వేషభావముతో హీనముగా చూచినచో మనము ధర్మమార్గము తప్పినవార మగుదుము. దేవుడు ప్రతి యొక్కని యందును ఉన్నాడు. కాన ఎవనినైనను ద్వేషభావముతో చూచుట నిర్హేతుకము. తాను పయనించు మార్గమునందు అభ్యాసి కెదురగు స్థితులలో నిది యొకటి. ఈ భావమును కబీరు తన పద్యము లందొక దానిలో నిట్లు మనోహరముగా చెప్పుచున్నాడు :

"అపార గురు కృపకు తమను తా మర్పించుకొని అధమ జన్ములు
ముక్తిని పొందగా, ఉన్నత జన్ములు ఎక్కువ కులము వారనెడి
గర్వముతో నిండినవారై తుదకు తామే మునిగి పోయిరి."

ప్రతి యొక్కరును అందువలన ఈ దుర్గుణము లేకుండ నుండుటకై తప్పక ప్రయత్నించవలెను.

నా పరిస్థితి బహుశ, అత్యంత దుఃఖకరమైనది. ఏలయన, అభ్యాసి చపలత్వముల కన్నిటికిని

బాధ్యునిగా నెంచునది కేవలము నన్నే. నా సహచరులలో కొందఱు తామేవిధముగను శ్రమించుటను లక్ష్యపెట్టక నా అంతశ్శక్తిని వినియోగించి తమకు సమస్తము నేనే చేయవలెనని ఆశించు వారున్నారు. నేను వారిని సత్సంగమునకు వచ్చునట్లు చేసి తీరవలెనని వారు కోరుదురు. నేను వారిని వారి నిత్యాభ్యాసమున స్థిరపఱచవలెను. సాధన పథమున వారిని నిశ్చలముగా నిలుపవలెను. వారు మండలములను, దశలను దాటు నట్లొనర్పవలెను. ఇది యంతయు నా సంకల్పబలము, శక్తులతో నేను చేయవలెను. వారు మాత్రము తమ జీవన విధానమును సవరించుకొనుటకు గాని, అలవాట్లను తీర్చి దిద్దుకొనుటకు గాని, వారికి చెప్పినట్లు చేయుట, అభ్యసించుట సహితము తమంతట తాము యేది చేయుటకును ఇష్టపడరు. ఇదియంతయు నిట్లుండినప్పటికిని వారి వెనుకబడిన తనమునకు, అభివృద్ధి లోపమునకు దోషము నాకే ఆపాదింతురు. నేను కూడ నా విచిత్ర ప్రకృతి కారణముగా అట్లే భావింప దొడుగుదును. అందు మూలమున వారి శ్రద్ధ, సహకారములు లేకపోయినప్పటికిని ఒక్కొక్కరి విషయమున ఏది అత్యుత్తమ మనిపించునో దానిని బలవంతముగా వారియందు చొప్పింప యత్నింతును. ఒకటి రెండు సందర్భములందు తనకు ఉన్నతతర స్థితుల నన్నిటిని ఒకేసారిగా ఇవ్వనందుకు అభ్యాసి నాపై నిందమోపునంతవరకు పోయెను. ఇట్టిది వేరెక్కడైనను జరుగగలదని ఎప్పుడైనను ఊహింపనగునా? నిశ్చయముగా జరుగదనుటలో నాకు సంశయము లేదు. అయిన, ఇక్కడ మాత్రమట్లేల ఉన్నది? ఈ విషయమున బహుశః నేనతి చనువుచూపుట దీనికి కారణము కావచ్చును. ఇది యెంత వఱకు సమర్ధనీయమన్నది మీ నిర్ణయమునకే వదిలివేయుచున్నాను. ఈ సందర్భమున నేనెఱిగిన దృష్టాంత మొకటి కలదు. దానిని ఇక్కడ ఉదహరింతును. పూర్వమొక మహనీయుడు తన శిష్యులలో నొకని భక్తి పూర్వక సేవలకు గాఢముగా సంతృప్తులై తన పూర్ణ కృపను ఒకే మాఱు అనుగ్రహించి, యతనిని పూర్తిగా తనవలె మార్చివైచెను. ఫలితమేమన ప్రాణాహుతి పూర్తియగు సరికి ఆ వ్యక్తి అంతిమ శ్వాస పీల్చ దొడగెను. గురు కృపవలన నాకిప్పుడట్టి శక్తి యున్నదనుకొనుడు. దానిని నేను అభ్యాసి ప్రాణ రక్షణకు వలసిన జాగ్రత్తలన్నియు తీసికొనియే ప్రయోగించవచ్చును. నిస్సందేహముగ నప్పుడది క్షణమాత్ర విషయమయి యుండును. అయితే దానివలన నాతనికి కలుగు ప్రయోజనమేమి? అప్పటి వఱకు నాతడు తగ్గుస్థాయిలోని స్థితులకే అలవాటుపడి యుండినందున అట్లతనిలో ప్రవేశపెట్టబడిన స్థితి యాతనికి గుర్తించరానిదై యుండును. తత్ఫలితముగా నతడేమాత్రము దానిని లెక్కలోనికి తీసికొన జాలక పోవచ్చును. సాధారణముగా సామాన్య మానవునకు శాంతిని పొందుటయే అత్యున్నత సాధన లక్ష్యము. అట్లయిన పైన చెప్పిన స్థితి దానికన్నను ఎంతయో అతీతమై యున్నది. ఫలితమేమనగా దానిని తనలో సంపూర్ణముగా ప్రత్యక్షము గావించుకొనుటకు అతనికి చాల కాలము పట్టును. అంత దీర్ఘకాలము నిరీక్షించు సహనము లేక తాను వంచితుడైనట్లు భావించి మధ్యలోనే తెగద్రెంపు కావించుకొనుటయు సంభవమే. ఏమైనను, ఆ స్థితి క్షణమాత్రమున పరమోచ్చస్థాయికి తెచ్చినట్లయినచో అతని నరములు ధ్వంసమయ్యెడి ప్రమాదము కలదు. వేఱు మాటలలో చెప్పవలెనన్న నిది యొకనిని స్వర్గమునకు పంపుటకై బుద్ధిపూర్వకముగా హత్య గావించుటతో సమానమగును.

దానికి వేఱొక ప్రత్యామ్నాయము కూడ కలదు. అది యేదన క్షణకాలములో మనస్సును క్రమబద్ధ స్థితికి తెచ్చుట యనునది. ఉన్నత ప్రగతి సాధించిన అభ్యాసులందొకనిపై నేనొక మాఱు, అవసరమైన అన్ని జాగ్రత్తలతో, అత్యంత సున్నితమైన స్పర్శతో ఒక్క క్షణకాలము మాత్రమే దీనిని ప్రయోగించితిని. దీని ఫలితము సరిగా నేనాశించినట్లు, నేను వాస్తవముగా కోరినంతమేరకే సంభవించినది. కాని, నెలన్నరకు

పైగా అతని హృదయము ఆ ప్రభావము వలని సహింపరాని భారముతో నుండి పోయినది. పర్యవసానముగా, అతని హృదయము కృంగి పోవునేమో అని ఆ కాలమంతయు నేనాతనిని అతి జాగరూకతతో కనిపెట్టి యుండవలసి వచ్చెను. అతని తీవ్రమైన భక్తికి చలించిన వాడనై, అదే సమయమున నాతనిని ప్రతి విపత్తు అపాయము నుండియు రక్షించుచునే నేనిది చేసితిని. అట్టి ప్రయోగము ఆ యొక్కని మీద మాత్రమే ప్రయత్నింప సాధ్యమైనది. ఏమైనప్పటికిని, ఇతరులెవరును తమ విషయమున నే నా విధముగా ప్రవర్తించుటకు వలసినంత ప్రేరణ నాలో నింత వఱకు కల్గించలేకపోయిరని చెప్పుటకు విచారించు చున్నాను. నా మేరకు నేను ఆధ్యాత్మిక ఉద్ధరణ కొఱకు సర్వోత్కృష్టమైన దానిని సాధ్యమైనంత అత్యల్ప కాలములో మీకందఱకు నందివ్వవలెనని సదా అధికాభిలాషతో నున్నాడను. నీవొక్క అడుగైనను ముందునకు వైచినచో నీవైపునకు నాలుగడుగులు ముందుకు వేయుటకు నే నత్యుత్సాహముతో నున్నాను.

వివేకానందస్వామి చెప్పిన ఈ పలుకులు నాకు జ్ఞప్తికి వచ్చుచున్నవి : “మోక్షము, ఉన్నతాత్మునితోడి సాంగత్యము వాంఛించు మానవ రూపము పొందుట, దుష్కరము.” అది కచ్చితముగా అంతే అనుట నిస్సంశయము. వాస్తవముగా మోక్షము కాంక్షించువారు గాని, ఇతర ఉన్నత లక్ష్యము గలవారు గాని చాలా తక్కువ. కాని, తీవ్ర తపనకు సాటియగు ఆకాంక్ష యింకను కష్టతరమును, అసాధారణము కూడ. లక్ష్యమును పొందవలెనను తీవ్రవాంఛ మాత్రమే అధిక ప్రయోజనకారి కాకపోవచ్చును. దానిని ఉన్నత పవిత్రాత్ములలో నొకరితో సన్నిహిత సంబంధముండి తీరవలెను. అది కూడ ఉన్నదనుకొనుడు. అప్పుడింకను కావలసినది మఱియొకటి మిగిలియున్నది. అదియే అభ్యాసము లేక సాధన. ఈ విధముగా ఈ అంశములన్నియు ఒకటై సమకూడి యుండినప్పుడు మాత్రమే అంతిమ లక్ష్య సాక్షాత్కారమునందు తోడ్పడును. గొప్ప జ్ఞానులందఱి సువిమర్శితాభిప్రాయ మిదియే.

నాతో నింకొక యిబ్బంది కూడ యున్నది. నేను సహజముగా అతి చనువు గలిగి, వెలుపలి ఒత్తిడికి అతి సున్నితతత్వము గలవాడను. తత్ఫలితముగా, ఏ విధమునను అన్యథా అక్షేపణీయము కాకుండు సాహాయ్యోపకారములకై అభ్యర్థనలను తిరస్కరింపజాల కున్నాడను. దీనిని నా యందుగల లోటులలో నొకటిగా లెక్కింపవచ్చును. మీకు మీరే దాని రుచిని చవిచూడవలెనని నా హృదయాంతరమున కోరుకొనుచున్నను, నేను దానిని బహిర్గతము చేయుట కిష్టపడక పోవుటకు నా కారణములు నాకున్నవి. అందువలన, ఈ నా లోటు నాదిగానేయుండి, నా వరకే యుండిపోనిండు. యదార్థమునకు ఆధ్యాత్మిక ప్రయత్న సంబంధముగా నా నుండి ఎవ్వరేది కోరినను దానికై నేను చేయగలిగినదంతయు చేయుటకు ఆంతరంగికముగా ప్రేరితుడనై వారు కోరినది ఇత్తును. ఉదాహరణమునకు, నాయొద్ద కేతెంచువారిలో పెక్కుమంది శాంతిని పొందు కోరిక కలవారుగా కనుపెట్టుచున్నారు. అందువలన, వారి కోరిక ననుసరించి వారికి ఆ ప్రకారమే ప్రాణాహుతి ద్వారా కలిగింతును. నేనట్లు యదార్థలక్ష్యానుసరణము నాపివైచి, వారికి శాంతియొక్క మోతాదులనే యొసగుటకు నిర్బంధింతుడనగు చున్నాను. ఆ విధముగా నదియెంతయో ఆలస్యము కావించబడుచున్నది. అందు మూలమున నేను కచ్చితమైన ఆధ్యాత్మిక పద్ధతులలో వారికి ఆధ్యాత్మిక శిక్షణను నిరాటంకముగా కొనసాగింపజాలను.

సాధకులు సర్వావస్థలందును దైవస్మరణమును పెంపొందించుకొనుటకై నా తీరక వేళలో నా శిక్షణ యందున్న సాధకులను నిర్మలము చేయుట యందెక్కువగా నిమగ్నుడనై యుందును. ఈ సేవ నాకు దైవారాధనకు బదులు. అందువలన నిది నా ప్రథమ కర్తవ్యము. కాని, అది మిక్కిలి విసుగు

పుట్టించెడు పని. సుదీర్ఘ కాలము పట్టునట్టిది. అది బహుశః అభ్యాసి సహనము నంతరింప జేయవచ్చును. నిర్మలీకరణ చర్య జరుగుచున్నప్పుడు గాని, సంస్కారములు, బంధనములు సడలింప బడుచున్నప్పుడు గాని సర్వసాధారణముగా ధ్యానము నందొకడు అధికోత్సాహము ననుభూతి చెందడు. యదార్థమున కదియే అమోఘమగు మార్గమును, వాని పవిత్ర కార్యమున కత్యంత సహాయకారి యగునదియును. నేనా విధముగా ముందుకు పోవునపుడు అతని శాంతి తృష్ణతో పాటు అతడు మిక్కిలి విలువనిచ్చి వాంఛించునట్టి సంతృప్తికి కూడ నే నవకాశ మీయవలసియున్నది. నా నుండి ఈ విధమైన ప్రాణాహుతి పొందుచుండగా ధ్యానము నందుత్సాహము లేనప్పుడు ఈ కారణము చేత నతడది వ్యర్థమని తలపోసి, తత్ఫలితముగా సత్సంగము నుండి విడిపోవును. గురుని సామర్థ్యము సమగ్రముగా నిర్ధరించి, సంపూర్ణముగా అర్హుడని తెలిసికొన్న పిమ్మట, సర్వస్వము నాతనికే వదలివైచి, అతనిని విశ్వసించి అనుసరించుటయే సక్రమ మార్గము. అతని ఆధ్యాత్మిక శిక్షణా మార్గములు, రీతులను గూర్చి అతడు నియమములను నిర్దేశించరాదు. ఏలయన, గురువు మాత్రమే అభ్యాసి కెయ్యది అత్యంతో త్తమమో అర్థము చేసికొనగలడు.

కొందఱభ్యాసులు తమ వ్యక్తిగత సాధన సమయమందు, నాతో కూర్చొని నపుడు కలుగునంతటి ప్రశాంతతా నిమగ్నతలు కలుగుటలేదని తఱచుగ చెప్పుచుందురు. అది సహజమే. ఏలయన, వారి ప్రధాన లక్ష్యము శాంతిని పొందుటే గాని సాక్షాత్కారము గాదు. అంతియేకాక వారు ఇంటియొద్ద ఎంతకాలము, ఎన్నిమాఱులు అభ్యాసము చేయుదురని స్వతంత్రించి అడిగితినేని అత్యధికుల విషయములో వారు వారమంతటిలో మొత్తముమీద ఒకగంట వ్యవధి కూడ అభ్యాసము చేయుట లేదని స్పష్టమగును. కొన్ని సంస్థలు దినమునకు ఆఱు గంటలు, అంతకంటె అధికముగాను ధ్యానము చేయవలెననియు, మిగత కాలము సత్సంగమునకు వినియోగించవలెననియు నిర్దేశించును. అట్లుండ, నేను ఉదయ మొక గంట, సాయంత్ర మొక అర్ధగంట మాత్రము సూచింతును. దీనికి కూడ సమయము దొరకలేదని, ధ్యాన సమయమున నిమగ్నతను తాముపొందుట లేదని సాకులు చెప్పుదురు. ఏమైనప్పటికిని వారికి వారే కారణము కనుగొనగలరు. వారు సమ్మతించిన యెడల వారిలో శ్రద్ధా భక్తులు లోపించుటయే దీనికి కారణమని వారికి నేను చెప్పగలను. అంతర్గతముగా భగవంతుని యెడల భక్తిగలవాడైన ధ్యానము వాని కర్తవ్యమున నొక భాగమైపోవును. అప్పుడు ఆసక్తి, నిమగ్నత లేకపోవుట అన్న ప్రశ్నే లేదు.

ధ్యానాభ్యాసమునందు సక్రమత పాటింప లేకుండుట గూర్చి ప్రజలు తఱచు సాకులు చెప్పుచుందురు. తాము వ్యాకులములు, కష్టములు వ్యాసంగములతో సతమతమగు చున్నామని చెప్పుదురు. దీనిని బట్టి వారు తమ ధ్యానాభ్యాసమును కేవలము సమస్త మనోవికల్పముల నుండి విముక్తి పొందినపుడే కొనసాగించ వచ్చునని వారి భావన. వారు నిజముగా అపేక్షించునదేమనగా నేను నా శక్తిని, ఇచ్ఛను ప్రయోగించి వారిని వారి వ్యాకులములు, కష్టములనుండి విడిపించి మార్గమున సుస్థిరులనుగా జేయవలెనని, అప్పుడే వారనుసరించుటకును, అభ్యసించుటకును సిద్ధపడుదురు. దీనికి నే నాదర్శమును చూపలేక పోయితిని గాన నేనేవిధముగను సమర్థించుకొన లేకున్నాను. నేను యథార్థముగా నొక్కి చెప్పదలచిన దంతయు నేమన ప్రజలు కర్తవ్య నిష్ఠతకు జాగృతులు కావలెననియే. వారు వారివంతు కర్తవ్యము చూచుకొనునపుడు నా కర్తవ్యాంశము నిర్వహించుటకు నేను పూనుకొనెదను. వారు తమ అభ్యాసమునకు తప్పక కట్టుపడియుండి దానివలన లాభమున్నదా లేదా అని చూడవలెను. అయిన, అభ్యాసము ప్రేమ భక్తి భావముతో అనుబంధితము కావలెను. నా హృదయ భావములు మీకు చెప్పవలెనన్న – నా గురుదేవునకు

కృతజ్ఞతలతో – నాయొద్దనుండు సర్వస్వమును, దానిని పొందుటకు తానుగా సన్నద్ధత కనబఱచు నతనికి, ధారాళముగ ననుగ్రహించుటకు సదా సంసిద్ధుడనై యున్నాను. కాని, యింతవఱకును తన పాత్రయంచు వఱకు నింపించు కొనుటకు ఏ యొక్కరును ముందుకు రానట్లే కనబడుచున్నది. నా యొద్దనున్నదంతయు దోచుకొని దానికి బదులుగా వారి యొద్ద నున్నది నాకిమ్మని అభ్యాసులకు తఱచుగా నిర్దేశించు చుందును. న్యాయముగా నిచ్చి పుచ్చుకొనుట దోపిడి కాదు. వారికి చెందిన దేదియో మన మిపుడు చూచెదము. జనక మహారాజు, అష్టావక్రుల కథను మదియందు గలవారు తక్షణమయ్యది "మనస్సే" అని ఊహింతురన్నది సుస్పష్టము. కాని నా భావమది కాదు. ఏలయన, మనస్సు నిచ్చి వేయుటకు జనక మహారాజు నంతటి వారికిని, దానిని స్వీకరించుటకు అష్టావక్రునంతటి వారికిని సాధ్యపడ వచ్చును. అట్టి సాహసముచేయ నేను అష్టావక్రుడను కాను. వాస్తవమునకు వారికి చెందినది ఏమనగా సంస్కారముల రూపమున వారు వారికి చెందినవిగా నింతవఱకు చేర్చి పెట్టుకొన్నదే. అతి తఱచుగా జనులు వారి సముపార్జితము లన్నియు తమతో కలిగి, గురుని ఆవరణమునందు ప్రవేశించి, తన్మూలమున విశేషాలస్యకారకులగుదురని నేను "సత్యోదయము" నందు చెప్పి యున్నాను. సముపార్జితములు వారే సృష్టించుకొన్న వస్తువులు, వానియందు వారు గాఢముగా మునిగియున్నారు. భగవంతుడు పూర్తిగా నిరామయుడు, సర్వరహితుడు, అందువలన నొకడు తానును అట్టి వాడైనప్పుడు మాత్రమే అతనిని కలియగలడు. ఈ విషయము నింకను పొడిగించుట నా అభిమతము కాదు. మీ రందఱును వివేకము, పాండిత్యము గలవారు. మీ విధ్యుక్త ధర్మమును చక్కగా గ్రహింపగలరు.

భగవంతుని శోభ అద్దమువలె నిర్మలముగానున్న హృదయమునందే ప్రతిబింబించును. మీ జీవిత సమస్యను పరిష్కరించుటకు కావలసిన సామర్థ్యమును భగవంతుడు మీ యందఱకును అనుగ్రహించు గాక.

# నా అస్తిత్వము

నా జీవితము, జీవితమను దాని వాచ్యార్థము ప్రకారము జీవితము కాదు. నేను దానిని ఉనికియొక్క స్థితి అని అందునేని అప్పుడది యొక నిరంతర అస్తిత్వ స్థితి యగును. అది ఏదైనను అతీత స్థితియైనచో, అప్పుడు దానిని మీకిష్టమైన పేరుతో పిలువవచ్చును. అది అట్లుండుటచేత తాకిడి వలననే నా తెలివి పునరుజ్జీవితమగును. అట్టి తాకిడి ప్రయోగింపగలిగిన వారు బహుశః కొలది మంది మాత్రమే. అయినను సమయము వచ్చినప్పుడది వృద్ధి చెందవలసి యున్నదనని నేను నమ్ముదును. అంతర స్థితితో లయమును పెంపొందించు కొనుటచేతను, లేదా అలంకరించు వాని చేతులందున్న మృతుని వలలె అగుటకు ఆత్మ నిరసనను గరిష్ఠ పరిమితి వరకు సాధించుట చేతను ఆ సామర్థ్యమును సంపాదింప జాలుదుము.

గురువునుండి వచ్చునది ప్రతిదియు అంగీకరింప దగినదియు, ఒప్పుకొన దగినదియు నను భావముతో, అదియే సరియైనదిగా నమ్మి విశ్వసించుటతో ఈ స్థితి మొదలగును. కాని, ఇంతవరకది కేవలము భౌతిక దృక్పథమే లేక వేరు మాటలలో ఆ తర్వాత అది విశ్వాసముగా రూపొందుటకై యొక నిర్మాణమునకు పునాది రచన మాత్రమే. క్రింది స్థాయియందు ఆత్మోన్నతి అనుభావమునాధారముగా అది అపరిష్కృత రూపమున కనుపట్టును. ఏదియును లేకుండుట కన్న ఏదియైనను ఉండుట మేలు. కాన నిది కూడ ఏమంత చెడ్డది కాదు. తెలియునన్న తెలివి నశించుటయందు ఈ భావము గట్టిగా కుదురు కొన్నచో అప్పుడే అది నిజమైన విశ్వాసము యొక్క ప్రారంభము. ఆ విధముగ విశ్వాసము నిర్మించుకొని, గురుని యందున్న దంతటిని సంగ్రహించుకొని, వాస్తవముగా నతడు గురుని అడుగుజాడలలో సాగుచుండును. ఇది అసాధారణ సిద్ధి యగుటచే కొద్ది మంది మాత్రమే దీనిని పొందగలరు. కాని, ఆ కారణమున ఒకడు దాని కొఱకై తన ప్రయత్నములను విరమింప వలెనని అర్థము కాదు. జనులు సాధారణముగా వారి వ్యక్తిగత, కుటుంబ, సంఘసంబంధమైన యోచనల కారణమున అడ్డగింప బడియున్నారు.

వారు వారి కార్యములకై ఉపాయముల మీద ఉపాయములు పన్ను చుందురు. కాని వారి మనస్సుయొక్క స్థితిని వృద్ధి చేసుకొనుటకును, చక్కదిద్దుకొనుటకును ఎన్నడును శ్రద్ధ వహించరు. వారి దృష్టిని ఈ అంశముపైకి మరల్చుట వారికి అత్యంత ప్రయోజనకరముకాదా? ఇతరుల ప్రయోజనము కొఱకు సేవజేయుట మంచిదే. కాని మొట్టమొదట తనదగు నైతికౌన్నత్యమును చూచుకొనుట ఇంకను మేలయినది. ఈ విధముగా మానసిక సమత్వము తిరిగి పొందబడి, అది సర్వకార్యముల యందును అత్యంత సాహాయ్యకమగును. భతవంతని మిక్కిలి గొప్ప కానుకలలో ఒకటిగ దీనిని పరిగణింపవచ్చును. ఎవడు, తననుతాను అర్హునిగా చేసికొనునో వాని కొఱకు భగవత్కృప ప్రవహించ నారంభించును. అందువలన ప్రతి యొక్కడును తాను పొందగోరు అంతిమ ధ్యేయము యొక్క సజీవ జ్ఞానము హృదయమునందు కలిగి, తానేమి కావలసి యున్నాడో అట్లు కాజూచుట అత్యంత ముఖ్యమైనది.

ఇప్పుడు, అన్వేషకుడెట్టివాడై యుండవలె ననునది తరువాతి ప్రశ్న. అతడు ప్రాపంచికాకర్షణలకు విముఖుడై ఒకే లక్ష్యము, ఒకే ఉద్దేశ్యముతో ప్రేరితుడై తన ఆదర్శ సిద్ధికి ఏది తోడ్పడునో దానిని గూర్చి మాత్రమే ఎల్లప్పుడును యోచించు వాడుగా నుండవలెను. అట్టి అన్వేషకుడు సమర్థుడగు గురువును పొందుటలో ఎన్నటికిని విఫలుడు కాడు. అట్టి అన్వేషకుడు సందర్భములేని ఆలోచనా ప్రవాహముచే

నెన్నటికిని పెడదారి పట్టడు. అతడు తన సాధనకు గట్టిగా అంటిపెట్టుకొని యుండి, సక్రమ మార్గమునందే దృఢముగా నిలిచి యుండును. అతడు తీవ్రమగు ఆకాంక్షచే ప్రేరితుడై, ఎల్లపడును తన పురోగమనమును త్వరితము చేయుమేలాగు పద్ధతుల అన్వేషణ యందే యుండును. అతని యొక్క అంతర ప్రకాశము మార్గమున నాతనికి అత్యంతముగా సహాయపడును. విజయమునకు కీలకమైనదిదియే. ఇదియే ఋషులచే ఎంతయో నొక్కిచెప్పబడినది. సంగ్రహముగ, నిశ్చయ విజయమునకు కావలసినదంతయు సరియగు విధానమును, హృదయ పూర్వక ప్రయత్నములతో కూడిన తీవ్రకాంక్షయును.

అభ్యాసి లయావస్థ వఱకును, ఇంకను దానికతీతముగా పురోగమించుట ఎట్లు సాధ్యము కావచ్చును? అది మొట్టమొదట, తానే ఆస్థితిని పొందిన గురుని కృపానుగ్రహము చేతకావచ్చును. కాని, దాని కొఱకై గురువు తన కృప ననుగ్రహించునట్లు ప్రేరేపించునట్టి తీవ్ర భక్తి ప్రేమలను అభ్యాసి తనయందు పెంపొందించుకొనవలసి యున్నది.

హృదయ పూర్వక భక్తి ప్రేమలతోకూడిన తపనాత్మక అసహన భావ మంతటిదగు తీవ్ర వాంఛాభివృద్ధి లయావస్థప్రాప్తికి ఆవశ్యకమగు ప్రముఖ విషయములలో నొకటి. ప్రేమ భావము హృదయము నందున్ననే తపన తనకు తానుగా కలిగి తీరును. కాలక్రమమున అది మఱి మఱి వృద్ధిచెందును. కాన, ఈ విషయమున ప్రమాణ వ్యత్యాసము గణనీయము కాదు. అయిన పరుష వాక్కుగాని, మందలింపు మాటగాని వాడినపుడు విసుగుదల, కోపము సహితము తెచ్చుకొనువారిని గూర్చి ఏమన వచ్చును? అది వారు తమ అహంకార భావములనుండి తమను తాము విముక్తులనుగావించుకొనుట కిచ్చగించ కున్నారను యథార్థ విషయమునకు స్పష్టమైన గుర్తు. వారిని సక్రమ మార్గము నందుంచి, ఉన్నత స్థితులను సమకూర్చుట అనునది నా కర్తవ్యములోనొక భాగమను భావముతో వారుండవచ్చును. కొంత వఱకది అట్లేయుండ వచ్చును. అయినను, వారు దాని కర్షులుగా కావలసి యున్నదనుట కూడ వారి మనస్సు నందుంచుకొనవలెను. మీలో ప్రతియొక్కఱి యందును నాకు అక్కఱ గలదు. కాని, అది నా ముఖ్యధర్మముల పరిమతిలో నున్నంత మేఱకే. ఆత్మ నిరసనమునకు ప్రయత్నించుమని ప్రతియొక్కనిని నేను ప్రేరేపింతును. కాని, వారు దానియందు గైకొన వలసిన ప్రాథమిక చర్యలను సహితము తమ దృష్టికి తెచ్చుకొనుటకు శ్రద్ధవహింపరు. నేను దానిని సహించవలసి యున్నది. ఎవరైనను కోపముతెచ్చుకొన వచ్చునని దీనిని గూర్చి నేనత్యంత జాగరూకతతో మాట్లాడుదును.

లయావస్థను, దాని కతీతమైన ఉన్నత స్థితుల నన్నింటిని ఇచ్చువాడు భగవంతుడేయని నేను దృఢముగా చెప్పవలెను. నా వఱకు నేను పొందిన దంతయు నా ప్రియతమ గురుదేవులనుండి మాత్రమేయని నిశ్చయముగా చెప్పగలను. అయిన, అతని వైపునకు నా ప్రవృత్తులను మలచి నందుకు గాను నేను భగవంతునకు కూడ కృతజ్ఞుడను. భగవత్సహాయము పొందు విధానము గురు సహాయము పొందు విధానము వంటిదే. ఇది నన్ను సూటిగ భగవత్ప్రేమకు కూడ కొని పోయినది. దీనిని అత్యుత్తమ వరములలో నొకటిగా తెలియవలెను. ఇది అత్యున్నతమగు విలువగలదియు, ఫలప్రదమును అయిన్పటికిని ఈ మార్గమును బహుశః కొలది మంది మాత్రమే అనుసరించగలిగినారు. అభ్యాసి తన వాంఛను తీవ్రతరము కావించుకొనుచు, అదే సమయమున కనీసమొక బడిపిల్లవాడు తన ఉపాధ్యాయునికెంత విధేయుడై యుండునో అంతయైనను తాను తన మార్గ దర్శకునకు విధేయుడై యుండవలెను. ఇది కూడ అతని కర్తవ్యము నందొక ప్రముఖ భాగము. దీని వలన మార్గదర్శి ఏ ప్రయోజనమును పొందడు.

దీని నుండి లాభము పొంది తన సామర్థ్యమును వృద్ధి చేసికొనునది అభ్యాసియే. నిజమైన మార్గదర్శి యెన్నడును కీర్తిని, గౌరవమును ఆశింపడు. తమ అంతస్తుకు తగని విషయములను కొన్ని సందర్భములలో బాహ్యముగా ననుసరించి, అగౌరవమును కోరి తెచ్చుకొనిన ఋషుల దృష్టాంతములు కలవు. తనయొద్ద నుండిన కపటపుటనుచరుల సాంగత్యము నుండి విముక్తి పొందుటకుపయోగపడిన అటువంటి సంఘటన యొకటి కబీరును గూర్చి చెప్పబడినది.

నా జీవిత కాలమునందే మీరెల్లరును అతీతమహోన్నత స్థితిని గాని, కనీసము సంపూర్ణ లయావస్థనైనను పొందవలెనని నాకోరిక. సమర్థవంతమగు సహజమార్గ విధానమున నిదియేమియు నంతకష్టము కాదు. ఉత్కృష్టమైన నాదివ్య గురుదేవుని కృపానుగ్రహముచే నడుపబడుచున్న మన సంస్థయందు తప్ప యింకెచ్చటనుఇట్టి సమర్థవంతమగు ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతి లభింపబోదని నేను దృఢముగ నొక్కి చెప్పగలను. దివ్యత్వమున కిట్టి రాజమార్గము ననుసరించు వారు అన్ని కాలములందును, అన్ని యుగములందును, ఎల్లప్పుడును కొలది మందియే యనుట నిశ్చయము. ముక్తి ప్రాప్తికి ఎవరు నిర్ణయింపబడిరో వారే ఆసక్త్యుత్సాహములతో దీని వైపున కాకర్షితులగుదురు.

ప్రస్తుత కాలమున మోక్షమైనను కోరు నిజమైన జిజ్ఞాసువులు కొలది మందే కలరు. ఏలయన, భౌతికమైన భాగ్యము, శ్రేయస్సు యొక్క రమ్యమైన ఆకర్షణలతో పోల్చినచో ఆ లక్ష్యము ప్రయోజనకరము కాదని సాధారణముగ ప్రజలు భావింతురు సంచారక సాధువులు, సన్యాసులు చూపెడి తప్పుడు ఆశలు మన గ్రహణ శక్తిని స్థూలతమమగు భౌతిక రూపమునను న్న అసత్య భావములతో కప్పివైచి, ప్రజలనుస్థూల రూపములకు, పద్ధతులకు దిగజార్చి వైచినవి.

ప్రజలు వానియందు గట్టిగా నిమగ్నులై యుండి పోవదురు. ఆ స్థితి నుండి బయటపడి సరియగు మార్గమున తమను తాము రూపొందించు కొనుట వారి శక్తి సామర్థ్యములకు మించినది. ఈ విషయమున వారేమియు చేయకుండిన నెంతయో బాగుండెడిది. ఏలయన, అవకాశము వచ్చినప్పుడు వారు నిజమగుమార్గదర్శకునకు తమను తామర్పించుకొని యుండెడివారు. మొఱటుగా తయారైన కఱ్ఱ సామాగ్రి కంటె తయారుకాని కొయ్యముక్క యెక్కువమేలు. ఏలయన, అట్లు తయారైయున్న సామాగ్రిని కోరిన సరియైన రూపములోనికి మార్చుట యించుమించుగ అసాధ్యము. ఈ కారణముగ అధఃపతనము దాదాపు పూర్తియయి, దైవవిరుద్ధ విషయములు, పద్ధతులు పవిత్రములుగను, దివ్యములుగను పరిగణింప బడుచున్నవి. అందుచేత ప్రకృతియొక్క తీక్షణ దృష్టి దీనివైపునకు సంపూర్ణ శక్తితో మరల్చబడినది. సమీప భవిష్యత్తులో నేమి జరుగుచున్నది యనునది సామాన్యావగాహనకు మిక్కిలి అతీతమైనది. సాధారణముగా, ప్రకృతి కాలావసరమున కనుగుణముగ పనిచేయుట కెవ్వనికి తన శక్తులను ప్రసాదించినదో వాని కార్య నిర్వహణలో జోక్యము చేసికొనదు. ఈ సందర్భమున, నా కప్పగింప బడిన కార్యాచరణ సమస్తము ప్రకృతి యొక్క అత్యంత కృపానుగ్రహముచే పదును పెట్టబడి, నా గురుదేవుని యిచ్ఛకు, ఆజ్ఞకు నన్ను సంపూర్ణముగా బద్ధుని చేసి వైచినది. ఈ కారణముగా ప్రస్తుతము గురుదేవుని యాజ్ఞలే యీ సందర్భమున నిరీక్షింప బడుచున్నవి.

నాకు మఱియొక యిబ్బంది కూడ కలదు. అది యేమన నా సమయము నందధిక భాగము మీ యందఱి కొఱకు వినియోగింప బడుచున్నది. అందుచేత సాధారణమైన భగవత్కార్యమునకు వినియోగించుటకు చాలినంత సమయము లభించుటలేదు. అయిన, నాకాలమునట్లు అనావశ్యకముగ

వినియోగింపజేయు వారెవరు? వారధిక భాగము, తమలో లేశ మాత్రమును నిజమునకు భగవత్కాంక్ష లేనివారే, సరియైన రీతిని వారు సమర్పించుకొన గల్గిరేని నా కాలమునందుచాలా భాగము మిగిల్చుకొన వచ్చును. నిస్సందేహముగ వారు దానిని పొంద గోరుదురు. కాని, వారు దానికై భక్తి ప్రేమలతో తమను తాము నియోగించు కొనగోరరు. కాని, దానికై నేను నియోగింపబడిన వాడనని భావించుటచే నా మేరకు నేను దీనిని అణు మాత్రమును సరకు చేయను. నా సేవలన్నిటికిని నాపై వారే మాత్రము కనికరము చూపగల్గిరేని నా కాలమునకొంత భాగమైనను మిగుల్చుకొని, ఇతర విషయములకు నన్ను నేను వినియోగించుకొను నవకాశము కలుగవచ్చును. అభ్యాసి తనను తానెట్లు తీర్చుకొనవలెనో అట్లు తీర్చుకొన్నచో నతడు దానిని తనంతట తానుగానే నా నుండి గ్రహింప నారంభించును.

పూర్ణ లయావస్థ యనగా చిట్ట చివఱి పరిమితి వఱకు శూన్య కరణము. అయినను, సంపూర్ణ శూన్యమనునది యెన్నడును, ఎట్టి పరిస్థితి యందును సాధ్యముకాదు. లయావస్థను మఱచు స్థితినే పూర్ణ లయావస్థగా తీసికొనవచ్చును. అదివిస్తారముగా శక్తి మంతమైనది; గొప్ప అవతారములు సహితము దీనిని కలిగియుండలేదు. అట్లు సంపాదించిన మహాశక్తి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులవంటి దేవుళ్ళచేత కూడ ధిక్కరింపఁబడ జాలనిది. అది మన విధానమగు సహజమార్గమున అనుసరింపబడు సాధారణ పద్ధతి. క్రమేణ అభ్యాసి ప్రథమము నుండియే శూన్యకరణము వైపుగా పురోగమింప నారంభించును, అయిన ఈ కార్యమునకు సరియైన మార్గదర్శకుడు పూర్తిగా ఆవశ్యకము.

ఆ అత్యున్నత స్థితి ప్రసాదితుడగు వ్యక్తి సంపూర్ణముగా భగవదిచ్ఛకు విదేయుడగుట నిశ్చయము. దాని నుండి క్షణకాలమైనను ఏ రీతిని దూరము కానంతవఱకు భగవదిచ్ఛ గురునిద్వారా అతనిలో పనిచేయును. మారు మాటలలో, నతడు సంపూర్తిగా నతని గురుదేవుని యధీనమునందే యుండును. తనను తన గురుదేవునకు పరిపూర్ణముగా సమర్పించుకొనగలవాడే ఆ యత్యున్నత స్థితిని పొంద నర్హత కలవాడైయుండును. అయిన, తుదకిది కూడ ఆపై ప్రవేశింప వలసియున్న అనంతత్వ ప్రారంభమే. సంగ్రహముగా, ఇంకను ఎంతదూరము వెళ్ళవలసియున్నదో ఏ విధముగను నిర్ణయింప సాధ్యము గాదు.

లయావస్థ ప్రాప్తి తర్వాత కూడ సాధింపవలసిన దెంతయో యింకను మిగిలి యుండును. దీనికి లక్షలాది సంవత్సరములు సైతము బహు స్వల్ప కాలము.అంతమేది, ఎందున్నదని కచ్చితముగా నిర్ణయించుట కడుదుష్కరము. ఈ ప్రతిపాదనను సమ్మతించుటకు ప్రజలు సుముఖముగా లేకుండ వచ్చును. నేను నాస్తికత్వమును నిజమైన అస్తిత్వముగా చెప్పుటచేత నిదియంతయు నిరర్థకమును, నిరాధారము నని వారనవచ్చును. కొంత మేఱకు వారిమాట సమర్థనీయము కావచ్చును. ఏలయన, అస్తిత్వము నందున్న యొకడు నాస్తిత్వమను భావమును మనస్సున నూహింపఁజాలడు. ఏమైనప్పటికిని అది కేవలము నాస్తిత్వస్థితి యొక్క యస్పష్ట ప్రతి బింబమును మాత్రమే సూచించును. వాస్తవమేమన, నాస్తిత్వస్థితి యందుండి యొకడు ఆస్థితి యొక్క యే ప్రతిబింబమును తాల్ప కున్నచో నప్పుడది లయావస్థయొక్క పరిపూర్ణతగా భావింపవచ్చును. కాని, యివి గొప్ప మహర్షుల సాధారణావగాహనకు కూడ అతీతమై యుండవచ్చును.

# జ్యోతి వెలుగుచునే యున్నది

జనోద్ధరణమునకేదో కొంత చేసిన మహాత్ములు, ఋషులు, గురువులు ప్రపంచమున ననేకులుండిరి. ప్రజా బాహుళ్యమున వారు ప్రకాశమును వ్యాపింపఁజేసిరి. కాని, వారందఱును అప్పుడప్పుడాయా ప్రదేశములలో సమీపమున నున్న ప్రజలకు ప్రకాశమునిచ్చుటకు వెలిగింపబడిన దీపముల వలె నుండిరి. వారు జనులకు మేలు చేసిరి. అందువలన జనులాధ్యాత్మికముగా వృద్ధిచెందిరి. కాని, భగవంతుడట్లాదేశించి నప్పుడు, ఎప్పుడో అరుదైన తరుణములందు మాత్రమే ఒకే కాలమున సర్వప్రపంచమును ప్రకాశింపఁ జేయుటకు దివ్యజ్యోతి వెలిగింపఁబడును.

అది యప్పుడే దిగి విచ్చనది. అన్నివైపులకును ప్రకాశము పఱపుచున్నది. కాని, దాని కొఱకు కొలది మంది మాత్రమే నిజముగా నుత్సాహులై యున్నట్లు కనుపట్టుచున్నది. క్రమ్ముకొని వచ్చుచున్న చీకటి ప్రపంచమును పూర్తిగను, మిక్కిలి దట్టముగనుముంచి వేయుటవలన ఈ దివ్యజ్యోతి యొక్క మిణుగురు కాంతి వారి దృష్టి కింకనుఅతీతమై యున్నది. ప్రపంచ జీవిత కాలము నందిదివఱ కెన్నియోమారులు కార్యరూపము దాల్చిన ఇది యొక సహజ దృగ్విషయము. అధర్మముపరాకాష్ఠ చెంది నపుడు ఎవరో యొక దివ్యాత్మ ప్రపంచమున నవతరించి, అంధకార మేఘములను పారద్రోలి వెలుగు నంతటను వ్యాపింపఁజేయును.

జ్యోతి అప్పుడే వెలిగింపఁ బడినది. భక్తి పూరిత హృదయములే దానిని గ్రహించి, లాభము పొందగలవు. అటువంటి అవకాశము సమీప భవిష్యత్తులో తిరిగి కలుగునని నీవనుకొందువా? అట్టి మహాపురుషుఁడు మఱల మఱల అవతరించఁగలడా? ఇటువంటి కార్యము కొఱకై, యింతకు పూర్వ మవతరించిన మహా పురుషులలో ఏ యొకరితో నైనను దీనిని సరిపోల్చ గలరా? అట్టి వ్యక్తి అవతార రూపమున నుండియుండెనా? నిశ్చయముగా లేదు. అట్టి ప్రతివ్యక్తి శక్తి సామర్థ్యములు అప్పటి కాల పరిస్థితుల కనుగుణముగా, భిన్నములై యుండెను. ఇది మిక్కిలి అరుదైన సమయములలో నొకటి. భగవదిచ్ఛ అట్టిది. ప్రకృతి కార్యమునకై ప్రస్తుత మవతరించిన మహాపురుషుఁడు తన కప్పగింపఁబడిన ప్రకృతి కార్యపరిమితి విషయమునను, సామర్థ్యము విషయమునను ఇదివరకటి వారి నందఱిని అధిగ మించును. నేటి ప్రపంచమున కట్టి మహాపురుషుని అవసరము కలదు. ఇది ప్రకృతి యొక్క ఆవశ్యకత యగుట వలన నిట్లు ఉనికిలోనికి వచ్చినది. ఆ మహాపురుషుడు మీకందఱకును మహోన్నత స్థితిని ఇచ్చుటకు తనమేరకు తాను సదా సంసిద్ధుడై యుండినను, దానిని పూర్తిగా నుపయోగించుకొనుటకు ముందునకు వచ్చుచున్నట్లు ఏ కొలది ముంది మాత్రమో అగపడుచున్నారు. భగవదిచ్ఛ అగుగాక. ఇదియొక ఆశ్చర్యకరమైన వెల్లడి కావచ్చును. గతము నందలి ప్రసిద్ధ మహాత్ములు, మహర్షులు కోవకు చెందిన వారందరిలో నొకరు నావారై యుండుట నా ప్రత్యేక భాగ్యము. ఇందులకు కొంత గణ్యత నాకు కూడా చెందవచ్చును.

మీ రందఱొక్కటై యీ సదవకాశమును సద్వినియోగపఱచు కొనుటకు సమయ మిదియే. ప్రకృతి చేయిచాయి, మిమ్ములను తన యొడిలోనికి తీసికొన నుత్సహించుచున్నది. దైవకృప సంపూర్ణ శక్తితో ప్రవహించుచున్నది. ఈనాటి వంటి తరుణము వేల సంవత్సరముల పర్యంతము తిరిగి రాకపోవచ్చును.

దీని నిప్పుడు పోగొట్టుకొన్నవారు యుగముల పర్యంతము ప్రపంచమున మఱియొక దివ్య పురుషుని ఆగమన సమయము వఱకు, తిరిగి పొందలేక పోవచ్చును. అది బహుశః ముక్తి లేక సాక్షాత్కారము మఱల సులభ సాధ్యముకాఁగల సమయము కావచ్చును. అయిన, నప్పుడుకూడ యీనాడున్నంత మేరకు ఉండకపోవచ్చును. ఏలయన, నిర్మాణ కార్యక్రమమే గాని విధ్వంసక కార్యక్రమమప్పుడు అమలులోనుండక పోవచ్చును. స్వల్ప త్యాగమైనను నేడుఅత్యుత్తమ ఫలితములను కలిగించుట యందధిక ప్రయోజనకారి కావచ్చును. దివ్యధారయప్పుడు ప్రవహింపఁ దొడగినది. సేద తీర్చెడి చల్లని దివ్య వాయువును పీల్చగల అనంత మహా సముద్ర తీరమును చేర్చుటకు చాలినంత కనీసపు త్యాగముతోనైనను అందఱు సంసిద్ధులగుదురు గాక.

ఇది యంతయు నేడు ఈ దుఃఖ ప్రపంచము నందున్న దివ్యపురుషుని అనంత కృపా విశేషముననే. సమీప భవిష్యత్తు నందిట్టితరుణము మఱలవచ్చునని మీరూహింతురా? నేటివలె కేవలము చూపు మాత్రముననే చివఱి స్థితివఱకు కొంపోగల ఇట్టి సులభ మార్గము లెన్నడైనను సాధ్యములు కాగలవా? ప్రకృతి కార్యమునకు సంబంధించిన తన ప్రాథమిక కర్తవ్యముతో బాటు, అతడు మీ ఆధ్యాత్మిక శిక్షణకు కూడ తనను తానునియోగించుకొను చుండుట మీ భాగ్యము కావచ్చును. ఈ ఆశా జనకములైన యంశములను గణనలోనికి తీసికొననివారు, తరుటవాత నాతడీ భౌతిక ప్రపంచమునుండి నిష్క్రమించినపుడు కలిగిన నష్టమునకు దుఃఖించవలసియుండును.

నా వఱకు నేను ఏమిచేయవలయునో, ఎచ్చట కేగవలయునో తెలియక విదారిత హృదయముతో అనంతమునందులోతుగ మునిగి యుంటినని మాత్రము చెప్ప గలవాడను. ఆయన తానిచ్చగించిన చోటికి నన్ను కొంపోవుదురు గాక. సర్వస్వము ఆయన మీదనే ఆధారపడి యున్నది. కాని, మునుకవైచిన వ్యక్తి సామాన్యముగ కనీసమొక్క పర్యాయైనను ఉపరి భాగముపైకి లేవవలెను. నేనును అట్లే చేసితిని. అయినను, నిశ్శబ్ద తరంగములచే నాకు తెలియని ఎచ్చటికో కొని పోఁబడుచుంటినని మాత్రమే కనుగొన గలిగితిని. అంత్యమేదో తెలియక, ముందు ముందునకు పోవుచునే ఉన్నాను.

నేనెట్టి ఉన్మాదాగ్నియందు దహింపబడుచున్నానో అట్టి దానినని మీ యందు రగుల్కొల్పు నుద్దేశ్యముతోనే దీని నంతయు దాపఱికము లేకుండ బహిర్గతము చేయుచుంటిని. అయినను భగవంతు డెవనిని తనకు తానుగా పైకిలాగునో వాడే ఈ యన్వేషణ యందు విజయవంతుడు కాఁగలడు. ఈ విషయమున నేను వెల్లడించినదంతయు ప్రజలనుండి అధికమైన మెప్పును పడయుచున్నప్పటికిని, వారు తమకు తామేమి చేయ వలయు నను దానిని గూర్చి తమ కనీసపుటాలోచనను సహితము పఱప కుండుట చూడ నా కత్యంత విచారకరముగ నున్నది. అయినను, నేను చేయగలిగినంతగా, వారికి సేవ చేయ సదా సంసిద్ధుడనై యున్నాడను.

సంపూర్ణ విజయము నిస్సంశయముగా భగవంతుడెవనికై నిర్దేశించునో వానికే కలుగు నున్నప్పటికిని, అదృష్ట వశమున ఈనాడు మన భాగ్యమునకు కలిగిన ఈ సదవకాశమును సద్వినియోగ పఱచుకొనుటకు మన మందఱమును చేతులు కలుపవలెను. అయినను, శ్రమ ఎన్నడును వృథా పోదు. దైవీయ ధారను ప్రవహింపఁ జేయుటకు దాని ఫలములనదియే కొని తెచ్చును. కాని, పెక్కుమందికి విడువని శ్రమ దుష్కర కార్యమగును. దీనికి కారణము ఆసక్తి, ఆకాంక్ష లేకుండుటయే. వారిలో కొందఱు తమకు తామే యొక విధమగు ప్రదర్శన మందిరముగా చేసి కొందురు. ఇతరులు తమ హృదయములను దారిని

పోవు వారినందఱనుచేర్చుకొను సత్రముగా మార్చుకొనెదరు. ఎప్పుడైనను ఒక రోజు తన శరీరమును తాను వదలి వేయవలసి యున్నదని ప్రతియొక్కనికి నిశ్చయముగ తెలియును. అయినను, తఱచు తదితరావశ్యక విషయములను కూడ లెక్కచేయక, అతడు ఉండవలసిన పరిమితుల కతీతముగా దాని యందాసక్తుడై యుండుచున్నాడు. దానిని పూర్తిగా నిర్లక్ష్యము చేయుటకు ప్రోత్సహించుట నా ఉద్దేశ్యము కాదు. ఏలయన, అది కూడ మహా పాపమే. నేను యథార్థముగా నుద్ధేశించినదేమన శరీర విషయమున తగుశ్రద్ధ, వలసిన పోషణల గూర్చి తప్పక గమనించవలసినదే. కాని, అది భగవంతునికి తనకు, పరులకు, విధ్యుక్త ధర్మముల నిర్వర్తించుటయందు సంపూర్ణముగా సమర్థవంతమై యుండునట్లు తగు మాత్రపు టవసరమున కనుగుణముగా నుండవలెననియే.

ప్రతి యొక్కరు తన యంతమును చేరుటకు సిద్ధమై యుండవలెను. అనగా, తన అంతమాసన్న మైనపుడు విచారించ కుండుటకై సాధ్యమైనంత త్వరలో అత్యున్నత ఆధ్యాత్మిక స్థాయిని పొందవలెను. అందులకు భక్తి, నిరంతర స్మరణలు మాత్రమే నిశ్చితమార్గములు. భగవదిచ్ఛకు తనను తాను సంపూర్ణముగా సమర్పించుకొని, శ్రద్ధ విశ్వాసములతో దృష్టిని నిజముగా దానివైపు మఱల్చినచో భగవత్సాక్షాత్కార మేమాత్రము దుష్కర కార్యము కాదు. ప్రతి విషయమును భగవదాజ్ఞగా ననుకొని, ప్రాపంచికధర్మమును సక్రమముగా నిర్వహించుటకు పూనుకొనినచో దానిని చాల సులభముగా సాధింపనగును.

దైవీయ పథము ననుసరించువానికి ఆత్మ విలయన మొక్కటే మార్గము. దాని నతడు పట్టుదలతో ననుసరింపవలెను. భక్తి ప్రేమలు వాస్తవమునకు దాని ప్రధాన లక్షణములు. ఆత్మవిలయన మొనర్చినవాడు, కోరదగిన యదార్థ జీవితమును, కేవలము జీవితాదర్శమును అయిన శాశ్వత స్థితిన చేరుకొనును. దీనిని తదనంతరము కంటె గురుదేవుల జీవితకాలమున సులభతరముగ పొందనగును. ఏలయన, అతని జీవిత కాలమున ఎల్లప్పుడు అతనిశక్తి ప్రవహించుచునే యుండును. అటుపిమ్మట, వారు నుడువునట్లు, ఆ నిర్జీవ జ్వాలయందు తమను తాముదహించుకోగలవి కీటక సమూహ మంతటిలోను ఏ కొలది మాత్రమో అరుదుగా నుండ నోపును.

నా గురుదేవుని జీవిత కాలమున, జ్వాల చుట్టును కీటకములవలె భక్తులు ఆయన చుట్టును మూగియుండిరి. అది యట్లేలన, దీపము వెలుగుచిందినది. వారు మార్గమున పురోగమించుచునే యుండిరి. కాని, అతని తర్వాత పరిస్థితి మాఱినది. అప్పుడు వారిలో కొందఱు తమ అంతరగ్నితో, వెడలి పోయిన జ్వాలనుండి తమను తాముగా దహించుకొన గల్గిన వారుండిరి. తనను తానుజ్జ్వలముగా నుంచుకొనుటకు, దానియందు తనను తానే దహించుకొనుటకు చాలినంత ప్రకాశము నెవడు తనయందు సంగ్రహించుకొని యుండునో అట్టివానికే యిది సాధ్యము. అట్టివాడు సర్వజనులకు దేనితో వారు తమను తాము దహించుకొనవలెనో ఆ అంతరుష్ణ లోపముతో ఉండి పోకుండుటకై అనుకరణీయుడగును.

ఆనంద సాగరమున చేరవలెనని దృఢముగా సంకల్పించుకొని, దానిని పొందలేకుండి పోయిన వానిని నేనెన్నడును కనలేదు. సక్రమ విధానము నీ యధీనము నందుంచుకొన్నచో నీవు జయమందలేక పోవుటకు కారణములేదు. తమ హృదయములలో ప్రకాశమును చూడవలెనని పరితపించు జనులను నేను చూతును. అయిన, నది బొత్తిగా ప్రయోజన రహితమైనది. ఏలయన, ఆ ప్రకాశము ఒకడు ఆకాంక్షించెడి వాస్తవానందమున కంటె కడుంగడు భారమైనది. అభ్యాసి ప్రకాశమును చూడ యత్నించరాదు. కాని, అది అటనున్నదని మాత్రమే భావించవలెను. నాకిది యెంత అసహ్యకరమైన

దనగా దాని నుండి నేను దూరముగా నుండ యత్నించునంతయని నేను చెప్పుదును. ప్రకాశము నిజమునకు సత్యచ్ఛాయయే కాని యదియే సత్యము కాదు. మనము యదార్థ సత్యమును పొందవలెను. ప్రకాశము దాని స్థూల రూపము. అభ్యాస కాలమున మనము దీనిని అనుభూతి చెందుదుము. అయినను మనము దీనిని అనావశ్యకమైనదిగా నెంచి నిర్లక్ష్యము చేయుదుము. వాస్తవముగా, చిట్టచివరకు మనము ఎచ్చట ప్రకాశముగాని, అంధకారముగాని లేదో అచ్చటకు చేరవలెను.

ప్రకృతితో పని చేయ గల్గుటకై దానిపై నాధిపత్యమును సంపాదించుకొనుటకు సహాయపడగల బిందువును వికసింపజేసి, ప్రతి యొక్కనిని కేంద్రమున కత్యంత సమీపముగ లాగి, ఆమండలము నందు వాని ఈదులాటను ప్రారంభింప చేయవలెనన్న తీవ్రవాంఛ నాకు కలదు. అది కేవలము భగవంతుడిచ్ఛగించిన వానికే నిర్దేశింపబడిన యొక దివ్య ప్రసాదము. మానవ శరీరమందు ప్రతి కణము అపారశక్తిని కలిగియున్నది. సమస్త విశ్వము దీనితో సన్నిహితముగా సంబంధము గలగియున్నది. వెన్నుపాము నందలి ప్రతిబిందువును అత్యధిక శక్తితో నిండి యున్నది. కాని, యింతవఱకును దీనిని గుర్తించుటకు యత్నము చేయలేదు. ప్రజలందఱును కుండలిని కొఱకే విలపించుచున్నారు. దానిని జాగృత మొనరించుటకు వెఱ్ఱిగ పరితపించుచున్నారు. మెదడు నందలి వివిధ జీవకణములయొక్క ముఖ్యభాగముల నిర్మాణము నందుగల ప్రతి కణమును కుండలినీ శక్తిని మించిన ప్రబల శక్తిని కలిగియున్నది. అయినను మానవ కళ్యాణము కొఱకు దీనిని ఉపయోగించుట కింకను ఎవ్వరును ప్రయత్నించలేదు. నా అభిప్రాయము జ్ఞానులలో పెక్కుమందికి ఆమోద యోగ్యము కాక పోవచ్చును. నేను వారికి దానిని ప్రదర్శించినప్పటికిని గ్రహించుటకు వలసినంత సునిశితత్వము వారికి లేక పోవచ్చును ఏమైనప్పటికిని, సమయము వచ్చినప్పుడు – అది తప్పకవచ్చును – ప్రజలు దాని నవగతము చేసికొని, అనుభూతి చెందగలుగుదురు. ప్రజలు ఆ అత్యున్నత స్థితిని ఏ మూల్యము చెల్లించనవసరము లేకయే పొందుటకై తమయందు గాఢమైన ఆసక్తిని జనులు సృష్టించుకొందురు గాక. కాని, ప్రతిచర్య అత్యల్పముగ నున్నట్లు అగపడుచున్నది. ఇది బహుశః నా లోపములలో కొన్నింటి వలననే కావచ్చును. ఏమైనప్పటికిని, దీనిని నా నుండి గ్రహించుటకు ఎవ్వరును ముందుకు రాకుండినచో, నేను దానిని మొత్తముమీద వదలి వేయవచ్చును. దానిని గ్రహించు సామర్థ్యముగల వారెవరైనను గ్రహింపవచ్చును. ఈ భావము నాలో పొంగి పొరలు చున్నప్పటికిని అది తనంత తానుగా వెలికి ప్రవహించి పోకుండునట్లు దానిని నేనదుపులో నుంచుకొని యున్నానని మీకు నమ్మకముగా చెప్పగలను. ప్రకృతి గ్రంథులలో నొక దానిని స్పృశించుటచే నొక క్షణములో వెలుపలికి ప్రవహించుటను కల్గింపనగును. కాని ఈ సమయముననది దైవేచ్ఛ కాదు.

# క్లేశములు

ప్రంచము దుఃఖ వ్యాకులములతో నిండియున్నది. కొందఱుబాధతో మూలుగుచున్నారు. కొందఱు తమ ప్రియతముల మరణమునకు దుఃఖించుచున్నారు. ఇతరులు దారిద్ర్యము, అనారోగ్యము, క్లేశములతో వ్యాకులము చెందియున్నారు. అదృష్టానుగ్రహము పొందినవారు కొలదిమంది మాత్రమే ఉండవచ్చును. కాని, వారికిని వారి బాధలు, కలతలు కలవు. దరిద్రునకు ధనవంతుడు కాలేదని చింత; ధనికునకు మఱింత ధనవంతుడు కాలేదని చింత; అధిక ధనవంతునకు అందఱి కంటెను గొప్ప శ్రీమంతుడు కాలేదని చింత. దీనికి పరిమితియే లేదు. ఇది ప్రకృతియొక్క సహజ క్రమము. పుట్టిన ప్రతి యొక్కడు క్షోభకు, క్రమభంగమునకులోనై యున్నాడు. ఏలయన, అతడు పుట్టిన క్షణమే పరస్పర వైరుధ్యములు తమంత తామే ఎదురైనవి. వానికి అమితముగ నంటి పెట్టుకొని యుండువాడు వాని పాశములందే గట్టిగా చిక్కుపడి యుండుట కాననగును. అతనిని దాని నుండి బయటకు రమ్మనినచో, ఒక వృక్షమును గట్టిగ పట్టుకొని ఆ వృక్షమే తనను వదలుట లేదని చెప్పుచున్న వానివలె అతడార్భాటము మాత్రము చేయును. ప్రపంచమున అన్నిటికంటె వింతయైన విషయమేమన, జనులు ఇతరులు మరణించు చుండుట చూచియు, తాముకూడ అనతి కాలముననే మరణమును చవి చూడవలసి యుండునని ఎన్నడును తలవకుండుటయని యుధిష్ఠిరుడు యక్షుని ప్రశ్నకు చాల యుక్తముగ ప్రత్యుత్తరమిచ్చెను. కాని, ఆ ప్రశ్నకు, జనులు తమ క్రమ భంగమును చూచియు, నిలకడలేని దిండు నాధారము చేసికొని యింకను నిదురించు చుండుట, అనుట నా సమాధానమై యుండును. అన్నిటికన్నను ఇది బహుశః నాకు వింతయైన విషయము. భర్తృహరి మహారాజు భగవచ్చింతనకు జాగృతుడైనపుడు, తన శిరము వాల్చుటకు ఒకదిండు నుంచుకొనియుండెను. కాని, కొంత కాలమునకది తగదని వలదుకొనెను. దిండు 'ఆధారమునకు' – దైవాధారమునకు – చిహ్నము. వేఱు మాటలలో, తనదైన సర్వస్వము వదలుకొని భగవంతునిపై నాధారపడుట. సామాన్య గృహస్థ జీవితమందిది సాధ్యమగునేని అన్నిటికన్నను అది విలువైనది కాదా ? ప్రాపంచిక బాధ్యతలను నిర్వహించుచు దైవచింతనలో ఎల్లప్పుడును నిమగ్నమైయుండుటెట్లు ? ఈ రెండును పరస్పర వ్యతిరేకములుగా నుండుట వలన, రెంటిని ఒకేసారి అనుసరించుట సాధ్యముకాదని ఎవరైనను అనవచ్చును. కాని, అదియట్లు కాదు. హృదయపూర్వకముగా చేపట్టినచో నది సుసాధ్యమును, సులభముగా నాచరణీయమును అగును. కాలక్రమమున నాతనిలో దైవ జ్ఞానము మేల్కొని, అతడు తన జీవిత కార్యక్రమము లన్నిటియందు దానితోనే పనిచేయ నారంభించును. గృహస్థ బాధ్యతలను నిర్వర్తించుచు సాక్షాత్కార సిద్ధికై తానే శ్రమించువాడు ఏ విధముగనైననునష్టపోవునని నేననుకొనను. పైగా, రెండు రెక్కలను వెలుపలకు చాచి ఎత్తుగా పైకెగురుచు తన శాశ్వత జన్మభూమి వైపునకు పోవచుండును.

ఈ ప్రపంచమునకు మనము వచ్చిన నాటినుండియు, దుఃఖములు లేకుండ మనమెన్నడును ఉండలేదు. మరల జన్మభూమికి తిరిగి పోవుటకు సాధించునంతవరకు కూడ ఎన్నటికిని అట్లుండలేము. రాముడు, కృష్ణుడు వంటి అవతారములు కూడ వారు ఈ భూమిపైన ఉన్నంత కాలము దుఃఖముల ననుభవించవలసి యుండెను. యదార్థమునకు బాధ, దుఃఖములనుండి విముక్తి పొందుటయే జీవితము యొక్క ప్రధాన అన్వేషణమైయున్నది. "స్వాతంత్ర్యమునకు మార్గము కారాగారము ద్వారానేయున్నది".

అని గాంధీ మాహాత్ముడొకతూరి అనినట్లు చెప్పబడినది. ఈ ప్రపంచమును కారాగారముగ తీసికొనినట్లైన పైన చెప్పినది ఆధ్యాత్మికార్ధమున కూడ మిక్కిలి ఉచితముగ సరిపోవును. పూర్తి నిరాశతో జనులు తఱచు జీవితమును చాలించవలెనని కోరుదురు. కాని నా అభిప్రాయమున అట్టి పరిస్థితులలో మరణమునకు సమానమైన జీవితమును అనుగ్రహించుమని భగవంతుని ప్రార్థించుట ఎంతయో మేలైనది.

ప్రతియొక్కనికి దానిలో తనవంతు గలదు. మహాఋషులు సైతము వానిని కలిగియుండిరి. ప్రపంచమున కష్టములే లేకుండిన, మానవుని ఆలోచన దాని రెండవ వైపు అనగా ఆనందమువరకు వెళ్ళుట ఎన్నడును సాధ్యముగాకుండి యుండెడిది. ఆ విధముగ మానవుని క్లేశము విముక్తి మార్గమును తెలిసికొనుటకు ప్రోత్సాహము నిచ్చును. వేరు మాటలలో, అవి ప్రేరేపకములుగ పనిచేయును. బొగ్గను వజ్రముగ మార్చవచ్చునని మనకు తెలియును. దాని అర్థము ఏమన నిర్మాణము నందు మార్పు వస్తువులకు క్రొత్త రూపము నిచ్చును. ఒక వస్తువు దాని నిర్మాణము సక్రమముగా నున్నప్పుడు ఉపయోగకరముగను, ఆహ్లాదకరముగను నుండును; సక్రమము కాకున్నప్పుడు అది బాధాకరముగను, వికృతముగను అగును. క్లేశముల విషయమున కూడ అంతే. మనోవాంఛలు మన విచక్షణా శక్తిని ఎంతగా కమ్మివేసినదనగా జీవిత సంబంధమైన విషయములయొక్క వాస్తవ విలువలకు మనము పూర్తిగా అంధులమై పోయితిమి. నిజమునకు, జీవితమున ప్రతిదియు మన అంతిమ శ్రేయస్సుకొఱకే; మన అనుకూలమునకై వానిని సక్రమముగా వినియోగించుకొనుటకు మాత్రమే మనము నేర్వవలసి యున్నది. కాని దురదృష్ట వశమున తప్పు మార్గము పట్టిన మనః ప్రవృత్తులచే నడిపింపబడి, మన మింతవఱకు పెడత్రోవను పోవుచుంటిమి. మనస్సుయొక్క నీచపు పోకడల కనుగుణముగ మనముప్రతి వస్తువును గూర్చి అపరిష్కృతదృష్టి నవలంభించు చుంటిమి. ప్రతివస్తువు మన దృష్టి యందు మరి మరి స్థూలముగను, ఘనముగను పెరుగుచు పోయినది. ఆ విధముగ హృదయము, మెదడు ప్రాభావితములై, అదే లోపమును పొందనారంభించెను. ఆవరణలు ఒక దాని తరువాత నింకొకటి చేర నారంభించి సత్యతత్త్వమును దృష్టి నుండి మఱుగు పరచినవి. సత్యతత్త్వము యొక్క ఉద్ధృత ప్రవాహము హృదయమున వీచి లోపల మేల్కొలుపును కలుగజేయు సమయము హఠాత్తుగ వచ్చు వఱకు నిది కొనసాగుచునే యుండును. అప్పుడే మానవుడు నిజమైన విలువలను సక్రమముగా నవగాహన చేసికొని తన కల్లోల స్థితిని చక్కదిద్దుకొనుటకు ఉత్సహించును.

మానవుడు తొలుత తన భౌతిక రూపమును ధరించినపుడు, తన అస్తిత్వము యొక్క యదార్థ ప్రకృతికి వ్యతిరేకములైన వస్తువులను తనతోకూడ తెచ్చుకొనెను; అనగా దానికి సరియైన రూపము నిచ్చుటకై యీ వ్యతిరేకములు రెండును ఒక దానితో నొకటి పెనవైచుకొని యుండినవి. అది అగ్ని, జలముల సంయోగము వలన కలిగెడి ప్రేలుడు రూపమున కనబడినది. వాయు ప్రసరణ తోడయినపుడు అది రగులు కొనుచు పోయిన ప్రేలుడు బలమును వృద్ధి కావించినది. ప్రేలుడు ఆత్మతో అనుసంధానమైన శక్తి యొక్క క్రియయే కాని వేఱు కాదు. ఆ విధముగ అది ప్రకృతి శక్తులను ప్రదర్శించును. సత్యతత్త్వము కను మరుగైనది. వస్తువుల అపక్రమ వినియోగము చివరకు ఏ విధముగ పరిణమించినదో ఊహింపుడు. ఈ అధః పతనమునకు మూలమును తెలసికొనుటకు మనము కారణము కాని, దాని ఫలితమును కాని గణనలోనికి తీసికొనలేదు.

ఈ క్రియ లెట్లు కలిగినవి? సృష్టి జరుగవలెనను దైవ సంకల్పము దానంతట అదియే ప్రకటిత మగుట ఆరంభమైనది. ఏకత్వమునకు వ్యతిరేకమైన వివిధత్వము యొక్క సంకల్పము క్రియాశీలమై

ప్రాముఖ్యమును పొందమొదలిడెను. క్రియా శీలత ఉద్భవించినది. రెండును ఒకటిగ కూడి శక్తిని పెంపొందించినవి. క్రియ ప్రారంభమాయెను.

మానవాత్మ ప్రజ్ఞను పొందెను. ఈ ప్రజ్ఞ వస్తువుల రూపకల్పనకు కారణమైన దైవ సంకల్పపు సూటి ఫలితము. మన సంలక్ప ఫలితమేమనగా ఆలోచనాశక్తిని ప్రయోగించుటచే మనతో తీసికొని వచ్చిన వస్తువులను తయారు చేసికొంటిమి. ఆ విధముగ మన చుట్టును నున్నదంతయు ఆత్మయొక్క నిజప్రకృతికి వ్యతిరేకముగా నుండెను. ప్రశాంతత ఆత్మయొక్క లక్షణము కాగా, దానికి వ్యతిరేకమైన అశాంతి శరీర లక్షణము. కాని దీని నంతటిని చేసినవారము మనమే, ఇది మనపనియే. ఇప్పుడీ క్రియలు ప్రతి క్రియల ఫలితముగ కలిగిన ప్రేలుడు బాధలు, దుఃఖముల రూపమున మనకు కనపడినది. ఏ విధముగ నైనను వానిని శక్తి నిచ్చుటను ఆపి వైచితిమేని, అవి నీరు పోయని మొక్కలవలె వాడిపోవును. శరీర ప్రజ్ఞతో కూడిన మన ఆలోచనను ఆత్మవైపునకు మరల్చినపుడు మాత్రమే ఇది సాధ్యము కాగలదు. మన తప్పుడు పనుల వలన దుఃఖములు, క్లేశముల రూపమును దాల్చిన విషయములు వాడిపోవ నారంభించును లేక ఉత్కృష్ట ప్రజ్ఞ ఫలితముగ అతి ప్రభావితములగును. కాలక్రమమున నవి పూర్తిగ నిర్మలములయి, వాని ప్రేలుడులు కూడ ఆగిపోవును. మానవుడపుడు ఆదియందు దివ్య సంకల్ప ఫలితముగ నుజ్జీవింపబడిన ఆత్మజ్ఞానస్థితి యందుండును.

మనకు సంక్రమించిన వస్తువుల యందేదోషములేదు. అత్యంత పరిశుద్ధములైన ఆ వస్తువుల దుర్వినియోగ ఫలితముగ దోషము వానియందు చేరినది. చివఱకది క్లేశములుగ మార్పు నొందెను. ఇప్పుడు వానిని నివారించు అవసరము మనకు కలదు. హృదయమున ఆరోగ్య భావమును పునరుజ్జీవింప చేయునది వ్యాధియే అని నేను చెప్పుదును. ఇప్పుడు, దుఃఖములుగా తెలియబడుచు, సత్యతత్త్వము యొక్క వాస్తవలక్షణమునకు వ్యతిరేకములైన యవి ఏవిధముగ బలమును పొంది, శక్తిమంతమైనవిగ పెరిగినవో చూచెదము. ఇవి మన అధీనమున నుండుటవలన మన నుండియే శక్తిని పొందుచున్నవి. తదితరములు భగవంతుని అధీనమున నుండుట వలన ఆయన నుండియే శక్తినిపొందును. వాని (దుఃఖములు) యెడల మనమెంత ఎక్కువశ్రద్ధ వహించెదమో, మన ఆలోచనా ప్రభావముగా నవి అంతగను బలపడును. కాలక్రమమున నవి మన భావోద్వేగముల నన్నింటిని క్రమ్మివేయు నంతగ శక్తిమంతములగును. అత్యంత శక్తిమంతమైన భగవంతుని వైపునకు మరలుటయే ఏకైక పరిష్కారము. క్లేశములను సంపూర్ణముగా నిర్వీర్యమగునటులచేయుచు, అప్పుడు దివ్యశక్తి ప్రవహింప నారంభించును. క్రమక్రమముగ మానవుడు గీతలో ఎంతయో గొప్పగా చెప్పబడిన స్థితిని పొంద నారంభించును. అచ్చుట తానే కర్త అను భావము పోవును. ఆ స్థితియందింకను పురోగమించుట అనగా సంస్కారములు ఏర్పడుటను నిలుపుట అని అర్థము. ఇది అతనిని జీవన్ముక్త స్థితికి కొనిపోవును. సూక్ష్మ వస్తువును సూక్ష్మపద్ధతితోనే పొందనగును. వాస్తవమునకు, సామాన్యముగ ఆనందమునకు రెండవ వైపుగా పరిగణింపబడు క్లేశములు సత్యముయొక్క ప్రజ్ఞను మన హృదయమున పునరుజ్జీవింపచేయు ఏకైక వస్తువుగ రూపొంది శాంతి, పురోగమన మార్గమున పయనించుటకు మనకు తోడ్పడును. ప్రతియొక్కనికి క్లేశములు కలవు. నాకును నావి ఉండినవి. నాగురుదేవునకు వానిని గూర్చి ఒక మారు వ్రాసితిని. ఈ క్రిందనీయబడిన ఆయన సమాధానము సువర్ణాక్షరములలో వ్రాయదగినవి.

"దుఃఖములకు గుఱియగుట మంచిది, విధేయతా, సహనములకు శిక్షణాకేంద్రము గృహము.

(జీవితము యొక్క) దైనందిన సంఘటనలను ఓరిమితో సహించుట అత్యున్నత తపఃత్యాగముల రూపము. కావున కోపోద్రేకములకు మారుగ సాధుస్వభావమును అలవరచుకొనవలసియున్నది. సాధుత్వమనగా ఇతరులచే నిందింపబడినను తప్పిదము తనదేయని తలంచునట్టి మనోభావము. దానికై, తనకు విధింపబడిన దానికి లోబడి యుండవలసియున్నది. సంతృప్తిని, సహనమును, జీవిత బంధముల నుండి విముక్తిని అలవరచుకొనుటకు ఎడమైయుండుట, ఏకాంతము, అసాంగత్యము అనునవి ఇతరులకు సాధనములు కావచ్చును. కాని మనకు మాత్రము కుటుంబము, మిత్రులు, సంఘము యొక్క నిందలు, దూషణలు ఉత్కృష్టమైనట్టి తపః త్యాగములు."

ఆయన తన సహజరులలో నొకరికి మరియొక చోట నిట్లు వ్రాసిరి : "క్లేశములు, దుఃఖముల విషయమున అవి నాకును ఉండినవి. వేరొకరికైనచో నవి బహుశః అదరగొట్టునవిగా నుండెడివి. నేననేక మారులు భోజనమునకు ఏమియు లేకుండ నుంటిని. నా బిడ్డలనేకులను, నాపై ఆధారపడియున్న వారిని నేను పోషింపవలసియుండెడిది. ఇంతేగాక, కొన్ని సమయములందు ఇతరులకు కూడ నేను సహాయపడవలసి యుండెడిది. దీనిని నేను తప్పింప సాధ్యముగాకుండినది. బాధ్యత సర్వస్వము నాపైననే యుండి, దానినంతయు నేనే నిర్వహించి, అన్ని అవసరములను సమకూర్చవలసి యుండెడిది. కొన్ని సమయములలో కుటుంబము మొత్తము కప్పుకొనుటకై ఒకే ఒక రజాయి, అదికూడ బాగుగా చినిగి పోయిన మెత్తతో ఉండెడిది. కాని నేను దానిని దురదృష్టము యొక్క ప్రదర్శనగా మాత్రమే తీసికొంటిని. కాలము గడచుటతో అది గతించెను. నాయందు ప్రధానముగా నుండిన సత్యతత్త్వముతో పోల్చినపుడు ఇదియంతయు బొత్తిగా ముఖ్యము కానిదని నేను భావించితిని. అందువలన ముక్తికి అవియే మార్గమని తలచి వానిపై మందహాసము చేసితిని.

క్లేశములపై సతతము దీర్ఘముగ నాలోచించుట మన దుఃఖముల నింకను ఎక్కువ చేయును. వానితోమన సంబంధము వృద్ధియై వాని చిక్కులలో మనము కదలకుండ తగులుకొని యుందుము. ఇది మన పురోగతి నడ్డగించును. విజయావకాశము స్వల్పమగును. దీనికొక ప్రత్యామ్నాయ మార్గమును, అపమార్గము పట్టిన కొందరు గురువులు సూచించెదరు. అది ఏమన సంసారము, స్నేహితులు, సంఘము వీనినుండి తెగ ద్రెంపులు చేసికొని ప్రాపంచిక బాధ్యతలను వర్జించుటయే. వాస్తవవిషయమునకు, వారికి అప్పటికి కూడ ప్రత్యేకమైన వ్యాకులములు, బంధనములు ఉండును. అందుచే అది సమస్యకు పరిష్కారము కాదు. అంతేకాక, అది అధ్యాత్మిక జీవితమునకు అత్యంత విషప్రాయములైన దురహంకారము, గర్వము, ద్వేషముల రూపమున గల తీవ్రతర దోషములను పెంచును.

ప్రపంచమున ఏయొక్కడు దుఃఖములు లేకుండ లేడు. వాస్తవమునకు మానవుని ఉనికికి రూఢియైన నిదర్శనము క్లేశములుండుటయే. ఆదిలో మానవుని ఉనికిలోనికి కొనివచ్చిన సమత్వరహిత క్రియా ఫలితమే క్లేశములు. ఇవి వ్యాకోచసంకోచములను కలుగచేయు ప్రకృతి శక్తుల పరస్పరచర్యలు. తత్ఫలితముగ పొరలు ఏర్పడుట ప్రారంభమయ్యెను. ఒకడు వాని ప్రభావమును తగ్గింపగలనని భావించి, తన దృష్టినంతటిని వానిపై నిలిపియుంచిన అదిదాదాపు అసాధ్యమగును. ఈ అన్వేషణలో, ఈ ఒక్క జీవితము మాట యటుంచి, యుగములు కూడ గడచిపోవచ్చును. అంతియే కాదు, అతడు తన స్వీయ క్రియలవలన చిక్కులను అధికతరముగా నిర్మించుకొనుచు పోవచుండును. యథార్థమునకు అది ప్రకృతి మనకు ప్రసాదించిన శక్తుల దుర్వినియోగము. శక్తుల వ్యాకోచ సంకోచములచే ఏర్పడిన పరిమితులను

తీసివేయుటలో మనమునిమగ్నులమైన, మన ఉద్దేశము సరిగా నెఱవేరగలదు. అందువలన, ప్రకృతి శక్తులు మానవుని యందు ప్రజ్ఞను ఎచ్చుట అధికము చేయ నారంభించునో, ఆ స్థాయినుండి మనము మొదలు పెట్టుట ఆవశ్యకము. ప్రజలుదీనికి పూనుకొన లేకుండుటకు కారణము వారు దానికెట్టి ప్రాముఖ్యమును ఈయకుండుటయే. ఏలయన, వారు నిశ్చిత లక్ష్యము, ఉద్దేశ్యము దృష్టియందు లేకుండిరి. ఒక విలుకాడు కొట్టవలసిన వస్తువుపై తన తీక్షణ గమనమును నిలిపిననే కాని, దానిని కొట్టుట ఎన్నటికిని సాధ్యము కాజాలదు.

బాధ, దుఃఖములను నేను స్వయముగ ననుభవించితిని. బాగుగ పర్యావలోకన చేసిన పిమ్మటబాధ, రోగములు ప్రచ్ఛన్న రూపమున నున్న ప్రకృతి వరములనెడి నిర్ణయమునకు నేనిప్పుడు వచ్చితిని. అవి సంస్కార ఫలితములనుండి విముక్తి నొందుటకు సహాయకరములగును. వాని అవశేషముల నుండి విముక్తి నొందినపుడు, అదియునుమనస్సు అంతర్ముఖముగ దాని వైపునకు మొగ్గి యున్నప్పుడు, ఆధ్యాత్మిక పురోగమనముగ కుంటుపడకుండ సాగిపోవును. ప్రాపంచిక జీవనమునకు సంబంధించిన సామాన్య జీవిత కార్యములను పరిత్యజింప నవసరమెవ్వనికి లేదు. కాని దానితోపాటు ఆంత్యమున దేనిని పొందవలసి యున్నదో, దాని సిద్ధి కొరకు కార్య నిమగ్నుడుగ నుండుట మాత్రమే అవసరము. అట్టి ప్రాణప్రదమైన విషయమున ప్రజలు ఆసక్తిని ఏల చూపరోయని నే నాశ్చర్య పడుదును. కొందరు తమ యందు భక్తిని పెంపొందించుకొనుటకు ప్రార్థన యందు నిమగ్నులై, ఆ ఉద్దేశ్యము కొరకై మఱల మఱల ఈ ప్రపంచమున జన్మించవలెనని కోరుట నేను కాంతును. వారి భక్తి భావము నేను హర్షింతును గాని తరువాతా భాగము (అనగా మరల మరల జన్మించుట) నాకు ఏ విధముగను అర్థము కాకున్నది. అది ఏ ఉద్ధేశ్యమును, అర్థమును లేనిదిగ కనుపట్టుచున్నది. యదార్థమునకు చేయవలసినది ఏమన భగవంతునికి తనను తాను అర్పించుకొనుట. ప్రారంభమున ఈ విషయము కఠినముగ కనపడవచ్చు; కాని వాస్తవముగా నది అత్యంత సులభమైనది.

పూజ లేక ధ్యానమునకు కాలము చిక్కుటలేదని చెప్పుకొనువారిని నేనెరుగుదును. కాని వారి జబ్బుకు, దుఃఖములకు, శారీరక అవసరములకు కావలసినంత సమయము వారికి దొరకునని నేను భావింతును; మఱియు, ప్రతియొక్కరికి బాగుగ తెలియును. కారణమేమన, వారికి ఈ విషయములన్నియు దైవకార్యములకన్న ఎక్కువ ముఖ్యములైనవి. నిజమునకు, తన ప్రాపంచిక కార్యక్రమముల కెటువంటి ఆంటకమును కలుగచేయకయే మానవుడు ప్రతి క్షణమును దైవచింతనలో నిమగ్నుడై యుండగలడు. అతడు దీనిని తనకు అలవాటగునట్లు సాధన చేసిన యెడల, అది అతనికి మిక్కిలి సులభము, సహజము అగును. ఫలితముగ అతడు దానినుండి ఒక్క క్షణమైనను విడివడి యుండుటకు ఇచ్చగింపడు. నేను మీ అందరికిని మిక్కిలి సహాయకరమైన సూచన నిచ్చెదను. ఏదేని ఒక పనిని చేపట్టుటకు ముందు భగవంతుడే దానిని చేయుచున్నాడను భావముతో ఒక్క క్షణమాయనను తలంచుడు. ఇది అత్యంత సరళమైన పద్ధతి. దీనిని మీరందరు హృదయ పూర్వకముగ అనుసరింతురని నా అభిమతము.

అందువలన అన్ని పరిస్థితుల యందును తీవ్రవాంఛ ముఖ్యావసరము. దానికి ధ్యానము అనివార్యమైన అంశము. దానియందు గాఢముగ స్థిరపడిన వానికి వాని సమస్య తుదకు పరిష్కారము కాగలదు. వాంఛయొక్క తీవ్రతను పెంచుకొనుట కత్యంత సులభ మార్గము ఏమన వాస్తవమునకు అది మనస్సున లేకుండినను కృత్రిమముగా నైనను దాని నవలంభించుట. కాల క్రమమున, నిరంతర సాధన వలన ఆ కృత్రిమ భావము యదార్థమైనదిగను, అసలైనదిగను అగును.

ప్రస్తుత కాలమున మనస్సుయొక్క అశాంత ప్రవృత్తులు విపరీత స్థాయికి చేరుకొనినవి. స్వల్ప ఆదాయముతో నొకడు; వృద్ధి అగుచున్న అవసరముల గూర్చి యింకొకడు; ఆరోగ్యము, సౌఖ్యము, కీర్తి మొదలైన వాని గూర్చి మఱియొకడు బాధపడుచున్నారు. తామేది కాంక్షితురో, దాని యందెక్కువ భాగము అదృష్ట వశమున అనుగ్రహింపబడిన ధనికులు కూడ ఒక రకమైన వ్యాకులముగాని లేక మఱొక రకమైనదిగాని కలిగియున్నారు. ప్రపంచమున విశ్రాంతిని, శాంతిని కలిగినవారు బహుశః లేరు. ప్రతి యొక్కడును అధికముగా తన వ్యక్తిగతమైన అవసరములకు, కోరికలకు సంబంధించిన సమస్యల నెదుర్కొనుచున్నాడు. అవి అతనికి బాధా దుఃఖములను సృజించుచున్నవి. వెలువడు దారి తెలియక మనిషి వానియందే చిక్కుపడి యుండును. సమస్త విషయములందును, సకల పరిస్థితులందును, సంతోషముగ నుండువాడే అందరికన్నను ధైర్యశాలి. గొప్పఋషులు అన్నిటికన్నను దారిద్ర్యమునకు, కష్టములకు ప్రాధాన్యము నిచ్చిరి. ప్రాచీన ఋషులలో నొకడు ప్రపంచమున గల సర్వ దుఃఖములను తనకు ప్రసాదింపుమని భగవంతుని ప్రార్థించెనని తెలియుచున్నది ! అత్యున్నత పురోగతిని సాధించి, శాశ్వతానందముతోడి స్థిర జీవితమును పొందిన ఆత్మలు అట్టివి.

ఒకడు చేయునట్టి లేక చేసి యుండినట్టి సంకల్పములు బ్రహ్మాండ మండలమున తేలియాడుచునుండి, శక్తిగ పరిణామము నొందును. కొన్ని సమయములందు అవి మనుష్య హృదయమును తాకి, అతని సామర్థ్యము, స్వభావముల కనుగుణముగ తమ గుర్తులను కలుగ చేయును. కాని, అతడు వానియెడల నిర్లక్ష్యముగ నుండిన వాని తీవ్రత పోయిన ఇంచుమించుగ అవి ప్రభావ హీనములగును. వానిని అలక్ష్యము చేయు నలవాటు నేర్పరచుకొన్నచో, అవి మనపై నెట్టి ప్రభావమును కలిగి యుండవు. ఒక ఋషి లేక మహాత్ముడు సామాన్య ప్రాపంచిక వ్యక్తికేవిధముగను భిన్నమైనవాడు కాదు. అతని మనస్సు, ఇంద్రియములు మాత్రము సుశిక్షిత స్థితిలో నుండి అతని సంపూర్ణ అధీనమున ఉండును. అతడు ప్రపంచమునగల వివిధ చ్ఛాయా వర్ణముల ప్రభావము నుండి విముక్తుడై యుండి, తన స్వీయ వర్ణ రాహిత్య స్థితి యందే సదా నిమగ్నుడై యుండును. అతడు శాంతి, నిశ్చలతా వాతావరణము నాశ్వాసించెడి తృప్తి, స్థిరత్వ స్థితిని పొందును.

సాధారణముగ ప్రాపంచిక బంధనములే దుఃఖ కారణములు. కాని అది అధిక భాగము ఎవరు వానికి అనావశ్యక ప్రాముఖ్యము నిత్తురో వారికి మాత్రమే. దుఃఖములు, క్లేశముల నుండి ఒక వ్యక్తి తన దృష్టిని దూరముగా మరల్చినట్లైన, వానియొక్క బాధించెడు లక్షనము చాలవరకు తగ్గిపోవును. కావున వానికి ఆయుక్తముగా నంటిపెట్టుకొనకుండ నుండు నలవాటును ఏర్పరచుకొనవలసి యున్నది. అప్పుడు మాత్రమే అతడు అన్ని పరిస్థితుల యందును సంతోషముగను, తృప్తిగను ఉండగలడు. ఒక వ్యక్తి తన ఉపయోగార్థమై వివిధ రకములైన వస్తువులను కలిగి యుండవచ్చును. అందు కొన్ని అతనికి అప్రియములైనవి, నచ్చనివి ఉండవచ్చును. అయినను వాని నన్నిటిని భద్రముగ బాగుగ అమర్చి, వానికి తగిన స్థలములందు సురక్షితముగ నుంచును. దుఃఖములు క్లేశములతో కూడి యుండిన తన సముపార్జితములు విషయమున కూడ మానవుడు అట్లే యుండవలెను. మానవ శరీరము ఆత్మకు నిలయము. ప్రియములు కానిండు, అప్రియములు కానిండు అన్ని వస్తువులు అందుండును. అవి అన్నియు ఆయా సందర్భములలో మనకు ఉపయోగార్థములే. అవసరమునకు మనకుపయోగపడునట్లు వానిని క్రపద్ధతిని ఉంచవలసినది మనమే. వాస్తవమునకు వానిని ఉపయోగించుట యందును, అమరిక యందును గల క్రమ వైరుధ్యమే కష్టమును కలిగించునది, కాని స్వతః అది కాదు. క్లేశముల విషయమున

అంతియే. వానిని సరిగ ఉపయోగించినచో అవి మనకు అనుకూలప్రదము లగును; తప్పుగా ఉపయోగించినచో మన ప్రయోజనమునకు హానికరము లగును.

ఈ సమస్యకు ఫలప్రదమగు పరిష్కారమేమన వానిని ఒక ఉన్నతాత్మన కర్పించుకొని, వానినుండి నీవు పూర్తిగ వేఱగుట. వ్యసనములు, వ్యాకులములు, దుఃఖములు అప్పుడుఉపశమించును. కర్తవ్యము తక్క మరేదియు దృష్టియందుండదు. సాధన సర్వస్వ మయినట్టి శరణాగతి భావమును ఇది తెలుపును.

రుచి లేమికి తనదైన వింతరుచి యొకటి కలదు. దానిని కూడ రుచి చూడ వలసియున్నది. ప్రతియొక్కడు కనీసము కొంతవరకైనను దుఃఖములలో చిక్కుకొనియున్నాడు. వానిని నిర్లక్ష్యము చేయుచు, అన్ని పరిస్థితుల యందు తృప్తులై, సంతుష్టులై ఉండుటకు ప్రయత్నించువారు ఆనందముగ నుందురు. దానికి గల ఏకైక మార్గము ప్రేమానురాగ భావములతో ఆ గొప్ప శక్తియందే ఆత్మను నిమగ్నము చేసియుంచుట. అనావశ్యములను కుక్కల మొఱగులుగా పరిగణింప వచ్చును. అప్పుడాతని యందు ప్రతిదియును మిత, సమత్వ స్థితిని దాల్చి క్రమమగుటకారంభించును. “మానవ పరిణామము” అను పదము నందిమిడియున్న సరియైన అర్థమదియే.

# తీవ్ర సంకల్పము

మనస్సు యొక్క కలత చెందిన స్థితి పెక్కు సందర్భములలో హృదయము యొక్క క్రూరత్వము మఱియు వ్యాకుల మనస్తత్వము వలన కలుగును. ఒకసారి ఏర్పడియుండి, ఆపై ఇచ్ఛాశక్తిచే బలపఱుపబడిన అలవాటును అధిగమించుట సామాన్యముగ అత్యంత కష్టము. కొన్ని సమయములలోనది మనుష్యుని క్రమముగ అథః పతనమునందు అతి నిమ్నస్థాయి వఱకు దిగజార్చి వైచును. ఎవరు నిన్ను తన కౌగిలిలోనికి తీసికొనుటకు సదా సన్నద్ధులై యున్నారో వారి ఒడిలో నాశ్రయము పొంది దానినుండి నీవే విడిపించుకొన యత్నించవలెనని తిరిగి నేను కోరుదును. నిస్సంశయముగా, కొన్ని సమయములలో నీవంతరంగ మందు దానికై ఆసక్తి కలిగియుందువు. అయిన, నింకను కావలసిన దొకటి కలదు. అది దృఢమైన తీవ్ర సంకల్పము. అది ఏమంత కష్టము కాదు. సరియగు పద్ధతిలో ప్రారంభించినచో అది బహుశః అత్యంత సులభము. ఇంచుమించు ప్రతి యొక్కడు దానికొరకు ఏదో ఒక విధముగా ఆసక్తుడై యున్నాడు. నా గురించి చెప్పవలెనన్న దానిని గూర్చి నేనెన్నడును అక్కఱపడి యుండలేదు, అని చెప్పుదును. బాహ్య దృష్టికి అది నా తప్పుగ కానవచ్చును. కాని, దానికి నా వింత స్వభావమే కారణము. ఎవరినైతే నా సర్వస్వముగ తీసికొంటినో ఆయన గ్రుడ్డి భక్తునిగ నేనెల్లప్పుడు ఉండి పోతిని. ఏది ఒప్పు, ఏది తప్పు అని నే నెన్నడును యాతనపడలేదు. సమస్తము ఆయన గూర్చిన, కేవలము ఆయన గూర్చిన భావములోనే లీనమై యుండినది. దేవుళ్ళు దేవతల ఆరాధన విషయమున నేనెన్నడును వారి అవసరమున నుండి యుండలేదు. ఇప్పుడు కూడ లేను. నా స్థితి ఆయనంతటిదిగాను, నా అంతము ఆయనది వలెను పొంద నపేక్షించితిని. మరిదేనిని నేను కాంక్షించలేదు. భగవంతుడు నిస్సంశయముగ నన్ను ఉనికి లోనికి తెచ్చి, అన్ని విషయములయందుసక్రమముగా నుండుటకు, ప్రతి యొక్కని వలెనే నాకు శక్తి యుక్తులను ప్రసాదించినాడు. కాని, మనము చెడుగా నుపయోగించుటచే ఆటంకములై అవియే యజమానునకు, సేవకునకు మధ్య తెఱగా నిలిచినవి. ఇప్పుడు, పరోగతి విషయమున మన అత్యుత్తమ ప్రయత్నములన్నియు ఆ తెఱపై గల చిన్న సందు దగ్గఱే ఆగిపోవును. అంతకన్న పైకి పోవుట యనునది శాశ్వతముగా ఊహకందనిదై యుండిపోవును. ఇప్పుడీ సందును దాటి పైకి పోగల వారెవరు ? కనీసము నా వఱకు నా గురువు తప్ప మఱియొకరు కారు. అందువలన నేనెవరికి ఋణపడి యుండవలెను, భగవంతునకా లేక నా గురువునకా? నామట్టుకు సమాధానము చక్కగా స్పష్టమే. అంతయు నేను నా గురువునకే ఋణపడి యున్నాను. ఈ ఋణము తీర్చుటెట్లు? నాకు గల ఒకే ఒక మార్గము ఏమన మీ అందరికిని నా శాయశక్తుల సేవ చేయుటయే. నేను మనః పూర్వకముగా మీ అందరికిని సంపూర్ణ బంధన విముక్తిని కోరుచున్నాను. కాని, గులాబి పూవెచ్చట కలదో ముల్లు కూడ అచ్చటనే యుండును. గులాబి పూలను కోరెడి వాడు ముండ్లకెన్నడును భయపడడు. కారాగారము ద్వారానే మోక్షమునకు మార్గము కలదని గాంధీ మహాత్ముడొక మారు వాక్రుచ్చినట్లు చెప్పబడినది. ఆధ్యాత్మిక మార్గము ఊతి నేలపైనను, ముళ్ళ పొదల ద్వారాను ఉన్నదని నేనును ఒక పర్యాయము నా గురువనకు వ్రాసిన లేఖ యందట్టి అభిప్రాయమును వెల్లడించితిని. నేనొకమాఱు ఎంత తీవ్రమైన బాధ, అశాంతి స్థితి యందుంటి ననగా అట్టి పరిస్థితులలో ప్రాపంచిక విషయాసక్తుడగు నేవ్యక్తి యయినను ఆత్మహత్య చేసికొనుటయే మేలను కొని యుండునని నా గురువునకు వ్రాసితిని. కాని, నా గురుదేవుని అధికతర శక్తి ప్రభావమున

నిది యంతయు నాకు ఆహ్లాదకరముగనే కనపడినది. నేను దారిద్ర్య జీవనము నెన్నుకొంటిని. ఉప్పు, రొట్టె తప్పించి మరేదియు లేకుండుటయే నాకు కడు రమ్యముగ నుండినది. అట్టి స్థితిని తనయందు కలుగచేయు నవకాశము నాకింత వరకెవ్వరును ఈయకుండుట దయనీయ విషయము. ఒకే ఒకని విషయమున ఆ స్థితిని బలవంతముగ కలిగించ నొక పరి ప్రయత్నించితిని, కాని ఆ ప్రయోగమున ఎక్కువ దూరము వెళ్ళకుండగనే దాని నాపివేయుమని పైనుండి ఆదేశము వచ్చినది. నా సహచరులకు ఆ రకమైన శిక్షణ నిచ్చినచో, వారి యందు మృదు మనస్సులు నా నుండి మెల్లగ జారుకొనెదరు; దుడుకు స్వభావము కలవారు బహిరంగ విరోధమునకు మఱల్చ బడవచ్చును. నా విషయమున నేను నా ఆలోచనలో ఆ సమయమున ఎంతలీనమైయుంటిననగా శునకపు భోజనావశేషము లందు పాల్గొనుటలో సహితము సంతోషము ననుభవించితిని. ఇక మానవ మాత్రులైన కులహీనుని గూర్చి లేక అంటరాని వానిని గూర్చి వేరుగ చెప్ప నవసరములేదు. ఏమైనప్పటికి, దానికి నాకు సావకాశ మెన్నడును కలుగ లేదనుట వేరు విషయము. నా హృదయమున నాకును శునకమునకును వ్యత్యాసము నే ననుభూతి చెందలేదు. ఇది, నేను ఆంతరంగిక బాధలతో నిండియున్న కాలమున ఉండిన నా స్థితి. ఆ విధముగా సుమారిరువది యొక్క సంవత్సరములు అవిరామముగా నాకు శిక్షణ నిచ్చినందులకు నా గురు దేవునకు నేను ఋణపడి యున్నాను. ఆ కాలావధి పిమ్మటనే నేనుపశమనము ననుభవింప నారంభించితిని. ఇప్పుడు నే ననుభవించుచున్న ప్రశాంతత ఆ కాలమున నాకుండిన బాధకన్న పరిమాణమున ఎంతయో అధికతరమైనది.

మరియు ఆ సమయమున భగవంతుని యెడల నాకు గల ఆసక్తిని గ్రహించిన నా తండ్రి అరణ్య వాసము కొఱకు గృహమును, ప్రపంచమును త్యజించెదనేమోయని భయమంది మెళుకువతో తన అధీనమున నన్నుంచెను. ఈ కారణమున కఠినమైన నిర్బంధము నా మీద విధింపబడెను. నేను నా గురువు నొద్దకు వెళ్ళుటకు కూడ అనుమతింప బడలేదు. నా జీవిత మంతటిలో సుమారు పదిమారులో ఏమో మాత్రమే నేను ఆయన యొద్దకు శారీరకముగ చేర గలిగితిని. అయినను నేను దానికెక్కువగ బాధనొందలేదు. ఏలయన అనావశ్యకములగు ఈ విషయములను గూర్చి చింతించుటకు నాకు సమయము లేదు. ఇది అంతయు నా గురువుయొక్క దయతో కూడిన అనుగ్రహముచే నాలో పెంపొంది భావరాహిత్య స్థితి వలననే. ఇది నిజమునకు "మనిషి–పూజ" యొక్క అద్భుత పరిణామము

---

గురు–పూజ మానవ రూపముననున్న గురువుపూజ.

భాగము - 2

# గురువు యొక్క మార్గదర్శకత్వము

"మన పద్ధతి ఎంత సరళమైన దనగా, ఈ కారణము చేతనే కొన్ని సమయములందు దాని నిజమైన భావమును గ్రహించుట ప్రజలకు బహు దుష్కరమగును."

# నా గురుని సందేశము

సమస్త మానవ కళ్యాణమునకై ఉద్దేశించిన నా గురుని సందేశము మీ కందజేయుట నాకెంతయు ఆనందముగ ఉన్నది. అతని పవిత్ర నామధేయము సమర్థ గురు మహాత్మ రామచంద్రజీ (ఫతేగడ్, యు.పి.). అతడు మన సంస్థకు ఆది గురువు. అతడు తన జీవిత మంతయు సమస్త మానవ జాతికిని ఆధ్యాత్మిక సేవ చేయుటయందే వెచ్చించెను. ముక్తి సాధన మన్నది కష్టసాధ్యమే కాక ఒక జీవిత కాలములో అసాధ్యము కూడ అను జన సమాన్యమునందలి నమ్మకము తప్పు. మన ఈ జీవితమే మనలను ముక్తి స్థాయికి తీసికొని పోగల చివరి జీవితము కావచ్చును, ఎవరెరుగుదురు. ఒకరు వాస్తవమునకు ముక్తిని పొందుట యందు శ్రద్ధ గలవారై యుండి తగిన మార్గదర్శకుని కలిగియుండు భాగ్యము లభించిన నిశ్చయముగా ఈ జీవిత కాలమునందే, కాదు అందులోనొక భాగమునందే, ముక్తిని పొందగలరని మా సమర్థగురువు నిర్భయముగా నొక్కి చెప్పెను. దీనిని అతడు పెక్కు సందర్భములలో నిదర్శనాత్మకముగా చేసి చూపెట్టె ననునది ప్రత్యక్షానుభవమే ఋజువు పరచగలదు.

హృదయముపై ధ్యానమన్నది మిక్కిలి సులువైన పద్ధతిగా అతడు ఉపదేశించెను. ఇది ఈ సంస్థ యందు అనుసరింపబడుచున్నది. ఇతరత్ర బోధించబడునట్లుగా నాసాగ్రము, భ్రూమధ్యము మొదలగు మరికొన్ని ఇతర స్థానముల మీద ధ్యానము కూడ కొంత వరకు ఉపకరింపవచ్చును. కాని నా ఉద్దేశ్యము నందు హృదయముపై ధ్యానమన్నది మిక్కిలి సులభమును, మిగుల ఫలవంతమును అయినది. "రాజయోగ ప్రభావ"మను గ్రంథమున ఈ విషయమును గూర్చి చాలినంత చర్చించి ఉన్నాను. మనమింత వరకు బాహ్య విషయము లందు లగ్నమైయున్నాము. కాని ఇప్పుడు మన మనస్సులను లోనికి త్రిప్పి అంతర్ముఖులము కావలసియున్నది. మన ప్రయత్నములందు విజయవంతమైతిమేని మనము స్వతస్సిద్ధముగానే ఆధ్యాత్మికాను భవములను పొంద నారంభింతుము. ఆధ్యాత్మిక మార్గమున మన పయనము నిరాఘాటముగా సాగిపోవును. ఇతర రూపములగు సాదనములును గూడ బహుశః కొంతవరకు సహాయకారులు కావచ్చును. అయిన నింత మాత్రము నిజము. మనము బాహ్యముఖులుగా నున్నంత వరకు మన దృష్టి ఎన్నడును లోనికి మరలదు. అందువలన, అత్యంత సహాయకములగు పద్ధతులెట్టివన మిక్కిలి సులభములును సహజములును అయి, సమస్త స్థూల ప్రభావరహితములు అగునట్టివే. అన్ని పరిమితుల కతీతమైన సూక్ష్మాతి సూక్ష్మమగునట్టి దానిని పొందుటకై మనలను లఘుతమమును, సక్ష్మతమమును చేయునట్టి సాధనముల వైపు సహజముగానే ఆకర్షితులము కావలెను. చిన్న బిడ్డను నవ్వించ దలచినప్పుడు మనము వానివలె అమాయకత్వము నటింతుము. అట్లే దైవ సాన్నిధ్యము పొందుట కొఱకు మనమే దైవ సన్నిభులు కావలెను.

ఆధ్యాత్మికతకు అత్యంతావశ్యక మగునట్టి మరొక విషయము మితత్వము. ఈ పదము నందు విస్తార భావమిమిడి యున్నది. ఇతరులకు సమంజస మగునట్లు మన బాహ్య జీవన విధానములను చక్క దిద్దుకొనుటకు మాత్రమే సంబంధించినట్టిది కాదది. అది మన మానసిక శారీరక కార్యరంగమున కంతటికి విస్తరించునట్టి విషయము. మా పూజ్య గురుదేవుని ఉద్దేశ్యమున ఒక వ్యక్తి ఏ విషయము నందైనను మితత్వములేని వాడైనచో తాను ఉన్నత స్థితులను పొంది యున్నప్పటికిని ఆధ్యాత్మిక క్షేత్రమున అడుగు మోపిన వానిగా కూడ పరిగణింప దగినవాడు కాడు. యథార్థమున, మితత్వమనగా మనలోని

అస్థిమిత ప్రవృత్తులు చాల మేరకు శాంతిల్లియున్న రంగమునందు మనము ప్రవేశించినారమని అర్థము. ఇంకను మిగిలి యున్న దేదైననున్నచో అది మనము తిరుగులాడుచున్న మండలమునకు సంబంధించి నట్టిది.

అన్ని క్షేత్రములందును కొన్ని గ్రంథులు కలవు. సృష్టి కొఱకు మూల స్థానము నుండి ప్రకృతి ప్రవాహము క్రిందకు జాలువారి నప్పుడు కలిగిన కుదుపులు గ్రంథులను సృష్టించినవి. ఇవి శక్తి కేంద్రములైనవి. మన మీ ప్రవాహములందు ఈదుకొని పోవుచున్నప్పుడు ధ్యానశక్తి వశమున ఈ ముడులు విప్పబడి మన పురోగమనము సులభతరమును, నిస్సంకటమును అగును. ఇంకను, మనము గ్రంథుల ప్రభావము అధికముగా తగ్గింపబడినట్టి స్వచ్ఛతరమగు మండలమునందు ప్రవేశింతుము. ఈ విధముగా మనము దశల వారిగ మాయ దాదాపు నశించునట్టి స్థితిని చేరునంత వరకు ప్రయాణింతుము. ఋషులలో అందఱి కన్న గొప్ప వారు సాధారణముగా ఈ మేరవరకే వెళ్ళగలిగిరి. కాని ఇంకను ఎంతయో మిగిలి యున్నది. ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలించి నప్పుడు మన మధిగ మించినది కేవలము అయిదవ వృత్తమే ("సత్యోదయము"న 23 వృత్తములు గల రేఖా పటము) యనియు, ఇంకను పదునొకండు వృత్తములావల తరించ వలసి యున్నవనియు చెప్పగలను.మనము పదునారింటిని దాటితిమేని నేను నా "రాజయోగ ప్రభావ" గ్రంథమున చెప్పిన కేంద్ర మండలమునందు ప్రవేశింతుము. ఈ దశ ఇంతకు మునుపు సశరీరములగు ఆత్మలకు కడుంగడు దుస్సాధ్యముగా నుండెడిది. కాని మా గురుదేవుని అద్భుత పరిశోధనా ఫలితముగా ఆ స్థితిని ఇప్పుడొకరు భౌతిక శరీరముతో నుండియే పొందగలరు. ప్రజలు దీని విషయమున నమ్మింపబడక పోవచ్చును. అయిన, ఒక వ్యక్తి తాను దానికొరకై పరిశ్రమించిన గాని, ప్రాణశక్తి లేక ఆధ్యాత్మిక శక్తి ప్రసారముచే ఆ స్థితి యొక్క క్షణిక దర్శనమైనను గావింప జాలిన వాస్తవ ప్రజ్ఞానిధియగు గురువును పొందినప్పుడు గాని ఆ స్థితిని ప్రత్యక్షముగా అనుభూతి చెందవచ్చునని నేను చెప్పుదును.

భక్తిని గూర్చి నేను అంతరమున గుర్తించ గలుగుమేరకు, భక్తియని ప్రజలు సాధారణముగా భావించునట్టిది కేవలము వాస్తవార్థమున స్తుతి మాత్రమేయని నిర్భయముగా చెప్పగలను. నిజమునకు యదార్థ భక్తి మిథ్యాస్తుతి కంటె చాల భిన్నమైనది. అది దైవముతో సరళమైన అనురాగ బంధము; దృఢమును, తిరుగులేనట్టిదియునగు అనురాగబంధము. బాధలను (వారు పిలుచునట్లు ప్రేమ వలన బాధలవి) కూడ అనుభూతి చెందువారు కొందరున్నారు. ఇవి నా ఉద్దేశ్యము నందు గ్రుచ్చుచున్నటువంటి కురుపు బాధలని ఉచిత రీతిని వివరింప వచ్చును. అయితే అది సాధారణమైన పొగడ్త స్థాయి కంటె కొంచెము ఉన్నతమైనది కావచ్చును గాక. దీనిని నేను వ్రణబాధయని ఏల పిలుతుననగా ఇందు దైవ స్మరణములేదు. అనగా మన భక్తి దైవముతోడి అనురాగ బంధము ఉండవలసినట్లు లేదు. అది లక్ష్యము కంటె తక్కువ. అట్టి బాధకు ఏకైక చికిత్స విష పదార్థమును తొలగింపగల శస్త్రచికిత్స మాత్రమే. దీని నుపేక్షించునట్లైన కాలక్రమమున అది చికిత్సకు సాధ్యపడని ఒక దీర్ఘ వ్రణముగా వృద్ధి చెందవచ్చును. చెడుగుతో కూడిన సాంగత్యము వాతావరణ ప్రభావమున మన శరీరము నందు పేరుకొనిన దైవవిరుద్ధమును, అధ్యాత్మిక విరుద్ధమును అయిన విషయము ఈ విషపదార్థము. ధ్యానము కొరకు పాటించు సాధనములు మన హృదయములో యదార్థ ప్రేమను ప్రకటితము గావించునట్టివిగ ఉండవలె నన్న నిర్ణయమునకు ఇది మనలను కొనివచ్చును.

దైవప్రేమ పెంపొందించుకొనుటకు అనేక మార్గములు కలవు. దీనికొరకు తల్లి, తండ్రి, మిత్రుడు, గురువు వంటి పెక్కు భావములు అనుసరణీయములగుచున్నవి. నా ఉద్దేశ్యమునందు భగవంతుని ప్రేయసిగా భావించుట ఎక్కువ శ్రేష్ఠము, అనుకూలము. మనలను ప్రేమికునిగాను, దైవమును ప్రేయసిగాను భావించి అదే భావముతో పురోగమించిన యెడల మార్గము మఱింత సుగమమగును. దీని నుండి కలుగు ఫలితమేమన కొంత కాలమునకు దైవము ప్రేమికునిగాను మనము ప్రేయసిగాను మార్పు చెందుదుము. ఇది ధ్యానమునందు వాస్తవముగా నాల్గవదశ. కాని, ఈ దశయందు మనము గమ్యమును సాధించితిమని తలచితిమేని అది పెద్ద పొరపాటే యగును. ఆపై నింకను ఎంతయో కలదు. అది మాటల కందనిది. ప్రత్యక్షానుభవమునకే సంబంధించినది. ఆధ్యాత్మిక పురోగతికి నత్యంత సాహాయ్యకములగు విషయములను నొక్కి చెప్పుటకే నేనిది యంతయు చెప్పితిని.

అయిన, దురదృష్టవశమున అంతిమ సిద్ధియొక్క ప్రమాణము, కాదు పరిపూర్ణతా ప్రమాణముకూడ, యెంత పడిపోయి భక్తి యెంత చవుకయైన విషయముగా పరిణమించినదనగా అవి వాని యసలు విలువను సంపూర్ణముగా పోగొట్టుకొన్నవి. వింత ధోరణిలో కనులు త్రిప్పుట కూడ భక్తిగా పరిగణింప బడుచున్నది. దీని ప్రభావము వలన అనుభవ మొక యున్నత సిద్ధి. ఈనాడొకనిని గురువుగా చేయుటకు ఇది చాలునని నేను గ్రహించుచున్నాను. కాలము చెడుగా మాఱి పోయినది. మనలను మఱింత చెడుగా చేసివైచినది. క్షీణదశ ఆరంభమైనది. అది ప్రజల మనస్సులనుసరియైన మార్గము నుండి తప్పుత్రోవ పట్టించుచున్నది. దానివలన వారుసంపూర్ణముగా కళంకితులైనప్పుడు అథఃపతనభావము వారి మనస్సులందు సంచరించనారంభించెను. కాని వారి అధఃపతన స్థితియందు వారు తప్పును ఒప్పుగా స్వీకరించి, జీవిత సమస్యలకు సరియైన పరిష్కారముగా దానిని భావించుచు, దానితోనే ముందుకు సాగిపోయిరి. వారు దానినే బోధించిరి. దానికి ప్రకాశవంతముగా రంగులు దిద్ది ప్రజలు దానినే స్వీకరించి, వారినే అనుసరించ వలసినదిగా ప్రేరేపించి, దానిని ప్రజలకందించిరి. అయిన, అందువేని యందును కాంతికిరణము లేశమునుకానరాదు. యుక్తాయుక్త వివేకము దాదాపుగా నశించిపోవునంతమేరకు నైతిక భావము పతనమైపోయినది. ద్వేషమెంత ప్రబలినదనగా అసహ్యకరమైన జగడములకు దిగుట, తద్వారమున దొమ్ములందు పాల్గొనుటయన్నది పవిత్ర కార్యముగా భావింపబడుచున్నది. దీనికంతటను విస్తారముగా దృష్టాంతములు కనవచ్చుచున్నవి. వ్యక్తిగత దైవము అనుభావమును ప్రతిపాదించినవారు కొందరున్నారు. మరి కొందరు రూపములేని దైవమును, ఇంకను మరికొందఱు సగుణ నిర్గుణ దైవ భావమును ప్రతిపాదించిరి. విరోధమునకు దారి తీసెడి తీవ్ర వాదోప వాదములు ప్రబలినవి. అవి పరస్పర ద్వేష భావములను పుట్టించి వివాద కారకములగుచున్నవి. సగుణ నిర్గుణ వాదులిరువురును, వారు ఒండొకరితో ఎంతయో పోటీ పడుచున్నప్పటికిని, నా ఉద్దేశ్యమున, సమానముగానే పొరబడుచున్నారు. అందుచేత ఏ ఒక్కరును లక్ష్యప్రాప్తిని పొందలేకున్నారు. వాస్తవమునకు ఇవి రెండును ఆత్మ సాక్షాత్కారమనెడి ఒకే లక్ష్యమునకు రెండు మార్గములు. వీని మధ్యగల ఏకైక భేద మేదన సగుణ మార్గము అనుసరించుచు దానికే కట్టుబడి యుండు వారికి అనంతమనునది ఎన్నడును దృష్టి కందనిదై మిగిలి యుండును. అనగా వారు గాలి యందలి నీటి ఆవిరులను గట్టి మంచుగడ్డగ ఘనీభవింప జేసిరి. ఈ మంచు గడ్డ జారి సముద్రమునకు చేరుకొన్నప్పుడు ఓడలు దానికి ఢీకొని మునిగిపోవచ్చును. నిర్గుణ భావవాదియగునతడు దానినే సర్వ సమగ్రమని భావించుచు దానికే నిరవధికముగ అంటిపెట్టుకొని ఉన్నచో వాని గతి కూడ అట్టిదే. బహుశః భేధమింతయే. ఇతని గడ్డ మరికొంత దూరము నందు ఉండ

వచ్చును. వాస్తవముగా చెప్పవలెనన్న భగవంతుడు సగుణుడు కాడు, నిర్గుణుడును కాదు. రెండింటికిని అతీతుడు. అతడు అతడే. మరి ఈ రహస్యమును భేదించుటకు ఏమి చేయవలెను ? అది సగుణముకానీ, నిర్గుణముకానీ ఈ రెండింటిలో ఏదియు కాకుండనీ, ఆ పరతత్త్వము మీద దృష్టిని స్థిర పరచి దాని యందు ప్రేమను పెంపొందించుకొనుటయే దీనికి ఏకైక పరిష్కారము కాగలదు.

ఇప్పుడు ఆత్మ సాక్షాత్కార సమస్యయే మిగిలియున్నది. సాధారణముగా ప్రజలు శంఖ, చక్ర, గదా పద్మములు వరుసగా నాలుగు చేతులందు ధరించిన విష్ణుమూర్తి భౌతిక రూపమును ప్రత్యక్షము చేసికొనుటగా అర్థము చేసికొందురు. కాని, నా అభిప్రాయమున అట్టి దర్శనము ఆరాధకుని స్థూలతర మానసికస్థితి ఫలితమే. అతడదే రూపమును ధ్యానమునకు గైకొని నందున అతని సూక్ష్మ తరమగు ఆత్మయే అతని కారూపమున నగపడెను. రాజయోగమున సాధనా ఫలితముగా వృద్ధి పొందు మానసిక స్థితి చాల భిన్నమైనది. ఆ స్థితియందు అతడు దైవీయశక్తిని సర్వత్ర, సర్వవిషయము లందును అనుభూతి చెందును. అది అతనిని పరమానంద స్థితికి కొనిపోవును. యధార్థ దర్శన స్థితి వాస్తవమున కట్టిది. ప్రజలు విలోకించి, తమకు తామే అనుభవింప నిండు.

ఈ దర్శన స్థితి పొందుట అనగా పరిపూర్ణత్వము కాదు. అది కేవలము దైవమువైపు వైచిన మొదటి అడుగు మాత్రమే. మన మింకను ఎంత దూరము వెళ్ళవలసి యున్నది, ఇంకను ఎన్ని స్థితులను దాటవలసి యున్నది, కచ్చితముగా నిర్ణయింపలేము. మనఅంతిమ లక్ష్యము భూమ యందు ఐక్యమగుట అయినప్పుడు దర్శన స్థితిని ఏ విధముగను అంతిమ మయినదిగ గ్రహింపరాదు. ఒక విధముగా మనము శిశువు తన క్రొత్త బొమ్మలతోవలె, మనము ప్రవేశించిన స్థితియొక్క ఫలితములను అనుభవించుచు, ఇంకను ఒక వినోద స్థితియందే ఉన్నాము. నీ హృదయ నేత్రముతో దీనిని చూచిన యెడల ఇందులోని యధార్థము తేలికగా గ్రహింపవచ్చును. 'వినోద'స్థితి యని ఏల అంటి ననగా సాధకుడు దాని నుండి కొలదిసేపు దూరమైనప్పటికిని దుఃఖము ననుభవించును. ఆరాధనా రూపమున మనలో అధిక సంఖ్యాకులు చేయువానిలో అంతటను సుఖానుభవ భావమున్నది. తత్ఫలితముగా ఇది ఒక రకమైన వినోదమే తప్ప ఇతరము కాదు. వినోదోత్పత్తి స్థానము లనేక ప్రకారములైనవి. శిశువునకు బొమ్మలు; పండితునకు పుస్తక పఠనము; ఆరాధకునకు అభ్యాస సాధనములు; భక్తునకు భావోద్రేకపూరిత ప్రేమ; సాక్షాత్కృతాత్మునకు సాక్షాత్కారము, ఐక్యము; పరిపూర్ణునకు వాని అజ్ఞాన స్థితి. కాని ఇంతవరకును ఇవి యన్నియు కేవలము వినోదము కొరకు ఉద్దేశించిన వినోదములే. యధార్థమగు సత్య తత్త్వము మనము ఈ దశల నన్నింటిని దాటినప్పుడింకను ఆవల కలదు. ప్రజలు ఈ వినోదములే సత్య తత్త్వముగా భావించి, వానియందే చిక్కుపడియుండి, వానితోనే తమ అన్వేషణమును అంతమొందించుకొనుట అన్నది శోచనీయమగు విషయము.

*मिल गई जिसको गांठ हलदी की ।*
*उस ने समझा कि हूँ मैं पनसारी ।।*

పసుపు కొమ్ము లభించిన వాడుతానొక వ్యాపారినని భావించెను.

సత్యతత్త్వ మెట్టిదై యుండగలదో మాటలలో వివరించుట మిక్కిలి కష్టము. ఇది సత్య తత్త్వము యొక్క ప్రారంభమే అయినప్పటికిని అర్థము చేసికొనుటకు గాను దీనిని మనము ఆధ్యాత్మిక దశలన్నిటి యొక్క అంత్య స్థితిగా పిలువవచ్చును. ఆ పైన అదికూడ అదృశ్యమై దాని జ్ఞాపకము కూడ వెనుక

కొదుగును. అప్పుడు మనము సమప్రదేశమును చేరుకొందుము. అందు మన ఈదులాట అనంతముగా సాగిపోవును. ఆ అనంత ప్రదేశపుటనుభవము లందాసక్తి కలవానికి, భావముల ప్రభావములన్నింటిని ప్రక్కకు తొలగించుకొన్న పిమ్మటనే తానందు ప్రవేశించవలెనని నేను చెప్పుదును.

నేను పైన చెప్పినదంతయు కేవలము ఒకని స్వీయ ప్రయత్నము తోడనే సాధించుట అన్నది చాలదుష్కరము కావచ్చును. కారణమేమన మనము పైకి పైకి పోవుచుండగ ప్రకృతిశక్తి సూక్ష్మాతి సూక్ష్మమగుచుండును. శక్తి ఎంత సూక్ష్మతరమైన అదిఅంత బలవంతమగును. అందుచేత స్వప్రయత్నముతో పైకి పోవుట యన్నది బహుదుర్లభమగును. ఈ దశయందు తన స్వీయ శక్తిచేత సాధకుని పైకి నెట్టగల సమర్థుడైన మార్గదర్శకుని సహాయ సహకారములు అత్యంతావశ్యకములు. అయిన, నా దృష్టిలో గురుశక్తిచే పైకి నెట్టబడినప్పటికిని (ఆ శక్తి వినియోగముచే అక్కడ అతని ఉనికిని నిలువరింపకపోయినచో) మరల క్రిందికి జారు ప్రమాదమింకను అట్లే ఉండును. నా సహచరులలో ఒకనిని బ్రహ్మాండమండలము యొక్క నాల్గవదశకు అతీతముగా పైకి తీసికొనిపోయి స్వయముగా నేను ఒకమారు ఆ స్థితియందు ప్రవేశించి, విషయముల ప్రత్యక్ష పరిశీలనము కావించి, స్వీయ ప్రయత్నముతో ఆపై దశకు చేరుటకు వేయి సంవత్సరముల కాలము పట్టుననియు, ఆటుపైని చలనమునకు అయిదువేల సంవత్సరముల కాలము పట్టుననియు కనుగొంటిని. ఆధ్యాత్మికదశలు అసంఖ్యాకములగుటచే వానిలో ప్రయాణించుటకు పట్టుకాలముకూడ లెక్కకట్టరానిదే. కేవలము ప్రాణాహుతి శక్తి మాత్రమే ఈ కాల వ్యవధిని తగ్గించి వేల సంవత్సరములు పట్టు గమనమును ఒకని జీవిత కాలవ్యవధిలోనే పూర్తిచేయు వీలు కల్గించు నట్టిది. అయిన, అంతిమ విజయసిద్ధియొక్క నిశ్చయ ప్రాప్తికి అంతిమ లక్ష్యముకూడ సదా దృష్టియందు నిచియుండవలెను.

అంతిమ లక్ష్యము దృష్టియందుంచుకొనక మన సాధనసరళిని కొనసాగించుచున్నచో మనస్థితి గమ్యము తెలియక ప్రయాణము చేయుచున్న ప్రయాణికుని వంటిదగును. గమ్యము సదా దృష్టి యందుంచు కొన్నప్పుడే ఆధ్యాత్మికపథమును గుర్తించగలము.

మార్గమునందు మనలను స్థిరముగా నుంచునది ఏది ? మనలను ముందుకు నెట్టుచు సహాయ మార్గదర్శకత్వములను నెరపు శక్తి ఏది ? అది, దుష్టమైనదిగ తరచు భావింపబడు మన మనస్సు, మనస్సే. వాస్తవమునకు మనమే దానిని అతిచుఋకైనది, నిశ్చయము చేసికోజాలనిది, ఊగిసలాడునట్టిదిగా కావించి, దాని అలవాట్లను చెడగొట్టివైచితిమి. లేకున్నది దైవాదేశములను, ఉన్నత స్థాయి యొక్క సూక్ష్మాతి సూక్ష్మాను భూతులనన్నింటిని మనకందజేసెడి అత్యుత్తమమును, ఏకైకమును, అత్యంత ప్రయోజన కరమును అయిన మనలోని సాధనము. పాడయిపోయిన స్థితిలోనది నిస్సందేహముగా చిత్తవిభ్రమములకు దారితీయును. వానిని తరచుగా పురోగమన దశలుగా అపార్థము చేసికొనుట కలదు. అట్టి దయనీయులగు వ్యక్తులు నాకెదురయినారు. ప్రమాదవశమున ఒకరు ఏ మాత్రమైన విదేహాత్మవాదమునందు అభిరుచి కలవారయినచో, దాని విషప్రభావ పరిమితి లెక్కకట్టరానిది కావచ్చును. కారణమేమన అతడు వానిని ఉన్నతాత్ములతోడను, దేవుళ్లతోడను సంబంధమని వివరింపనారంభించి, దైవాదేశములను పొందుచున్నట్లుగ చెప్పుకొనును, అయిన, మనస్సును పరిశుద్ధ స్థితికి తెచ్చినచో అది ఎన్నడును ఒకరినీ విధముగ తప్పుదారి పట్టించదు. నేనిచ్చట మానవ మనస్సు యొక్క మూలమును గూర్చిన నా స్వంత పరిశోధనను తెలియబరతును.

సృష్టి సమయము ఆసన్నమైనప్పుడు కేంద్రమునకు దిగువనున్న మండలములో ఒక సంచలనము కలిగెను. ఇది సృష్టికి ఆధారముగ పనిచేసెను. అప్పుడది దాని పరమ స్వచ్ఛ స్థితి యందుండెను. ఏలయన, భగవంతుని మిక్కిలి దగ్గతి స్థితియది. ఇదే మానవునియందు మనస్సై కనవచ్చెను. దీని కావల కేవలము భగవంతుడే కలడు. దీనినే నేనునా "రాజయోగ ప్రభావము"న కేంద్రము అని అంటిని. ఇప్పుడు దాని ప్రస్తుత స్థితిలో మనస్సు ఎంతవరకు భ్రష్టమైపోయినదో ఒక్క క్షణమూహింపుడు. అది తిరిగి పరిశుద్ధముకావింపబడి మొదటి స్థితికి తేగలిగినప్పుడు ఏది మంచిదో దానినే అది బహిర్గతము చేయును. అదృష్టవశమున అంతటి గొప్ప ప్రజ్ఞానిధియగు గురువును కనుగొనగలిగినప్పుడు, సాధకుడు కూడ ప్రాణాహుతియొక్క తీవ్రశక్తిని తాళజాలగలవాడైనప్పుడు, ప్రాణాహుతి ద్వారా మనస్సును దాని మొదటి స్థితికి క్షణములో తేవచ్చును.

నేను కేవలము కొన్ని ముఖ్యాంశములను మాత్రమే స్పృశించితిని. మరియును ప్రతిదశయందును ప్రాణాహుతియొక్క ప్రాముఖ్యమును నొక్కి చెప్పితిని. కారణమేమన నేనింతవరకు ఎన్నడును దీనికంటె మేలైన మరింత ఫలప్రదమైన పురోభివృద్ధికారక మార్గమును చూచి ఉండలేదు. అది ఏలయన గురుని ఉత్కృష్టశక్తి మన స్వప్రయత్నముతో కలిసి, పురోగమనశక్తిని ద్విగుణీకృతము చేయును. ఇంకను ఈ విధముగ స్వప్రయత్నము యొక్క అతిప్రజ్ఞ అణచి ఉంచబడి, స్థూల యాంత్రిక మార్గానుసారులగు వారిలో తరచు కలిగెడి అహంకార భావము నెన్నడును వృద్ధి చెందనీయదు. రాజయోగ ప్రభావమున నేను సూచించినట్లు ఇప్పుడు కాలము మారిపోవుచున్నది. కాన మా పూజ్యగురువు మహాత్మ శ్రీ రామచంద్రజీ ప్రతిపాదించిన సాధనములే ప్రపంచమంతటను ఆచరణలో నుండును. దైవజ్ఞాన మొక విజ్ఞానశాస్త్రము. (గ్రంథులరూపముననున్న) మూల భాండాగారమునుండి ప్రవహించు ప్రకృతి శక్తికి సృష్టిలయములను రెంటిని చేయగల సామర్థ్యము కలదు. భారతదేశ ఋషులు సృజనశక్తిని ఎల్లప్పుడును మానవజాతి పునరుద్ధరణకు వినియోగించిరి. అతి విస్తారముగనున్న విధ్వంసక శక్తికూడ ఎంత శక్తిమంతమైనదనగా అణుబాంబు సహితము దానికి దీటురాదు. ప్రస్తుతమీశక్తి కూడ యిప్పుడున్న దానికి బదులుగ ఒక క్రొత్త ప్రపంచము నిర్మించుట యందు వినియోగింపబడుచున్నది. ఆధ్యాత్మిక పునరుజ్జీవనమప్పుడే ఆరంభమైనది. భారతదేశము మరల, అది ఎంతకాలము తీసికొనినప్పటికిని, ప్రపంచమునకు నాయకత్వము వహించును. ఆధ్యాత్మికత ఆధారముకాకుండ భూమిపై ఏ దేశమును మనజాలదని ప్రపంచము త్వరలోనే గ్రహించగలదు.రాజకీయచతురత, వ్యూహరచనల యుగము ఇప్పుడు అతివేగముగ గతించుచున్నది. ఈ శతాబ్దాంతములోగా గుర్తింపదగిన మార్పులు తప్పకరానున్నవి. ఏది విధిగా జరుగనున్నదో దానిని సంతోషముగా ఆహ్వానించుటకు ప్రతి ఒక్కరును సిద్ధముగానుండవలెను. దేనివలన మాత్రమే వారికి శ్రేయము నిశ్చయముగా కలుగగలదో ఆ ఆధ్యాత్మిక మార్గమునకు వారు తప్పక రావలెను. నేను ప్రజలకు, వారికి సహితము తెలియకుండగనే, నిరంతరము కొంత వఱకు సేవచేయునప్పటికిని, వారు నాకీ విషయమున సేవా అవకాశము కలిగించుటలేదు. నేను పైన చెప్పినదంతయు యావత్ప్రపంచమునకు మా గురుదేవుని సందేశము.

***हज़ारों साल नरगिस अपनी बेनूरी पे रोती है***
***बड़ी मुशकिल से होता है चमन में दिदावर पैदा ।।***

నేత్రాకారము గల నార్గిసన్ పుష్పము దాని దృష్టిలోపమునకు వేల సంవత్సరములుగా విలపించుచున్నది. నిజమైన నేత్రములతో ఉద్యానవనము నందేదియును జనించదు.

# అనుభవపూర్వక అన్వేషణ

ఆత్మ సాక్షాత్కారమనునది అభ్యాసానుభవము ద్వారా కలిగెడి ప్రత్యక్షజ్ఞానము. ఆవశ్యకమగు నొక అనుభవ పూర్వకాన్వేషణ. అన్వేషణమునకు ఆవశ్యకములని సాధారణముగ విధింపబడు కఠిన జీవిత నియమములు సామాన్య మానవ జీవితమున ఆచరణ యోగ్యములు కావు. నేడు ప్రపంచమునకు కావలసినదేమన శాస్త్రీయ పద్ధతులపై ఆధారపడి మన సామాన్య జీవితముతో సన్నిహిత సంబంధము కలదిగా నడిచెడు సమర్థవంతమైన విధానము. మన సమర్థ గురువు ఈ క్లేశములనన్నింటిని పరిగణించుచు మన భౌతిక, మానసిక దుర్భలతలను, తక్కువగు జీవిత కాలవ్యవధిని దృష్టిలో నిడుకొని తనదైన కరుణా కటాక్షముచేత మనకీ సులభ తమ మార్గమును ప్రసాదించెను. ఇది సాధ్యమయినంత అత్యల్ప కాలములో అనవసర శ్రమ ప్రయాసలు లేకుండ అత్యంతోన్నత విజయమును కలుగజేయునట్టిది.

సహజ మార్గ విధానము నందు గురువు తన అంతః శక్తుల వినియోగము చేత అభ్యాసి యందలి నిద్రాణ శక్తులను పని చేయుటకునై మేలుకొలిపి, త్వరితము కావించి, ప్రాణాహుతిపద్ధతి ద్వారా దైవీయ ప్రవాహము నాతని హృదయము వైపు మళ్లించును. దీని ఫలితముగ అభ్యాసి అధికాధికముగ పరమానందము ననుభూతి చెందుచు ఆధ్యాత్మికముగ పురోగమింప నారంభించును. అభ్యాసి దీనిని తీసికొనుటకై కేవలము తన్ను తాను సన్నద్ధ పరచుకొనవలెను. మారు మాటలలో, దానికి తనను తాను సమర్థుడుగాను, అర్హుడు గాను చేసికొనవలలెను. ఈ విధముగ ఇదివరకు యుగముల పర్యంతము నిరంతర శ్రమ ప్రయాస లావశ్యములయిన దంతయు నిప్పుడు చాల తేలికగా, బహుస్వల్ప కాలములో, కొలది శ్రమతోడనే సాధింపనగును. అయిన, ఇది యంతయు అనుభవ పూర్వకమయినది. ఏ విధముగను మాటలలో పెట్టరానిది. కేవలము ప్రత్యక్షానుభవమే దీని గుణములను విశద పరచ గలదు.

ఈ విధానము నందలి గొప్ప వింత ఏమన ఈ పద్ధతిలో శిక్షణ పొందిన ఒక బోధకుడు తాను నిజమునకు స్వయముగ పొందని దశను కూడ ప్రాణాహుతి ప్రసారము ద్వారా అభ్యాసము చవి చూచునట్లు చేయగలడు. కారణమేమన అభ్యాసికి ప్రాణాహుతి ప్రాసారము ద్వారా ఏదైనను కలుగజేయునది అవాస్తవమునకు బోధకుడు కాడు. బోధకుని వ్యక్తిత్వము ద్వారా సమస్తము చేయునది సమర్థ గురుదేవులే. ఈ విధముగా బోధకుని యొక్క వ్యక్తి గత పరిమితులు అభ్యాసిపై నెట్టి ప్రభావము కలిగి యుండవు. ఏది అతడు ప్రసారము చేయునట్లు పైకి అగుపడునో అది నేరుగ అనంతము నుండియే వచ్చుచున్నది. ఏమైనప్పటికిని బోధకుడు అభ్యాసి వైపుగ ప్రవాహ గతిని కలుగజేయుటకు తన ఆత్మశక్తిని కావలసినంతగా అభివృద్ధి పరచుకొని యుండవలెను.

మనస్సులో ఉంచుకొనదగిన తరువాత ముఖ్య విషయము నైతిక క్రమశిక్షణ. దీనినిగూర్చి ప్రతియొక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. తనకు గాని, తానున్న సంస్థకుగాని చెడ్డ పేరు తెచ్చెడు పని ఎన్నడు చేయరాదు. అతని జీవన విధానమును ఇతరులతో వ్యవహారమును ప్రేమ, కరుణ భావములతో ఉత్తేజితమైన నిరాడంబరుడై, నమ్రత గలవాడై, స్నేహ భావము కలవాడై ఉండవలయును. ఇది అతనికి కూడ శాంతి సంతృప్తులకు మూలమగును. ఒకడు తన సమస్త ప్రాపంచిక బాధ్యతలను, కర్తవ్యములను సక్రమముగా నిర్వర్తించుచునే నిరంతర దివ్య ప్రజ్ఞయందు లీనమై నిరాడంబరమును, పవిత్రమును

అయిన జీవనమును సాగించవలెను. తన ప్రాపంచిక బాధ్యతలయెడ తీవ్ర నిరసనముతో గృహము నుండి పారిపోయి, ఏ నిర్దిష్ట లక్ష్యము ప్రయోజనమును లేక తిరుగాడుట ఎవనికిని ఎంత మాత్రము సమర్ధనీయము కాదు. వాస్తవమునకు వైరాగ్యమని పిలువబడునట్టి స్థితి యందు కూడ ఒకడు ప్రాపంచిక భావరహితుడగుట అరుదు. దైవము ననాదరణ చేసిన గృహస్థుడు భగవంతుని మోసగించినట్లు భావించినచో విరాగియని పిలువ బడువాడు మరింత పాపిగా నిరూపితుడగును. కబీరు మహనీయుడు యుక్తముగ ఇట్లు నుడివెను.

> "భగవంతుడు బ్రహ్మచారికి ఇరువది యడుగుల
> దూరములోను, సన్న్యాసికి ముప్పది యడుగుల
> దూరములోను ఉండును. కాని, తనను వాని
> హృదయములోనే ఆరాధించునట్టి గృహస్థునికి
> వానియందే నివాస మేర్పరచుకొని యుండును."

మనము వాస్తవముగా సర్వదా భగవంతుని తోడను, భగవంతుని యందును ఉండుటకు ప్రయత్నించవలెను. అతని నుండి క్షణమేని ఎన్నడును దూరము కారాదు. ఈ స్థితి వరకు వచ్చితిమేని మనము నిరంతరము వైరాగ్య స్థితి యందే యుండుదుము. ఈవిధముగా భగవంతుని తోడి సాంగత్యము ప్రపంచము తోడి నిస్సంగత్వముగా పరిణమించును. ఇదియే నిజమైన వైరాగ్యము.

కొందరు వ్యక్తులు ఈ విధానము నందు నియమితములైన అభ్యాస సాధనములు వానియంతటి అవియే అంతిమ లక్ష్య ప్రాప్తికి సరిపోవునన్న భావముతో నున్నట్లు అగపడుచున్నారు. కాని, అది పూర్తిగా నట్లుకాదు. సహజ మార్గ సాధనా విధానమును గూర్చి నుడువునపుడు దానియందలి యంతరార్థమునకు నేను మీ దృష్టి నాకర్షించవలసి యున్నది. అభ్యాసి తన మనస్సును దాని బాహ్య స్వరూపము మీదనే నెలకొన జేయరాదు. దురదృష్ట వశమున, ప్రజలు కేవలము లాంఛన ప్రాయమగు నియమములు, పద్ధతుల మీదనే వారి దృష్టి నిలిపి అసలైన భావమును అలక్ష్యము చేయుచున్నారు. ఈ విధానమునందు ఆధ్యాత్మిక శిక్షణము ప్రాణాహుతి ప్రసారము ద్వారా జరుగుచున్నప్పటికిని అత్యావశ్యకమును, విడిచి పెట్టరానిది అగువిషయము, అభ్యాసి తనయందే అభివృద్ధి పరచుకోవలసినది, కలదు. అది, అభ్యాసముతో అనుసంధితమై యుండవలసిన ప్రేమ, భక్తి భావములు. ఈ అంశమును సాధకుల పురోగతిని త్వరితము చేయుటకు శ్రీకృష్ణుడు రాజయోగమునందు ప్రవేశ పెట్టెను. ప్రేమను పెంపొందించుకొను ఏకైక మార్గము నిరంతర స్మరణము. నిత్య కార్య కలాపముల నిర్వర్తించునపుడు నీవు దానిని దైవాదేశములకు విధేయుడవై నిర్వహించుచున్నట్లును, తత్కారణముగానవి నీ కర్తవ్యాంశములైనట్లును భావింపవలెను. ఈ సులభ పద్ధతి సరియైన భావముతో ననుసరించిన యెడల నిన్నది అంతిమ లక్ష్యముతో సంపర్కమున నుంచును. మరియొక ప్రయోజనమేమనగా నీవు ఇంకను సంస్కారముల నేర్పఱచుకొనుట నాపివేయుదువు. నిరంతర స్మరణము భగవంతునితో సన్నిహితత్వమును వృద్ధి పఱచును. అది భక్తిగా అభివృద్ధి చెందును. ఇదియేల యనగా ఆ సంకల్పములోని వేడిమి ఉద్వేగమును ప్రేరేపించును. ఇది భక్తి రూపమును దాల్చును. దీనిని నీవు అలవాటుగా క్రిందికి తెచ్చుకొన్నచో నీలో ప్రేమ ఎంత త్వరగా వృద్ధి చెందునో గమనింతువు. ఇది వాస్తవముగా ఆధ్యాత్మిక జీవనములో నొక ఆవశ్య కాంశము.

కొన్ని సంస్థలలో సాధన యందనుసరించు పద్ధతులు తరచుగా గుప్తముగా నుంచబడును. ఆ సంస్థ యందు నియమ ప్రకారము వచ్చి చేరుటకు పూనుకొన్నవారికి మాత్రమే అవి వెలువరించుట గాని, విశదపరచుట గాని జరుగును. వారి మూలోద్దేశ్యము బొత్తిగా అర్థము చేసికొన వీలుగాదు. ప్రకృతిలో గోప్యము లేదు. నా ఉద్దేశ్యమున, దైవ మార్గము ననుసరించుచున్నట్లు ప్రకటించుకొనువానికి కూడ అటువంటిది ఏదియు ఉండరాదు. మన సంస్థయందు అభ్యసించు పద్ధతి హృదయముపై ధ్యానము చేయుట. ఈ పద్ధతినే పతంజలి కూడ చెప్పెను. ఈ పద్ధతి యందలి మూల సూత్రమును గూర్చి నా "రాజయోగ ప్రభావము"నందు చర్చించితిని. దాని నిక్కడ తిరిగి చెప్పుట నా ఉద్దేశ్యము కాదు. వ్యక్తి స్థూలత్వమును దూర మొనరించుకొనుటకును, సూక్ష్మతమ స్థితిని పొందుటకును ఈ పద్ధతి అత్యధికముగా తోడ్పడును. భగవంతుడు సంపూర్ణముగా స్థూలత్వరహితుడు. అందువలన, భగవత్సాక్షాత్కారము కూడ అట్టి సూక్ష్మ పరిశుద్ధ స్థితి ప్రాప్తియే గావలెను. ఇది ఈ విధానము నందలి అత్యుత్తమ గుణము. ఆవరణముల రూపమున పేరు కొనిపోయిన స్థూలత్వమునుండి అభ్యాసి తన్నుతాను వెలువఱచుకొనుట కిది సహకరించును. ఈ విషయమున ప్రాణాహుతి పద్ధతి ద్వారా గురుని సహాయము అత్యంతావశ్యకము. ఈ కారణముచేత అభ్యాసి స్థూలత్వమును తననుండి తొలగించుటకు మారుగ దానిని మరింత వృద్ధి చేయు పద్ధతులు సాధనముల నుండి దూరముగా నుండుట అతి ముఖ్యము. కోరిన ఫలితముల నిచ్చు నట్లగపడని పరంపరానుగతమైన చెడు పద్ధతులకు గట్టిగా మనమెన్నడును కట్టుబడి ఉండి పోరాదు. సూక్ష్మత్వము వైపు మన పురోగమనమునకు సహాయపడు వానిని మాత్రమే మన మనుసరించవలెను.

ఒక మనిషి తనదృష్టిని అంతరాత్మవైపు మరల్చినపుడే నిజమయిన మనిషి కాగలడు. అసలైన సత్యాన్వేషణ అందే కలదు. దీనిని అనుసరించుచుండువాడు, దేనినుండి సమస్తమును వచ్చినదో ఆ మండలమునందు తన స్థానమును స్థిరపరచుకొనియుండును. మారుమాటలలో అతడు ప్రధాన మూలముతో తన సంబంధమును ఏర్పరచుకొనును. అప్పుడు మిగిలియున్న ఒకే ఒక విషయము దాని విస్తరణము. ఇందుకొరకు నియమిత అభ్యాసము చాలును. నేను అత్యంత సులభమైన పద్ధతులను నియమింతును, అయినప్పటికిని కొందరు దాని నెక్కువ లక్ష్యపెట్టరు. కారణము బహుశః వారికి నిజమైన ఆకాంక్ష లేకుండుట కావచ్చును. తీవ్రాకాంక్ష సృష్టింపబడినప్పుడు (భగవంతుడట్లే సంకల్పించుగాక) భగవత్ప్రాప్తి అత్యల్ప కాల విషయమగును.

మన సహచరులలో అత్యధికులు వారి స్వప్రయోజనములకు అత్యధిక ప్రాముఖ్యము నిచ్చి వానియందే నిమగ్నమై ఉండిపోవుదురని చెప్పుటకు నేను విచారించెదను. అసంఖ్యాక జీవితములు చెల్లిపోయనవి గాని ఇంకను మన మాతృభూమికి తిరిగి వెళ్లుట అనునది నెరవేర్చ లేకపోతిమి. ఇంకను దానిపై తీవ్రాకాంక్షకూడ హృదయమునందు పురుజ్జీవింపబడుచున్నట్లు కానవచ్చుటలేదు. వాస్తవమున ఇది యంతయు భగవంతుని మధురసంకల్పముపై ఆధారపడియున్నది. నేను ఇవ్వగలుగునంతమేరకును వారు నానుండి పొందుదురుగాక! ఇంకనుగూడ వారి ఆకాంక్ష మిగిలియుండినచో నేను మిగుల సంతోషముగ మరింత పరిపూర్ణత సాధించిన మరియొకరిని వెదికి కొందని వారికి సూచింతును. జనులు నాకంటె ఔన్నత్యమును పొందగా చూచుటయే నా కత్యంతానందదాయకము. నేనేమి, నేనెందున్నాను అన్నది పూర్ణముగా పూజ్యగురువునకే తెలియును. నేనర్థము చేసికోగలిగినది ఇంతమట్టుకే. అది ఏమన నా స్థితియొక్క అవధిని నిర్ణయించుట నాతరముకాదని, ఇంకను మరి ఎంత దూరము ఈద వలసియున్నదో

తెలియదని, ఏమైనప్పటికిని, నా సహచరులలో ఎవరయినను ఉత్తరకాలమున ఎప్పుడయినను దీనిని సంపూర్ణముగా అవగతము చేసికొనుట జరిగిన అతడు ఆ సమయమును పూర్తిగా వినియోగించు కొనలేక పోయినందులకు చింతించవలసి యుండును. నేను పదే పదే గుర్తు చేయుచున్నప్పటికిని వారి హృదయములు ఏల చలించకున్నవో అని నేను ఆశ్చర్య పడుచున్నాడను. ఇది బహుశః నా లోపములలో కొన్నింటి వలననే కావచ్చును.

మన పద్ధతి ఎంత సరళమైన దనగా ఈ కారణము చేతనే కొన్ని సమయము లందు దాని నిజమైన భావమును గ్రహించుట ప్రజలకు బహు దుష్కరమగును. ప్రజలు భగవంతుని తానెట్లున్నాడో అట్లు గ్రహింపక వారి స్వంత రుచులకు, ఇష్టములకు అనుగుణముగ వారి మనస్సులలో సృష్టించిన అసంఖ్యాకమైన కృత్రిమ కల్పనములలో నతని నిమిడ్చి ఆ విధముగా నతనిని సంపూర్ణముగా మాయా కోశమున పడవైచుటవలన కష్టములుత్పన్నమగుచున్నవి. వారు అతని నట్లే ఆరాధింతురు. తత్ఫలితముగ వారే మాయలో చిక్కుకొందురు. మారు మాటలలో వారు స్థూల రూపమున నున్న మాయను ఆరాధింప వారగుదురు. ఇప్పుడెవరయినను వారికి దానిని వివరింప వచ్చినచో అతడు వారిని మోసగింప చూచుచున్నాడని భావించి పారిపోవుదురు. మాయకు సంబంధించిన పలు రంగులలో తామే అద్దబడి, వారి అభిమతమున కనుగుణముగా పలు వెన్నెల వస్తువుల నందజేయునట్టి మహాత్ములనే అధికముగా వారు మెచ్చుకొందురు. సామాన్యమైన పొరపాటు ఏమనగా వారు అత్యావశ్యకమైన ఈ అంశములను గమనించుట యందు శ్రద్ధ వహింపక ముక్తి ఎవరి దగ్గర లేదో వారి యందు దానిని అన్వేషింతురు. వాస్తవమునకు వారిలో అధిక సంఖ్యాకులు ముక్తి కొఱకై ఎట్టి కోరికయును కలిగియుండలేదు. వారు తమ ప్రాపంచిక వాంఛలను తీర్చుకొనుట కొరకే దేవుళ్ళు, దేవతలకు అంటి పెట్టుకొని యుందురు. భగవంతుని కూడ ఆరాధించువారు కొందరు ఉండవచ్చును. అయినను, దారిలో తటస్థించినదిగా మాత్రమే. అది కూడ కేవలము స్వార్థ ప్రయోజనములకే. వారు వాస్తవముగ ఈవిధమైన ఆధ్యాత్మిక శిక్షణ పొంద నర్హులు కారు. వారు దానికి సమర్థులును కారు. యదార్థముగ మనము ఐక్యమువైపు పయనించు చుండగ వారు మరొక ప్రక్క వైవిధ్యమువైపు నిరవధికముగ చెదరిపోవుచు, ఆలోచనా ప్రవాహమును అనేక భిన్న మార్గములలో నడిపించుచున్నారు. ఇట్లు మన ఆలోచనాశక్తి నానావిధములుగ ప్రయోగింపబడుటతో బలహీన పరుపబడి చెదరగొట్టబడును; ఆత్మ సాక్షాత్కారమునకు మన ప్రయత్నములు వైఫల్యమున అంతమొందును. సాధారణముగ అట్టి వ్యక్తులను నేను మన సత్సంగమునందు చేర్చుకొనను. ఏలయన, వారియందు శ్రమయంతయు నిష్ఫలమగునని నా నమ్మకము. తత్ఫలితముగా నా సమయమును వారికొరకు వృథా చేయుట కంటె ఆధ్యాత్మిక లాభము ఆకాంక్షించు ఇతరుల కొరకు దానిని ఉపయోగించవలెను.

ఈ విధానమునందు ఏకైక పరమ శుద్ధతత్త్వమగు భగవంతుని గూర్చిన వాస్తవారాధనకు తప్ప మఱిదేనికిని, ఎంతమాత్రమును అవకాశములేదు. దీనియందు, తోడుతో దేవుళ్ళు దేవతలనాశ్రయించి ముందుకు సాగిపోవుట అనునది ఏమాత్రము సాధ్యము గాదు. దానిని విడిచిపెట్టలేనంత బలహీనత గలవాడెవడైననున్నచో నేనతనిని విడిచిపెట్టుమని నిర్బంధించలేను. అట్టి సందర్భమునందు అతని పురోగమన విషయమున నేను బాధ్యుడను కాజాలను. అవసరము లేని దానిని విడిచి పెట్టుటకు వారు సిద్ధముగా లేకున్నచో వారు ఇతర మార్గముల కొరకు ఇతరుల యొద్దకేల వెళ్ళవలెను? ఇతర మార్గములు, విధానముల వెదకి కొనుటయే వారనుసరించుదానిలో వారికి గట్టి నమ్మకము లేదనియు, వారి

హృదయంతరములందు దానిలో నేదో దోషమో, లోపమో గుర్తించినారనియు నిరూపించును. వారనుసరించదగునట్టి ఏకైక మార్గమేదన సరియైన విదానమునకు దారి చూపుటకు కొంతకాలము భగవత్కృపకై శ్రద్ధతో ప్రార్థించుట. సాధనయొక్క ప్రాయోగిక వైఖరి కొరకు అనుభవ పూర్వకమైన అధ్యాత్మిక శిక్షణా విధానమును ఆవశ్యకముగా అనుసరింపవలెను. దీనికి మనకు సరియైన మార్గదర్శకత్వము కావలసియున్నది. గ్రంథములనుండి పొందెడి మార్గదర్శకత్వమంత ప్రయోజనకరము గాదు. ఏలయన, అది తరచుగా తప్పుదారి పట్టించునట్టిది. కొన్ని యెడల ప్రమాదకరము కూడ. గ్రంథములందు విధించిన పద్ధతులు కేవలము బాహ్య విషయములనే స్పృశించునవై సాధారణముగా తికమక పెట్టును. పుస్తకములందు మందుల పేర్లను, వాని దర్మములను కేవలము చదువుకొని యొకడెన్నడును సరియైన వైద్యుడు గాజాలడు. అట్లే భగవంతుడు, ఆత్మ మొదలగు వానిగూర్చి గాని లేక మార్గమున వివిధ ఆధ్యాత్మిక స్థితుల గూర్చిగాని బాహ్య భౌతిక పరిజ్ఞానము సంపాదించి యొకడు యదార్థముగా లక్ష్య ప్రాప్తిని పొందినట్లు ఎన్నడును చెప్పుకొనజాలడు. దానిని గూర్చిన వర్ణమును పుస్తకములందు కేవలము చదువుటచేతనే మామిడి పండు రుచిని పూర్తిగా గ్రహించుట అసంభవము. "వంటకము యొక్కరుచికి నిదర్శనము తినుటయందే కలదు" అన్నది అందరెరిగిన నానుడి.

ప్రజలకు మార్గదర్శకత్వము వహింతుమని బహిరంగముగా చెప్పుకొను నేటి బోధకులు కూడ అభివృద్ధి గూర్చి తప్పుడు ఆశలు కల్పించి, ప్రజలనటువంటి మార్గములననుసరింపగా ప్రోత్సహింతురు.. ప్రజలు తమ పక్షమునుండి తామనుసరించవలసినవిగా బోధించబడిన పద్ధతులు వారి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రగతికి చెందుచున్నవా లేక దేనికిని చెందవా అనుదాని నర్థము చేసికొనుటకెన్నడును శ్రమపడరు. అధిక సంఖ్యాకుల విషయమున, కొంత పురోగతి సాధించినట్లుగా భావింపబడినప్పటికిని, వారు వాస్తవముగా జీవ, మాయా బ్రహ్మలను గూర్చి తాత్విక వివాదములందు అధికముగా చిక్కుకొనినవారై కనవత్తురు. బహుశః మరియేయితర ముఖ్యోద్దేశ్యము లేకుండ ప్రజలొక మహాత్ముని దర్శనము కొఱకు వెళ్ళినపుడు ఇవియే సాధారణముగా వారికి చర్చనీయాంశములు. ఇప్పుడు అట్టి సమస్యలకు పరిష్కార మార్గము, ఒకవేళ లభ్యమయినప్పటికిని, అది వారి ఆధ్యాత్మికావసరమున కేవిధముగనైన నుపకరించునా అనుప్రశ్న ఉత్పన్నమగును. లేదు అనుటే దీనికి నిశ్చయముగా జవాబు అని నా అభిప్రాయము. అప్పుడుదానివలన వారికి ఉపయోగమేమి? అది కేవలము మానసిక తర్కమేగాని వేరుకాదు.

పెక్కుమంది చీకటిలో తడవులాడుచున్నారు. వారు రాళ్ళు భగవంతునకు ప్రాతినిధ్యము వహించునని భావింతురు. వారు వివేకము పోగొట్టుకొని యున్నారు. వారు మనిషికి మనిషికి మధ్యగాని, మనిషికి తదితర జీవులకు మధ్యగాని భేదము గుర్తింపజాలరు. ఎవరు మనిషి? మానవత్వముతో నిండినవాడే మనిషి. సరియైన అర్థమున, ఒక మనిషిని అతడెట్టి మనిషిగా నుండవలయునో అట్టి మనిషిగా చేయగలవాడే అసలైన మనిషి – అతడే యధార్థమున సంపూర్ణ మానవుడు. అట్టివానినెట్లు నిర్ణయించగలము? అతడు అసామాన్య అసాధారణ విషయములను ప్రదర్శించు ఇంద్రజాలికుడుగాని, మాంత్రికుడుగాని కాజాలడు. కాని, భక్తులలో ఎట్టివారు తామెంత మాత్రముకారో అట్టివారుగా నటించు మాయల మారులు పెక్కుమంది యుండవచ్చును. వారు వారి హృదయ మెక్కడో దానినుండి దూరముగా తిరుగులాడు చుండగా, జపమాలలోని ప్రతిపూసకు "రామ, రామ" అని కూయుచుందురు.

ప్రజలలో అధిక సంఖ్యాకులు భక్తిగీతములు పాడుచు “జయ జయ” ధ్వానములుచేయుటను నీవు చూచెదవు. చిత్రములను, ప్రతిబింబములను ఆచారప్రకారము ఆరాధించుట వారికి అలవాటు. వారికి కథలు, దృష్టాంతములు భక్తికి మార్గములు; పవిత్ర గ్రంథపారాయణము ఆరాధనము; చర్చలు, ఉపన్యాసములే జ్ఞానసిద్ధి. బోధకులు, ప్రచారకులు కూడ తక్కువలేరు. ఎవని దగ్గరకైనను వెళ్ళుము. అతడు నీకేదో ఒకటి అనుసరించవలసినది చెప్పును, వారి అఱపులు, ఆర్భాటములెంత గొప్పవనగా ఆ శబ్దములకు సమస్తాకాశమే ప్రతిధ్వనించుచున్నది. చిత్రాతి చిత్రమేమన అప్పటికి కూడ అది వారి హృదయములందు ప్రతిఫలించుట లేదు. ఈ ఆర్భాటమింతయయినప్పటికిని వారెప్పుడును ఎక్కడుండి నారో యిప్పుడును అక్కడే యున్నారు. పొందవలసిన దానిని పొందనులేదు, పోగొట్టుకొనవలసిన దానిని పోగొట్టుకొననులేదు. వారి ఆరాధన ప్రకటనమునకై వారు విలపించిరి, జపించిరి, స్తుతించిరి, దుఃఖించిరి; కాని అంతయు నిష్ప్రయోజనము. అయిన్నపటికిని వారు తాము భక్తులమని భావింతురు. మహాత్ములుగా కీర్తింపబడుదురు. అట్లు, ఒక విధముగా, వారి నటన కంతటికిని తగిన బత్తెమును పొందుదురు. వారొక పదవిని సంపాదించుకొని, భక్త బృందమునందు గురువులుగా, మార్గదర్శకులుగా పరిగణింపబడుదురు. వారి పొగడ్త వారికి తెచ్చిపెట్టునది యంతయును, ఇదియే.

సామాన్య ప్రజలు సాధారణముగా అనుసరించు ఆరాధనాపద్ధతులలో చాలవరకు, ఒక విధమున గాకున్న మరొక విధముననైన, పొగడ్త రూపములే అనుట అసమంజసము కాకపోవచ్చును. వానిలో బొత్తిగా అనురాగము గాని, ప్రేమగాని సమర్పణముగాని లేదు. స్పష్టముగా, వారు చేయునదంతయు తమ్ముతాము తృప్తిపరచుకొనుటకే గాని వారు అరాధించు దేవుళ్ళను తృప్తిపరచుటకుగాదు. ఇది ఇంద్రియములతో సన్నిహితముగా సంబంధము కలిగియుండుటచేత నిజముగానే ఒక నీచ వాంఛ. మారు మాటలలో, వారెల్ల కాలము ఇది ఇంద్రియములందే చిక్కువడి యుందురు. దీనిని వారానందమని అనుఉకొందురు. కేవలము చూపునకే అది అసంగత భావము. ఈ కారణమువలన, వారు ఎంతో కష్టపడి నటించినప్పటికిని అపార దైవకృపా విహీనులుగానే ఎల్లకాలము మిగిలిపోవుదురు.

ఇది యంతయు వివరించుటలో నా యుద్దేశ్యమేమన అట్టి బాహ్యాపరమైన ముఖస్తుతి ప్రదర్శనములు హృదయములో అంతః ప్రజ్ఞను మేల్కొల్పుటకు ఎంతమాత్రము పనిచేయవని మీ మనస్సులో దృఢాభిప్రాయము కల్గించుటయే. ఇది యంతయు నింద్రియములకు సంబంధించిన ప్రాపంచిక వాంఛల కొఱకే. వీనికి నిజముగా అంతములేదు. ఏలయన, నొక విషయవాంఛ తీరినచో, దానికి సంబంధించిన మఱియొకటి వెంటనే దానిస్థానమున పైకి లేచును. అందువలన, ఈ సాధనములు వాంఛలు, అపేక్షల అల్లికనుండి విముక్తి మార్గము చూపవు. తత్ఫలితముగ వీనివలన నెట్టి ప్రత్యక్ష ప్రయోజనము లేదు.

ఇంద్రియములకు సంబంధించిన భౌతిక వాంఛారహితమైనదే నిజమైన భక్తి. అది నిజమైన ఆకాంక్షతో ప్రేరేపితమైనది. ఎట్టి ఆకాంక్షయన, అది తీరినప్పుడు దాని స్థానమున మఱియొకటి పుట్టనివ్వక, సమస్తాకాంక్షలను అంతమొందించునట్టిది. అది యధార్థముగా మన యాత్రకు అంతమగు మాతృభూమి యొక్క జ్ఞాపకము. సహజముగానే గృహముయొక్క జ్ఞాపకము భగవత్ స్మరణమును మన హృదయమునందు సజీవముగా నుంచును; భగవత్ స్మరణము మన గృహము యొక్క జ్ఞాపకమును సజీవముగా నుంచును. అది నిజముగా అంతములేని అంతము. దానిపై ఆకాంక్ష పదార్థ వ్యాప్తికి అతీతమైనది. ఇంద్రియముల గూర్చి నుడువ బనిలేదు. అది సామాన్యముగా నర్థము చేసికొనబడు ఆత్మ సాక్షాత్కారము, ఐక్యము, గమ్యస్థానము లేక అంతము.

దాని తోడి అనురాగము వేఱు విధముగా 'నిరంతర స్మరణము'గా వివరించవచ్చును. నిజమునకు భక్తి యనిన నదియే. అది లేకున్ననది కేవలము అపహాస్యమే యగును. దీనిని పొగడ్తయనియే పిలువనగును. పొగడ్త చేయువానికి చేయించుకొను వానికిని హానికరము. తన చుట్టును స్తోత్రపాఠకులు గల రాజు, ఆ కారణమున ప్రమాదమునందు చిక్కుకొననుట నిశ్చయము. అందుచేత నతడు ఈ చెడు నఱికట్టుటకు కఠిన చర్యలు తీసుకొనవలెను. ప్రకృతికూడ ఈ కార్యమునకు నొక చర్యావిధానము బహుశః పాటించి యుండవచ్చును. ఏమైనను ఫలితము దానంతటనే కాలక్రమమునందు వెలుగులోనికి వచ్చును.

# సాధనములు

ఆత్మ సాక్షాత్కారమునకు అసంఖ్యాక సాధనములు, అభ్యాసములు విధించబడుచున్నవి. వీనిలో సత్వర విజయమును నమ్మకముగా కల్గించు దానిని మనమెన్నుకొనవలెను. అది ఏది అన్నది ప్రతి వ్యక్తియును తనకు తానుగా నిర్ణయించుకొననిండు. సూచనగా ఈ విషయముపై స్వామి వివేకానందుని వివేచనాత్మకమైన అభిప్రాయమును ఉదహరింతును. "ఒక మనిషిని సాధన పథమున అత్యున్నత స్థాయివఱకు విజయవంతముగా కొనిపోగలది కేవలము రాజయోగము మాత్రమే. ప్రాణాహుతి ద్వారా తన స్వీయ అంతర శక్తులను ప్రయోగించు సామర్థ్యము గలవాడు తప్ప యితరుడు మార్గదర్శకుడుగా లేక గురువుగా నుండుటకు యోగ్యుడు కాడు." హఠయోగమునకు ఆజ్ఞా చక్రమున కతీతముగా వెళ్ళుట సాధ్యముగాదని కూడ నేను మీకు నమ్మకముగా చెప్పగలను. దీనికి తోడు, అందు మఱియొక తీవ్ర లోపముగలదు. మనము హఠయోగపు శారీరక అభ్యాసములతో మొదలుపెట్టినచో, తానను భావము ఆధారముగా మన దైహిక ప్రయత్నముల యొక్క ప్రజ్ఞ కూడ ఆద్యంతము మిగిలియుండును. అట్లహంకారము తగ్గుటకు మారు, తద్వారా వృద్ధిచెందుచు పోవును. రాజయోగ విషయమున నట్లు జరుగదు. ఇందు సాధకుడు నిరంతర క్రియాశీల మానసిక ప్రవృత్తులను నిశ్శబ్ద పఱచుటకై సూక్ష్మతను సాధనములతో పురోగమించును. ఇంకను సూక్ష్మతమమైన దానిపై తన దృష్టి నిలిపియున్నాడు. కనుక, దీనినాచరించుటలో ఎల్లప్పుడును శరీర భావమునకు దూరమైనవాడై యున్నాడు.

సత్యమును పొందుటకు గృహస్థాశ్రమము ప్రతిబంధకముగాదు. ఉన్నత స్థితి సులభసాధ్యమగుటకు అత్యంతోత్తమమగు నాశ్రయమము నా అభిప్రాయమున నిదియే. నేను గృహస్థుడను. మా గురుదేవులును అంతే. పరిపూర్ణుడగు ఋషి ఈ ఆశ్రమమునందే కనవచ్చునని నేను మీకు నమ్మకముగా చెప్పగలను. మనముమన బాధ్యతల నిర్వహించుచు, భగవంతుని అంతిమ సత్య తత్త్వముగా గుర్తుంచుకొందుము. అది భగవదాదేశ మను భావము మనసున నున్నయెడల కర్తవ్య నిర్వహణమే ఆరాధనము.

హృదయముపై ధ్యానము చేయు పద్ధతి హృదయమున దైవ ప్రకాశమును గూర్చి చింతించుట. ఈ పద్ధతిలో ధ్యానమారంభించి నపుడు కేవల మొక్కసారి మాత్రమే లోనున్న దైవ ప్రకాశము నిన్నాకర్షించు చున్నట్లు చింతింపుము. ధ్యాన కాలమున నితర భావములు వచ్చినయెడల వానిని సరకు చేయకుము. వానిని రానిమ్ము. నీవు నీ పనితో సాగిపొమ్ము. మిక్కిలి సహజమైన పద్ధతిలో, సుఖాసనమున ఉదయకాలము నందొక గంట కూర్చొండుము. ఈ పద్ధతిలోని తత్త్వము కావలెనన్న దానిని నీకు కొంత సమయము తర్వాత తెలియ బఱతును. నీవు ధ్యానము మాత్రమే చేయవలెను. ధ్యానకాలమున సాధారణముగ వచ్చెడి భావములు, ఆలోచనలతో పెనుగులాడకూడదు. ధ్యాన ఫలితమే ఏకాగ్రత, ధ్యానమునకు ఏకాగ్రత కావలెనని, అందుకై మనస్సును నిర్బంధించువారు సాధారణముగా అపజయము నెదుర్కొందురు. ఈ పద్ధతులనుసరించు సమయమున మనస్సును గుర్తుంచుకొనవలెను. ధ్యానమునకు అరుణోదయ కాలమున కూర్చొనుట మేలు. అది సాధ్యము గాకున్న అభ్యాసివగు నీకనుకూలముగా ఏ నిర్ణీత సమయమునందైనను కూర్చొనవచ్చును. బాహ్య విషయముల వలన కలత చెందక, నీ యభ్యాసమునందు మఱింత నిమగ్నతతో సాగవలసిన ఆవశ్యకతను గుర్తించుటకు అవియొక విధముగా నీకు సహాయ మొనరించుచున్నవని భావించుచు నీ పనియందు నిమగ్నమై యుండుము.

సాయంకాలము తిరిగి అదేసుఖాసనమునందు అర్థగంట కూర్చుండి క్లిష్టతలు,నీ పూర్వాలోచనల అల్లిక, నీ దేహమునందలి ఘనత్వము లేక స్థూలత్వములన్నియు నీ వీపునుండి కరిగిపోవుచున్నట్లు లేదా పొగవలె ఎగిరిపోవుచున్నట్లు భావించుము. అది నీ మనస్సును నిర్మలము కావించుటకు సహకరించును; మన సమర్ధ గురుదేవుల ఫలప్రదాయియగు ప్రభావమును గ్రహించునట్లుగా చేయును. అవాంఛనీయ పదార్థమునుండి నీవు ముక్తుడవైనట్లు గుర్తించిన వెంటనే నేను తగుచర్య తీసికొందును. చక్రములను, వాని ఉపబిందువులను శుభ్రపఱచి మేల్కొలిపి చివరకు కుండలినిని కూడ తీసికొనుచు, ఉన్నత స్థితికి ఎగయుదుము. కాని అభ్యాసికి తనకుగా దానితో పనిలేదు. అది కేవలము గురుదేవుని దృక్పథము లోనిదే.

మా గురుదేవుల వంటి గొప్ప ప్రతిభాశాలి యగు మార్గ దర్శకునకు వాస్తవముగా ఆధ్యాత్మికత ప్రసాదించుటకు క్షణమైనను పట్టదు. అభ్యాసిగా రూపొంద జేయుటకు అధికముగా కాలము వెచ్చించబడును. మనము భక్తి విశ్వాసములతో మన అభ్యాసమును కొనసాగించవలెను. కోరినది తనంత తానుగా మన దగ్గఱకు వచ్చును.

నేను వివిధ సంస్థల అధిపతులను పలుమార్లు కలిసినాను. నాకు విస్మయము, విచారము కల్గించునట్లుగా, అందరియందును ప్రాణాహుతి విచారకరముగా లోపించి యుండుటేగాక పెక్కుమందికి అది చాల క్రొత్త విషయము అని తెలిసికొంటిని. స్వామి వివేకానందునకట్టి సమర్థత యుండెను. కాని, అట్టి మహాపురుషులెప్పుడును అరుదు. మాపూజ్య గురుదేవులవంటి మహాపురుషులు నిష్కారణముగా జనింపరు. ప్రపంచము వారి కొరకై ఆతురతతో కూడిన నిరీక్షణముతో కాచుకొనియున్నప్పుడే వారు అవతరింతురు. అట్టి మహోన్నత మూర్తులు లేక అవతార పురుషులు, భౌతిక రూపమున ఉపాసనా విధానములను, పద్ధతులను కాలమునకు తగినట్లు మార్చుటకు అవతరింతురు. తన కాలమున గొప్ప గురువగు శ్రీ కృష్ణుని విషయము అట్టిదే. మా పూజ్య గురుదేవులు కూడ ప్రస్తుత కాలావసరముల కనుగుణముగా చక్కబఱచి, ఈ విధానమును మార్పుచేసిరి. ఆధ్యాత్మిక క్షేత్రమున వారి అత్యద్భుత పరిశోధన “రాజయోగ ప్రభావ” గ్రంథమందు చెప్పినట్లు అభ్యాసి కేంద్ర మండలమును సమీపించుటకు చెందినట్టిది. నేను మా సమర్థ గురుదేవుల అడుగు జాడల ననుసరించుచున్నాను.

తఱచు ప్రజలు అత్యున్నత ప్రమాణముదాక భగవచ్ఛక్తిని సమస్తము నొకే మారు తమయందు ప్రవేశపెట్టుమని కోరుచుందురు. దాపరికము లేకుండ చెప్పవలెనన్న నేనును అట్లు చేయుటకు ఎల్లప్పుడును ఉత్సాహపడుచుందును. కాని, అందుకు చాలినంత సమర్థత అభ్యాసిలో అరుదుగా కనవచ్చుచుండుట నాకు విచారము గలిగించుచున్నది. ఆలస్యము ఆ ఆలోపమువలననే జరుగుచున్నది. దానికి నన్ను ఏ విధముగా గాని లోభిగా నిందించుట తగదు. నాలో నున్న దంతయు సర్వమానవాళికే. ఏ విధమగు దాపరికము, భేద భావములు లేకుండ ఆధ్యాత్మికతను దశదిశల విస్తరింప జేయుటకు గురుదక్షిణగా మా గురుదేవులకిచ్చిన పవిత్ర వాగ్దానమునకు నేను బద్ధుడను. అది నేనిపుడు చేయుచున్నాను. నా జీవితమంతయు చేయుచుందును. అయినను, నీవు నిరుత్సాహపడనవసరము లేదు. నీ విషయమును నిజముగా నీవు నాకప్పగించి యున్నచో, నీవు కూడ చేయవలసినది చేయుచున్నచో, నీ పరిపూర్ణత్వమునకు నా సంపూర్ణ సహకారము నిత్తునని మాటి యిచ్చుచున్నాను.

మనస్సు నేవిధముగా లగ్నము చేసి యుంచవలెనను విషయమున, నా అభ్యాస కాలమున నేనేమి చేసెడి వాడనో వివరింతును. ఈనాటి వలెనే మా గురు దేవులే నాకు సర్వస్వమై యుండిరి. నా హృదయము లోపలను, వెలుపలను కూడ నేను వారి రూపమునే ధ్యానించుచుంటిని. నీ వాతనిని చూడనందున దీనినాచరించుమని నీకు చెప్పను. ఈ విధానమునందు నాకు కలిగిన లాభము మాటలలో చెప్పనలవి కానిది. పతంజలి 'యోగ దర్శనము' నందలి 37వ సూత్రము (వీతరాగవిషయం వా చిత్తమ్ 1.37) దీనిని సంపూర్ణముగా బలపరచుచున్నప్పటికిని, కొందరికిది అభ్యంతరముకావచ్చును. ఋషుల చిత్రముల మీద ధ్యానముచేయుటకు నేనెంత మాత్రము సుముఖముగాలేను. నిరంతర భగవత్ స్మరణము సహజము గానే ఆధ్యాత్మికతలోని ప్రత్యేక లక్షణము. నీ మామూలు అభ్యాసముతో బాటు దీనినే నీవు ప్రయత్నించ వలసినదిగా చెప్పుదును. నిరంతర స్మరణము నలవఱచుకొను పద్ధతియేదన నీ కార్యాలయమునందును, గృహమునందును, మార్గమునందును, అంగడి వీధియందును, విరామసమయములలోను భగవంతుడు సర్వాంతర్యామియనియు, నాతని గూర్చి నీవు తలచుచున్నావనియు, దృఢ విశ్వాసముతో చింతన చేయుచుండుట. ఆ తలపునందే నీవుండగలంత సమయము ఉండజూడుము.

నీవు వైరాగ్యదశను చేరవలెనను ఉత్సాహముతోనున్నావని నేను సంతసించుచున్నాను. నిస్సందేహముగా నీవాస్థితిని పొందగలవు. అయిన నీవు చాలినంతగా పరిశుద్ధుడవైనప్పుడే. అది నీమీద కూడ ఆధారపడియున్నది. దీనికొరకే నీవు సాయంకాలాభ్యాసము చేయవలసినదిగా ఉపదేశింపబడినది. నీవు ఆధ్యాత్మికముగా అభివృద్ధి చెందుచున్నావని నేను భావింతును. దీనర్థము చేసికొనుటకు నీకు నేనొక సూచన చేతును. నీవు, స్వల్పముగానేకావచ్చును, తేలికదనము ననుభూతి చెందుచుండ వలెను. క్రమక్రమముగా క్లిష్టతలు తొలగిపోవుచున్నందులకు, ఆధ్యాత్మికశక్తి నీలోనికి ప్రవహించుచున్నందులకిది యొక నిదర్శనము. దీని ననుభూతి చెంద యత్నించుచు, ఆప్రకారము నాకు తెలియపఱచుము. పగలి కాలమునందు ధ్యానము చేయుటకు వీలుకానిచో నీవు పరుండబోవునపుడుగాని, (కొంత నిద్రించిన పిమ్మట) మధ్యరాత్రి గతించి పరిసరములు నిశ్శబ్దముగా నున్నపుడుగాని చేయుము. అట్టి సందర్భమున, సాయంకాలము చేయవలసిన శుద్ధి చేయు పద్ధతిని మొదట చేయుము. సుమారు పదిహేను నిముషములు దానిని చేసిన తర్వాత నిర్దేశించిన విధమున ధ్యానము ఒక గంట కాలముగాని లేక ఇంచుమించుగ గాని చేయును.

పూర్వకర్మముల గూర్చి యాలోచించుచు మనము మనలను బలహీన పరచుకొనరాదు. మనము మన భవిష్యత్తును ప్రకాశవంత మొనరించుకొనుటకై అత్యున్నతమైన దానిని సాధింప సదా ప్రయత్నించ వలెను. ఈ ప్రాపంచిక జీవితమున అన్నియు అనుకూల పరిస్థితులనే పొంది యుండుట చాలదుర్లభము చేయవలసినదేమన పరిస్థితుల కనుగుణముగా వీలైనంతగా మనము సరిపెట్టుకొని, వానిని మనకత్యంత లాభదాయకముగా వినియోగించుకొనుటే. ఇట్టి విషయములందు కూడ నిరంతర స్మరణము నీ కధికముగా సహకరించును. అన్నిచోట్ల, కుటుంబ సమస్య తీవ్రముగానున్నది. ఎట్లైనను, మనము దానిని సహింపవలెను.

అభ్యాసపరముగా ఇంకను ఉన్న ఒక విషయమేదన అతినమ్రభావము కలిగి, దేవునియందు ప్రేమ పొంగిపొర్లెడి హృదయముతో ప్రతిరోజు పరుండబోవు సమయమున క్రింది సంగ్రహ ప్రార్థన చేయుట.

ఓ ప్రభూ! నీవే మానవ జీవితమునకు లక్ష్యమవు;
మేమింకను మాపురోగతికి ప్రతిబంధకములైన
కోరికలకు బానిసలమై యున్నాము.
మమ్మా స్థితికి చేర్చగల ఏకైక దైవమవు, శక్తివి నీవే.

పై దానిని నీ మనస్సునందు ఒకటి, రెండుసార్లు చెప్పుకొని దానిపై కొన్ని నిమిషములు ధ్యానము చేయుము.

ప్రార్థన ఎట్లు చేయవలెనన్న అత్యంత దీనుడైనవ్యక్తి పరమోత్కృష్ట గురుదేవుల ముందట గాఢముగా బాధపడుచున్న హృదయముతో తనవేదనలను నివేదనము చేయుచున్నట్లు, కన్నీరు నిండిన కన్నులతో అతని దయానుగ్రహములకై వేడికొనుచు చేయవలెను. అప్పుడే అతడు అర్హుడగు ఆధ్యాత్మిక అభిలాషి కాగలడు.

చర్యలోనికి వచ్చునదంతయు నెల్లప్పుడును నిజముగా చేయువాడగు భగవంతుని ఇచ్ఛానుసారముగనే యుండును. మనము దానిని మన స్వంత కృషి ఫలితమని భావించి, మనస్వంత ఇచ్ఛతో చర్యలతో ముడిపెట్టి నపుడే కష్టముత్పన్నమగును. మనము విజయము సిద్ధించిన ఆనందపడి, అపజము కల్గిన బాధపడునది కేవలమీకారణమువలననే. మనలను బంధనములందు తగుల్కొని యుండజేయునది ఇదియే. ఈ అహంకార భావము లేకుండుటే నిజమైన ఓజశ్శక్తిపుట్టుక అని అర్థము. దీనినెట్లు సాధించవలలెను? భగవంతని మహాశక్తితో తనను కేవలము అనుబంధించు కొనుట వలననే. ఇట్లొనరించుకొని, దశ తర్వాతదశగా అధిగమించుచు మనము భగవంతునకు మరిమరి సన్నిహితుల మగుచుందుము. పరిపూర్ణ లయప్రాప్తి మాట అటుండ, ఆ పరమోత్కృష్ట తత్త్వముతో తమను తామనుబంధించు కొనయత్నించు వ్యక్తులను కొలదిమందిని మాత్రమే కనుగొనుట దయనీయ విషయము. దానికి సమర్పణమే ఏకైక మార్గము. కాని అది బహు దుష్కర కార్యము; అందును ముఖ్యముగా తమ స్వంత భారముతో అతిగా బరువెక్కియున్న వారికి.

ఆత్మ సమర్పణకు క్రమశిక్షణ తొలిమెట్టు. మొదట మానసిక క్రమశిక్షణ నవలంభించుట సాధ్యము కానియెడల కనీసము శారీరక క్రమశిక్షణనైనను ప్రారంభమున పాటించవలెను. అనంతరము శిక్షకుని సామర్థ్యము మనస్సుపై బాగుగ స్థిరపడి, శిష్యుడు కూడ నిజమైన సత్యాన్వేషకుడైయున్న మానసిక విధేయత దానంతట అదియే వృద్ధి పొంద నారంభించును. అతడు నిచ్చెన మొదటి మెట్టుపై కాలిడినప్పుడు, ఆ తరువాతి మెట్టు దానంతటదియే అతని దృష్టిలోనికి వచ్చును. ఆ విధముగా అభ్యాసము నారంభించినపుడు, ముఖ్యముగ శిక్షకుని యోగ్యత లోనికి విశ్వసనీయములైనపుడు, భక్తి ప్రేమలు తమంతట తామే వృద్ధి నొంద మొదలిడును. నాతోనున్న వారందరికి సాక్షత్కారము కొఱకు ఆకాంక్ష కలదో లేదో నిశ్చయముగ నేను చెప్పజాలను. ఒకవేళ వారికి కలదేని, ఈ విషయములు స్వతస్సిద్ధముగానే వారియందు వృద్ధిపొంది యుండవలెను. వారి హృదయము నందు దాని కొఱకు ఆసక్తియుండి తీరవలెను. ఆ ఆసక్తి, యొకడు లక్ష్యమునకు దృఢముగా కట్టుబడియున్నట్లు భావించినప్పుడు మాత్రమే పెంపొందగలదు. కొందఱు వారిమనస్సు కొంతకాలము ప్రశాంతస్థితి యందుంచుకొనుటకు మాత్రమే నాయొద్ద కూర్చుండవచ్చును. ఇది కూడ నాకు కొంతమేరకు తగినది కావచ్చును. ఏలయన, కనీసము కొంత సమయమైనను నేనట్లు వారికి కొంత తృప్తిని కలిగించవచ్చును. కాని, కేవలమంత మాత్రము

చాలదు. ఆధ్యాత్మికతా విషయమును దేనిని పరిగణింపక, స్నేహము, సాహచర్య భావముల ప్రాతిపదికపై నాతో కలిసియుండుటకు నిచ్చగించు వారును కొందఱుండవచ్చును. ఇది కూడ నాకేమంత స్వల్ప విషయము కాకపోవచ్చును. ఏలయన, ఎవ్వరైనను తమ హృదయమున నాయందు ప్రేమకలిగి యుండుటను కనుగొనినపుడు నేనెంతయో ఆనందించి, నూతనోత్సాహముననుభవించెదను. అయిన, ప్రపంచము నందు ప్రేమించుటకును ప్రీతినొందుటకును అనేకములుండగా నాకొఱకెవరైనను ఏల పట్టించు కొనవలెను? తన్ను తాను మఱచిన వాడు, లేదా కనీసము మఱచుట కిష్టపడువాడు లేదా అంతటిని మఱచుట కిష్టపడు వాడును మాత్రమే బహుశః నావైపునకు మొగ్గును. నా మనః ప్రవృత్తి కొంచెము విచిత్రమైనది. నన్ను నేను పూర్తిగా మఱచియుండి, ఇప్పుడితరులు నన్ను గుఱుతించవలెనని కోరుదును. వివేకవంతుడెన్నడును దానికి సిద్ధపడదని నేను నమ్ముదును. బహుశః ఇదే కారణమున నేనితరుల హృదయమున భావోద్రేకమును రేకెత్తించుటలో విఫలుడనగుదును. ఏలయన, నాస్వీయాస్తిత్వము వలనే నాలో నదియును అంతర్ధానమయ్యెను. అది యట్లుండ, నన్ను గుర్తించుటకు వారికి సహాయపడు నాధారము నాలో నింకేమి మిగిలియున్నది? అటువంటి దివ్యోన్మత్తతను పెంపొందించుకొని నపుడు మాత్రమే ఈ భావము మరింత స్పష్టమగును.

# ఏకాగ్రత

ఏకాగ్రత అనునది తెలివితో కూడిన మానసిక వ్యవహారమును నిశ్చలత్వమునకు తీసికొని వచ్చు స్థితిని సూచించునని సామాన్యముగా అర్థము చేసికొందురు. కాని, ఇది దానయం దివమిడియున్న భావమును సరిగ వెల్లడింపదు. ఈవిధమగు ఏకాగ్రత తెలిసికాని తెలియకుండనైనగాని ఒకడనుసరింపవలసిన శారీరక ప్రయత్నమును సూచించును. సాధారణముగా, ఏదోయొక నిర్దిష్ట స్థితిని గూర్చిన తెలివితోడి భావముతో సాధకుడు ముందుకు సాగిపోవును. దానిని ఏకాగ్రత యని తాను చెప్పును. సాధారణముగా ప్రజలు దీనిని తాత్కాలికముగ ఇంద్రియములను ఆపివేయుటచే కలిగిన అసహజమగు గాఢనిద్రయను భావమున తీసికొనెదరు. ఆవిధముగా, అది యొక మత్తుమందు యొక్క మైమరపుచే కల్గిన స్పృహలేని స్థితివలెనుండును. బహుశః ఆకారణముననే మహాత్ములనబడు కొందరు భంగు, చరస్, గంజాయిల కలవాటు పడినట్లు కనబడుచున్నది.

సాధారణముగ గురువులు ప్రారంభదశయందే అభ్యాసిని ఏకాగ్రతను అభ్యసింపుమని ఉపదేశింతురు. అభ్యాసి దానిని సాధించు ప్రయత్నమునకే తాను పూనుకొనును. కాని, సంవత్సరముల తరబడి శ్రమించినను అతడు దానిని అరుదుగానే సాధించుటకు సమర్థుడగును. అది ఎందువలన? ఆపజయమును అభ్యాసి యొక్క ఏ లోపమునకు ఏ విధముగాను ఆపాదించుటగాక, అనుభవసిద్ధమైన సాక్షాత్కార మార్గమునందు అభ్యాసిని నడిపించుటకుగాను తన పుస్తక పరిజ్ఞానము నుపయోగించు గురువునకు ఆపాదింపవలెను. నిజమేమన, నిర్దేశింప బడినట్లుగా ఈ పద్ధతి అంతయు సంపూర్ణముగా అసహజము, కృత్రిమము; మరియు అందుల కనుసరింపబడిన విధానములు శారీరకములు, స్థూలములు. దాని ఫలితముగ సూక్ష్మత్వము వైపునకు పురోగమించుటకు బదులు వారు మరిమరి ఘనత్వమును, స్థౌల్యమును గ్రహించుకొనుచు పోయి, తుట్టతుదకు అభేద్యమైన బండగా మారిపోవుదురు.

మానసిక ప్రవృత్తులను ఆపివేయుటయే ఏకాగ్రతగ తీసికొనినట్లైన తనయందు జడత్వస్థితిని సృష్టించుకొనుటకు అభ్యాసి ఆవశ్యకముగ ప్రయత్నించవలసియున్నది. నిస్సందేహముగా, దీని కొఱకు అవసరమైన శక్తి భౌతిక పదార్థముతో కూడి పనిచేయు శారీరక శక్తియే. ఆవిధముగ దీనికొరకు చేపట్టిన విధానమంతయు యదార్థమునకు భౌతిక సాధనముగనే పరిణమించును. ఆ భావమున ఏకాగ్రత ఎరుకస్థితియందున్న స్థూల మనస్సునకే సంబంధించి యుండును. దీని కార్యకలాపము శారీరక శక్తి ప్రయోగముచే తాత్కాలికముగ అణచిపెట్టబడియుండును. ఆ ప్రకారము వృద్ధిచెందిన స్థితితో పురోగమించినవారు ఆంతరంగికముగ ఎంత స్థూలము, కఠినము అగుదురని వారికి సున్నిత, సూక్ష్మ ప్రభావములు పూర్తిగ దుర్గ్రాహ్యములగును. దీనికి తగిన నిదర్శనములుగ ప్రత్యక్ష ఉదాహరణలు కలవు. ఆలోచనలను బలవంతముగ నణచుటకే కలిగిన ఏకాగ్రత మనస్సుపై దాని భారమును కలిగించును. అందులకై ప్రయోగింపబడిన శక్తికూడ స్థూలమైనదియే అగుట వలన తన బరువును కల్గించును. ఈ విధముగా, ఒక్కమాటలో చెప్పవలెనన్న స్పృహలేని స్థితిగ చెప్పబడు ఏకాగ్రత అసలే తప్పు. ఏలయన, అది భౌతికపదార్థముతో కలిసియుండునట్లు చేయును. ఆ యర్థమున ఏకాగ్రతను బురద వంటి స్థితితో యుక్తముగ పోల్చవచ్చును. దాని నుండి అభ్యాసి తనను తాను వదిలించుకొనుట మిక్కిలి కష్టమైనట్టిది. తన ప్రయత్నములన్నియు విరమించుకొని దానిపై సాగిలపడిననేకాని, అతడు దాని యందు లోతుగ

కూరుకొని పోవుటనుండి తనను తాను రక్షించుకొనలేడు. ఆ స్థితితో ఆ విధముగనే సాగెడు వారు ఆద్యంతము భౌతిక పదార్థముతోనే సాగిపోవుదురు. అయితే, అది వారి భౌతిక ప్రయోజనముల యందు కొంతవరకు సహాయకరమై, వారియందు సమ్మోహన శక్తులను పెంపొందించును. కాని స్వచ్ఛమైన ఆధ్యాత్మిక సాధనలో అది ఏమాత్రమును సహాయకరము కాదు.

ప్రజలు ఏకాగ్రతలోనికి పోవుటకు ఇష్టపడెదరు. ఏలయన అది వారి యింద్రియములకు ఆకర్షణీయముగ నుండును. అందువలన అది ఆధ్యాత్మిక సాధనలో సహాయకారి కాలేదనుట స్పష్టము. ఆలోచనలను అణచిపెట్టుటతో నేరుగా సంబంధము గలది ఏకాగ్రత. మన దృష్టియందు సమ్మోహన విద్యవచ్చిన పిమ్మట మాత్రమే ఈ భావము మన మనస్సున ప్రవేశించినది, ఏలయన అచ్చట ఆలోచన యొక్క భౌతికశక్తి అంతటను ఉపయోగింప బడినది. దానివలన ఎట్టి ఆధ్యాత్మిక ప్రయోజనము నెరవేరదు. అయితే అది ఒక వస్తువు యొక్క స్వభావమును, గుణగణములను తెలియజేయగలదు. కాని, అది ఏవిధముగను ఆ వస్తుప్రాప్తికి సహాయపడజాలదు. అందువలన భగవంతుని పొందుటలో అది సాధనము కాజాలదు. అంతియేగాక అది సత్యతత్త్వమునుండి అభ్యాసిని దూరముగా నుంచఁజూచును. ఏకాగ్రత ఆధారము కేవలము అహంకారమయి యుండగా ధ్యానమునకు ఆధారము కేవలము ఆధ్యాత్మికమైనదే. నీవు మనస్సును కేంద్రీకరించదలచినచో అచ్చట “నీవు” నిస్సందేహముగా ఉన్నావు. కాని నీవు ధ్యానము చేయుచుండిన, ఏదియో ఉన్నతమైన దాని కొరకు ఎదురుచూచు చుందువు. కావున “నేను” అను భావమునకు నీవు దూరమయ్యెదవు.

అందువలన ‘ఏకాగ్రత’ అను పదమునందలి అంతరార్థములను సరకుచేయక, ఆదిమ మూలమునుండి తనకు వచ్చుచున్న దైవ ప్రకాశమున తాను లీనమగుటయే సాధకునకు గల ఒకే ఒక సరియైన మార్గము. ఆ సందర్భమున ఏకాగ్రతయన్న ప్రశ్న ఎంతమాత్రము ఉత్పన్నముకాదు. ఏకాగ్రతను లేక మరియొకటిగను వివరింప నలవికాని దానితో అతడు ఎల్లప్పుడును ఉండును. బంధనము కలిగించెడి ఏకాగ్రత అన్ని అంతరార్థముల తోడను ఎట్టి ఉపయోగము లేనిదగుట చేత నేను “నైకాగ్రత” అని పిలుచునట్టిదానిశక్తియే జ్ఞానము యొక్క ఉన్నతోన్నత మండలములను పొంద జేయగలదు. ఆ మార్గమున ముందుకు పోవుచు నొకడు దివ్య తేజస్సుతో తనను తాను ప్రకాశింప చేసికొనునట్లు మూలముయొక్క శక్తిని గ్రహించుకొనుచునే యుండును.

“నైకాగ్రత” అను పదము దేనిని సూచించును? స్పష్టముగ అది ఆలోచనల యొక్క పొంగి పొరలుటకు సంబంధించినట్టి ఒక స్థితిని సూచించును. కాని అప్పుడు దానికి రెండంశములు కలవు. మొదటిది ఆలోచనా ప్రవాహము మన ఎరుకతో కూడి యుండనప్పుడు; రెండవది మనము దాని ఎరుకను కలిగియుండి, దాని ప్రభావమును మనస్సుపై తెచ్చుకొనినప్పుడు. ఇది అనగా రెండవది, ముఖ్యముగ ఏదో యొక దుఃఖము లేక వ్యాకులత యొక్క భావముతో సంబంధము కలిగి యున్నప్పుడు, నిస్సందేహముగ ఒకానొక చంచలస్థితికి సమానమగును. మొదటి అంశము విషయమున ఆలోచనా ప్రవాహము ఎడతెగక సాగునప్పటికిని దానియొక్క అడ్డు తగిలెడి ప్రభావము మనస్సుపై నుండదు. సామాన్యముగ ఈ మానసిక స్థితి అరుదుగా కలతపెట్టునదిగా కనవచ్చును. ఈ రెండు అంశములను దృష్టిలోనికి తీసికొని, రెండవది ఏకాగ్రత యని తెలియబడు స్థితికి పూర్తిగ సరిపోలి యుండునని నేను చెప్పుదును; కాని, కేవలము ఈ వ్యత్యాసముతో, ఇచ్చట ఏకాగ్రతా లక్ష్యముభగవచ్చింతనకు మారుగా

చంచలత్వము, వ్యాకులము. అందువలన, దానిని మన అజ్ఞాత ప్రయత్నబలముచే నిలుపుకొనినట్టి అసంపూర్ణ ఏకాగ్రతగ తీసికొనవచ్చును. రెండు సందర్భములందును (అనగా జ్ఞాత ప్రయత్నముచేతను, అజ్ఞాత ప్రయత్నముచేతను) ఫలితము ఒక్కటియే : అది భారత్వము, జడత్వము, అలసత్వము. ఏకాగ్రత అను పదమునందే కృత్రిమ భావము ఇమిడియున్నది. ఆకారణముగ ప్రయత్నము అనివార్యము. ఆలోచనా ప్రవాహము నిరాఘాటముగ జరుగునపుడు అది ప్రయత్నము లేనిది మరియును ఏకాగ్రతయని సామాన్యముగ తెలియు స్థితికి సన్నిహితముగ సదృశమై యుండును. అందువలన దానికి సరియగు పదము "నిమగ్నత". అది సహజ పద్ధతి. సరియగు విధానమున చేయు ధ్యానము యొక్క ఫలితముగ అది తనంతట తానే వచ్చును.

నిమగ్నత అను భావమున తీసికొన్న ఏకాగ్రత (ఆలోచనా ప్రవాహముతో కూడి, మనస్సుపై నెట్టి ప్రభావము కల్గించని నైకాగ్రత)యే అసలైన స్థితి. అది విభిన్న స్థాయిలలో, విభిన్న రీతులలో నుండవచ్చును. ఒకటి అథమస్థాయి ఏకాగ్రత, ఇంకొకటి ఉన్నతస్థాయి ఏకాగ్రత, మరియొకటి అత్యున్నతస్థాయి ఏకాగ్రత కావచ్చును. ఇప్పుడు, "ఏకాగ్రత" అను సామాన్యాంశమును తీసివైచిన తదనంతరము మిగులునది ఏమన అథమము, ఉన్నతము, అత్యున్నతము మాత్రమే. ఆవిధముగనే పరతత్త్వము వైపునకు ప్రయాణమును సాగింపవలసి యున్నది. దానికి భిన్నముగ మన ఆలోచన ఏకాగ్రత భావమునందే చిక్కుకొని యుండిన, పైపైకి పోవునట్లు చేయు మన అంతరికశక్తి చురుకుగ పని చేయదు. అందువలన ఎట్టి నిర్బంధమైన తీర్మానము, ప్రయత్నము లేకుండ సంకల్ప (సూక్ష్మభావము) రూపమున ఆ యాలోచనను గ్రహించుటయే సరియగు మార్గము. ఎట్టి కృత్రిమత్వమును, నిర్బంధమును విధింపక సరళమును సహజమును అయిన పద్ధతిలో దానితో ముందునకు పోవలయును. సహజ మార్గమున అనుసరింపబడు విధానమిట్టిదే. వాస్తవమునకు చిట్టచివఱనున్న ఆ స్థితినే అది గురుదేవుని ప్రాణాహుతి ద్వారా మొట్టమొదటి నుండియే ప్రవేశపెట్టును. ప్రారంభమున నది అభ్యాసికి అప్పుడప్పుడు మాత్రమే క్షణికముగ గోచరించినను, నిరంతర సాధన అనంతరమున ఆ స్థితియే అతనిని సంపూర్ణముగ ఆవరించును. ఇందువలననే, ధ్యాన సమయమున తరచు ఆలోచనాపరంపర కనబడినప్పటికిని, సహజ మార్గసాధన చేయువాడు "నిమగ్నత" యని బాగుగా వివరింపదగిన ఒక విచిత్రమైన ఏకాగ్రతాస్థితి ననుభవించును.

# ప్రేమ పథము

ఆధ్యాత్మిక దశయందు, సాధకుడు గురువు ఇచ్చున దేదియైనను సరియైనదిగను, తనకు లాభదాయక మైనదిగను భావించినపుడే గురువునందు విశ్వాసము ప్రారంభమగును. అది అట్లయినపుడు, అతడు దానిని విధేయతతో స్వీకరించును. క్రమక్రమముగ అనుభవసాంగత్యముల వలన అతడు విశ్వాస సంతృప్తి భావములను మరింతగ ననుభవింప మొదలిడినపుడు, గురువుపై అతని ఆధారము మరింత బలపడి, అతని విధేయత వృద్ధియగును. ఈ ప్రకారము విశ్వాసమొక విధముగ పెంపొంద నారంభించును. అతడు యెట్టి సంశయములేని మనోభావమును పొంద నారంభించును. ఈ సాధారణ క్రమము భగవత్సాక్షాత్కారమును కాంక్షించుచు, ఎక్కువ జాగ్రత్తతో మార్గము ననుసరించు వారికి అన్వయించును.

కాని, నావంటి వాని విషయమున భగవత్సాక్షాత్కారమను ధ్యేయముతో నేనీ రంగమున ప్రవేశింపలేదని మీకు విశ్వసనీయముగ చెప్పవచ్చును. నాకట్టి ఆశయము, ఉద్దేశ్యము, లక్ష్యము లేదు. నే నపేక్షించిన దానిని తప్ప మరే వస్తువును నేను నా దృష్టియందిడుకొనలేదు. నేను, నా గురుదేవుని, కేవలము నా గురుదేవునే, అపేక్షించితిని. అన్నిటియందును, అంతయును నాకు ఆయనయే. మరేదియు నా దృష్టియందు లేదు. ఆయన రూపము మాత్రమే నా హృదయాంతరాళమున నాటుకొని యుండినది. ఆయన రూపమును తప్ప మరిదేనిని నేనెన్నడు చూడలేదు. ప్రాపంచిక ఆనందమును, సౌఖ్యమునుకాని; స్వర్గానందమును, సౌఖ్యమునుకాని నేనెన్నడు కాంక్షించలేదు. నాకు భగవంతుని యెడల సంపూర్ణ నిరాసక్త భావముండెను. నేను కాంక్షించినదంతయు వారి గమ్యము వంటి దానిని పొందుటయే – అంతకు తక్కువకాని, అతీతము కాని మరేమియు కాదు. భగవత్సాక్షాత్కారము కొరకై నాకు పూర్తిగ యెట్టి అపేక్షయు లేకుండెను. సామాన్యార్థమున నా వరకు, అది దైవ దూషణ అయినను కానిండు, నేనాయన యందు ప్రేమతో యెంత ఉన్మత్తుడనైతినన, అన్ని విషయములను గమనించు శక్తిని కూడ పోగొట్టుకొంటిని. జనులు దీనిని అంధవిశ్వాసమని ఖండింపవచ్చును. అయినను, ప్రేమోన్మాదము నన్ను దాని వైపునకు ఆకిర్షఇంచినది. ఆనందము యొక్క పరమానందస్థితి ననుభవించుటకు మారుగ, ప్రేమయొక్క అంధకార స్థితియందే తిరుగులాడుట నాకు ప్రతికరమైనది. కాని, నేను దానిని నాకు మాత్రమే ప్రత్యేకముగ పరిమితము కావించి యుంచదలచితిని. మరి యెవరిని ఈ ఉన్మాదమార్గమును అనుసరింపుమని ప్రేరుపింపను. ఆయన ప్రతి హావభావము నాకు దైవ రహస్య ప్రకటనము; ఆయన ప్రతి వాక్కు ఒక ఆధ్యాత్మిక గ్రంథము; ఆయన ప్రతి చర్యయు "అజ్ఞాత వస్తువు" యొక్క వివరణ. నాకు యెంచుకొనుట గాని, ఇష్టపడుట గాని; మంచి చెడుల తారతమ్య జ్ఞానముగాని లేకపోయినది. నాకు ఆయన దంతయు ఉండవలసినట్లే ఉండెను. నేనాయన యిచ్ఛకు సంపూర్ణ విదేయుడనై యుంటిని. ఒక్క క్షణమైనను వేరొక విధముగ యెన్నడును తలవలేకపోతిని. నేను అక్షరాల ఈ క్రింది భావమును పాటించితిని :

"నీ ఆధ్యాత్మిక గురువు నీ ప్రార్థనపు కంబళిని మద్యముతో
అద్దుమని చెప్పినట్లైన అట్లే చేయుము. ఏలయన, ఆ

దూరమునంతటిని ఆయన స్వయముగ పయనించిన వాడగుటచే,
మార్గమునందలి అన్ని ఒడుదుడుకులను గూర్చి ఆయన బాగుగా
యెఱింగియున్నాడు.”

నా విషయమున అదియొక తీవ్రదోషమని ఎవరైన భావించవచ్చును. దానికి నా సులువైన సమాధానము ఏమిటన మజ్ను (నిజామిచే రచింపబడిన సుప్రసిద్ధ ప్రేమగాథ “లైలామజ్ను” ఉదాహరణము) వలెనే నేనును ప్రేమోన్మాదమున నన్నే మరచితిని. లైలాయొక్క దృక్పథము నుండియే మజ్నును బాగుగ నిర్ణయింప గులుగుదుము. నేను నా ప్రణయమూర్తి లైలాతో మాత్రమే సంబంధమును కలిగియుంటిని. ఒక్కమాటలో నిదియే నన్ను గూర్చియు, నాస్థితి గూర్చియు వివరణ. కాని, యితరులను అదే ఉన్మాద ప్రేమమార్గము ననుసరింపుమని నేను ఒత్తిడి చేయను.

భగవత్సాక్షాత్కారము లేక స్వర్గానందము మరియు అప్సరసల ఆనందదాయక సహవాసమున కాంక్షించు వారికి శాస్త్రములు విలువైనవి కావచ్చును. నాకట్టి అభిలాషలు లేవు గాన, అవి నా కంతగ ఉపయుక్తము కాలేదు. ఇంతియే కాక, శాస్త్రములు దైవమునకు సంబంధించిన విషయములను చర్చించు నప్పటికిని, వానియందు ఒప్పుకొనవలసినట్లుగా ఎంతయో సందిగ్ధత కూడ యున్నది. వాని సంరక్షణార్ధము మహర్షి మనువు, వేదములలో సహేతుకము కాని దానిని దేనిని స్వీకరింప నవరసము లేదనియు, అనుసరింపరాదనియు స్పష్టమైన మాటలలో నిర్దేశించినాడు. వాని ఆధ్యాత్మిక విలువ గుఱించి చెప్పవలయునన్న, అవి ప్రాథమిక నీతి నియమములను చర్చించునవి గాన వాస్తవమునకు అవి అధ్యాత్మికతను ప్రారంభించువారికి మాత్రమే యుద్దేశింపబడినవని నేను కచ్చితముగ చెప్పగలను. వాని శ్రుతులలో దేనినైనను పరిగణించినట్లైన, అది ఆరంభావస్థ యొక్క ఆవశ్యక విషయములకు సంబంధించినదని తెలసికొనెదవు. అయితే వానిని తాత్త్విక జ్ఞానము నందు పండితునిగను, తాత్త్వికునిగను అగుటకు అధ్యయనము చేయవచ్చును. కాని, ఆచరణరంగమున వాని ఉపయోగము ఎక్కువలేదు.

వాస్తవమునకు అనంత సాగరతీరములను చేరినప్పటి స్థితి నుండియే ఆధ్యాత్మిక రంగము ఆరంభమగును. ఆ స్థితికి పూర్వమున నున్నట్లు కనపడునది ఏదియైనను ఆధ్యాత్మికతయొక్క ప్రతిబింబముగ మాత్రమే భావించవచ్చును. శ్రుతులన్నియు నిశ్చయముగ ఆస్థాయికి దిగువగల స్థితులకు సంబంధించి నట్టివి. ఇదియేగాక అవి చాల భాగము పరిసరముల యొక్కయు మరియు అవి కూర్చబడిన ప్రదేశముల యొక్కయు భౌగోళిక పరిస్థితుల ఫలితముగ ప్రభావింపబడినవి. ఉదాహరణమునకు శాస్త్రములలో ఏదియైనను ధ్రువప్రాంతములలో రచింపబడియుండిన, రోజును స్నానము చేయవలెనన్న నియమము, మాంసాహారముపై నిబంధనము నిశ్చయముగ ఉండి యుండవు. వాస్తవమునకు, అవి ఆయా ప్రదేశములలోని, పరిసములకు, పరిస్థితులకు అనుగుణముగ వానిని రచించిన ఋషుల వ్యక్తిగానుభవములపై నాధారపడి ప్రవర్తన, క్రమశిక్షణల గూర్చి సాధారణ నియమములను తెలుపును.

ఇప్పుడు నా విషయమునకు మఱలవత్తును : గురువు యొక్కయు, భగవంతుని యొక్కయు పరస్పర స్థానముల విషయమున గురువు యొక్క సాహాయ్యము, మార్గదర్శకత్వము ద్వారా భగవత్సాక్షాత్కారమును అపేక్షింపదలచినప్పుడు మాత్రమే ఈ ప్రశ్న ఉద్భవించును అని నేను చెప్పుదును.

ఆ విషయమట్లుండ, వారిరువును (భగవంతుడు మరియు గురువు) అతని దృష్టియందుందురనుట విశదమే. ఆ సందర్భమున మూడవవ్యక్తి (తాను లేక భక్తుడు) కూడ ఏవిధముగను నిర్లక్షింపబడరాదు. ఈ ప్రకారము అది బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వలె నొకమూర్తిత్రయము అగును. అతడు ఆవిధముగా ఈమూర్తిత్రయము నందే స్థిరపడి యుండును. అది వేరొక రీతిగా అనేకత్వమనదగును. కాని, ఆధ్యాత్మికతకు సంబంధించిన నంతవరకు, వివిధత్వము నుండి ఏకత్వమునకు, అపై దాని కతీతముగ నున్నది 'ఆది' ఏమైయుండునో దాని కడకు పయనించుట మన వాస్తవోద్దేశ్యము. కాని, అట్లు మన మనుసరించు మార్గము మనము దేని నపేక్షింతుమో దాని వ్యతిరేక దిశకు కొనిపోవును. ఈ పరిస్థితుల యందేమి చేయవలసియున్నదో యెవరికి, వారే ప్రతియొక్కరు నిర్ణయించుకొనవలెను. నా వఱకు, ఈ సమస్యను ఉన్మాదమునకు దిగుట (సహచరుని యెడల ప్రేమోన్మాదము) అను నా పద్ధతిలో నేను పరిష్కరించి వైచితిని. వేఱొకఱికి కూడ ఇదియే పరిష్కారము కావచ్చును. కాని, అది నిజార్థమున నా గురుదేవునివంటి ఆమోఘ, అతి మానవ, దైవీయ గురువు లభించినప్పుడు మాత్రమే.

అభ్యాసి తన గురువును భగవంతుని ప్రేమించునంతగ ప్రేమించవలెనని చెప్పుదురు. నా దృష్టియందు అది ఆచరింప నసాధ్యమైనట్టిది. ఏలయన యెన్నడును రెండు సమానాంతరప్రేమ వస్తువు లుండజాలవు. మానవ హృదయము ఏ యొక్కరైనను ప్రతియొక్కరును తమ యునికి గలిగి ఉండుటకు ధర్మశాల కాదు. అనేకత్వము మాట అటుంచి, ప్రేమ ద్వంద్వ విశ్వాసమును అనుమతింపదు. ప్రియుడు, ప్రేయసియను ద్వంద్వమునకు కూడ అక్కడ తావులేదు.

***जब मैं था तब तू नहीं अब तू है मैं नाहिं ।।***
***प्रेम गली अति सांकरी तामैं दो न समाहिं ।।***

> "నే నుండినపుడు నీవు లేవు; ఇప్పుడు నీవుంటివి, నేను లేను.
> ప్రేమపథము మిక్కిలి ఇఱుకు. అది యిద్దరిని యిముడ్చు
> కొనజాలదు."

ప్రేమపథ మిట్టిది. ఇది గురువు, దైవమునకుగల పరస్పర స్థానమును గూర్చిన ప్రశ్నకు సమాధానము కూడ. ఇద్దఱిలో ఏ యొకరినైనను నిర్లక్ష్యము చేయవలెనని దాని అర్థము. ఇందులకే వివేకానందస్వామి "నీ గురువునే బ్రహ్మముగ తెలియుము" అనుటను మనకు జ్ఞాపకము చేయుచున్నాను. అదియే ఏకైక పరిష్కారము. కాని, సంపాదనము కొఱకై బోధనలు, ఉపదేశములు చేయుచు కీర్తి ప్రతిష్ఠలను, సంపదలను అన్వేషించు వృత్తి గురువుల కిది అన్వయింపదు.

అనేకులు నా ఆధ్యాత్మికసేవను పొందు అవసరమున లేకుండిరని నేను కనుగొంటిని. కావున, అది ఆధ్యాత్మికము కానిండు లేక శారీరకము కానిండు, యెట్టి సేవకైనను నన్ను నేను అర్పించుకొనుటకు నావఱకు నేను సదా సిద్ధముగ నున్న వాడను. అప్పుడు వారు కొంత సుఖసౌఖ్యములను బడయుటకై నానుండి కనీసము శారీరకమైనట్టి సేవనైనను పొందనిండు. దాని కారణమున నేను కొంత అననుకూలతకు గురి అయినను లెక్కచేయను. ఎలయన, నా కిన్పటికే పెక్కు శారీరక క్లేశములున్నవి. కావున, వానికి కొద్దిగా చేర్చుట యన్నది గణనీయము కాదు. శారీరక క్లేశములన్నిటి యందును, రాజులలో నత్యధికులకు

కూడ లభింపనట్టి వింతైన ఒక విధమగు సంతోషానందములను నేను అనుభవింతును. ఇంతవఱకు నాకు ఒకదాని తరువాత నింకొకటి ఆవరణము లనేకము లుండి యుండినవి. కాని, నాకిప్పుడున్నట్టి దానిని సూక్ష్మముగ గమనించినచో, అది చిట్ట చివఱిదియైన నగ్నతావరణము మాత్రమే అని తెలియబడును. అది వదలివేయబడినపుడు దాని స్థానమున మఱియొకటి రారాదు. మీ రందఱును అట్టి నగ్నతావరణములోనే కప్పబడి యుండవలెనని నా అభిమతము. కాని, బాహ్య ఆవరణమైనట్టి ఈ భౌతిక శరీరము యొక్క ఆకర్షణలయందును, వ్యామోహము లందును చిక్కుకొని యుండినంత వరకు అది సాధ్యము కాదు.

# గురు సహాయము

ఈనాటి ఆక్రందనాత్మక అవసరము ప్రపంచశాంతి. ఉన్నత పదవిలో నున్నవారు దానిని సాధించుటకై గట్టి ప్రయత్నము చేయుచున్నారు. కాని, ఆ యుద్దేశ్యమునకై అనుసరించు విధానములు యింతవరకును సత్ఫలితములను యిచ్చు సూచన కనవచ్చుటలేదు. ప్రపంచ శాంతి స్థాపనకై ప్రయత్నములు యెక్కువ ఫలప్రదములయినట్లు కానరావు. కారణమేమన అవి కేవలము బాహ్యములై, సమస్యయొక్క అంచులను మాత్రమే స్పృశించుచున్నవి. వాస్తవమున, వ్యక్తిగత మనస్సు యొక్క ఆంతరికస్థితిని పరిగణించిననే కాని ప్రపంచశాంతి యెన్నటికిని సాధ్యము కాజాలదు. ప్రపంచశాంతి వ్యక్తిగత శాంతితో సూటిగ సంబంధమును కలిగియున్నది. దీనికై వ్యక్తిగత మనస్సును వలసిన స్థాయికి తీసికొని రావలసియున్నది. వ్యక్తిగత మనస్సు సుస్థిర విరామ, ప్రశాంతస్థితికి కొనిరాబడినట్లైన, ప్రపంచమున ప్రతివస్తువు అతనికి అదే వర్ణమున కనబడును. అందువలన, ప్రతివ్యక్తి యందు శాంతి, సంతృప్త స్థితిని పెంపొందించుటకై ఉపాయములను తెలిసికొనుట ఆవశ్యకము. ఈ ప్రకారము ప్రపంచశాంతిని పొందులకు మనము చేయవలసినదేమన వ్యక్తిగతముగా ప్రజల మనఃప్రవృత్తులను రూపొందించుట. అనగా మనస్సునందు మితత్వస్థితిని ప్రవేశపెట్టుటకై దానిని సరియగు రీతిని క్రమబద్ధము కావించుట. ప్రపంచమున శాంతిని తీసికొనివచ్చు మార్గమది యొక్కటియే. కావున, మన మందరము వ్యక్తిగతముగా మనశ్శాంతిని పెంపొందించుకొనుట అత్యవసరము. కాని, అది ప్రత్యేకముగ ఆధ్యాత్మికత యొక్క ఉద్దేశ్యముగాను దానికొఱకై ఆధ్యాత్మిక ఉపాయముల ననుసరించుట ఆవశ్యకము.

వివేకానందస్వామి చెప్పినట్లు, హిందూమతము యొక్క అతి గొప్ప విశిష్టతలలో నొకటి యేమన అది ఉన్నతోన్నత జీవితాదర్శనములను పొందుటకు ప్రతియొక్క అభిరుచి. మనస్తత్త్వము, ప్రతిభగల వారికి ఉపాయములను,మార్గములను చూపించును. ఇందుకొఱకై దీనియందు కొందరికి విగ్రహములు, ప్రతిమల ఆరాధన; ఇతరులకు దేవుళ్లు, దేవతల ఆరాధన; ఇంకను యితరులకు సాకార నిరాకార ఆరాధన మొదలైనవి కలవు. ఇంకను పైగా ఉన్నత సామర్థ్యములు కలవారికి ఉపాసన, భక్తి, జ్ఞానము మొదలైన మార్గములున్నవి. ఇంకను ఉన్నతోన్నత ఆదర్శములను పొందుటకు హఠయోగము మరియు రాజయోగముల వంటి వివిధ తరగతులుగ విభజింపబడిన యోగమార్గము కలదు. విమోచనము లేక సంపూర్ణముక్తిని సాధించు విషయమున, పూర్వపు ప్రస్తుతపు మహర్షులు దాదాపు అందరును రాజయోగ మొక్కటి మాత్రమే మానవుడు అందుకొనగలిగిన చివరి స్థితివరకు విజయమును నిశ్చయపరచునను అంశము నంగీకరింతురు. సంపూర్ణముక్తికి అంకితమైన ప్రతియొక్కడు త్వరతితముగనో లేక ఆలస్యముగనో ఆ మార్గమునకే వచ్చి తీరవలయును. రాజయోగము అనుపేర నింతవరకు తెలియబడిన పద్ధతినుండి అనావశ్యకమైన వానిని తొలగించి కొన్ని సవరణలు, మార్పులతో సహజమార్గము, రాజయోగ పద్ధతులతోనే అత్యంత సన్నిహితముగా నడచుచున్నది.

ఆంతరిక శాంతిని పొందుటకు మనస్సును సరిగా క్రమపరచుట అవసరము. కావున, మానవుని యందలి విషయ వాంఛల ఫలితముగ సాధారణముగ కలతచెంది యుండెడి మనః ప్రవృత్తులను సక్రమముగ రూపొందించుట మొదటి మెట్టునుండియు గమనించవలయును. ఆ ప్రయోజనము కొఱకు

ప్రయత్నించు ప్రతిసాధన యొక్క మూలోద్దేశము యదార్థమునకు ఇదియే అయి ఉండవలెను. సాధకుని చిత్తవృత్తులలో మితత్వమును నిశ్చయముగ కలుగ చేయనియెడల, ఏ సాధన అయినను ప్రయోజనకరము కాదు. తన మూలస్థితి యందు శుద్ధము, క్రబద్ధము అయినట్టి మనస్సు ఇప్పుడు ఇంద్రియముల సంపూర్ణ ప్రభావముచే కలుషితమై చెడగొట్టబడెను. ఇప్పుడు అది సరిచేయబడి క్రమబద్ధము కావింపబడవలెను. దీనికి బాధ్యత పూర్తిగ సాధకునిపైననే యుండును. దాదాపు సాధనలన్నిటికిని మూలోద్దేశ్యము అదే అయినప్పటికిని, అది నిర్లక్ష్యము చేయబడియున్నది. మనస్సునధీనమున నుంచు కొనుటకు సాధారణముగ అనుసరింపబడు కఠిన తపశ్చర్యలు, శరీరశోషణమున్నగు పద్ధతులు, మనస్సును దాని అపమార్గ ప్రవృత్తి నుండి తప్పింపజాలవు. అవి చెడుగునులోన అణచియుంచుటకు మాత్రమే ఉపకరించును. ఆ అదుపు ఒకవేళ ఏదోవిధముగా ఎన్నడైనను సడలింపబడిన, ఆ చెడుగు భేదించుకొని పైకిరావచ్చును. అందువలన, ఈ సమస్యకు నిజమైన పరిష్కారము మనస్సు నధీనములోనికి తెచ్చుటకు దానిని అణచుట, నిరోధించుట, శోషించుటలోగాక, దానిని క్రమేపి రూపొందించుటలోనే కలదు. అదియే అపమార్గ వైఖరులనుండి దానిని తప్పింపగలదు.

సాధారణముగ జనులు స్పృహలేమి లేక జడత్వస్థితిని కలుగచేయుటకు తొలుగనే సహజముగా మనస్సు పనిచేయుటను కూడ ఆపివేయుటకు ఉద్దేశపడెదరు. నేటిగురవులు కూడ జనులలో విశ్వాసమును కలుగ జేయు నాతురతతో, అట్టి పద్ధతులనే ఉపయోగించెదరు. వాస్తవమునకవి మనలను అధ్యాత్మిక వ్యాప్తి నుండి కడుదూరముగ కొనిపోవును. వాని అనుచరులు కూడ విచక్షణాజ్ఞానమును కోల్పోయి దానిని, దాని వివిధచ్ఛాయలు, వర్ణములలో సవివరముగా నిర్ణయింప నసమర్థులైరి. వారు కేవలము వర్ణమయత యందే అనురక్తులై యుందురు. వారి యాంత్రిక మనస్సులకు యాంత్రిక సాధనలచే ముందునకు కొనిపోవు యాంత్రిక మార్గదర్శి మాత్రమే వారికి కావలయును. దాని ఫలితముగ వారెల్లప్పుడు వారి యాంత్రిక ఉత్పత్తి యొక్క ఆకర్షణయందే చిక్కియుందురు. కాని, దానికి వారు మాత్రమే నింద్యులు కారు. పావనులుగను, ప్రపంచ మత గురువులుగను నటించెడి ఆకర్షక ప్రచారకులు వేదికలపై నుండి ప్రయోగించెడి నిదానముగ పనిచేయు విషముయొక్క నిశ్చేష్టకర ప్రభావముచే ప్రజలు పూర్తిగ నింపబడియున్నారు. ఫలితమేమన, కొన్ని ఔషధముల నుపయోగించుటచేతను, కర్మకాండకు చెందిన ఆకర్షణలచేతను సృష్టింపబడిన అనేక రకములైన ఉన్మత్తతకు వారు అలవాటుపడుదురు. గురువులు కూడ వారి అనుయాయులలో అదే ఉన్మత్త ప్రభావమును కలిగింతురు. అది వారి ఇంద్రియాభిరుచి కనుగుణమైనది గాన అధికముగా కోరబడుచున్నది. గురువు స్థితి, శిష్యుని స్థితి కూడా అట్టిదే. ఒకరు ఆత్మ ప్రాధాన్య గర్వ భావములతో నిండియుండగా ఇంకొకరు ఇంద్రియ భోగాభిలాషయందు మునిగియుందురు. దానికే వారు ఆనంద స్థితియని పూర్తిగ తప్పు అర్థము చెప్పుదురు. నిజమునకు ఆధ్యాత్మిక రంగము, ఇంద్రియ వ్యాప్తి కావలనుండియే మొదలగును. దాపటికము లేకుండ చెప్పవలెనన్న, ఇంద్రియపు హద్దులను దాటనిగురువు యదార్థమునకు గురువే కాడు. అతడు ఆధ్యాత్మికస్థితిగ నూహించుటకు గూడ భయంకరమైనట్టి జడత్వమును తప్ప ఏదియు ఈయలేడు.

సహజ మార్గమున క్రింది దశలలో స్వల్ప ఉన్మత్తతనను పోలి ఒక రకమైన తన్మయత్వమును తరచుగ ననుభవింతుము. కాని అది పై నుదహరింపబడిన జడత్వస్థితికి నిశ్చయముగ విభిన్నమైనది. ఈ స్థితిని ఇంద్రియముల, భారఫలితము నుండి విముక్తి నొందిన ప్రశాంతత యొక్క ఆనంద స్థితిగ

మఱింత యుక్తముగా చెప్పవచ్చును. అప్పుడు అభ్యాసి ఇంద్రియ ప్రభావమునుండి పూర్తిగ వేరు చేయబడినట్లు భావించును. దీనిని ఉన్నత స్థాయి నృత్యమైన ఆత్మ నృత్యముగ తెలుపవచ్చును. నర్తకుడు నృత్యమున సంపూర్ణముగ లీనమైనపుడు ఆనృత్యము ప్రేక్షకులను పారవశ్యస్థితికి కొనిపోవు గుణముగల శ్రీకృష్ణ భగవానుని నృత్యమునకు సమానమగును. కాని, ఈ రకమైన నృత్యము ఇప్పుడు పూర్తిగ తెలియనిదై వాడుకయందు లేకున్నది. పురాతన గ్రంథములు కూడ దానిని స్పష్టమైన పదములలో నుదహరింపలేదు. శివుని తాండవ నృత్యము, కచ్చితముగ అదియే కాకున్నను, దాని నెక్కువ పోలియున్నది. కాని, అది స్థూలతర రీతిదై యుండెను.

సాధనలో రెండంశములు కలవు : ఒకటి అభ్యాసము, మరియొకటి గురుదేవుని సహాయము. భగవత్కృపా ధారను ఆకర్షించుటలో అభ్యాసికి సహాయకరముగ నుండు ఆంతరిక స్థితులను సృష్టించు కొనుటకు మాత్రమే అభ్యాసము నుద్దేశింపబడినది. ఇందులో స్వప్రయత్న మిమిడి యున్నది. కాని, స్వప్రయత్నము మాత్రమే సరిపోదు. అది గురుదేవుని సహాయముచే జోడింప బడవలెను. వాస్తవమునకు మన అంతిమధ్యేయము కొరకై మనకు నిజముగ అవసరముండునది. భగవత్కృప మాత్రమే. కాని, ఆంతరికమైన చిక్కుల వలన దానిని తనకు తానుగ పొందుట సాధకుని సామర్థ్యమునకు దాదాపు అతీతమైనట్టిది. ఆకారణమున గురుదేవుని సహాయము తప్పనిసరి. ప్రారంభదశలలో గురుదేవుని మాధ్యమము ద్వారానే భగవత్కృప అభ్యాసి లోనికి ప్రవేహించును. అందువలననే అది తరచు గురు కృపగ వివరింప బడును. అది గురుదేవుని మాధ్యమము ద్వారా వచ్చినను లేక సూటిగ వచ్చినను, రెండు సందర్భము లందును ఒకే భగవత్కృప. అభ్యాసి దానిని నేరుగ పొందుటకు వలయు సమర్థత లేకుండునంతవరకు, అతనికి దానిని ప్రసాదించు భారము గురుదేవుని పైన నుండును. దానిని సూటిగ గ్రహించు సామర్థ్యము నాతడు పెంపొందించు కొనినపుడు, గురువు బాధ్యత దాదాపు అంతమైనట్లే. అయినను అప్పుడు కూడ భద్రతకొఱకు ఆయన అతనిపై జాగరూక దృష్టి నిలుపవలెను. యధార్థమునకు అర్హుడైన గురువుయొక్క అసలు ధర్మమిదియే.

గురువు సహాయము సాధనయందు ఆవశ్యకమగు అంశము కావు, ప్రాణాహుతియను యోగపద్ధతి ద్వారా ప్రసరింపబడిన తన శక్తిచే సహాయము చేయుచు ముందునకు కొనిపోవు యోగ్యుడైన గురువు నన్వేషించుట ఇప్పుడు సాధకుని విధి అయినది. అపేక్షిత ఫలితమున తీసికొనివచ్చుట కిది మాత్రమే ఫలప్రదమైన ఉపాయము. సహజ మర్గామున దైవకృప ప్రాణాహుతి పద్ధతి ద్వారా సాధకుని వైపునకు మరల్చబడును. వాస్తవమునకు అభ్యాసి యొక్క ఆధ్యాత్మికోన్నతికి ప్రాణాహుతి అత్యంత స్వల్ప వ్యవధిలో ఏమిచేయునో, స్వప్రయత్నములు ఒక పూర్తి దశాబ్ధ కాలములో నైనను చేయజాలవు. గ్రంథములలో నిర్దేశింపబడిన పురాతన పద్ధతుల కనుగుణముగ ధ్యానమును స్వతంత్రముగ అభ్యసించినచో తరచు తీవ్ర కష్టములుత్పన్నమగును. పూర్వపద్ధతి ప్రకారముచేయు అభ్యాసమునందుమనస్సు యొక్క ఆగని క్రియా కలాపములను ఆపుటకు, దానితో సతతము పెనుగులాడుచునే యుండవలెను. నిజముగా ఎట్టి ప్రయోజనము లేకయే ఈ పెనుగులాట యావత్కాలము కొనసాగుచునే యుండును. ఆ ప్రకారము ధ్యానము అనునది దాదాపు లేనేలేదు. కాలమంతయు పెనుగులాటలోను, మనోవృత్తుల నణచులోను వృధాయగును. ఈ మహత్తర కష్టము నధిగమించుటకు సహజమార్గ విధానమున మనము చేయునదేమనగా మనస్సు సంపూర్ణముగ క్రమబద్ధమై, నియంత్రితమైయున్న గురువుయొక్క శక్తితో మనలను సంధానము చేసికొనెదము. అప్పుడు ఆయన శక్తి సాధకుని యందు ప్రవహింపమొదలిడి

అతని మనఃప్రవృత్తులను క్రమబద్ధము కావించును. అందువలన, అభ్యాసికి అత్యంత నిశ్చయమైనట్టి విజయము నిచ్చుటలో ప్రాణాహుతి ప్రాథమిక మూల్యమున్నది. ప్రాణాహుతి ద్వారా సహాయముచేయు సామర్థ్యము గల గురువును మనము భగవత్కృపచే పొందగలిగినపుడు యుగముల తరబడి మరియు జన్మజన్మల పర్యంతము అలుపు పుట్టించు మన పరిశ్రమ తప్పించ బడగలదు. అందుచే నీ మార్గదర్శకునిగ అట్టి వాని నన్వేషింపుమని నేను మనఃపూర్వకముగ సలహోయిత్తును. అట్టి వారరుదు. అయినను, నిశ్చయముగ కలరు. నిజమైన అన్వేషకుడు యదార్థముగ పట్టుదలతో నుండిన అట్టి ఒకనిని గుర్తించుటలో ఎన్నటికిని విఫలుడు కాజాలడు.

దీనివలన ఏవిధముగను నేను సాంప్రదాయకమైన గురుపరంపరా విధానమును ప్రతిపాదింప దలచలేదు. నా దృష్టికది మానసిక దాస్యము తప్ప యింకేదియు కాదు. మనపద్ధతి యందు సాధన కత్యావశ్యకములైనట్టి పరస్పరప్రేమ, సేవ, త్యాగభావముతో కూడిన సర్వమానవ సౌభ్రాతృత్వరూపమున దీనిని మనము కలిగియుందుము. శిష్యులు తమయందు పవిత్ర సంస్కారములను పెంపొందించు కొందుఅను మిషపై, గురువులు వారినుండి వ్యక్తిగత సేవను అధికార పూర్వకముగా నభిలషించుట అనుభావమును మేము తీవ్రముగ ఖండింతుము. దానికి భిన్నముగ, గురువు సేవాభావముతో పనిచేయుచు అవసరము వచ్చినప్పుడు తాను శిష్యునకు ఆధ్యాత్మికముగానే కాక, శారీరకముగ కూడ సేవ చేయవలెనన్న అభిప్రాయమును మేము సమర్థింతుము.

ఆలోచింపవలసిన తరువాతియంశము సరియగు మార్గదర్శిని లేక గురువును ఎన్నుకొనుట. గురవుపని ఆధ్యాత్మిక జీవితమున అత్యంత అర్థవంతమైన మరియు వెలకట్ట వీలుకాని అంశము కనుక మార్గదర్శకునిగ యోగ్యుడైన వ్యక్తి నెన్నుకొనుట యందు తగిన జాగ్రత్త తీసికొనుట నిశ్చయముగ ఆవశ్యకము. ఈ విషయమున మిక్కిలి చిన్న పొరబాటు కూడ ఎంతయో విపత్కరము కావచ్చును. వాస్తవమునకు భగవంతుడు మాత్రమే నిజమైన మార్గదర్శి, గురువు. మన మందరము ఆయన నుండియే వెలుగును పొందెదము. కాని, తన హృదయమును ఆమేరకు పరిశుద్ధము కావించు కొనిన వాడు మాత్రమే అచ్చటినుండి వచ్చు ఆ వెలుగును గ్రహింపగా, భౌతిక క్లిష్టతలలో గాఢముగ తగులుకొని యున్న సామాన్య మానవుడు దాని ననుభవింపజాలడు. అందువలన, ఆ సందర్భముగా తనకు సహాయము చేయుటకు తన సహజీవులలో ఉన్నత ప్రతిభగల యొకరి అవసరము అతనికి ఉండును. మనమాతనికి మార్గదర్శి, గురువు, ప్రభువు లేక మన యిచ్చవచ్చిన ఏ పేరుతోనైనను పిలువ వచ్చును; కాని అతడు సేవ, త్యాగ భావములతో పనిచేయు సహాయకుడు, పోషకుడు మాత్రమే. అతని పాత్ర అత్యంత ప్రముఖమైనది. ఏలయన, నిజమగు నన్వేషకుని పైకిలాగి, అతని యందు స్థూలత్వము యొక్క ఆవరణలచే కప్పబడియున్న ప్రకాశము నుజ్జీవింప చేయువాడు వాస్తవమునకు ఆయనయే. ఆ ప్రకారము మేల్కొలుపబడిన ప్రకాశము బాహ్య ఆవరణములపై తన ప్రతిబింబమును ప్రసరింపజేయ మొదలిడి స్థౌల్యము, మాలిన్యములను అందుండి తీసివేయును. క్రమ క్రమముగ అది వృద్ధియగుచు లోతుగనున్న ఆవరణములపై కూడ పనిచేయును. స్వప్రయత్నములచే కూడ ప్రకాశమును మేల్కొలుపవచ్చును. కాని దానికనేక సంవత్సరముల పర్యంతము విడువని పరిశ్రమ కావలియున్నది. ఈ కారణమున యోగ్యుడైన మార్గదర్శితో సాంగత్యము అభ్యాసికి అపారమగు విలువగలది. ఏలయన, గురువు కూడ కర్తవ్యబద్ధుడై మార్గమున ప్రతిబంధకములను, అడ్డంకులను తొలగించుచునే యుండును.

ఆధిక్యశ్రేష్టతా భావములచే పూరితుడై ఒక గురువు మార్గదర్శిగా ఈ రంగము నందు ప్రవేశించిన, అతడు అసలు గురువైన భగవంతుని స్థానమును నాక్రమించినవాడనునది స్పష్టము. అందువలన, అతడితరులకు వలసినంతగ లాభము చేకూర్చజాలడనుట కడుంగడు నిశ్చయము. కావున, అతడు తనను వినమ్రుడుగా భావించుకొని ప్రేమ, సేవాభావముతో ప్రవర్తించుట ఆవశ్యకము. అతడు వ్యక్తిగతముగను, సామూహికముగను తన సహజీవుల సేవకు తన్నుతాను పూర్తిగా సమర్పించుకొన వలయును. ఆసేవ ఆధ్యాత్మికమైనట్టిది, శారీరకమైనట్టిది కూడ కావచ్చును. అతడెల్లప్పుడును ఆధ్యాత్మిక సేవయందే నిమగ్నుడు కావలెను. అవసరమైనచో శారీరక సేవచేయుటకు కూడ అతడు సర్వదా సిద్ధమయి ఉండవలెను. అతడు అహంకార, ఆధిక్య, గర్వ భావములను బొత్తిగా లేనివాడై యుండవలెను. అతడు కేవలము సిద్ధాంతములను బోధించు టవాడుగ కాక, మానవుడు చేరుకొనగల స్థితి యొక్క అంతిమ పరిమితి వరకు గల పూర్తి దూరమును పయనించి, అనంత స్థితియందు సంపూర్ణ లయము నొందిన అనుభవజ్ఞుడై యుండవలెను. అట్టి వ్యక్తి మాత్రమే అభ్యాసిని ఆధ్యాత్మిక పథమున తీసికొనిపోవు గురువుగ నుండుటకు అర్హతముడై యున్నవాడు. ఈ సందర్భమున ఆధ్యాత్మిక శక్తి దానియంతట యదియే నిరంతరము అతని నుండి ప్రసారమగుచు, అతని చుట్టు నున్నవారి మీద ప్రభావము కల్గించు చుండును. కాని అట్టి విశిష్ట పురుషులు జగత్తునకు ప్రకృతి ప్రసాదము. వారు ప్రకృతి కార్యము కొఱకు మాధ్యమముగ పనిచేయుటకు ప్రకృతి ఇచ్ఛాను సారముగ ప్రపంచమునకు వత్తురు. సాధ్యమైన మఱి లభ్యమైనచో అట్టి ఉన్నతాత్మునే అన్వేషింప వలయును. అట్లు గాకున్న, ఆయన తరువాత లభ్యమైనట్టి మరియు చేర గలిగినట్టి మహోన్నతాత్మునితో సంబంధమును పెట్టుకొనవలెను. ఆయన వ్యాప్తిలో తానులయమై అభ్యాసి కూడ అట్టి వ్యాప్తినే పొందగలడు.

ప్రతి మహాత్ముడు లేక యోగి తనదైనట్టి వ్యాప్తిని – అది అధికమైనను, అల్పమైనను – ఒక పరిమితి వరకు కలిగియున్నాడు. అన్వేషకుని సంకల్పము దైవత్వముపై ధృఢముగ నిలుప బడినపుడు, ఆ విధముగ అతనిలో ఉజ్జీవింప బడిన దైవశక్తి అత్యంత అధిక వ్యాప్తిని కలుగజేయును. తక్కువ దశలలో వ్యాప్తి తక్కువ. మన సంస్థయందు ప్రతి అభ్యాసి తనయందు వృద్ధి చెందిన సామర్థ్యమున కనుగుణముగ వ్యాప్తిని ఒక పరిమితి వరకు పొందియున్నాడు. భగవంతునితో సూటిగ సంపర్కము నేర్పరచుకొనుటకు, ఆకాలమున ఉండిన అట్టి మహోన్నత పురుషునితో అభ్యాసి సంబంధమును పెట్టుకొనుట పూర్తిగ ఆవశ్యకము. వేరు మాటలలో చెప్పవలెనన్న, పరిపూర్ణవ్యక్తిని పొందుటే భగవంతుని పొందుట. శాస్త్రములు కూడ ఈ అభిప్రాయమును సమర్థించుచున్నవి. అట్టి మహాపురుషుడు ఆకాలమున అందుబాటులో లేకుండిన, ఆ మహావ్యక్తితో యధోచితమైన సంబంధము కలిగిన యొకనితో సంబందము పెట్టుకొనుటయే సరియగు మార్గము. ఏలయన శ్రేష్ఠమైనట్టిది అందుబాటులో లేపుడు, ఆ తరువాతి శ్రేష్ఠమైన దానినే ఆశ్రయింపవలెను.

మహోన్నత ప్రతిభాశాలియైన గురువు మరియొక కారణమున కూడ తప్పనిసరిగ ఆవశ్యకము. మన ఆధ్యాత్మిక పయనమున మనము బిందువునకు, బిందువునకు మధ్యగల స్థలము నధిగమించుచు, ఒకదాని నుండి మరియొకదానికి దాటుచు పోవుదుము. తరువాతి బిందువును చేరుటకు ఈ మధ్యస్థలములను దాటవలయును. కాని వానిని దాటునుపుడు వాని అనుభవము లేక భోగమును పూర్తిచేయుటకు అసంపూర్ణ స్థలము గుండా సమగ్రయాత్ర అవసరము. అది లేకుండ ఆపైని ఆరోహణము ఏవిధముగను సాధ్యముకాదు. కేవలము స్వప్రయత్నముచే దీనికి ప్రయత్నించు నతడు, దాని చిక్కులలో

బయటపడు ఆశలేనంత తగులుకొని నిరవధికముగ దానియందే ఉండిపోవును. అట్లు జరగని వారు కొందరుండ వచ్చును. కాని, అట్టివారు మిక్కిలి అరుదు. అది కూడ అసామాన్య ప్రతిభ కలిగి యుండి, భగవత్కృపచే అనుగ్రహింప బడినప్పుడు మాత్రమే సాధ్యము. భగవచ్ఛక్తితో అవిచ్ఛిన్నమగు సంబంధమును స్థిరపరచుకొనిన వాని శక్తియే నిశ్చయముగ మనలను ఆ చిక్కులన్నిటి గుండా సురక్షితముగ కొనిపోగలుగును. దాని కొరకై అతనిని ఆశ్రయించుట ఆవశ్యకము కాదా? నిశ్చయముగ అవును. స్వామి అన్నను లేక సేవకుడన్నను, నీవాతనిని ఏ భావమున తీసికొన్నను అతడు నీకు శిక్షకుడు, మార్గదర్శి, లేక సామాన్యార్థమున గురువు.

బిందువులకు మధ్య ఉన్న స్థలములు అసంఖ్యాకములు. మన యాత్రా మార్గమున వాని అన్నిటి గుండా పోవలయును. ప్రతిభావంతుడైన సమర్థ గురువు సహాయముతో ఈ భోగ క్రమము చాలవరకు తగ్గును. ఈ స్థానములయందు అభ్యాసి ఉండెడి కాలము బాగుగా తగ్గింపబడి అందుమూలమున ఎక్కువకాలము మరియు శక్తి మిగుల్చు కొనబడును. కాని, గురువు యొక్క ఆధారముండుట వలన "భోగము" ఎట్లు నిశ్చలమగునో అనునది కొంతవరకు విచిత్రముగను, అసహజముగను కనపడవచ్చును. వాస్తవమేమన అభ్యాసి యుండుచున్న స్థానముయొక్క స్థితి అతనిని పూర్తిగ చిక్కించుకొని అతని చుట్టును ఒక రకమైన అల్లికను ఏర్పరచును. అది ధ్వంసము చేయబడిననే కాని, ఇంకను ఉన్నత ఆరోహణమను ప్రశ్నయేలుదు. కొన్నివేళల స్వప్రయత్న మాత్రమున కొంచెము పైకి పోవచ్చును. కాని, అది మరల క్రిందికి జారుటకు మాత్రమే. తొలుతనున్న కొన్నిటిని మాత్రమే తప్ప ఈ మధ్య స్థలముల నింతవరకు ఋషులలో పెక్కుమంది దాటలేక పోయిరను దానిని ప్రత్యక్ష పరిశీలనము నిరూపింప గలదు. తప్పించు కొనుమార్గమును కనుగొనలేక వారు ఏదో యొక దానియందు నిరవధికముగ తిరుగులాడుచునే యుండిరి. తన మహోన్నత శక్తిచే మార్గమును వారికి సుగమము చేయు సరియైన సామర్థ్యము, ప్రతిభ వారి గురువునందు లేకుండుటయే దానికి గల స్పష్టమైన కారణము. తమ స్వశక్తిపై నాధారపడువారు మొట్టమొదటి లేదా రెండవ దశయందే ఆగిపోవుదురు. గురువు తోడ్పాటు ఉన్నప్పుడు "భోగము" యొక్క అవసరమేల ఉత్పన్నముకాదో గ్రహించుట ఏమియునంత కష్టముకాదు. నిజమునకు "భోగము" పూర్వకర్మల ఫలితముల ననుభవించుటకు మాత్రమే కాక, తాను తగులుకొని యున్న అల్లిక ప్రభావమును నాశనము చేయుటకు కూడ సంబంధించి యున్నది. అది ఛేదింప బడినపుడు మాత్రమే అభ్యాసి తరువాతి బిందువు వఱకు పోగలడు. అది గురువు సహాయముతోనే సాధ్యము.

తమ ఆధ్యాత్మిక శిక్షణను తమకు తామే నిర్వహించుకొనుట సాధ్యమే యనెడి కొందరి తప్పు భావమును తొలగించుటయే యీ విషయమును చర్చించుటలో నా యుద్దేశ్యము. అది కొంత పరిమితి వరకు మాత్రమే సాధ్యము కావచ్చును. అది కూడ, సాధకుడు విశేష సామర్థ్యములతో ననుగ్రహింప బడినపుడు మాత్రమే. దానికిపైన అది పూర్తి అసంభవము, అసాధ్యము. అందువలన, మన సహజీవులలో నిజముగ సమర్థుడైన యొకని సహాయము నన్వేషించుటయే ఏకైక పరిష్కారము.

సమర్థుడైన గురువు నెన్నుకొనుట నిస్సందేశముగ మిక్కిలి కష్టమైన కార్యము. నా స్వానుభవము నాధారముగ నేను మీకు యోగ్యతను నిర్ణయించు నొక సులభపద్ధతిని తెలిపెదను. నీ వొక వ్యక్తితో సంబంధమును కలిగియుండుట తటస్థించినపుడు, అతని సంపర్కము నీలో శాంతి, నిశ్చలతా భావమును పెంపొందించు చున్నదో లేదో మరియు మనస్సుపై ఎట్టి భారప్రభావమును కలుగ చేయకుండ దాని

చంచల ప్రవృతులు తాత్కాలికముగనైనను శాంతించినవా లేవా అని అర్థము చేసికొన ప్రయత్నింపుము. అది అట్లున్నచో అతడు నిన్ను మార్గమున ముందునకు కొనిపోవుటకు తగిన వ్యక్తి యని తీర్మానించు కొనవలెను.

ఇంకొక చిక్కు కూడ కలదు. అది ఏమన అట్టి గురువు లభించినను, అందుబాటులో నున్నను కూడ ఆయన ఏదోయొక అద్భుత మహిమను ప్రదర్శించిననే కాని అతనిని సాధారణముగ నమ్మరు. ప్రాణాహుతి శక్తిగల రాజయోగి మహిమలను నిస్సంశయముగ ప్రదర్శింపగలడు. కాని, అది తన పవిత్ర స్థానమునకు అగౌరవమైనట్టిది కావున అతడట్లు చేయుటకు ఇష్టపడడు. పైగా, మహిమలు ఏవిధముగను నిజమగు విశ్వాసమును పెంపొందింపవు. కావున, అవి ముఖ్యములుకావని ప్రత్యక్షానుభవము పరిపూర్ణముగ నిరూపించుచున్నది. తన జీవితమంతయు మహిమలను ప్రదర్శించిన క్రీస్తు ఉదాహరణము మన ముందున్నది. అట్లయినను, ఆయనకు పండ్రెండుగురే శిష్యులుండిరి. వారిలో నొకడు తరువాత ఆయనను శిలువ నెక్కించి చంపుట జరుగునట్లు పన్నుగడ పన్నెను. ప్రజల యందు విశ్వాసము పెంపొందించుటకు ఆయన మహిమలు నిరుపయోగములైనవని అది చూపించుచున్నది. వాస్తవమునకు ఆయన ఉదాత్తమైన బోధనయే తర్వాత అంత విస్తారమైన అనుచర వర్గమును చేకూర్చినది. కావున మహిమలపై గాక సత్యము పైననే దృష్టిని నిలిపి యుంచుట మనకు అత్యంత శ్రేయస్కరము. అవి మిక్కిలి స్వల్ప విషయము లనుటలో సందేహమేమియు లేదు. అవి అల్ప సిద్ధులు, సామాన్య శక్తులు కలవారిచే కూడ ప్రదర్శింపబడును. ఒక మహాత్ముని కాని, యోగిని కాని గుర్తించుటకు మహిమ ప్రమాణము కాదు. పైగా నిది దుర్బలులైన నమ్మిమోసపోయెడు ప్రజలను తమ గురుత్వపు వలలో తగలించుకొనుటకై చతురైన గురువులు ఉద్దేశ పూర్వకముగ చేయు మోసము. గురునెన్నుకొను విషయమున చివరి నిర్ణయమునకు వచ్చుటకు ముందుగ, ఆధ్యాత్మిక మార్గమున అనుభవ సిద్ధులకు సంబంధించి, ఆయన శక్తి సామర్థ్యములయందు సంపూర్ణ విశ్వాసము కలిగి తీరవలయును. దీని కొఱకు, ప్రత్యక్ష మార్గమున పరిశీలనము, అనుభవముల నాధారముగ విషయ నిర్ణయము చేయుటకు ఆయనతో సాంగత్యమును సతతము కలిగి యుండవలయును. అట్లు నమ్మకము కలిగినపుడు, ఆయనను విశ్వాస పూర్వకముగ నమ్మి ఆయనపై స్థిరముగ నాధారపడవలయును. సాధన విజయవంతమగుటకు ఇది అత్యావశ్యకము. క్రమ క్రమముగ ఆధ్యాత్మిక జీవితమున అతి ముఖ్యాంశమగు విశ్వాసము వృద్ధి చెంద నారంభించును. గురుస్మరణ వెనుకనుండగా ఆయన రూపము సాధకుని దృష్టి యందు ప్రధానమైన దగును. గురుస్మరణ భావచాపల్యమును అధిగమించుటలో ముఖ్యాంశము. సులభ విజయమునకు అది తప్పనిసరి. స్మరణ యున్నప్పుడు, స్మరింప బడువాడు కూడ సమీపముననే ఉండితీరవలయును. ఇది అభ్యాసిని తాను తన ప్రియురాలి వాకిలి తలుపులను తట్టుచున్నానను భావమును పొందు స్థాయికి కొనిపోవును. తన తలుపులను తట్టునది భక్తితత్పరుడైన అన్వేషకుడేయని నమ్మకము కలిగినపుడు భగవంతుడు తానే అతనిని లోనికి కొనిపోవుటకు ద్వారము కడకు విచ్చేయును. ఆ విధముగ మన మార్గమున అవరోధములు విచ్ఛిన్నమై మనము ఆయన కడకు ప్రవేశమును పొందెదము. కాని, దానిని మనము ప్రత్యక్షముగ ననుభవించినపుడు మాత్రమే దాని సంపూర్ణ అవగాహన మనకు కలుగుగలదు. ఇట్టి దశయందు సాధకుడు దైవ గుణములను మిళితము చేసికొన నారంభించును. మూలమునుండి క్రిందికి వచ్చు సూర్యప్రకాశము లోనికి మనమిప్పుడు వచ్చితిమని దాని యర్థము. ఆవిధముగ మనము మూలము కడకు వచ్చితిమి. మనమిప్పుడు అనంత సాగరములో నున్నాము. మన ఈదులాట మొదలైనది.

ఇప్పుడు అంతయును పోయినది. స్మరణ, సమర్పణ యొక్క అత్యంత సూక్ష్మస్థితిగ మారి, మౌనమైన ఆకాంక్ష గుప్తమైన అశాంతులచే అనుబంధింప బడినది. అది మాత్రమే ఇప్పుడు మనకు మిగిలియున్న సాధనము. ఆస్థితి సంపూర్ణముగ మనోహరత్వము, రుచిలేనట్టిది. కాని, దానినుండి ఒక్కక్షణము కూడ దూరమగుటకు ఇష్టము లేకుండు నంత మేఱకు విచిత్ర ఆకర్షణను అది కలిగియున్నది. నావరకు దానికి మారుగ నా జీవితమును కూడ నిచ్చుటకు సిద్ధ పడెదను, కాని దానిని వదలను, అది సత్యతత్త్వము యొక్క ప్రారంభము, అచ్చట శుద్ధత, శాంతి ఆనందము కూడ లుప్తమైయున్నవి.

ఒకడు భగవంతునిలో లీనమైయుండగ మరియొకడు భగవంతుని భౌతిక సృష్టియందు లీనమై యుండిన, వారేమి పొందుదురు ? ఒకడు సత్యతత్త్వమును, మరియొకడు దాని అనుకరణమును పొందును. దానికి భగవంతుని తప్పుపట్టగలమా? నిశ్చయముగ లేము. రెండు సందర్భములందును దైవధార ఒక్కటియే, కాని వారొక్కక్కరు దానిని తమ శక్తి సామర్థ్యముల కనుగుణముగ స్వీకరింతురు. అందఱకును ఒకే గురువైన భగవంతునితో సంబంధమును కలవాడనై యున్నతము, అధమము; గొప్ప, చిన్న అను భావము లేశమైనను లేకుండ నేను నా సహచరులందరి యందును సమత్వభావమును కలిగియున్నాను. వాస్తవమునకు మానవరూపమున నున్న ఒకడు మానవతా దృష్టియందు గొప్పవానిగను, అధికుడుగను భావింపబడినను, అతడు అత్యంత అల్పుడై యుండవచ్చును. నిజమునకు వ్యక్తిగతముగ అతడు శూన్యము కంటె ఎక్కువ గానున్నను, అతనికి గల మిక్కిలి అత్యల్పమే అతని గొప్పతనముగ ఏర్పడవచ్చును. సున్నకు దాని ప్రాముఖ్యము దానికి కలదు. ఏలయన, ఒక సంఖ్యకు చేర్చినపుడు అది దాని విలువను పదిరెట్లకు పెంచును. భక్తి మనలను చివరకు ఇంతవరకు తీసికొని వచ్చును.

నా హృదయము మీ అందరకును ఒక క్రీడారంగముగ నీయబడినది; దానిని ఒకడు తన వినోదము కొరకు విలాస స్థలముగ నుపయోగించిననుసరే, లేక పిచ్చివానిగ తిరుగుటకు ఎడారిగ నుపయోగించినను సరే, దానినతడు తన ఇచ్చవచ్చినట్లు ఏవిధముగనైనను ఉపయోగించనీ, ప్రతియొక్కరు దానియందు స్వేచ్ఛగ స్థిరపడవచ్చును, ఆ ప్రదేశమున ఒకరు తన స్వీయ ప్రతిబింబమును, మరి యొకరు ప్రియతముడైన భగవంతుని ప్రతిబింబమును దర్శింపవచ్చును. సమానత్వము ప్రకృతి యొక్క స్వభావము. ప్రతియొక్కరు దానియందు తన వంతును కలిగియుండును. భగవంతుడు 'సమవృత్తి' మరియు 'సమదర్శి' గను తెలియబడుచున్నాడు. నిజమైన గురువు కూడ తన హృదయము నిండ సమానత్వ భావమును కలిగి యుండవలయును. అట్లుగాకుండిన, ఆ వృత్తి కాతడెంతమాత్రము అర్హుడు కాదు.

# పురోగమన దశలు

మన అభ్యాసమునందు సహాకరములైనట్టి వివిధ శక్తి కేంద్రములను మేల్కొలుపుచు మనము క్రమబద్ధముగ ముందునకు సాగిపోవుదుము. ఈ బిందువులలో ప్రతి యొక్కటి ఒక విశిష్ట లక్షణమును కలిగియున్నది. జీవకేంద్రమైనట్టి హృదయముతో మనము ప్రారంభింతుము. లక్ష్యము సిద్ధించువరకు ఈ బిందువునందు ధ్యానము చేయుచుందుము. దానియందు ఐదు బిందువులు లేక ఉపకేంద్రములు కలవు. మన యాత్రయందు వానిగుండా పోవదుము. చివరి బిందువు లేక ఐదవ బిందువును చేరునప్పటికి, 'ఆజ్ఞా చక్రము' వైపునకు మన మార్గము సూటిగ అగును. ఈ బిందువు దగ్గరస్థితి విచిత్రముగ నుండును. ఈ బిందువు నుండి మనము ఉపయోగించు శక్తి క్రింది భాగమునకు మరలింపబడును. ఈ బిందువు కడకు పయనించునపుడు అనుభవమునకు వచ్చు ప్రధానస్థితి ఏమన నీడవంటి చీకటివలె నున్న ఏదియో యొక భావన. ఇది మనము చివరకు ప్రకాశమున కతీతముగ పోవలసియున్నదనుటకు నొక సూచన మాత్రమే. దాని వాస్తవ ప్రకృతి వెలుతురుకు గాని, చీకటికి గాని సంబంధించినది కాకుండ, ఉషఃకాల వర్ణమునకు చెందియుండును. అచ్చటినుండి మనము సూటిగ 'సహస్ర దళ కమలము' – వేయి రేకులు కలిగియున్న పద్మము ––నకు పయనించెదము. ఇది 'విరాట్' మండలము. ఈ బిందువు నుండియే మహాభారత యుద్ధ సమయమున అర్జునుని దృష్టికి 'విరాట్ రూపము' తీసికొని రాబడినది. అది బ్రహ్మాండము, సహస్రారమున మన యాత్ర ముగిసిన పిమ్మట మనము తలవెనుకగల ఉబ్బెత్తు భాగమును చేరుదుము.

ఈ బిందువునకు పయనించు మార్గమున మనము వివిధ కేంద్రముల గుండా పోవుచు వానిని దాటుదుము. వానికి ప్రత్యేక లక్షణము కలదు. తలవెనుక గల ఉబ్బెత్తు భాగమున మనము ఒక మార్పులేని స్థితి ననుభవింతుము. అది మరియొక విధముగ 'బ్రహ్మగతి' లేక దైవస్థితి. దానిని పూర్తిచేయుట యనగా మన ప్రకాశ మనుకొనబడిన ఏడువృత్తములను దాటితిమని యర్థము. తదుపరి 'బ్రహ్మము' నందు సంపూర్ణముగ లయమై సాధకుడు 'భూమ' – పరతత్త్వము లేక తన స్వచ్ఛస్థితిలో భగవంతుని – తో సన్నిహిత సంబంధమును పొందును. అప్పుడు తానేమి అన్నది, ఎక్కడ నున్నది అతని గ్రాహ్యమున కతీతము.

మొదటి బిందువు అయిన హృదయమునందు ఈ దిగువ నాలుగు స్థితులు క్రమముగా అనుభవింపబడును :

1) దివ్యశక్తి అంతటను వ్యాపించియున్నదను ఎరుక మనస్సు నందు జాగృతమైయుండుట. ఇది యొక విచిత్రస్థితి.

2) ఎల్లెడలను సర్వపదార్థముల యందును వ్యాపించియున్న ఒక దివ్యస్థితి. దాని స్మృతి యందు లగ్నమై యుండుట.

3) దివ్యశక్తి యొక్క అనుభూతి కాని, స్మృతి కాని ఏదియు లేకుండు లయావస్థ మాత్రమే.

4) అంతయు పోయెను. హృదయముపై ఏ గుర్తును లేదు, ఉనికి యొక్క గుర్తు కూడ.

ఈ నాలుగు స్థితులు ప్రతిచోటను, ప్రతి బిందువు నొద్దను అనుభవింప బడును. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణాపద్ధతి యందు ప్రతి యొక్కరును వాని ననుభవింతురు. బహుశః సూక్ష్మ తత్త్వమును గ్రహింపగలవారు మాత్రమే ఆ స్థితులన్నిటిని వాని అతి సూక్ష్మ వివరణములతో అనుభూతి పొందగలరు. మనము అత్యంత అధమము నుండి అత్యున్నతమునకు వివిధ ఉపకేంద్రముల ద్వారా పోవుకొలదిని నివి సూక్ష్మతరములగు చుండును.

సామాన్యముగ అభ్యాసి పడు పొరబాటు భావము ఏమన తన చిత్తవృత్తులను నిరసనము చేయు తలంపుతో మొదలిడి, దానితో నేరుగ సంబంధము కలిగిన సాధనములను అనుసరించును. ఆవిధముగ నతడు తన సాధనను ఒక సంకుచిత వలయమునకే పరిమితము చేయును. ఇది 'వృత్తులు' లేక ఇంద్రియములతో యావజ్జీవపు పోరాటముగ పరిణమించును. తరచుగనిది మెదడుపై విపరీత ఫలితమును కలుగజేయును. నా అభిప్రాయమున వృత్తులతో పెనుగులాడుటకు బదులు వారు వారి ధ్యేయమునకు దృఢముగ అంటిపెట్టుకొని యుండిన విజయము మరింత సులభము, నిశ్చయము నగును. ఇంతియే గాక, వారు చేయు ప్రయత్నములు వారియందు ప్రవేశ పెట్టబడిన ప్రబలశక్తిచే బలవత్తరము కావింపబడినచో, సంవత్సరములు పట్టు కార్యము క్షణములలోనే పూర్తి చేయబడును. ప్రాణాహుతి సహాయమున అభ్యాసి వృత్తులతో ఫలప్రదముగ వ్యవహరించుట మిక్కిలి సులభము. సమర్థవంతుడైన గురువు ప్రాణాహుతి ద్వారా తనశక్తిని ప్రయోగించుట వలన, అభ్యాసి మనోవృత్తులను ఊర్ధ్వముఖముగ మరల్చును. తత్ఫలితముగ అవి రూపొంద మొదలిడి ఇదివరకటి కంటె నిశ్చలముగను, ప్రశాంతముగను అగును. అతడు అభ్యాసియొక్క పిండమనస్సును (స్థూల-ప్రత్యేకింపబడిన ప్రజ్ఞ) తగురీతి శుద్ధము కావించి దానిని బ్రహ్మాండ మానసము (సూక్ష్మతర లేదా విశ్వప్రజ్ఞ) యొక్క స్థితియందు మునుగునట్లు చేయును. ఈ ప్రక్రియ అత్యున్నత స్థాయివైపునకు అభ్యాసి యొక్క గమనమును త్వరితము చేయును. కాలక్రమమున అధమ మనస్సు ఉన్నతస్థాయి యొక్క స్థితియందు సంపూర్ణలయమును పొందినపుడు, అది తన వాస్తవ ప్రకృతిని గుర్తించి అనావశ్యకములు, బాహ్యములు అయిన వానియందు లౌలత్యము కలిగియుండుటను వదలుకొనును. ఆ ప్రకారము వృత్తుల నిరసన దానియంతట అదియే ఫలితమునకు వచ్చి, సాధకుని యధార్థ ప్రకృతి తానే ప్రకటితమగుటకు మొదలిడును. అభ్యాసి తాను దైనందిన అభ్యాసక్రమము ననుసరింపక పోయినను, అతడు గురువుతో నిజార్థమున సహకరించినచో, గురువు యొక్క ప్రాణాహుతి శక్తిచే పరిపూర్ణత యొక్క చిట్టచివరి హద్దువరకు ఈ దశలను దాటునట్లు చేయబడగలదు. కాని, సామాన్యముగ ఆ స్థితినంతటిని ఒక్కసారిగ సంపూర్ణ క్రియారూపములోనికి కొనివచ్చినట్లైన, అతని నరములు, కండరములు ధ్వంసమగు ప్రమాదము కలదు. ఈ ప్రక్రియ, సహజ మార్గ విధానమున అభ్యాసికి శారీరక ప్రమాదము కలుగకుండునట్లు పూర్తిగ సురక్షితము కావింపబడినది. మన సమర్థ గురుదేవుల అత్యంత ఉత్కృష్టమైన, నూతన పరిశోధనలో నిది యొకటి. అభ్యాసికి ప్రాణాహుతి మూలముగ నీయబడిన స్థితి, కొంతకాలము తర్వాత దాని వికాసము ఫలితమునకు వచ్చుట మొదలిడినప్పుడు అతని యెఱుకకు వచ్చునట్లు ఈ ప్రక్రియ చాల మృదువుగ ప్రయోగింపబడును. ఆ సందర్భమున పైకి కనబడు అతని స్థితి క్రమదశలలో దానిని పొందినవాని స్థితికి కొంచెము భిన్నముగ కనపడును. కాని, ఈ రెండు సందర్భములందును, అభ్యాసి జనన మరణములనుండి నిశ్చయముగ ముక్తినొందును.

నా విషయమునకు మరల వచ్చెదను. వృత్తులు ఆ ప్రకారము శూన్యమునకు క్షీణింప బడినపుడు, లేక తిరస్కరింప బడినపుడు, లేక వేరుమాటలలో, ఒక అతీతస్థితిని పొందినపుడు, అప్పుడది బ్రహ్మగతియొక్క

అధమరకమైనస్థితి. దీనిని పొందినపుడు, తెర ఛేదింపబడి మనము దానికతీతమైన తరువాతి అంతర్ వలయమున ప్రవేశించెదము. మనదృష్టి అప్పుడు అంతర్గతముగ మరలును. ఆత్మ నన్వేషించుచు మనము దానికడకు పరోగమించెదము. ఇట్లు, సహజమార్గము చక్రములను ఒకదాని తరువాత మరియొక దానిని చేపట్టుచు సహజగతిని ముందునకు సాగిపోవును. అతివేగముగ పురోగమించుటకు ఈ పద్ధతి మనకు సహాయపడును.

ప్రకృతిశక్తి అపారము. మానవుడు తన ఆలోచన ఒకానొక వలయమునందు బద్ధమైయున్నట్లు తెలిసినప్పుడు, 'పరిమితి' అను శబ్దము అతని గ్రహణములోనికి ప్రవేశించినది. అందువలననే అతని శక్తి పరిమితమైనదని అతడు తీర్మానించెను. ఈ భావము అతని యందు ఏదో ఉన్నతతర శక్తి లేక అధికతర శక్తి యున్నదను ఆలోచనను పెంపొందించును. అది అతీతముగ నున్నదనియు, అపారమైన దనియు భావింప బడుచున్నది. మన వలయము సంకుచితమైనట్టిదిగ అనుకొనినపుడే ఈ ద్వంద్వ భావము తలయెత్తినది. ఆధ్యాత్మిక ప్రగతిలో ఒకానొక దశయందు విధిగా జరుగవలసినట్లు, ఈ భావము మనస్సునుండి తొలగింప బడినచో, మనము అప్పుడు పరిమితికి లోనయియున్నామను భావమును పోగొట్టుకొనుట కూడ మిక్కిలి సాధ్యము. పరిమితులలో నుండుట, పరిమితుల కతీతముగ నుండుట అను ఈ రెండు తలంపులు మనస్సునుండి కడిగి వేయబడినప్పుడు యధార్థమునకు పరిమితులనుండి విముక్తులమగుదుము. పరిమితికి లేక పరిమితమైనట్టి దానికి ఏది అతీతమో దానితో ఆత్మ కలుపబడినది. అదృష్టవశమున ఆ ఉన్నత స్థితి నుండి ప్రాణాహుతి లభించుట తటస్థించినచో అప్పుడు పై సిద్ధి తప్పక సాధ్యము మరియు ఆచరణయుతము. ఉదాహరణమునకు ముక్తి స్థితికి ఒకనిని కొనిరావలెనన్న దానికి అతడు ఆత్మను అనంతము వైపునకు మరల్చుటయే సహజమార్గ పద్ధతి. ఫలితమేమన అతడు జీవితపు ఆఖరుక్షణము లోపల, చివరకు గమ్యమును చేరి ముక్తిని పొందువఱకు, పురోభివృద్ధి చెందుచు పోవును. అటి అద్భుత పరిణామములను, ప్రాణాహుతి శక్తిని తన అధీనమున కలిగియున్న యోగ్యుడైన గురువు తప్ప మరి ఎవ్వరును తీసికొని రాలేరనియు, నిశ్చితవిజయమును తప్పక ఇచ్చు మార్గము రాజయోగమే యనియు, నేను ఢంకగొట్టి చాటి చెప్పగలను. కాని ముక్తికై మనఃపూర్వక ఆకాంక్షతో ప్రేరితులైన వారికిని, దానికి నిజముగ విధిచే నియుక్తులైనట్టి అదృష్టవంతుల వంతునకును మాత్రమే ఇది రాగలదు. పతంజలి పద్ధతి యందు విధించబడిన యోగము యొక్క వరుస క్రమమైన వివిధ సోపానములు సమస్తము సహజమార్గ విధానమునగల దైనందిన సాధనలో పొందు పరుపబడినవి. అభ్యాసి వాని నొక్కక్క దానిని ప్రత్యేకముగ అభ్యసించకుండగనే అవి పూర్తి చేయబడును. ప్రాణాహుతి సహాయము ద్వారా మాత్రమే అది సాధ్యము కావున, హెచ్చుసంఖ్యలో అభ్యాసకులు వచ్చి దానివలన లాభము పొందెదరని నే నపేక్షించు చుంటిని.

జనులు తరచు వారి ఆంతరికస్థితి విషయమున ఏమియు అనుభవించుట లేదని చెప్పుదురు. కాని, నేను ఎప్పుడైనను దానిని ప్రయత్నించితిరా లేదా యిన వారినడిగినప్పుడు తాము దానికసమర్థులము గాన ప్రత్నింప లేదని మాత్రమే సమాధాన మిత్తురు. నేను వారితో నేకీభవించును. అభ్యాసముతో ముందునకు పోవునపుడు సూక్ష్మబుద్ధి తప్పక వృద్ధిచెందును. కావున, ఈ సామార్థ్యము ప్రతియొక్కరును కలిగియున్నారని నేను విశ్వసింతును. వాస్తవమేమన వృద్ధి అయిన వారి జ్ఞానమును దీనికి గాక ఇతర విషయముల కుపయోగింతురు. సాధారణముగ దానిని బగవంతుని వైపునకు కాక లౌకిక విషయముల వైపునకు మరల్చెదరు. తత్ఫలితముగ వారు ప్రపంచమునకు ఎక్కువ దృఢముగ అంటుకొని పోవుచుందురు.

నిజమునకు వారు ఏ త్యాగము చేయుటకు నిచ్చగింపరు. వారు పరతత్త్వప్రాప్తికి నిజమైన ఎట్టి ఆకాంక్షను కలిగి యుండరు. వారు చేయునట్లు నటించున దంతయు కేవలము వినోదము కొరకే లేక బహుశః వారి కుతూహలమును తృప్తిపరచుకొనుటకు మాత్రమే. ఈ పరిస్థితులందు కూడ సాధ్యమైనంతవరకు వారికి సహాయము చేయుటకు బద్ధుడనైతినని నేను భావించెదను.

భగవంతుని కడకు దృష్టిని మరల్చినప్పుడు మాత్రమే వైరాగ్యము చాల సులభముగ వృద్ధిచెందగలదు. నా వంతునకు నేను వారి దృష్టిని భగవంతుని కడకు మరల్చి నా ఇచ్ఛానుశక్తిచే అచ్చట నిలిపి యుంచెదను. దీనిని వారు తప్పక అనుభవించి, గుర్తింతురు. కాని, దానిని వారు భౌతిక ప్రయోజనముల కొరకు మాత్రమే ఉపయోగింతురు. కొన్ని సందర్భములలో వారు దానిని ప్రాపంచిక విషయముల కొరకు క్రిందికి లాగుచునే యుందురని నా విశ్వాసము.

కాని అనేకమంది సాధకులు, ముందునకు వచ్చి సాధనను ప్రారంభించినను, ఆలోచనలు వచ్చుచున్నవని సతతము వాపోవుదురు. మొత్తము మీద, దానికి బాధ్యులెవరు, నేనా లేక అభ్యాసియేనా? నా వంతుకు నేను అభ్యాసి ఎక్కువ వ్యాకులము చెందునేమోయని అతని మనస్సునుండి విరుద్ధ గుణములను పూర్తిగ బయటకు లాగివేయుచునే యుందునని విశ్వసనీయముగ చెప్పగలను. కాని, తమవైపునకు నా దృష్టిని ఆకర్షింపనైన లేని వారికి నేనేమి చేయగలను? వాస్తవమునకు నాయందు నా స్వంతమైనదేదియు లేదు. నాయందు కూడబెట్టిన దంతయు మీ అందరి కోసమే. నా జీవిత కాలముననే దానినెవరికో అప్పగించి ఆ భారమునుండి విముక్తి పొంది నాయందేమియు లేకుండ వెడలి పోవలెనని నా కోరిక. ఇప్పుడు, గురుదేవులు నాకప్పటించిన బాధ్యతగ నేను కలిగియున్న దానిని ఆధ్యాత్మికత యని గాని సత్యతత్త్వమని గాని, చివరకు ఆనందమని గాని అనలేము.

అత్యున్నత ఆరోహణమును నిశ్చయముగ నిచ్చునట్లు కనబడు మనఃస్థితిని తమ యందు సృష్టించుకొనుటకు కొందరు గట్టిగ ప్రయాసపడినప్పటికిని, వాస్తవార్థమున యదార్థ అన్వేషకులు దొరుకుట అరుదు.

నిజమగు అన్వేషకునిగ దానికై ముందునకు వచ్చినట్లయిన, ఈ పద్ధతి యొక్క అసలైన యోగ్యత వెలుగులోనికి వచ్చును. దానిని గ్రహించు శక్తిని కలవారుగ తమను తాము చేసికొనుటకు అయినను శ్రమించువారు అభ్యాసులలో కొందరు కూడ యుండరు. అప్పటికి కూడ నేను వారియందు దానిని అప్పుడప్పుడు చొప్పించెదను. అయినను, నేను భౌతికకాయమును వీడునపుడు దాని నంతటిని నాతో కొనిపోవలసి వచ్చునేమో యని నాభయము. ప్రతి మనిషికి తనయందు ప్రవేశపెట్టబడిన స్థితుల గుణమును గుర్తించు అవసరము కలదు. అప్పుడు మాత్రమే అది ఇతరుల నుద్ధరించుటకు ఉపయోగింప బడగలదు. ఆధ్యాత్మికస్థితులనేకము లున్నవి. వానికి నిర్దేశింపబడిన బిందువులు అనేకములు గలవు. ఇంకను ఎన్నియో కనిపెట్ట బడుచున్నవి. కాని బహుశః వానియందు ఒకటి లేక రెంటినికూడ ఉపయోగించు సామర్థ్యమును ప్రదర్శించిన వారెవ్వరును లేరు. అట్లైనను ప్రతి అభ్యాసి ప్రతిబిందువు నొద్దను గల స్థితులను చవిచూడ వలెనని నేను ఆతురతతో కూడిన కోరికతో మందుచున్నాను. అభ్యాసి దానియందు కొంచెమైనను పాలు పంచుకొనిన యెడల అతడు విశేషముగ మార్పు నొందును. ఆ మేరకు ఆధ్యాత్మిక శిక్షణ కర్హుడైన వానిని కనుగొనుట బహుకష్టమని నా గురుదేవులు కూడ దృఢముగ పలికిరి.

సర్వశూన్యస్థితి యంతటి స్థితిరహిత స్థితి నుండి వచ్చు సున్నిత ప్రాణాహుతి అభ్యాసిపై అద్భుత ప్రభావమును కలిగింప గలదను తీర్మానమునకు నా అనుభవమున వచ్చితిని. భావావేశముతో నిచ్చు శక్తియుత ప్రాణాహుతి ఆవిధముగ చేయజాలదు. శక్తి, ఆవేశము, వేడిమికి అతీతమైనట్టిది సత్యతత్త్వము. వేడిమి ఉనికి లోనికి వచ్చుటకు ముందునున్న స్థితిని అది పోలియున్నది. వాస్తవమునకు కది భావమునకు, అవగాహనకు అతీతము. అది వాస్తవార్థమున సత్యతత్త్వము.

ప్రగతియొక్క ఉన్నత దశయందు నియమప్రకారము నిత్యాభ్యాసము చేయుట దాదాపు అసాధ్యమగును. ఆ స్థితియందు అభ్యాసి భగవంతునితో తన సంబంధమును సజీవముగ నుంచుకొనినట్లైన అతని అభ్యాసము తానంతట అదియే ఎరుకతో కూడిన ఎట్టి ప్రయత్నము లేకుండ, తెలియకుండనే జరిగిపోవును. శ్రద్ధా విశ్వాసములతో ముందునకు పోవచున్నట్లైన మన సంస్థయందు ప్రతి అభ్యాసి విషయము ఇంచుమించుగ ఇదే. ఉన్నతమైన లయావస్థను పొందినపుడు మార్గము తానంతట అదే అతనికి గోచరమగును. జడత్వస్థితి (దీనియందు ఒకడు తాను మృతి నొందిన వానివలె భావించును) ఒక ఆధ్యాత్మిక స్థితి. జనులు దానిని తప్పుగ ఆధ్యాత్మికత యొక్క అంతిమ స్థితిగ తీసికొనినప్పటికిని వాస్తవార్థమున అది ఆధ్యాత్మికత యొక్క ఆరంభముగ భావింపవచ్చును. ప్రతియొక్కరు దానిని కాంక్షించి దానినే పొందవలెనని నా అపేక్ష.

మానసిక వృత్తులు నిశ్శబ్ద పఱుపబడుట, సర్వశూన్య స్థితివరకు వృద్ధి పొందింపబడినపుడు, ఆంతరిక శూన్యత ప్రారంభమైనదనుటకు సూచన. ప్రస్తుత యుగపు భౌతిక విజ్ఞానశాస్త్రము సంపూర్ణ శూన్యత ఎన్నటికిని సాధ్యము కాజాలదని కచ్చితముగ తెలుపుచున్నది. శూన్యత సంపూర్ణముగ జరిగిన పిమ్మట కూడ స్వల్పవాయువుండి తీరును. ఈ విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతమును నా స్వీయ పద్ధతిని వివరింతును. శూన్యకరణము సంపూర్ణముగా జరిగినపుడు మిగులునదేదియైనను అది దాని నిజమగు సారము. అది అపార బలముకలది; శక్తిమంతమైనది. అత్యంత ప్రాణాంతకమైనట్టి విధ్వంసకర ఆయుధముల నిర్మాణమునకు ఈ శక్తి బాగుగ ఉపయోగపడగలదు. అది మన ఆధ్యాత్మిక ప్రయోజనమునకు కూడ అపారమగు విలువలు కలిగి యున్నట్టిది. మానవుడు తన యందట్టి శూన్యతను సృష్టించుకొనినప్పుడు, అతడు ఎంత ఉన్నత శక్తిమంతుడగు ననగా అప్పుడు అతని సంకల్పము యొక్క స్వల్ప చలనము కూడ అత్యంత గొప్ప ఫలితముల నీయగలదు. కాని, నాపై నుండి దానిని పొందుటకు సిద్ధపడు వారెవ్వరును లేనట్లు కనపడుచున్నది. దానిని సంపూర్ణముగ పొందుటకు సిద్ధపడు వానిని కనుగొనుట యందు నా తీవ్ర అభిలాష యింతవరకు ఫలప్రదముగ కానట్లుగ కనపడుచున్నది. దారుణము, నిర్జనమునైన భగవంతుని విస్తీర్ణమునకు స్వల్ప కాలపు వినోదయాత్ర చేయుటకు బహుశః ఎవ్వరికిని యిష్టమున్నట్లుగ అగపడలేదు. దానివరకు ప్రవేశము ఎవ్వరికిని లేదు. దానికి ఏ విధమైన అంతమును లేదు. ఆత్మనిరసన స్థితి మాత్రము చివరిదశ కాదు. అది కూడ మన అంతిమ లక్ష్యముకాదు.. అది భూమ లేక అనంతమున కతీతమై బహుదూరమున నున్నది.

ఇచ్చుట మనము కడకు చేరవలసియున్నద అంతిమ స్థితిని గూర్చి కొంత తెలుపుటకు నేను మరికొన్ని మాటలను చెప్పవలసియున్నది. శూన్యత యొక్క చివరి పరిమితిని చేరిన పిమ్మట ఇంకను ముందునకు, అనందము యొక్క కడపటి హద్దుగ చెప్పబడు దాని వరకు, పోవలసియున్నది. అచ్చుట దేహమునందు గల ప్రతి అణువు శక్తిగ రూపొందును. అప్పుడేమగును? అతడు ప్రకృతి యొక్క

ఉపకరణమగును. ప్రతి వస్తువును తన శక్తి, అధీనము లందు కలిగియుండి అతడేమియు తెలియకుండ యుండును. కొన్ని అసాధారణ సందర్భములందు తప్ప అతడు తన స్వీయ ఉనికి స్థితిని గూర్చిన ఎఱుక లేకుండి నప్పటికిని దైవ కార్యమునెడ అతడు సదా సంపూర్ణముగ ఎఱుక కలిగియుండి అప్రమత్తులై యుండును. విశ్వము పనిచేయుటయంతయు అతని ఇచ్ఛకు లోబడి యుండును. "రాజయోగ ప్రభావము"న నేను సూచించినట్లు మార్పును కొనివచ్చు ఉద్దేశ్యమునకై ప్రపంచమున అవతరించిన వర్తమాన మహాపురుషుని వలెనే అతడు ప్రకృతి శక్తులనన్నిటిని తన అధీనమున ఉంచుకొనును.

**భాగము - 3**

# వివరణములు

"శాస్త్రములు ఒకదాని నొకటి వ్యతిరేకించు కొనుచున్నవి. కాని, అవి యోచించి ఒక పరిష్కారమునకు వచ్చుటకు అవకాశ మిచ్చును గాని మన కవి ఉపయుక్తములు."

1. సాధన చేయుటకు తాము యథార్థమునకు బలహీనులు గాకున్నను కొందరట్లు భావించుట నిజముగ ఆశ్చర్యకరము. ఒక మహాత్మునికి ఎట్టిశక్తి, ఆత్మబలము కలవో అవియే సామాన్యమానవుడు తనయందు కలిగియున్నాడు. వారి మధ్యగల ఒకేయొక భేదమేమన మహాత్ముడు తన ఆత్మచుట్టును గల ఆవరణమును ఛేదించుకొని యుండగా, సామాన్యుడు ఒక పట్టుపురుగు తన గూటిలో నుండునటుల ఉన్నాడు. ఈ ఆవరణలను త్రోసివేయుటకు దృఢముగ తీర్మానించుకొని నట్లైన అతనిని భూమిమీద ఏశక్తి ఆపజాలదు. మానవుని ఆధ్యాత్మిక అభివృద్ధికి కావలసిన దృఢ సంకల్పముమాత్రమే. అది యున్నప్పుడు గమ్యము కనుచూపుమేరలోనే యుండును. ఈ రెండింటిని నీవు కలిగియుండిన, అపజయమునకు బొత్తిగా ఎట్టి అవకాశముండదు. సత్య వస్తువును నిశ్చయముగ పొందుటకు దృఢముగ నొక్కమాఱు సంకల్పించిన చాలును. ఆధ్యాత్మిక రంగమున దృఢమైన సంకల్పముతో ప్రవేశించినప్పుడు సగము దూరమధిమగమించినట్లే. అప్పుడింకేదియును అతని దారియందు అడ్డు నిలువదు. కావున దయయుంచి గమ్యమును చేరలేమను అసత్య భావమునందుండుట మానుకొనుము. శిలవలె ధృడముగ నుండుము. విజయము దానంతట అదే ఉదయించుట నిశ్చయము. మార్గదర్శకుని యందు విశ్వాసము నిజముగా మిక్కిలి గణనీయమైనది. కాని, తన స్వీయ ఆవరణములను ఛేదించుకొని, దానితోబాటు ఇతరులకు ఆ మార్గమున సహాయము, ప్రాపునిచ్చు ప్రాణాహుతి శక్తి కలిగియున్నవాడు మాత్రమే సమర్థవంతుడైన మార్గదర్శి కాగలడని నీవు ఈ సందర్భమున జ్ఞప్తియందుంచు కొనవలసియున్నది.

నీ ఆంతరింక స్థితిని నాకు సాధ్యమైనంతవఱకు పరిశీలించితిని. నేనచ్చట ఉత్తమ అభివృద్ధి యొక్క గుర్తులను కనుగొన్నను. కొన్ని చిక్కులు అచ్చట ఉన్నవనుటలో సందేహములేదు. కాని నీవు నీ సాధనను కొనసాగించుచున్నట్లైన అవి సులభముగ తీసివేయబడగలవు. నీయందు ఏదేని బలహీనతలను నీవు గమనించినట్లయిన దయయుంచి దానిని నాదిగా భావించి ధైర్యముగ నీ అభ్యాసమును కొనసాగనిమ్ము. ఆవిధముగ బాధ్యత నాకు మార్చబడును. అప్పుడు నీవు దాని ప్రభావము నుండి విముక్తుడవగుదువు. ఇది చేయుటకు చాల సులభము. దీనిని చేసి ఫలితములను గమనించుము. సాధారణముగ దీని కొరకనుసరింపబడు జటిల పద్ధతులు పరిస్థితులను మరింత వివరింపజేసి, మిగుల క్లిష్టము గావించును. సాక్షాత్కారము చాల సరళమైనట్టి విషయము. అది అత్యంత సరళమైన ఉపాయములచే మాత్రమే పొందబడగలదు. అందు ఒక విషయము ప్రత్యేకముగ ముఖ్యమైనట్టిది. అది ఏమన గమ్యమును పొందుటకు సదా అశాంతితో కూడిన ఆతురతను అభ్యాసి కలిగియుండి తీరవలయును. విజయమున కిదియే కీలకమై మూలమునే సాధించును. నావంతునకు నేను నా ఆధ్యాత్మిక కార్యము నందున్నప్పుడెన్నడైనను విజయమును సాధించుటలో నాకు కొంచెమైనను సందేహము కలుగదు. ఆకారణమున నా ఆధ్యాత్మిక జీవితము అంతటియందు నేను నిరాశ నెన్నడు పొందలేదు. అచంచల సంకల్పమే దాని రహస్యము. మీరందరు ఆవిధమైన ఆమోఘ సంకల్పమును పెంపొందించు కొనెదరని నేనపేక్షింతును. అది నీవు చాల సులభముగ చేయగలవు.

2. దివ్యపురుషుని ఉనికి కారణమున ముక్తి నేడు మిక్కిలి సులభమయ్యెను. సామాన్యముగ జనుల భావన ముక్తి కతీతముగ పోదు. దానినే వారు మానవ సాధ్యమగు అంతిమ పరిమితియని భావింతురు. కాని అది తప్పు భావన. వాస్తవమునకు దైవపథమున ముక్తి అత్యంత అథమసిద్ధి. కావున అది

పసిబిడ్డ ఆడుకొను ఆటబొమ్మ వంటిది మాత్రమే. దానిపై సాధింపవలసిన దింకను చాలయున్నది. అనంత సాగర మింకను ముందునకున్నది. అది అపార విస్తారము. దానిపై మాత్రమే నీ దృష్టిని నిలిపి యుంచి, దానిని గుర్తించుటకు ముందుముందుకు పయనింపుము.

సహాయావసరమున నన్ను ఎవనికైనను సహాయము చేయుటకు సదా సిద్ధముగా నున్న హృదయమును నేను కలిగియున్ననాడను. ఆ కార్యమును గురువుగా కా కేవలము మానవాళి యొక్క వినమ్ర సేవకునిగ నేను స్వీకరింతును. తమ కాలమునందు గురువులుగ పనిచేయుచున్న మరియు పనిచేసియున్న మహానుభావులు ఉన్నారు, ఉండియుండిరి. కాని దానికి బదులుగ సేవకునిగ నుండుటకు, సామాన్య ప్రజల ప్రయోజనమునకై సేవకునిగ పనిచేయుటకు నే నిష్టపడెదను. దయయుంచి నేను చెప్పినట్లు చేయుము. నీ దినదినాభివృద్ధిని గూర్చియు, మరియు ఏమైన అడ్డంకులున్నచో వానిని గూర్చియు నాకు తెలుపుచుండుము. నిరంతర స్మరణతో పట్టు విడువక ముందునకు సాగుచున్నయెడల గమ్యమును నీవు సాధింపగలవని నేను నిశ్చయముగ చెప్పుదును.

3. నీవు నన్ను చూచిన సమయము ఆనందకరమైనట్టిది. నేను నిన్ను చూచు అవకాశము కలిగినప్పుడది యింకను ఆనందకరమగును. ఈ వాక్యము లోతైన అర్థము కలది. ఆ అర్థమున దానిని తీసికొనవచ్చును. నేను నిన్ను మొట్టమొదట చూచినప్పుడు, నీ యందనేక విషయములు మిశ్రితములై యుండి, ఏకత్వములో బహుత్వ ముండినట్లు గోచరించినది. ఈ అస్తిత్వము నిస్సందేహముగ పదార్థము ఆత్మతో సంలీనమగుటవలన కలిగిన ఫలితము. కాని, అచ్చట ఇంకను మఱియొక విషయము కూడ కలదు. వస్తువులన్నియు అంతట క్రమము చెడి, చిందరవందరగను పడియున్న గృహ మొకటియుండగా, ప్రతి వస్తువు క్రమరీతిని బాగుగ నమర్చబడియున్న గృహ మింకొకటి కలదు. సహజముగ మొదటిది క్షోభ స్థితియని, రెండవది నిశ్చలమైనట్టి క్రమబద్ధ స్థితియని చెప్పబడును. ఈ మానవ దేహము లేక మనము నివసించు ఈ గృహముయొక్క విషయము కూడ అంతే. దాని యందనేక వస్తువు లుంచబడియున్నవి. వివిధ ఇంద్రియముల చర్యలయొక్క ఫలితముల రూపమున నవి యీదేహము నందున్నవి. వానిని వాని స్వీయప్రవృత్తి, అభిరుచుల కనుగుణముగా స్వతంత్రముగ పనిచేయునట్లు విచ్చలవిడిగ వదలినచో వాని కార్యములు చాలవరకు క్రమరహితములై క్షోభకరముగ నుండును. అందువలన వాని నడుపులో నుంచుటకు శక్తిమంతము, సమర్థవంతమునయిన ఒక వ్యక్తి వానికి కావలసియున్నది. సామాన్యముగ పెక్కు సందర్భములలో కోరతగునది ఇదియే. ఈ సందర్భమునందే మనము అస్తవ్యస్తముగ నున్న గృహము యొక్క స్వరూపమును కనపరచెదము. నీవు నా యొద్దకు మొదట వచ్చినప్పుడు నీ విషయము కూడ అంతే. అత్యధికుల విషయమున ఇది సామాన్యమే.

మన ఈ బాహ్యజీవితము వెనుకనున్న ఒక నూతన జీవితమున మనము ప్రవేశింపవలసియున్నది. గోచరించు మనిషి వెనుక నిజమైన మనుష్యుడున్నాడనికూడ మనము చెప్పవచ్చును. నీవిప్పుడు నిజమైన జీవితమునందు ప్రవేశింప కోరుచుంటివి గాన, మనుష్యుని వెనుకన్ను మనుష్యుని లేక మనుష్యున కతీతుడైన మనుష్యుని అనగా నిజమగు మనిషినినీ వన్వేషింపవలసియున్నది. అట్టి పురుషుడున్న యెడల హృదయ చక్షువుచే మాత్రమే అతడు గుర్తింపబడగలడు; అతడు దేహమున ప్రతి కణము ప్రతి అణువునందు అనుభవింపబడగలడు. భౌతిక దేహమును కలిగియున్నను దానికతడేవిధముగను సంబంధించి యుండడు.

అతడు శూన్యమున కత్యంత సమీపముగ నుండును. విశ్వమంతయు అతని యావరణ. దానియందే అతడు తనదైన క్రీడ గలిగియుండును. ఎడారి యిసుకయందును, సాగ తరంగములయందును కూడ అతడుండుటను నీవు చూచెదవు. సూర్యుడు, చంద్రుడు, తారల ప్రకాశములో అతని యునికిని నీవు చూచెదవు. ప్రతిచోటను, నరకమునందును, స్వర్గమనందును కూడ అతడుండియుండున. కాని, అతనిని గుర్తించుట ఎట్లు అనునది అసలు సమస్య. నిజమున కదియే నా గురుదేవుని కృపచే నామీద ప్రవాహముగా వచ్చిపడుచున్నది. దానినే ప్రాణాహుతి ద్వారా అభ్యాసకులకు ఇత్తును. దానికొరకెట్టి ప్రతిఫలమును ఆశింపకుండ నేను దానిని నా కర్తవ్య భాగముగ తీసికొనెదను. అయినను, అది ఋణము లేక బాకీ (ఈ పదమును సామాన్యార్థమున తీసికొనకుండ) రూపమున అభ్యాసినుండి తనంతట తానుగనే రావలసియుండును. అట్లు చెప్పుటలో, అది అభ్యాసియొక్క ప్రతిక్రియ మాత్రమే అని నా భావము. నీకుగా నీవు ప్రతిక్రియ చేసిననేగాని అంతర్గత అవ్యవస్థను మరియు క్షోభలను క్రమపడునట్లు చేయుట అసాధ్యము. శాంతి, నిశ్చలతలతోకూడిన వాతావరణమును నెలకొలుపుటకు అవి కనీసము తాత్కాలికముగా నిలపివేయబడినవే కాని జీవన పద్ధతులు క్రమబద్ధమై, మెరుగగుట అసంభవము. సరియైన రీతిలో క్రమపఱచుట లోపించి యున్నంతరవకు సమత్వము ఉండదు. అందువలన, పొందికయే యుండదు. అది లేకుండ మనము ప్రకృతిలో నిలువజాలము. మనము ప్రకృతితో సన్నిహితముగ సంబంధమును పొందినప్పుడు మాత్రమే. దాని నుండి వచ్చు పరిశుద్ధము గావింపబడిన వాయువును పీల్చ మొదలిడుదుము. క్రమక్రమముగా మనము దానితో అభిన్నత్వము నొంద నారంభింతుము. ఒక్క మాటలో మనము మనుష్యున కతీతుడైన అసలైన మనుష్యునితో సంబంధ మేర్పరచుకొనినపుడే ప్రతిదియు సాధ్యమై, పొందబడగలదిగ అగును.

ప్రారంభమున జీవితావసరములు పరిమితమై యుండినవి. కాలము గడిచిన కొలది, పరిసరములు ప్రజల జీవమును ప్రభావింప జేసి, తత్ఫలితముగ అవసరములు పెరుగ నారంభించినవి. భౌతిక దృష్టి నుండి ప్రపంచము దినదినాభివృద్ధి చెందుచున్నది. ఆకారణమున క్రమముగ భోగ విలాసములు అవసరముల స్థానము నాక్రమించుచున్నవి. ఒక విధముగ జీవితము పూర్తిగ భోగపరాయణమైనది. ఆకర్షణలు, వ్యామోహములకై మన ఆకలి మఱి మఱి అధికముగను, సాంద్రతరముగను పెరుగుచునేయున్నది. అది నిరంతరము మన ఆలోచనాశక్తిచే మఱింత బలవత్తరమగుచున్నది. ఆ విధముగ వ్యక్తిగత మనస్సు సంపూర్ణముగ చెడగొట్టబడుచున్నది. ఆ కారణముననే అది అత్యధికముగ చంచలమగుచున్నది. వ్యక్తిగత మనస్సు యొక్క అధిక చంచలత మన ఆలోచనల చేతను, చర్యల చేతను వృద్ధియగుచు, తీవ్రమగుట జరుగుచునే యున్నది. ఇది ఆ పిమ్మట మన విధిని రూపొందించును. ఆవిధముగ మనవిధి మనస్సు యొక్క ఈ చంచలతచే నడిపింపబడు చున్నది. వ్యక్తిగత మనస్సు ఇప్పుడు అట్టి స్వభావమున కలవాటుపడి మనలను దాని ఆదేశములనే అనుసరించునట్లు చేయును. ఆ విధముగ మనము పూర్తిగ చెడగొట్టబడినాము. అందువలన ఇప్పుడు మనము వ్యక్తిగత మనస్సును సరి చేయవలసియున్నది. మనస్సు యొక్క అనవసర అత్యాశకెట్టి సంబంధము లేని సరళ జీవిత విధానములను అనుసరించుటయే పద్ధతి. దాని అర్థము జీవనప్రమాణమును తగ్గించుటకాదు; కాని అమితము, అనావశ్యకము అయిన దానిని దాని నుండి తీసివేయుటయే.

---

4. నీకు ధనము కొరతగనున్నప్పుడు వ్యాకులము చెందెదవని వ్రాసియుంటివి. నిస్సంశయముగ నిది బాధాకరమైనది. కాని, దానికి రెండంశములున్నవి. ఒకటి మనుష్యుడు కలత చెంది ఏమియు తోచకుండ నున్నప్పుడు; ఇంకొకటి అతడు విధేయ భావమున నిశ్చలముగను, ప్రశాతముగను ఉండునపుడు. ఇద్దరును కష్టము నధిగమించుటకు ప్రయత్నములన్నియు చేయుదురు. అయినను స్వల్ప భేదమున్నది. ఇద్దరు సేవకులచే పరిచర్యలు చేయబడు ఒకరోగి ఉదాహరణమును తీసి కొనెదము. సకాలమున ఆహారము, ఔషధము నిచ్చుచు, అతని సౌకర్యములనన్నిటిని చూచుచు, వారు అతనికి సపర్యలు చేయుదురు. కాని, అందు ఒకడు అతిన వ్యాధివలన ఎక్కువ ఆంధోళనపడుచు, కలవరము చెందుచు నుండగా, మరియొకడు సంపూర్ణముగా శాంతి, నిశ్చలతలు కలవాడుగ నుండును. నీ అభిప్రాయమున ఆ యిద్దరిలో ఎవరు ఆ రోగికి ఎక్కువ సేవ చేయుచున్నారు? వారిరువురును అతనికి ప్రేమపూరిత హృదయముతో, నిష్కపటముగా సేవ చేయుచున్నప్పటికిని, నిశ్చలము శాంతమునైన మనస్సుతో నుండిన వాడు మఱియొకని కంటెను ఆరోగికి ఎక్కువ సహాయకారి యని నీవు నిశ్చయముగ చెప్పెదవని నేను భావించెదను. నీ గృహచ్ఛిద్రముల సందర్భమున కూడ అంతే. నీవు ప్రశాంతముగను, నిశ్చలముగను ఉన్నప్పుడు వాని పరిష్కార మింకను మేలుగా లభించుట సాధ్యము. మనము భగవదిచ్ఛకు లోబడిన కర్తవ్యభావముతో సదా మన పనిని కావింపవలయున. యధార్థ జీవితామృతము యొక్క రుచిని ఇది నీ కిచ్చును.

– – –

5. కోరిక లేవిధముగ అధిగమింప బడగలవని నీ వడుగుదువు. నాకు గల ఒకే ఒక సమాధానము : "అలంకరించు వాని చేతిలో నున్న శవమువలె భగవంతునకు నిన్ను నీవే అర్పించుకొన ప్రయత్నింపుము." కాని, నీవు నన్నొక పద్ధతిని సూచింపు మనిన నీకొక సులభోపాయమును తెలిపెదను. అది "నీ కోరికలను నీవిగా కాక, నావిగా తలంచుట." నీకిచ్చ వచ్చిన ప్రశ్నను దేనినైనను నన్నడగవచ్చును. నీ హృదయమున కేవలము ప్రకాశమును మాత్రమే కనుగొనుట నాకు సంతోషకరము. భక్తి సాధ్యమైనంత గొప్పదిగ నుండుట అవసరము. నిరంతర స్మరణము హృదయమున దానిని సృష్టించును.

6. సహోదరుడు, పుత్రుడు, పుత్రిక అను భావమున ఎవరిని నీ మనస్సులోనికి తీసుకొనకుండ, ప్రతి యొక్కరి పదవి, వ్యక్తిత్వముల యెడల తగు గౌరవముతో నీ కర్తవ్యమును నీవు నిర్వహింపుమని నేను నీకు సలహా యొసంగిన అందు తప్పేమి యుండగలదు? దప్పిక గొన్న వ్యక్తి నీటిని అది నీరని తెలియకుండగనే తీసుకొనిన, అది అతని దాహమును పోగొట్టదా? ఒకడు దేనిని గూర్చి తలచునో మరియు మాటలాడునో దానిని అతడు ప్రత్యక్షముగ అనుసరించి తీరవలయును. ఉన్నత భావములను ఉపదేశించుచున్నను, ఆంతరంగికముగ తాము అధికులము, గొప్పవారము అను గర్వభావములచే ఉబ్బినవారై దివ్యజ్ఞానమును బోధించు జగద్గురువులవలె అగపడుట కన్ని విధానములను ప్రయత్నించు మహాత్ములను, సాధువులను తఱచు నీవు చూచుచుందువు. వారి యధార్థమైన యోగ్యతను తెలిసికొనుటకు వారి హృదయముల లోనికి నీవు తొంగిచూచినప్పుడు నీకు వారిని గూర్చి ఎట్టి అభిప్రాయము కలుగును? వారియందు గౌరవ భావమును కలిగించున దేదియు నీకు కానరాదనుట నిశ్చయము. హిందీ పదము "మాన్" (స్వాతిశయము) తిరుగబడినప్పుడు

"నామ్" (నామము) అగును. దానితో వారి భౌతిక రూపము తక్షణమే దృష్టికి వచ్చును. ఆ విధముగ వారు భౌతిక రూపమునకే బద్ధులైయుండి, దానివలన మరి మరి వ్యామోహములను, బంధనములను వారికి వారే సృష్టించుకొనెదరు.

మనుష్యుడు సంపూర్ణముగ భగవంతుని వైపునకు తిరిగినపుడు మాత్రమే వైరాగ్యము పొందబడును. అది అట్లయినపుడు మనుష్యుడు సహజముగా తనయందును, తనకు సంబంధించిన ప్రతి వస్తువునందును కూడ అనాసక్తుడగును. ఆవిధముగ అతడు దేహ ప్రజ్ఞనే గాక, ఆ పైన ఆత్మ ప్రజ్ఞను కూడ పోగొట్టుకొనును. అప్పుడు మిగిలి యున్నది "మృతరూపములో నుండుట" లేక ఒక "జీవన్మృతత్వము" తప్ప వేరొకటి కాదు.

అనారోగ్యమును మానసిక అనారోగ్య భావమును వదలివేయుము. నీవు ఆరోగ్యముగ నున్నావని భావింపుము, అప్పుడు మాత్రమే నీవు ఆరోగ్యముగ నుండుటను తెలిసికొనెదవు. ఆరోగ్యముగ నున్న ఒక మనుష్యుడు తాను రోగినని సతతము భావించుచుండిన, అతడు కనీసము అర్థరోగి యగుట నిశ్చయము. దుర్బలత్వమునకు తావీయవలదు. ప్రకృతి యందలి ప్రతి దానిని మనుష్యుడు కలిగియున్నాడు కాని, అతడు దానిని పరిగణనలోనికి తీసుకొనుట లేదు. మానవుడు తన దృష్టిని ధ్యేయము పైననే తప్పక నిలిపి యుంచవలెను. సాదన యొక్క విజయమున కత్యంతావశ్యకమైనట్టి ఆరోగ్య విషయమున కూడ అంతే అయి యుండవలెను. ఒకే సంకల్పము, ఒకే ధ్యేయము, ఒకే మార్గము దృష్టియందుండి తీరవలయును; అది భగవంతునితో సంబంధము కలిగినదై యుండవలయును. ప్రతి యొక్కరు తమ యందావిధమైన ఉన్మాదమును పెంపొందించుకొనవలెను. అప్పుడు మాత్రమే తాను కాంక్షించు దానియొక్క దర్శనమును బహుశః పొందగలడు. తన న్వేషించువాడొక డున్నాడని భగవంతుడు భావించినపుడు అతనిని లోనికి తీసికొనుటకు భగవత్కృప చలితమగును. అన్వేషణ ఆవేదనాపూరిత హృదయముతో కొనసాగిన, అది ఎంత శక్తిమంతమగు ననగా భగవంతుడు తానే అని అన్వేషణలో బయలుదేరును. అతని తీవ్ర అభిలాష తపనాత్మకమైన ఆతురతతో కూడినదై, వారిరువురిని కలిపెడు మార్గమును ఏర్పరచును, భగవత్కృప అతనిలోనికి ప్రవహించుటకు శూన్యతను సృష్టించును. సోదరా, కడచిన కాలము తిరిగి ఎన్నడును రాదు. అని జ్ఞప్తి యందుంచుకొనుము! కావున, ఈ అవకాశమును పూర్తిగ సద్వినియోగము చేసికొన ప్రయత్నింపుము. గురువునకు, తనను తాను సంపూర్ణముగ అర్పించుకొనిన వాడు మాత్రమే ఈ అభ్యాసమునందు విజయవంతుడగును. సంపూర్ణముగ అర్పించుకొనుట యనగా భిక్షకుని స్థితికి తనను తాను తగ్గించుకొనుట. వేరు మాటలలో, అతడు భగవంతుని ద్వారముకడ భిక్షకుడు కావలసియుండును.

7. నా సహజరులను కొందరిని శారీరకముగ చూడవలెనని నేను తరచు నెమ్మది లేనట్లుగా ఆతురత చెందుదును. వారి హృదయమున నా యెడ గల అనురాగ భావ తీవ్రత మూలముననే అది అట్లయి యుండవలెను. ఈ భావము వారి యందు తగ్గినప్పుడు నాయందు కూడ అది స్వల్పముగా తగ్గును. మన ఆలోచన యొక్క ప్రతిధ్వని అయినట్టి మూలమును కదిపి చుట్టునుగల నీటియందు తరంగములను సృష్టించగల మార్గమిదియే. నేను మీ అందరిని గురించిన ఆలోచనయందు మునిగి యుండుట కిష్టపడుదును. ఒక విధముగా నది నేను వివిధత్వము వైపునకు మఱలుటగా అనిపించవచ్చును. సాధారణముగ ప్రారంభమున మనము వివిధత్వము నుండి ఏకత్వమునకు

పోవుదుము. కాని, అంతమున మార్గము మారి మనము మరల వివిధత్వము వైపునకు పయనించ నారంభింతుము. తుదకు మన మెచ్చట నుండి బయలుదేరితిమో ఆ స్థానమునకు మరలి వచ్చెదమని దాని అర్థము. అనంతము వైపునకు మన పయనమున అదే మార్గమును మన మనుసరించుట ఆవశ్యకము. అది ఆరాధన విషయమున అయినను లేక ఇంకే యితర విషయమున అయినను, నిజమున కదియే ప్రత్యక్షమైన ఆధ్యాత్మిక మార్గము. కాని భగవత్కృపచే, ఎవడైనను ఇంకను అతీతముగా వెళ్ళినపుడు అతడు ఏకత్వము మరియు వివిధత్వము ఈ రెండు స్థితులతోను సంబంధమున్న అత్యున్నత శ్రేణికి చెందినవాడై యుండినదే కాని, మూలము యొక్క ఎరుకను కూడ నిలుపుకొనుట కష్టమగును.

– – –

8. కేలవము మరణాంతరముననే సాధ్యమగునట్టి దైవ అనంతమునం దీదులాటను ఎంతో కృపచే ననుగ్రహించిన నా దయామయులైన గురుదేవునికి నేనెంత అధికముగా ఋణపడియున్నాను ! ఆయన యింకను నన్ను దానియందుముందునకు త్రోయుచునే యున్నారు. ఇదేగాక, ఆయన అనంతసాగరమున తను ఈదులాడు మార్గమున తాను పొందినదంతటిని నా కనుగ్రహించిరి. ఏలయన, ప్రతి సందర్భమున ఆరోహణము అంతము లేకుండ కొనసాగుచునే యుండును.

– – –

9. ఈ మార్గమున నా సోదరులకు సహాయము చేయుటకొరకు నే నెక్కువ కాలము బ్రతికి యుండవలసి యున్నదో లేదో నేను చెప్పజాలను. కానీ, ఇది మాత్రము నిశ్చయము : ఎవరైనను తమ అంతిమ ధ్యేయముకొరకేమియు చేయక కాలమును వృధా చేయుచున్నట్లయిన అది పెద్ద తప్పు. నా తదనంతరము నా స్థానమున మీ అందరకును నేను చేయు విధముగనే ఆధ్యాత్మికోన్నతి నిచ్చుటకు ఒకరు నిశ్చయముగ నుండు నప్పటికిని, నా జీవితకాలముననే మిమ్ములను ప్రగతియొక్క అత్యున్నతాగ్రమున చూచుట నా కత్యంత సంతోష మూలమగును.

మీలో కొందరు తమ సోమరితనపు అలవాట్లను అధిగమించుటకు యత్నించుట లేదని తెలిసికొనుటకు నేను విచారించుచుంటిని. ధ్యేయము మీ మనస్సున ఇప్పటికి కూడ గాఢముగ నాటుకొనలేదను నిజము నిది స్పష్టముగ సూచించును. అది మీ దృష్టియందు ప్రధానముగా నున్న యెడల, ఈ విషయమున మీరు మీ కర్తవ్యమును తప్పించుకొనుటయును అసాధ్యము. మార్గమునగల అవరోధములు కొన్ని, పెడదారి పట్టిన మీ స్వీయ చర్యలవలననే ప్రత్యేకముగ సృష్టింపబడినవి. కాని మీకు మనఃపూర్వకముగ మీ ధ్యేయమునందే శ్రద్ధయుండిన, ఈ విషయములు నిశ్చయముగ వాని యంతట అవియే కరిగిపోవును. మీరు నన్ను హృదయపూర్వకమైన ఉత్సాహ బలముచే దానికై ప్రేరేపించినట్లయినచో నేను కూడ మీ కీ విషయమును సహాయకరముగ నుండవచ్చును.

– – –

10. ప్రజలు తమ దురభ్యాసములను అధిగమించుటకు ప్రయత్నింపరు. ఏలయన వారప్పుడు ప్రయాసకు, లేదా స్వల్ప అననుకూలతకు లోను కావలసియుండును. సరకు చేయవద్దు. అది అట్లే ఉండనిమ్ము. వారి ధ్యేయ సిద్ధికై వారు సరియగు మార్గము ననుసరించుచు, దాని కొరకు

తీవ్ర ఆకాంక్ష కలిగినప్పుడు, ఈ విషయము లేవియును వారి మార్గమున కవరోధములుగా నిలువకుండ ఎండుటాకులవలె రాలిపోవును.

– – –

11. అనేక మారులు ప్రజలు తమ శారీరక రుగ్మతలను నేను గమనించి, వానిని కుదుర్చుటకై నాసంకల్ప శక్తిని ప్రయోగింప వలయునని అపేక్షించెదరు. ఇంతియేగాక, వారి స్నేహితులు, బంధువుల విషయములను చేపట్టుమని వారు నన్ను ప్రోత్సహింతురు. స్వాభావికముగ నేను అతిమర్యాద కలిగినట్టి వాడనగుట చేతను, ఉపకారశీల ప్రకృతి గలవాడ నగుట చేతను నాకష్టములను, ప్రయాసలను లెక్కచేయక వానికి పూనుకొనెదను. నా సహచరులలో ఎవరిదైనను శారీరక బాధను గూర్చి వినుట జరిగినప్పుడు, సహజముగా నేను కనీసము వారి ఉపశమనము కొరకైన స్వల్పకాలము నాగమనము వారి పైకి పఱపెదను. కాని ఎవరైనను అతని రోగనివారణకై సూటి విన్నపముతో నాదరి చేరినట్లైన అధికశ్రమ ప్రయాసలను లెక్కచేయక నాశక్త్యానుసారము అతనికి సహాయము చేయుటకు నేను బద్ధుడనైతినని భావింతును.

నాయెడల వారికి అధికప్రేమ భక్తి భావములు కలవని అనుకొనుట చేత వారు నానుండి ఇటువంటి సేవను కోరుటకు బహుశః ప్రోత్సహింపబడుదురు. ఇది ప్రాపంచిక లాభముల పొందగోరు వారి అభ్యర్థనల విషయమున వారికి ధైర్యమును కలుగజేయును. బహుశః ఆకారణముననే తమ శిష్యులతో మితభాషులుగ నుండవలయునని గురువులు సాధారణముగా సలహా యివ్వబడుదురు. వాస్తవమునకు ప్రపంచమున ప్రతియొక్కరును కష్టముల ననుభవింపవలసినదే. అవి నాకుకూడ యుండినవి; ఇప్పుడు కూడ నాకవి అనేకములున్నవి. నా గురుదేవుని జీవితకాలమున కాకష్టములను వారికి చెప్పుకొని యున్నను, నేనెన్నడును వారి నివారణమును స్వల్పముగా నైనను కోరలేదు. ఇది నాయందు భక్తి కొరత అగుటవలన అయియుండవచ్చును. నా సహచరులకు గల భక్తితో పోల్చిన నా భక్తి తక్కువ అయి యుండవచ్చును. ఏది ఎట్లయినను అది ఈనాటికి కూడ కొనసాగుచునే యున్నది. ఒకవైపు నుండి కాకున్న మఱియొక వైపునుండి ఈ రకమైన కోరికలు నాకు విడువకుండ వచ్చుచునే యున్నవి.

నాకు గల అడ్డంకులను గూర్చి చెప్పవలయునన్న, దీనియంతటితో పాటు నా అధీనమునకు అప్పగింపబడిన స్వీయ కర్తవ్యమైన ప్రకృతి కార్యమును నిర్వహించుటయందుకూడ నేను శ్రద్ధవహింప వలసియున్నది. అదిమాత్రమే గాక నాసహచరుల యొక్క ఆధ్యాత్మిక శిక్షణను కూడ గమనింపవలసి యున్నది. నాస్థానమున నున్న వానికి అది ఏమంత తక్కువ ప్రయాసకరమైన కార్యము కాదు. అందువలన అంతటి శ్రమను తట్టుకొనుటకు నా హృదయము, మెదడు అసమర్థములని నేను తెలిసికొంటిని. ఇంతేగాక, నాపై బలవంతముగ విధింపబడిన ఈ అనావశ్యక అంశము, నా కప్పగింపబడిన ప్రకృతి కార్యమునకు తీవ్ర అవరోధమును కలిగించును. తత్ఫలిగముగ నది తీవ్రముగ నష్టము నొందుచున్నది. శారీరక రుగ్మతలను నివారించు వైద్యులనేకులు తమ చుట్టును నుండగా ఆ రకమైన సేవను నానుండి వారేలకోరవలసి యున్నదో నేనర్థము చేసికొన జాలకున్నాను. అట్టి రోగములకు చికిత్సచేయు వైద్యుడు తన పరిశ్రమకు విశేషమైన ప్రతిఫలమును పొందును. కాని, జనుల నుండి నాకు ప్రతిఫలముగ వారి ఆలోచనను భగవంతుని వైపునకు లేశమేని మరల్చుట యైనను నేను కలిగి యుండలేదు. కాలాంతరమున అది వారి స్వీయ ప్రయోజనమునకే అయి యుండెడిది.

అందు నింకొక ఇబ్బంది కూడ కలదు. అది సభ్యుల సంఖ్య పెరుగుటతో బాటు వ్యాధి నివారణ కార్యము కూడ తీవ్రముగా పెరుగు నవకాశముండి, దాని ఫలితముగ కొన్నాళ్ళకు ఈ అవసరమును తీర్చుట దాదాపు అసాధ్యము కావచ్చును.

– – –

12. కేవలము రాచఠీకపు దుస్తులే ఒకనిని నిజమైన రాజుగ చేయలేవనునది మనకు తెలియును. అట్లే, ఒకనిని నిజమైనట్టి మహాత్మునిగను లేక యోగిగను చేయగలవి వాని రూపము లేక దుస్తులు కావు. బాహ్యమైనట్టి భౌతిక లక్షణములు లోనున్న హృదయము యొక్క నిశ్చితమైన చిహ్నములు కావు. యథార్థమైన ప్రేమభావముతో ప్రేరితుడైనవాడు మాత్రమే హృదయమున్న వ్యక్తిని గుర్తింపగలడు. సాధనయందెవ్వని సాంగత్యము అత్యధిక ప్రయోజనకారి యగునో అట్టి వ్యక్తి ఎట్టి వానిగ నుండవలయును? నిశ్చయముగా నతడు తాను గురువు ననెడి భావమును బొత్తిగా లేనివాడై యుండవలయును. ఆత్మ ప్రాధాన్యము, గర్వము అను భావములను అతడు ఏమాత్రము లేనివాడై యుండవలయును. అతడు సంపూర్ణముగ భగవత్ప్రేమయందు మునిగినవాడై యుండవలెను. దాని ప్రభావము అతనినుండి దానంతట అదే అతని సమీపమున నున్నవారిని కప్పివేయునంతగా వ్యాపించవలెను. దురదృష్టవశమున, ఏదియు సాధింపకయే ప్రపంచములోనికి గురువులుగ వచ్చి, ఇతరులు అనుసరించుటకు విధానములను, అభ్యాసములను నియమించువారు ఈనాడున్నారు. వీరియందు హిందూసమాజమున ఉన్నత వర్గముగ పేర్కొనబడు దానికి చెందినవారు కూడ కలరు.

నా వ్యక్తిగతానుభవమును బట్టి, వారిలో పెక్కుమంది హృదయములందు పాషాణమువంటి ఘనత్వము ధృఢముగా పాతుకొనిపోయి యుండుటను నేను కనుగొంటిని. వారు సాధారణముగ విగ్రహములు మరియు ప్రతిమల ఆరాధనకు గాఢముగా నంటిపెట్టుకొని యున్నవారు. కొన్ని సందర్భములలో వారిచే అభ్యసింపబడిన ధ్యానము లేక ఏకాగ్రత యొక్క తప్పుడు విధానముల ఫలితముగ ఎక్కువగ ఏర్పడు విచిత్రమైన ముడుతలను, గీతలను వారి హృదయములందు నేను కనుగొనియుంటిని. ధ్యానమున కత్యంత యోగ్యములైన బిందువులేవన ధార ఎచ్చటనుండి ఊర్ధ్వ ముఖముగను లేక అధోముఖముగను ప్రవహించునో అవి మాత్రమే. అవి హృదయము లేక త్రికుటి (కనుబొమ్మల మధ్య కేంద్రము) మాత్రమే అగును. నాభి బిందువుపై ధ్యానము చక్కిలిగింత భావమును కలిగించి, చివరకు మనస్సును ప్రేరేపించి, ఉద్రేకములను మరింత బలపరచుట తప్ప దానియందు ఏ ఆధ్యాత్మిక ప్రయోజనము లేదు.

– – –

13. వాస్తవమునకు మనమందరము గురుదేవుని వాకిలి వద్ద చేత భిక్షాపాత్రను కలిగియున్న భిక్షకులవంటి వారము. గురుదేవుడు ఆ పాత్రను సత్వరమే నింపును. కాని, ఆ పాత్ర ఇదివరకే ఆధ్యాత్మికతకాని ఇతర వస్తువులచే నింపబడియుండిన ఆయననుండి దేనినైనను పొందుటయను ప్రశ్న ఉత్పన్నమే కాదు. ఏలయన, దానియందు దేనినైనను పోసిన అది ఒక్కసారిగా బయటకు పొరలిపోవును. అందువలన, గురుదేవుని కృపచే నింపబడుటకు వీలుగా వీని నన్నింటిని విడిచి మనలను ఖాళీగా నుంచుకొనుటయే మన ప్రథమ కర్తవ్యము.

కాని, నా హెచ్చరిక అంతటిని ఎవ్వరు గమనింపకుండయుండుటను చూచుట శోచనీయకర విషయము. అంతమాత్రపు సామర్థ్యమును వారియందు పెంపొందించుకొనుటకు ప్రయత్నించు వారెవ్వరును లేనట్లు కనబడుచున్నది. వాతావరణమంతయు అత్యంత బలమైన భగవచ్ఛక్తితో ఎక్కువగా నింపబడియున్నది. ముక్తి ఎన్నడైనను అంత సులభమును, చవుకయు కాగలదా? ఇతర విషయములు, భావములు అన్నిటిని ప్రక్కకు నెట్టి ప్రతియొక్కరు తమ సంపూర్ణ గమనమును దానికి మాత్రమే ఈయవలసిన సమయమిదియే అనుట నిశ్చయము. మీ కర్తవ్యము బాధ్యతలతో బాటు ప్రతిదానిని నిరాకరించి ప్రాపంచిక జీవితమును వదలివేయుడని మిమ్ములను ప్రోత్సహించుట నా భావము కాదు. ఈ సమయమును మీకు సాధ్యమయినంత అత్యుత్తమముగ నుపయోగించుకొనుచు, గురుదేవునికి సమర్పించుకొనవలయునని చెప్పుట మాత్రమే నా భావము. గురుదేవుడు మీ ఆధ్యాత్మికోన్నతికి కావలసిన నిజమైన భావములతో మిమ్ములను పూరితులను చేయుచు, మీకు తెలియకుండగనే కూడ మీ కెంతయో చేయును. కాని, అప్పుడు మీనుండి కూడ యధార్థమైనట్టి ప్రతిస్పందన ఉండవలయును. ఆయన మిమ్ములను పైపైకి నెట్టునట్లుగ చేయుటకు తీవ్ర భావమును ఆయనయందు కలుగచేయవలయును. ఈ ఉద్యమమున యధార్థమునకు నీ పాత్ర అంతియే. దానికి నీవు తీవ్ర ప్రేమ. భక్తులను పెంపొందించుకొన వలసియున్నది.

– – –

14. స్వప్రతయ్నముచే అత్యున్నతారోహణమును పొందినారని సంతోషకరమైన వార్తను ఎవ్వరును తెచ్చునటుల కానరాదు. ఎక్కువ భాగము వారికొరకు నేనే ప్రతిదియు చేయవలసియున్నది. వారిని మార్గమున ఉంచుట, దైవకృపచే ప్రోత్సహించుట, వారిని శుద్ధము చేయుట, పైకితీసికొని పోవుచు అత్యున్నత స్థాయిలందు నిలిపియుంచుట. ఇది అంతయు దేనివలన అయియుండవచ్చును? ఇది వారినందరిని అత్యంత స్వల్పకాలమున అత్యున్నత స్థానమున చూడవలెనని నాకు గల అపరిమిత ఆతురత వలననే అయియుండవచ్చును. ఈ భావము యొక్క ప్రభావమున నే నెల్లప్పుడును వారికిగల సామర్థ్యమునకు మించి, ఆకలి మాంద్యము కలుగుమేరకు కూడ, ఆధ్యాత్మికాహారము నిచ్చెదను. తత్ఫలితముగ, ఆ పై ఆకాంక్ష కొంతకాలము తగ్గి యుండును. కాని, దాని యంతటితో కూడ, అభ్యాసియందు ఉండవలసినట్టి ఆసక్తి, ఉత్సాహములు లోపించిన వనుటను కాదనలేము.

---

15. నియమితకాలమున ధ్యానమునకు కూర్చుండవలెనను నీ కోరిక ప్రబలమై వృద్ధియగుట నాకు సంతోషకరముగ నున్నది. ఇది నిస్సందేహముగ ఉత్సాహము కలిగించు గుర్తు. కాని ప్రియ సోదరా, నీవు నన్ను అలక్ష్యము చేతువని నేననుకొనుట లేదు. నన్ను వీడకుండుటకు నీ మనస్సును ధృడము చేసికొనినచో, నేను ఎల్లప్పుడును నీ ప్రక్కనే యుండుటను నీవు కనుగొనెదవు. సకాలమున అది నీ అనుభవమునకు రాగలదు. నీ ఆలోచనలను, భావములను ఆహ్వానింపబడని అతిథులుగా భావింపుము. అప్పటికిని అవి నిన్నింకను బాధించినచో అవి నావియని, నీవి కావని మాత్రము తలంచుము. ఈ విధానము గొప్ప ప్రయోజనకరము. ఆశించిన ఫలితము నిచ్చుటలో ఎన్నటికిని విఫలము కాజాలదు. దీని ఫలితములను దయచేసి నాకు తెలుపుము. ఆలోచనల నొక్క క్షణములో నిలిపి వేయుట సాధ్యమే కాని అది మనకు ప్రయోజనకరమైనట్టిది కాదు. ఏలయన ముక్తిని

పొందుటకు పూడ్చబడిన ఆలోచనలను వాని 'భోగము' పూర్తి అయిన పిమ్మట బయటకు నెట్టివేయుట ఆవశ్యకము.

"నా దుఃఖపూరిత ఆక్రందన మీ జాలిగుండెను కదలించునని నే నాశించెదను", అని నీవు చెప్పితివి. నా గురుదేవుడు ప్రపంచమునందలి దుఃఖములకు నన్ను గురిచేసినారు. నేను దానికోసమే కనీసమొక్కరినైనను తయారుచేయ నిష్టపడుదునని మాత్రమే నేను దీనికి సమాధానముగ చెప్పవచ్చును. నీ వెంతకాలమైనను ధ్యానము చేయవచ్చును. కాని, ఎట్టి మానసికమైన అలసట ఉండరాదు.

16. నీ జీవితమునందలి సంఘటనలను వర్ణించుచు, నాకు తీరిక లేకుండిన నికపై దానిని చదువ వలదని నన్ను కోరి యుంటిని. దానికి సమాధానముగ, నా స్వీయ సృష్టి నుండి నేను తీరికను పొందితిని గాన నాకు సరిపడు నంత తీరిక గలదని చెప్పుదును. అందుచే నిప్పుడది సంపూర్ణముగ నీదే. నీవు వివరించినట్టి సంఘటనలు జీవితమున సామాన్యముగ సంభవించునట్టివి. కాని, అంత్యదశకు చేరినప్పుడు పూర్వ చింతలన్నియు ఒక్క క్షణమున అదృశ్యమగును. అందువలన, మనదృష్టి అన్ని పరిస్థితులందును ధ్యేయము లేక గమనము వైపునకే త్రిప్పబడి యుండుట శ్రేయస్కరము. భగంతునని కృపవలన నిప్పుడు నీవు దానివైపునకు మొగ్గి యున్నట్టుల కనపడుచున్నది. ఇది యింకను బలపడవలెను. వెనుకటి తన్నులు విద్యార్థిని సరియగు మార్గమునకు తీసికొని వచ్చుటకు ఉపాధ్యాయుని దండనగా అనుకొనవలెను. వానికి మనము కృతజ్ఞులమై యుండవలెను. నిన్ను నేను అధ్యాత్మిక జీవితములోనికి తీసికొని రావలసియున్నదని నేననినట్లయిన అది అంత సరికాకపోవచ్చును, ఏలయన తీసికొని రావలసిన ప్రశ్నయేలేదు. మనము సత్యతత్త్వమునందు స్థిరపడుటను మాత్రమే చేసికొనవలసియున్నది. నీ సంకల్పము ఇప్పటికే అభ్యాసమునందు నీకు సహాయముచేయుచున్నందులకు భగవంతునికి ధన్యవాదములు. నిశ్చయముగా నిన్ను మార్గమున నిలిపియుంచుటకు సామాగ్రిని నీవిప్పుడు సేకరించి యున్నావు. వేరు మాటలలో, లక్ష్యమును నీదృష్టిలోనికి తెచ్చుకొంటివని నేను చెప్పవచ్చును. ఇప్పుడు లక్ష్యమును గురిచూసి బాణమును వేయుట మాత్రమే – సంకల్పము బాణముగను, హృదయము విల్లుగను అగును. కాని, అదే సమయమున దానికై శక్తిని ప్రయోగించుట అవసరమగును. అది గురుదేవుని సహాయరూపమున కలదు. నీ విప్పుడు గమ్యమును, మార్గదర్శిని కూడ తెలిసియున్నావు. నీ సంకల్పమును దానితో దృఢముగ చేర్చుటయే తప్ప ఇప్పుడు చేయవలసనదేమియు లేదు. ఈ సంబంధము బలముగా వృద్ధియగునపుడు, ఎవరు సంబంధము కలిగియున్నారు, దేనితో అనునది తెలిసికొనుట అసాధ్యము. దేహ ప్రజ్ఞపోవును, జీవశక్తిగా పిలువదగిన అసలు వస్తువు మిగిలియుండును. దీనికి పద్ధతి పైన చెప్పబడినట్టిదే అగును. లక్ష్యమును తప్పక భేదించుటకు నిశ్చయపరచుటకు గురువు సహాయము తప్పనిసరి. దీనికొరకు శారీరక గుణముల గుఱుతులు పడకుండ తప్పించుకొనుట కూడ అవసరము. ఇది జరిగిన పిమ్మట క్రొత్త సంస్కారములు ఏర్పడుట నిలిచిపోయి, అవి క్రమేపి వృద్ధియగుట అంతమగును. దీనినుండి తెగద్రెంపులు చేసికొని దానితో నిన్ను కలుపుకొనుటయే కేవల పరిష్కారము. దీనికి గల ఒకే ఒక పద్ధతి నీ కిదివరకే చెప్పబడిన ధ్యానము. నీ సాధనను నీవు క్రమపద్ధతిని సాగించెదవని ఆశించెదను. నా సేవలకు సంబంధించినంత వరకు, నాకు సాధ్యమగు దానిని చేయుటకు నేను సదా సిద్ధముగా నున్నాను. నా గురుదేవులు మీ అందరికొరకు నాకప్పగించిన ఆస్తిగా నేను కలిగియున్న దానిని మీ అందరికి

పంచిపెట్టుటకు నేను ఎల్లప్పుడును సిద్ధముగా నున్నాను. దాని నంతటిని మీరు తీసికొని పోవుటకుగాను మిమ్ములను సమర్థులుగ చేయుటలో నా సేవల నంగీకరింపుడని, అంతేకాదు, అత్యున్నత సేవ చేయుటకు నన్ను నిర్బంధింపుడని నేను మిమ్ముల నందరిని మనఃపూర్వకముగా నర్థించుచున్నాను. నన్ను శారీరకముగా చూచు అవకాశము నీకు లభింప నంతవరకు నేనప్పుడే నీతో అచ్చట ఉంటినని భావింపుము. తన్మయతా స్థితిని నీలో వృద్ధి చేసికొనుటకిది నీకు సహాయపడును.

17. నీ లేఖ నా కత్యధిక సంతోషమును ఇచ్చినది. ఈ అల్ప వ్యక్తిని గూర్చి ఎవరో యొక ప్రేమికుడు స్మరింప నారంభించినట్లు నేను భావించెదను. ఏమైనను ఇది నాకు స్వల్ప విషయము కాదు. నేను నీకు చేయు సేవలు నీ హృదయమున తీవ్ర ఆతురతను వృద్ధిచేయునట్టి స్వభావము కలిగినవై బహుశః ఉండవచ్చును. కాని నీవు, నేను ఇరువురము దానికొరకు వేచియుండ వలసినదే. ప్రశాంతత హృదయమునుండి హృదయమునకు ప్రసారితము కావింపబడును. నీవు ధ్యానము నింతవరకు ప్రారంభింపకుండిన దయయుంచి ఇప్పుడు ప్రారంభింపుము. భగవంతుడు నిన్ను ఆశీర్వదించు గాక ! నా గురించి ఎక్కువగా నీకు నేను చెప్పదలచుకొనలేదు. ఏలయన, కేవలము చెప్పుకొనుటయే మన్సూర్‌ను ఊరికంబమునకు పంపినది. ఆరోజులు ఇప్పుడు లేకుండినను, జనులు సంకుచిత దృష్టితో నన్ను అంచనావేయ నారంభించు అవకాశము కలదు. నీ హృదయపు త్రాసులో నన్ను తూచి సత్యమును తెలిసి కొనెదవని నేనాశించెదను. ప్రియమైన సోదరా, లేఖలలో వ్యక్తము చేసిన నా అభిప్రాయములను నీవు హృదయములోనికి తీసికొంటివి. వానిని రచించిన వ్యక్తిని అలక్ష్యము చేయుట విచారకరము కాదా? నీవు సంకల్పము నేర్పరచుకొనినంతనే, దానినుండి కార్యము దానంతట అదే ప్రారంభమగును. ప్రార్థన చేయుము. దానియందు మునిగియుండుటకు ప్రయత్నింపుము. అది ఎంతవరకనగా భిక్షాపాత్ర మాత్రమే చేతి యందుండి భిక్షమెత్తుట కూడ తెలియని స్థితిలోనికి పోవనంతవరకు. అట్టి స్థితిని నీవు సృష్టించుకొనినచో. నీ ప్రార్థన ఎన్నడును అలక్ష్యము చేయబడదు. ప్రేమతో ఏడ్చుటను మరియు దుఃఖించుటను అభ్యాసము చేయుము. అది నిజముగా లేకుండిన కృత్రిమము గానైనను చేయుము. ఇది చేయుము, ఫలితము చూడుము.

– – –

18. సంస్థకు సేవ చేయవలెనను సంకల్పము నీ హృదయమున ప్రముఖమగున్నదని తెలసికొనుటకు నేను మిక్కిలి సంతోషించెదను. ఈ సంకల్పమే తుదకు నీ ఆధ్యాత్మిక ప్రగతి వృద్ధియగుటకు తోడ్పడును. నీవొక నదిని గూర్చి భావించినంత మాత్రముననే నీ హృదయము దాని ఆహ్లాదకరమైన చల్లదనము ననుభవింప మొదలిడును.

నిర్దేశించిన విధముగా నీవు ధ్యానము తప్పక చేయవలెనని నేను చెప్పుదును. కనీసము స్వల్పకాలమైనను చేయుము. అది కూడ ప్రయోగము కొఱకు మాత్రమే. నీవు మరేదియు చేయలేక పోయినట్లయిన, అప్పుడు నీ మనస్సున నేనే (రాంచంద్ర) నీ ఆలోచనలో మునిగియున్నానని మాత్రము ఊహింపుము. నీ తీరిక గంటలందును, మరియు నడచు నప్పుడు లేక శారీరక కార్యమేదైనను చేయునప్పుడు ఇది చేయుము. ఇది పూజకాదు. ఆచార నిబద్ధమైన విషయము కాదు. శారీరకమైన సంస్కార ప్రభావముల నుండి హృదయమును విముక్తిచేసి యుంచుటకును, మరియు ఇంద్రియములను

వాని లక్ష్యము నుండి మరల్చి అంతర్ముఖముగా ఆకర్షించుటకును గల విధానమును నీవు తెలిసికొన గోరుచున్నావు. దీనికి సమాధానముగా, ధ్యానము మాత్రమే ఈ విషయములన్నిటికిని సరిపోవునని నేను చెప్పవచ్చును. సంకల్ప శక్తిచే స్పృశింపబడిన మాత్రముననే అపేక్షించిన స్థితిని ఒక్క క్షణముననే సృష్టింపగల కొన్ని బిందువులు కూడ శరీరముననున్నవి. ఆ పద్ధతులను ప్రయోగించుటకు అవసరమైన స్థితులను నీవు నీయందు సృష్టించుకొనవలెనని నే నపేక్షించెదను. లేనియెడల, ఈ అపరిపక్వ దశయందు అది అపాయకరమగును. ఈ పద్ధతులు ఉన్నత ప్రగతినొందిన సాధకులందును మరియు ప్రత్యేక సందర్భములందును మాత్రమే, తగిన ముందు జాగ్రత్తతో, ఉపయోగింపబడగలవు. అట్టి పద్ధతులచే మనుష్యుడు అసలు స్థితిని ఒక్క క్షణములోనే తిరిగి పొందగలడు. దీనినంతను కేవలము వినోదముగా వివరించితిని.

---

19. మహాపురుషుల దర్శనము కావలయునని నీవు కోరుట మంచిది. నీ ఆత్మదర్శనము కలుగుటకు మాత్రమే ప్రయత్నించుట యింకను మంచిది కాగలదు. తక్షణమే మూల స్వరూపము కావలయునని నీవు కోరుటలేదని అంటివి. ఏలయన, అది అశాశ్వతమైనది కావచ్చు ననుభావము వలన, మంచిదే. దీనిని నాకు వదలివేయుట యింకను ఉత్తమము! సామాన్య నియమమున ఆధ్యాత్మిక యాత్ర దశలవారీగా, ఒకదాని తరువాత నింకొకటి, నిర్వహించబడుచు పూర్తి చేయబడును. నేను నీ సామర్థ్యమును గణనలోనికి తీసికొనుట అలక్ష్యము చేసినట్లైన, తగినట్టి శిక్షణను నేను ఎట్లీయగలవాడను? దయచేసి అధైర్యము చెందకుము. గృహమును, సంసారమును త్యజింపవలసి యుండుట, ప్రాణాపాయముండుట అను ప్రశ్నయే లేదు. నిన్ను నీవు సమర్పించుకొంటివని చెప్పుచున్నాను. కాని నీవు దానిని సంపూర్ణముగ చేయుచుంటివో లేదో నీకు సంశయముగ నున్నదని మరల చెప్పుచుంటివి. అది సందిగ్ధముగా నున్నది. నీవు సమర్పించుకొనినపుడు సంశయమున్న ప్రశ్న ఏవిధముగాను ఉత్పన్నము కాదు. కావున దయయుంచి సంశయపడుటను వదలివేయుము. అభ్యాసి మనస్సున సహకార భావము ఉద్భవించినప్పుడే అతడు సమర్పణయొక్క తొలిదశకు చేరినాడు. దేనినైనను నిర్ణయించుకొనుటకు కావలసిన ధైర్యమును కలిగి యుండుము. దృఢ సంకల్పముతో అడుగిడుము; నీ విజయము నిశ్చయమగును. నీ ప్రాపంచిక బాధ్యతలు నీ మార్గమున అవరోధమని అనుకొనుచున్నావు. కాని, అది తీవ్రమైన పొరబాటు భావము. మన మీ రెండు భాగములను, అనగా ప్రాపంచికము మఱియు పారమార్థికము, ప్రక్కప్రక్కనే జతగ తీసికొని సాగవలయును. ఈవిషయమున నా గురుదేవు లొక ఆదర్శము. నేను కూడ వారి అడుగుజాడలనే అనుసరించుచున్నాను. వైరాగ్యమనగా, కర్తవ్యమును ఏ విధముగను నిర్లక్ష్యము చేయుటయని అర్థము కాదు – అది ప్రపంచ విషయమున కానిండు లేక భగవంతుని విషయమున కానిండు.

---

20. ఒక నాట్య ప్రదర్శనలో కీలు బొమ్మలవలె మనము ఆడుచుంటిమి. దానిని మనము మాత్రమే ఆనందించుచున్నాము. దాని ఆకర్షణలలో మనమెంత మునిగి మైమరచిపోయితి మనగా దానియందే మనము గట్టిగా తగులుకొనియుంటిమి. బయటపడవలెనను భావము ఎప్పుడైనను కలిగినట్లయిన, ఆ చిక్కుకొనుట మనలను అతిగా నిర్బంధించు బంధనమగును. దానినుండి బయల్పడవలెనను

ఆకాంక్ష ఎక్కువైన కొలది, దాని పట్టు మనపై మరింత బిగువై మన యత్నములన్నియు నిష్ఫలము లగును. ఆ రమ్యమైన వినోదము మన దృష్టిని దానినుండి మరల్చుటకు సమ్మతింపదు. సాధ్యము కాగల ఒకే ఒక బయటపడు మార్గమేమన దాని మూలకారణమును దృష్టియందిడుకొని దానిని పరమార్థముగా భావించుటయే. దాని మూలమును పలుమాఱు మన ఆలోచనలోనికి తీసికొనినప్పుడు, అదే భావము మన హృదయమున స్థిరపడును. దీనిని స్మరణగా తీసికొనవచ్చును. కాని, అది మూలముతో కలుపబడినది. కావు, మన ఆలోచన పరమార్థము వైపునకు పయనించును. ధ్యానాభ్యాసముచే దీనిని మనము వృద్ధి చేసికొందుము. మనము అట్లు చేయుట ఆరంభించినపుడు మూలమునుండి సహాయము క్రిందికి ప్రవహించును. దానితో నీవే సంబంధము నేర్పరచుకొనిన యెడల బాహ్యాకర్షణలు వాని యంతట అదే మాయమగును. నీవు అభ్యాసము చేయుటకు మనస్సులో తీర్మానించుకొనియుండుట మంచిదే, కాని అది నెరవేరుటకూడ నీ పైననే ఆధారపడియున్నది. నీవు ఆ సత్య వస్తువుయొక్క గాఢముద్రను లోనికి తీసికొనినట్లయిన, ధ్యానము తాను గానే ఆరంభమై తీరును.

నీవు పూజను ప్రారంభించినందులకు భగవంతునికి ధన్యవాదములు. అట్లు గాకుండిన అది నా స్వీయ లోపముగా నేను భావించియుండెడివాడను. ధ్యానములు నీవు ఆరంభించినప్పుడు, "నీటిబుడగ యొక్క కన్ను నీటి ముఖమును త్వరలోనే చూచును" అని నా విశ్వాసము.

భగవంతుడు నీకు పట్టుదలను, నిలకడను ప్రసాదించుగాక ! ఏదో యొక విశేష శక్తి నీ దేహమును అధీనములోనికి తీసికొని, ఇతర శక్తులనన్నిటిని ప్రక్కకు త్రోసివేయును, నీచే అభ్యాసమును చేయించుచున్నదని చెప్పుదువు. భగవంతుని దయవలన నా ప్రాణాహుతిని గ్రహింప మొదలిడితిని. నా ప్రార్థన ఇప్పుడు ఫలప్రదమగుచున్నదని నిరూపితమగుచున్నది. నీ ప్రగతికి ఇది ఒక మంచి చిహ్నముగా భావింపవచ్చును. అది అట్లయినపుడు, తన్మయత్వ స్థితిని మరియు తేలికగ అయితినన్న అనుభవమును రుచి చూడకుండుటకు కారణము కనబడుట లేదు.

ప్రాణాహుతి ద్వారా అభ్యాసి దేహమున వ్యాధులు ఎన్నడును ప్రవేశింపవను విశ్వాసముతో నుండుము. ఇది నా అనుభవము. నా గురు దేవుని అనుభవము కూడ. అట్లు కాకుండ, కొన్ని వ్యాధులు నిర్మలీకరణ ప్రక్రియ ప్రభావముచే బయటకు తప్పక పోవునని అనేకమార్లు అనుభవమునకు వచ్చినది.

---

21. తత్త్వశాస్త్రమును గూర్చిన నీ ప్రశ్నకు నేను ఇచ్చుట క్లుప్తముగా సమాధానము నిచ్చుచుంటిని. సామాన్య నియమముగా, ప్రతియొక్క క్రియ, అది దైహికమైనను, మానసికమైనను, ఏదో ఫలితమును – మంచిదైనను, చెడ్డదైనను, ఏమైయుండినప్పటికిని – కలిగించి తీరవలయును. పంచేంద్రియము లపై దాని ప్రభావము నిశ్చయముగా నుండునని దాని భావము. మానసికానందము సూక్ష్మతరమగుకొలది దాని ఫలితము మరింత తక్కువగానుండును. తత్ఫలితముగా దాని బంధముకూడ మరింత మృదువుగ నుండును.

22. నిన్ను నా వానినిగ చేసి, ప్రత్యేకముగా నా వానినిగ మాత్రమే గైకొనుమని నన్నర్థించితిని. దానిని చేయుటకే నేను ప్రయత్నించుచుంటిని. నేను నీ వాడనుగా నున్నప్పటికిని, నీవు యధార్థముగ నా వాడవుగా కావలెనని – అనగా ప్రతియొక్క క్రియకు ఏది అంత్యమో దానినే నీ వనుభవింప

కోరుచుంటివని చెప్పవలయును. ఇది ఎట్లున్నదనగా "నేను మొదటి మిల్టన్, షేక్స్పియర్‌ల భావముల నర్థము చేసికొనినిండు. ఆ పిమ్మట అక్షరమాలను నేర్చుకొన యత్నించెదను" అని ఒక పిల్లవాడు చెప్పునట్లును, లేక "నేను మొదట భగవంతుని సాక్షాత్కరింపజేసికొనినిండు, ఆ పిమ్మట ఆయనను పూజింప మొదలిడుదును" అని ఒక అభ్యాసి చెప్పినట్లును ఉండును. నీ వన్వేషించు వస్తువు నీకు లభించినపుడు నీవేల సాధన చేయవలెను? తాను తక్కువస్థితి యందున్నానను దానిని గుర్తించినవాడు మాత్రమే ఉన్నతిని ఆరోహింపగలడు. "నాకు నిజమైన అనుభవము కలుగ కుండినట్లైన, నాకు పూర్తి విశ్వాసమున్నదని చెప్పజాలను" అని నీ స్వీయ ఆలోచనా సరళికి అనుగుణముగా నీవు చెప్పుట సవ్యమేకావచ్చును. దీనికై, నీవు దేని నన్వేషింపదలచితివో దాని యధార్థ అనుభవమునకై, ఆవశ్యకములైన విషయములను దయయుంచి నీయందు సృష్టించుకొనుము. నీకు నిస్సంశయముగా భగవత్కృపయందు విశ్వాసము కలదు. కాని అట్టి స్వల్పమైన నమ్మకమువలన ప్రయోజనము లేదు. అది ఏ విధముగను కృప యనికూడ అనబడదు. పరిపూర్ణుడైనట్టి గురువు అధీనమునకు వచ్చుటయే భగవంతుని కృపయని నేను భావింతును. నీ ప్రయోజనము కొరకై ఆయనను కార్యమునకు కుపక్రమించునట్లు చేయుట నీ అనుగ్రహముపై నాధారపడియున్నది. ఎట్లయినను, ఆయన కృప. కార్యరూపము దాల్చినదా లేదా యని గమనించి చూడుమని నేను నిన్నర్థించెదను. తగినంత అభ్యాసము లేకుండ, నీవు ఆయన ఇచ్ఛను నీ వైపు లాగుటకు ప్రయత్నించినచో, అప్పుడు నీలో పనిచేయ ప్రారంభించినది నీ స్వీయ సంకల్పమే అగును. దానివలన, నీయందు నీవు గంతులువేయు ఊహలను, గుమికూడు ఆలోచనలను తప్ప మరి దేనిని పెంపొందించుకొనలేవు. ఈ స్థితి ఆధ్యాత్మికత యొక్క కృత్రిమ రూపమును మాత్రమే నీ దృష్టికి తీసికొనివచ్చును. ప్రశాంతతను పెంపొందించు స్థితిని నీ వనుభవించునపుడు అది నా కృషి ఫలితమని నీవు భావించెదవని పల్కితివి. దానికి నేనేమి చెప్పగలను? గమనించి నీ మనస్సును ఆ ఆలోచనతో జోడించి దానిపైననే యోచన చేయుము. అప్పుడు మాత్రమే అది అవగాహనమగుట సాధ్యము కావచ్చును.

సాక్షాత్కారమును ఒక మార్పులేని స్థితిగ నిర్వచింపగలము. అది వేల సంవత్సరముల పర్యంతమున కూడ మానవుడునకు అరుదుగా ప్రసాదింపబడు స్థితి. దానిని సంపూర్ణముగా పొందిన గురువు లభించుట తటస్థించినచో, అభ్యాసికూడ దానియందు తీవ్రమైన ఉత్సాహము, నిజమైన ఆతురత కలవాడైనచో దానిని పొందుట మిక్కిలి సులభసాధ్యము. కాని, "ఉన్నది" (అస్తిత్వము) అను భావము ఉన్నంతవరకు అది పూర్తి సాక్షాత్కారము కాదు. అందువలన, ఆనందమనునది కూడ లోపమే అని పర్యవసించును. దానిని గూర్చి అధైర్యము చెందవలదు, సోదరా. అది ఎంత సూక్ష్మాతిసూక్ష్మ స్థితి యనగా దీనిని భగవంతుడు ఎవరికి అనుగ్రహించునో వారు దానికై అత్యంత కష్టమైన బాధ ననుభవించుటకు సిద్ధపడుదురు. కాని దానిని ఒక్క క్షణముకూడ వదలుకొనుటకు నిష్టపడరు. నీ కవగాహన యగుటకు, నీవు సంతృప్తి చెందుటకు అది సరిపోవునని విశ్వసించెదను. నీ ఈ ప్రదేశమునుండి వెళ్ళిపోతివి, కాని నీ స్మృతిని మాతో వదలి వెళ్ళితివి. నీవు అతిథివిగా నుంటివి. నీవు ప్రదేశమును విడిచి పోవునపుడు నీ కాతిథ్యము నిచ్చినవానిని నీతో కూడ తీసికొని పోయినట్టి అతిథివి. నీవు నా సందేశమును నీ మిత్రులకు తెలియజేసి యుండి యుండవలెను. ఇప్పుడుది వారి హృదయములలో స్థిరపడునట్లు చేయుట గురుదేవునిపై ఆధారపడి యున్నది.

---

23. నేను నిన్ను ప్రేమించుటను నిజముగ ఆరంభింపకుండినచో, నాకు దివ్య ప్రేమలేదని యుక్తముగా నేను ఆరోపించబడగలను. మహాత్ముల కృపయందు నీకు విశ్వాసము కలదని తెలిసికొనుటకు నేను సంతోషించుచున్నాను. దానికి అనురూపమైనది ఏదో నీ హృదయాంతరాళమున ఉండునపుడే ఆ విశ్వాసము కలుగును. ఒకడు తన లోపములను గ్రహింప మొదలిడిన, అప్పుడు ఆ భావము తీవ్రమగును. హృదయమున కప్పుడు దాని స్వీయ సృష్టియైన చిక్కులను సహించుట కష్టమగును. భగవంతుడు తనయందున్న దానిని మాత్రమే మనకిచ్చును. అది అట్లుండ, మనము మన ప్రయత్నములచే సృష్టించుకొనిన దానిని మాత్రమే ప్రోగుచేసితిమి. భౌతిక ప్రపంచమునకు సన్నిహితముగా అంటిపెట్టుకొని యుండుటచే మన ప్రయత్నములన్నియు మనకు తెలియకుండ ఆలోచనయందు చిక్కులను సృష్టించు వైపునకే మనలను మరల్చుచున్నవి. ఇదియే బంధనముల రూపమును పొందును. వాని ప్రభావమున మనము ఆదిలో మనకు ప్రసాదింపబడిన దానిని సంపూర్ణముగ మఱచి, ఈ బంధనములన్నియు భగవంతుని నుండియే అని మొరపెట్టుకొన మొదలిడుదుము. మతములన్నియు ప్రజలను భగవంతుని కృపా కటాక్షములపై ఆధారపడుమని ప్రోత్సహించును. కాని మనయందు చిక్కులను సృష్టించినవాడు భగవంతుడే అయినచో, ఆయన కృపా కటాక్షములకై ఎవరును ఎదురుచూచెడివారు కారనుట నిశ్చయము.

– – –

24. మానవ నిర్మాణమున ఆటుపోటులు కచ్చితముగా సహజములు. ఆధ్యాత్మికతా ప్రభావమున నీ స్వభావము పరివర్తనము నొందినపుడు అవి క్షీణించును. భవిష్యత్సంఘటనలను ఊహించి తెలుపుటకు నాకు గల సామర్థ్యమును గూర్చి చెప్పవలెనన్న, నేను దానిని పట్టించుకొనననని స్పష్టముగా చెప్పుదును. కాని, గురుదేవుని ఇచ్ఛానుసారముగ అప్పుడప్పుడు వానిని గూర్చి నాకు కొన్ని సూచనలు తప్పక వచ్చుచుండును. మానవ మర్యాద ననుసరించి, వానితోనే మనము తృప్తి చెందవలయును. అవి భక్తియొక్క ప్రాథమిక నియమము. మన కోరికలకు ఏది సంబంధించి యుండునో దాని నన్వేషించిన యెడల, యధార్థమునకు మనము సమర్పించుకొంటిమని చెప్పజాలము. సమర్పణ విషయమునందు, అభ్యాసకుని ఇచ్ఛ, గురుని యిచ్ఛయందు లీనమగును.

– – –

25. నీవు నిజముగా పెద్దమనిషివని నా పూర్ణ విశ్వాసము. కావున ఎవరైనను తమకొరకు ఏదైనను చేయుమని నిన్నర్థించినచో, దానిని చేయుటలో నీకు నష్టము లేకుండిన, అట్లు చేయుటకు నీవు నిశ్చయముగా నంగీకరింతువని అనుకొందును. అది మానవ కర్తవ్యమున ఒక భాగము కూడ. అందువలన నేను నిన్ను దానికై అర్థించెదను. నా ప్రార్థనను అంగీకరింతువని ఆశించెదను. అది నాకు లాభదాయకము, నీకు నష్టము కానిది. నీవు పూజ చేయుట లేదు. ఏ అర్థమున నిన్ను పూజ చేయుమని నే నడుగుదునో, ఆ భావమున నేను కూడ చేయుటలేదు. అందుచే మనమిద్దరము ఈ విషయమున సమముగా నున్నాము; సమానముగా పాపులము కూడ.

నీవు పూజ చేయునట్లుగా ప్రేరూపించు నేదో యొక అనుభవము విధిగా కలుగవలెనని అనుచున్నావు. కాని నేను కూడ ఏ పూజను చేయుటలేదు. కావున నా కోసము, చెప్పబడిన రీతిని, నేనే భగవంతునిపై ధ్యానము చేయుచున్నానని సుమారు ఒక అర్ధగంట ఎడతెగక భావింపుము. ప్రియమైన సోదరా! నా కోసము ఈ చిన్న సేవను నీవు చేయలేవా? నా ప్రార్థనను మన్నించి నీవు నాకు నిశ్చయముగా ఉపకారము చేయుదువని ఆశించుచున్నాను. నీ చికాకు స్వభావమును గూర్చి మొరపెట్టు కొంటివి. అది నీ హృదయమున ఉప్పొంగుచున్న చిన్న అలల ప్రభావము వలననే. నీరు ప్రశాంతమైనపుడు ఈ విషయములు మాయమగును.

*अपनी मौजों में दिले ज़ार जरा डूब के देख ।*
*तू ही तू होगा न दरिया न किनारा होगा ।।*

> “దుఃఖించు ఓ హృదయమా, నీ అలలలోనికి లోతుగా మునిగి చూడుము;
> అప్పుడచ్చట నుండునది నీవు మాత్రమే; నది కాని నది గట్లు కాని
> కాదు.”

నేను ఉద్యోగము నుండి విరమించితిని. ఇక మీదట నేను భగవంతుని సేవకుడనైతిని. ఆయన సేవ మాత్రమే లాభదాయకము, శ్రేయస్కరము. మీ రందరును ఆయనతో ప్రేమ బాంధవ్యమును కలిపి నిలుపుకొనెదరని నా అపేక్ష. నీవు కూడ దానినే అపేక్షించుచుంటివి. అది చాల మంచిది. అదృష్టవశమున, ఈ కోరిక ఎన్నడైనను క్రిందకి జారిపోయి, దాని అదిమ మూలముతో కలిసినట్లయిన, అప్పుడు ప్రతి కోరిక అంతమగును. ఆ గమ్యము కొరకే అభ్యాసము లన్నియు ఉద్దేశింపబడినవి. మన కోరికలు ఈ అశాశ్వత ప్రపంచపు దిశవైపు తిరిగినపుడు, అవి వినాశకారకములగును. వాని ప్రవాహము పరమార్థము వైపునకు మరల్చబడినపుడు అవి మనలను నిశ్చయముగ ఉజ్జీవింప జేయును. నీ నిలకడకై నా ప్రార్థనలను కోరితివి. అవి, నోటి ద్వారా లేక వ్రాత ద్వారా, మాటల రూపమున మాత్రమే నిన్ను చేరగలవు. కాని నేను నీకు నా హృదయమనెడి రత్నాలహారమును పంపవలయునని నా కోరిక. అది నయనాశ్రువు లనెడి ముత్యములచే పొదగబడినది. అది నీలో ఒక పెనుతుఫానును సృష్టించుగాక ! ఇచ్చట పెనుతుఫాను అనగా ఏదో ఒకనాడు నిశ్చయముగా సముద్రమునకు తిరిగి వచ్చు నదీ తరంగములు.

– – –

26. నీవు శాస్త్రవేత్తవు కావున, దేహము నందలి అణువులు నిరంతరము నిర్మితమగుచు, నశించుచునే యుండునని అంగీకరించ వలయును. అందువలన మనయందు నూతన అణువులు సదా నిర్మాణమగుచునే యుండుననుట వాస్తవము. మనము ప్రేమ–వేడిమితో అణువులను అధికము చేసినట్లయిన, అవి దాని నుండి ఆ ప్రభావమును గ్రహింప మొదలిడి రూపాంతరము నొందును. ఈ ప్రకారము మన అస్తిత్వము యావత్తు సంపూర్ణముగ మారు సమయము రావచ్చును. యథార్థమున కదియే పరివర్తనము లేక సంపూర్ణ పరిణామము. పాత అణువుల స్థానమున వచ్చిన నూతన అణువులు ప్రేమ యొక్క ప్రభావముచే నింపబడియుండుటచే అవి కచ్చితముగా శ్రేష్ఠమైనవి, ఉత్కృష్టమైనవి. కాని దానితోపాటు అస్తిత్వము యొక్క భావము కూడ మనస్సు నుండి కడిగి వేయబడవలెను. దీని నర్థము చేసికొనుటకును, వివరించుటకును స్వల్పముగా కష్టమయినను, సాధించి పొందుట అంత కష్టము కాదు. దానికి సరియగు క్షేత్రము అవసరము.

బాగుగ ఎరువులు వేయబడి సారవంతము చేయబడిన క్షేత్రమునందు అందమైన మొక్కలు బాగుగ పెరుగును. అదే విధముగ మనలను మనమే లేకుండ చేసికొనినపుడు మొక్క క్రమముగ పెరుగుటకై క్షేత్రము అనుకూలమగును.

– – –

27. నీ విద్యార్థులకు నీవు జలయంత్ర శాస్త్రము (హైడ్రాలిక్సు)ను బోధించుట నారంభించినపుడు, వారి కన్నులలో కాంతి మెరయుటయు, పదార్థముల శక్తి లేక మరి యేయితర విషయమునైనను వారికి బోధించుటను ప్రారంభించినప్పుడు వారు దానిని ఊహింపనంత బాగుగా అర్థము చేసికొనుట ఆశ్చర్యకరము. దానికి కారణమును నే నే విధముగ చెప్పగలవాడను? బహుశః అది నీ స్వీయప్రతిభవలన కావచ్చును. నీ జ్ఞాన ప్రకాశమే వారి కన్నుల నుండి ప్రతిబింబింపబడి యుండవలెను. లేనియెడల ఆ విషయములన్నిటితో నాకేమి అవసరము? మంచిది. ఏమైనను నేను చెప్పగలిగిన దంతయు నిది మాత్రమే: నీ సరుకును బాగుగా విక్రయించుచుంటివని.

–––

28. కొంతకాలము ఈ అనామకునితో నుండి, నీవు నిజముగా నీ యందొక స్థితిని సృష్టించుకొనినావు. అది యింకను వృద్ధి అయిన అంతటిని లీనము కావించుకొను ప్రేమగా దానిని వివరింపవచ్చును. నీ వెక్కడికి వెళ్ళినను నీవు గాఢ ప్రభావములను సృష్టించుటకు కారణమిదియే. సంస్థకు నీ వింతవరకు చేయుచుండిన సేవకు నేనెంతో సంతోషించితిని. త్వరలో నీకు జయము కలుగునని నా నమ్మిక.

–––

29. శిక్షకునిగా నుండుటకు నీవు అర్హుడవు కావని భావించుచున్నావు. ఆ భావమున్నప్పుడు అట్లగుటకు ఎంతకాలమో పట్టదు. గురు దేవుని కృపవలన అప్పుడు ఆ స్థాయికి ఒక్క క్షణముననే తీసికొని రాబడగలవు. ఇతరుల సేవకై సేవకుడగుట ఒక గొప్ప అదృష్టము, మంచిదే. ఆ సమస్యను నాకు వదలివేయుము. నీ ప్రేమ అంత తీవ్రమగునపుడు నన్ను నీ వైపున కాకర్షించుకొనుట సహజముగనే వృద్ధియగును. ఏదో కఠినమైన పనిని నీ కిమ్మని నన్నడుగుదువు. దానియందు ఏ కష్టము లేకపోవుట అనునదియే కష్టము. నిన్ను పరిపూర్ణత్వమునకు సహజ రీతిని తీసికొనిపోవలెనని నా అపేక్ష. భగవంతుడు నాకు సహాయము చేయు గాక !

–––

30. నా అసలు చిరునామా తెలిసికొనుట ఎట్లని అడుగుదువు. శాస్త్రీయ భాషలో “నిన్ను నీవు తెలిసికొనినప్పుడే నా చిరునామా నీకు తెలియును” అని నేను చెప్పవచ్చును. కాని దానికి సమాధానమును ఈ విధముగా నిచ్చుటకు నేనిష్టపడుదును : “నీవు నేనుగా అయినప్పుడు మాత్రమే”. దాని అర్థము బుద్ధిపూర్వకముగా కాకుండ, సహజముగ నీకు నీవే నన్ను నీ యందు చూచుట మొదలిడవలెను. లేకుండి, అదే స్థితి నీయందు సృష్టింపబడినప్పుడు మాత్రమే నీవు నా నిజమగు చిరునామాను తెలిసికొనగలవు. ఇది అంతయు ధ్యానాభ్యాసము ద్వారా జరుగును. ప్రియ సోదరా, పరిపూర్ణత్వమునకై ప్రయత్నించుటకు ఈ రంగమునందు ప్రవేశింపుము. దానిని నానుండి

తీసికొనుము. అది ఏ మాత్రము కష్టముకాదు. ఎవడు తనను పూర్తిగ శూన్యము చేసికొనియుండెనో, ఆ వ్యక్తికి మాత్రమే తనను తాను అర్పించుకొనవలయును. అప్పుడతనికి ప్రతివస్తువును దానంతట అదే లభించును.

---

31. గ్రంథములను రచించుటయందు దోషమేమియు లేదు. కాని ఉత్కృష్టమైన ప్రజ్ఞ వికసించినప్పుడు రచన చేయుట నిజముగా ఆనందకరము. కాని దానికి నీవు కొంతకాలము వేచి యుండవలెను. నీ హృదయయాత్రను సంపూర్ణము కావించుటకు నేను ప్రయత్నించుచున్నాను. ఆ పిమ్మట నీవు యధార్థమైన జీవితసారము ననుభవించుటకై నేను పిండ ప్రదేశమునందలి ఇతర బిందువలను తీసికొనెదను.

---

32. మీ యందు ప్రతియొక్కరు, ఒక భావమున, వ్యాపక గుణము గలవారుగ కావలయునని నా అపేక్ష. మీ రెచ్చటి కేగినను మీ యొక్క గాఢ ముద్రను వేయగలుగవలెను. మీ నుండి ఆ ప్రభావము ఒక వ్యాపకమువలె తనంతట తానే బయటకు ప్రవహించును. “నేనెవరిని చూచితినో వారు ముగ్ధులైరి; నే నెవరిని గూర్చి యోచించితినో వారాకర్షింపబడిరి; నన్నెవరు చూచిరో వారు పరివర్తనము చెందిరి,” అని నీవు వ్రాసితివి. మన సంస్థ యందట్టి ఉన్నతాత్ములను నేను కలిగియుండగా, సంస్థ ప్రకాశించుట నిశ్చయము.

నేను నిన్ను మరువవలదని కోరినాను. నేనుకూడ నా ప్రియతముని ఏ విధముగను మరువకుండ ఉండుటను అపేక్షించెదను. నీ యీ కోరిక నిశ్చయముగ నెరవేరునని భావింపవచ్చును. నీయందు అహంకార మనునదే లేదు. నీ స్థితి ఏమైనను అది భగవంతుని నుండియే వచ్చినదని భావింపుము. నీ స్థితి నాకు మిక్కిలి సంతృప్తికరముగ నున్నది. నీవు నిజముగా పాత్రుడవు (యోగ్యతగల వ్యక్తివి). అట్లు గాకుండ, జనులు నాయొద్దకు వచ్చి పోవుదురు. కాని, ఎవ్వడును నన్ను తనతో తీసికొనిపోడు. నీవు నిజముగా నన్ను నీతో తీసికొనిపోయితివి.

నీ ప్రస్తుత స్థితి నీ పనిలో నీ కవరోధముగా మారినట్లయిన, లేక భరింప శక్యము కానిదైన, నేను దానిని సరిదిద్దుటకై నాకు అవశ్యము వ్రాయుము. భగవంతుని కృపవలన నీవు నిశ్చయముగా కొంత శాంతిని పొందెదవు. ఇది నీ కెక్కువ ప్రయోజనకరమగును. సంస్థకు నీవు నిస్సంశయముగా అపారసేవ చేయుదువు. నీవు నన్ను స్మరించినంత మాత్రముననే నేను నీ ప్రక్కనే ఉన్నట్లు అనుభూతిని పొందవచ్చును. భగవంతుడు నీకు స్థిరత్వమును ప్రసాదించు గాక! నీ ప్రగతి త్వరితమగు గాక ! తుదకు నీవు సంస్థకు మిక్కిలి విలువైనవాడవగుదువు. చేయవలసియున్నదేమైనను, అది నీ చేతను, నీ సహచరులచేతను కావింపబడవలయును. ఏమైనను నేను ఆధ్యాత్మిక విత్తనమును నాటితిని. ఆ వృక్షము త్వరలోనే ఫలించును. కాని దాని సంరక్షణ బాధ్యత యిప్పుడు మీ అందరిపైననే కలదు. నీ మిత్రులకు నీవొక సజీవ సందేశముగ అయినందులకు భగవంతునికి ధన్యవాదములు. ఈ సంస్థ యొక్క ప్రాముఖ్యమును వారర్థము చేసికొనుట కది సరిపోవును.

---

33. భగవంతుని దయవలన నీ సంశయములు నిశ్చయముగా మాయమగును, కాని, “ఎందుకు” అను ప్రతి ప్రశ్నకు సమాధానము నిచ్చుట యింతవరకెవ్వరికిని సాధ్యము కాలేదనుట నిస్సందేహము. ఇక ముందుకూడ అట్టి ఆశ ఏమియులేదు. నీ వనుభవించు ప్రకాశము నీ సద్భావములు, నీ గాఢప్రేమ భావముల ప్రతిబింబమే. నీ వింతవరకు ధ్యానమున పురోగమించలేదను భావమును వీడుము. నీకు సాధ్యము కాగలిగినంతవరకు నిరంతర స్మరణచేయుచు ధ్యానముతో ముందునకు సాగుము. నీవు భక్తి తత్పరుడవు కావున నీ కిది కష్టము కాకూడదు. మనస్సు, పదార్థము, ఆత్మల సహజస్థితిని గూర్చి చెప్పుమని నీ వడిగితివి. నేను నాగురించి కూడ ఎట్టి ఎరుకలేని వాడనైనప్పుడు నేనేమి చెప్పగలను? నాకుండిన విజ్ఞానము నాధారము చేసికొని ఊహాకల్పన చేయుటకు నేను విజ్ఞాన శాస్త్రవేత్తను కాను. ఇచ్చట భక్తుడు, ప్రవక్త, భగవంతుడు గుర్తింపులోనికి రారు. వీరు ముప్పురు పూర్తిగా అదృశ్యమగుదురు. నేనప్పుడేమి వ్రాయగలను? త్వరలోనే నేను నిన్ను ముఖతః తప్పక చూచెదను. కాని నేనక్కడ లేనంత వరకు, నీ హృదయమున నన్ను నీ అతిథిగా నుంచు కొనవచ్చును. నేను నిజముగా అచ్చట స్వయముగా ఉన్నప్పుడు నేనే అతిథిని, ఆతిథ్యము నిచ్చువాడను కూడ. నీ ప్రార్థన, భక్తి, పవిత్ర భావములచే నితరులను ఈ మార్గమునకు తీసికొని రాగలవు.

---

34. మీ మౌల్వీ సాహెబ్ తన హృదయ కుహరమున నాకు స్థాన మిచ్చిరో లేదో నాకు తెలియదు. ఆయన నాకు స్థానము నిచ్చినట్లయిన, నన్ను అచ్చట స్వతంత్రునిగ ఉంచిరో లేక బంధములలో నుంచిరో అను ప్రశ్న ఉత్పన్నమగును. నేను స్వతంత్రునిగ నుండి నప్పుడు మాత్రమే అతనికి కొంత ప్రయోజనకరముగ నుండును. దాని యందిమిడి యున్న అర్థమేమన అతడు నాహక్కులను నాకనుమతించునా లేక వానిని లేకుండ చేయుచునా నన్ను తనవానినిగా చేసికొనినది అను విషయము. అతడు నా హక్కులను నాకే ఉంచి యున్నచో నేను అతనికి సహాయకరముగ నుందును. ఇక రెండవ మిత్రుని విషయమున నేనతని త్వరిత ప్రగతిని కోరెదను. కాని వాస్తవమేమన, తత్త్వశాస్త్రమునకు జీవసారమైనట్టి సంశయము అనెడి ఇసుక పునాదిపై తన ఆధ్యాత్మిక దేవాలయమును నిర్మింప గోరుచున్నాడు. తత్త్వశాస్త్రము ఆశ్చర్యము నుండియే ప్రారంభము కావలెనని నా అభిప్రాయము. మన సాధనా విధానమున ఆశ్చర్య భావము దానంతట అదియే అభ్యాసకుని యందు సృష్టింపబడు స్థితికి వచ్చును. నేనాస్థితి యందనేక సంవత్సరము లుంటిని. ఈ స్థితి మొదలయిన తరువాత ఆధ్యాత్మిక సంపూర్ణముగా ఒక క్రొత్త మలుపు తిరుగును.

---

35. “జీవితమున కేమైన అర్థమున్నది?” అను నీ ప్రశ్న కిప్పుడు వత్తును. దానిని గూర్చి నీకొక భావమును కలిగించుటకుగాను నేనొక పద్యము నుదహరింతును.

“జీవితమన్న జీవత్వము; హృదయగతముగా
నిర్జీవులగు వారికి దుర్దశయే ప్రాప్తించును.”

ఇది ఎట్టి కవితా భావముతో కూడి యున్నను, నా దృక్పథ మీ క్రింది వివరణముతో స్పష్టమగును. జీవత్వమన్న నేమి? హృదయముతో జీవించుట. అయిన అది ఎట్టి జీవితమై యుండ నోపును? ఒక్క

మాటలో నే నిట్లు చెప్పవచ్చును : "నీ హృదయమును మరి యొకరి కిచ్చి వేయుము. అప్పుడు మిగిలి యున్నది కేవలము జీవనమే." 'జీవితము' అను పదమును గూర్చి తరచి యోచించినచో జీవించుటతో సంబంధమును కలిగి యున్నదే జీవితము అను నిర్ధారణకు వత్తువు. జీవితముతో ముడిపడి యున్న ఒక విధమైన జీవత్వము నిజముగా ఉన్నదని నా ఈ వివరణము స్పష్టము కావించును. దానితోబాటు, ఏ జీవిత్వముతో ఈ జీవితము ముడిపడి యుండవలెనని ఆకాంక్షించుచున్నదో అది అనంతమును, అనశ్వరమును. మనము మన జీవితమును ఆ జీవితము నందు లయింప చేసినచో అదే యధార్థ జీవితము. అప్పుడు ఆనందము కాని, విచారము కాని; ఆహ్లాదము కాని, ఆవేదన కాని ఉండదు. ఆ జీవితము కడకు మిమ్ముల నందరిని కొనిపోవలెనని నా ఆకాంక్ష. నేను చెప్పినట్లుగా ఆ జీవితము మాత్రమే జీవితమునకు గమ్యము. "నీ హృదయము నింకొకరి కర్పింపుము" అను వాక్యమునకు నీ వెట్టి అర్థము నిచ్చినను, అది ప్రేమ భావముతో కూడి యుండినచో అంతయు సవ్యముగానే యుండును. కాని సత్య వస్తువు కేవలము వివరణముల ద్వారా తెలియబడుట ఎన్నటికిని సాధ్యము కాదనునది స్పష్టము. ఏలయన, అది మనస్సుతో గ్రహించుకొనుట కతీతమైనట్టిది. అది అంతయు వ్రాయుటలో నా ఉద్దేశ్యము భౌతికత్వముతో కప్పివేయబడిన యధార్థ తత్త్వము లేదా అవివేకపు ఆకర్షణవైపు మొగ్గియున్న హృదయము మఱల్చబడవలెననియే. జీవితమున చేయవలసిన దంతయు నిదియే – హృదయము భగవంతునికే, నీవు నీకే !

ఈ విధమగు జీవితము నుండి నీకేమి వచ్చునను నీ ప్రశ్నకు సమాధానముగ వెనుక ఒక ఉద్దేశముండి నపుడు మాత్రమే లాభము పొందుట అను ప్రశ్న ఉదయించునని నేను చెప్పవచ్చును. కాని హృదయమే మనది కానపుడు ఉద్దేశమను ప్రశ్న ఏవిధముగను ఉత్పన్నము కాదు. అప్పుడు నీ వేమి పొందగలవు? నిజముగా ఏది నీకు చెందునో దానిని మాత్రమే. ఈ జీవితమునకు పూర్వము నీకు నిశ్చయముగా ఒక జీవితముండి యుండినది. దాని ఫలితముగానే నీవు ఈ జీవితము లోనికి వచ్చితివి. నీ పూర్వ జీవితము ఇప్పుడు మరల కావలయునని నీవు కోరినచో అది అసాధ్యము. నీవు చెప్పునట్లుగా నీ మనస్సును, హృదయమును ఇంకొకరికి సమర్పించితివి. కావున రాబోవు జీవితమునకు కూడ చింతన యుండరాదు.

వైవిధ్యమే జీవితము. వైవిధ్యమే లేకుండిన జీవితమున కర్థమేమి యుండెడిది ? ఇప్పుడు అది ఎట్లు సంభవించినది ? దానికి సమాధానమేమన మూలమున నున్న అసలు వస్తువు మరుగున పడియుండు నంత వరకు మన ఆలోచనలను మనమే ఘనీభవింప చేసితిమి. రమ్యాకర్షణలు తళుకు బెళుకులు మాత్రమే దృష్టియందుండినవి. వానితో మత్తెంక్కించబడు నంతవరకు వానిని ప్రేమించితిమి. వానిచే మత్తెక్కినపుడు నీవు బొంగరమువలె ఆనందాతిశయముతో తిరుగుచునే యుంటివి. నీవు దానిచే రంజింపబడి గంతులు వేసితివి. ప్రకృతి కర్మాగారమున నీ స్వయం నిర్మాణమునకు నీ వెట్టి పాత్రను వహించితివో దయయుంచి నీవే నిర్ణయించుకొనుము. దానికి నీవు మాత్రమే ప్రత్యేకముగా బాధ్యుడవు.

నీ వర్ధగంటసేపు పూజచేయుట మంచిదే కాని ఒక గంటసేపు చేసినచో నింకను బాగును. నీవు అన్ని దశలను దాటుటకు నిరంతర స్మరణము సహాయపడగలదు. విభిన్న దశలన్నియు, అతీత ప్రజ్ఞ యొక్క వివిధ స్థితులను దానివలన వికసించి నిన్ను సత్యవస్తువుతో కలుపును. "ఎందుకు" అను ప్రతి ప్రశ్నకు సమాధానము నిచ్చుట అసాధ్యమను అభిప్రాయమునకు నీవు స్వల్పముగా కలవరపడినట్లు

అగపడుచున్నది. నేను కొన్ని దృష్టాంతముల నివ్వనిమ్ము. విత్తనము ముందువచ్చెనా లేక చెట్టా అను సమస్య ఇంతవరకు పరిష్కరింపబడలేదు. కాని, ముందు వచ్చినది విత్తనమని నా అభిప్రాయము. అది దివ్య ధారా ప్రకంపనల యొక్క కదలికలు, తాకిడులవలననే. ఇంతకు జగత్తు ఎందులకు సృష్టింపబడవలయును? భగవంతు డెచ్చట నుండి వచ్చినాడు ? అని కూడా అడుగువచ్చును. వీనికి సమాధానము బహుశః ఏమైయుండగలదు అని నీకు నీవే యోచించుము. భగవంతునే ఆయన ఎచ్చటనుండి వచ్చినాడని ప్రశ్నింప గలిగినచో ఆయన సమాధానము నీయజాలడు అని నేను భావించెదను. ఒకవేళ ఆయన సమాధానము నిచ్చినచో అప్పుడు ఆయన భగవంతుడు కాలేడు. ఏలయన ఆ సమాధానముతో ఒక్కసారిగా ఆయనకు పరిమితి ఏర్పడి, ఆయన అనందత్వము పోవును.

---

36. నీకు నా చిన్న కుటీరమున కెల్లప్పుడు స్వాగతము. ఈ కుటీర మెంత ఎక్కువ హీనస్థితిలో నున్నదనగా ఎల్లెడల మూలము నుండి లోపలకు పడు స్వల్పమగు జల్లుచే పూర్తిగా తడియుదుమను భయము వలన బహుశః దానియందెవ్వరునుఒక క్షనముకూడ విశ్రమించుట కిచ్చగింపరు.

---

37. జనులు తఱచుగ తమ దుఃఖములను గూర్చి మొర పెట్టుకొనుచు, వానికి బాధ్యత నంతటిని భగవంతుని పైకే నెట్టివేయుదురు. తమకు బాధ కలిగించుటకై ఆయన దుఃఖములను కలిగించుచున్నాడని వారు చెప్పుదురు. కాని, తమ బాధలన్నిటికిని ఆయన హృదయము జాలి, కరుణలచే ఎన్నటికిని చలింపదా? బహుశః చలింపదని వారు సాధారణముగ కనుగొందురు. అట్లయినపుడు, అట్టి నిర్ణయాత్మక కంటకునినుండి ఎందులకు దూరముగా నుండకూడదు? అట్టి ప్రజలను నీవు సంతృప్తి పరచగలవా? విజ్ఞాన, తత్త్వశాస్త్రములు దానికి ఏదోయొక సమాధానమును ఇచ్చును, కాని, తుదకు అవన్నియు మౌనము వహించును. అందువలన, నీవా పద్ధతులలో ఆలోచనచేసి ఎందులకు వ్యసనపడెదవు ? ఆంతరిక ప్రశాంతతకు ఆ పద్ధతి నిశ్చయముగ వ్యతిరేకము. వస్తువుల సత్యతత్త్వమును గ్రహించుటకే మనమెల్లప్పుడును యత్నింపవలెను. ఆధ్యాత్మికత యొక్క అంతరార్థమిదియే. కోరికలు నెరవేరుటను శిక్షగా భావించుటకు మారుగ, కోరికలుండుటయే ఒకవిధమైన శిక్షగా తీసికొనుట ఇంకను మంచిది.

---

38. ఇచ్చట భగవంతుని కృపవలన గురుదేవుని శక్తి మాత్రమే అంతటయును పనిచేయును. దానియందు హాని కెట్టి అవకాశము లేదు. నీకు ఎట్టి కష్టమైనను, చిక్కు అయినను, భరింపరాని భావోద్రేకమైనను ఉండిన, ప్రార్థన మూలమున ఏ సమయముననైనను, ఎచ్చటనుండియైనను ఆయనకు తెలియజేయుము. అది తక్షణమే పోవును. అది నాకు తెలియునో లేదో యని నీవు చింతింపకుము. నీ ఉద్దేశము ఎటులైనను నెరవేరును.

---

39. మార్గమునకును, గమ్యమునకును ఎట్టి భేదము కనబడుట లేదను నీ అభిప్రాయము గాఢానురాగమునకు ఒక సూచన. అభ్యాసి తనయందు నిజముగా భక్తిని కలిగియుండి,

అనంతమున శాశ్వతముగా స్థిరపడియుండి, జన్మభూమియొక్క స్మరణమును తన హృదయమున సజీవముగా నుంచు మార్గదర్శి ఏదో అదృష్టవశమున పొందగలిగిన, అతడు నిశ్చయముగా పరిపూర్ణత్వమును పొందగలడు. నీవు నిశ్చయముగా అట్టి వ్యక్తి అయిన నా సమర్థ గురుదేవుని మార్గదర్శకత్వమున నున్నావు. సూక్ష్మముగా పరిశీలించిన, ఆయన తేజస్సు ప్రపంచమంతటను వ్యాపించుచు కనబడును. ఎవడైనను దానిని గూర్చి గాఢముగా యోచించి నట్లయిన, అతడు ఆది మూలమూలలా నిండియుండుటను చూడగలడు. అయినను, నేను నీకు అధ్యాత్మికత అనెడి మత్తు పానీయమును ఇచ్చుచునుండి, అదే సమయమున నీ సామర్థ్యమును అధికాధికముగా పెంపొందింపజేసెదను. నీకు నానుండి మరింకేమి కావలయును?

---

40. సక్రమ ఆలోచనా సరళి ఇప్పటికిని నీ యందభివృద్ధి కాలేదని అంటివి. అది నీ కెన్నడును రానే రాదని భావించు చుంటివా ?

"జన్మభూమి యొక్క ఉషఃసౌందర్యమునకు కొద్దిగా మెఱుగులు దిద్దనిండు." ప్రజలు నిన్ను శాస్త్రవేత్తగా భావింతురు. అది వారికి సంబంధించిన విషయము. దానికి నీ వెందుకలు వ్యసన పడెదవు ? వారు నిన్ను ఎంతో కొంతవానిగానైన పరిగణించుచున్నందులకు భగవంతునికి ధన్యవాదములు. నా విషయములో ప్రజలు సాధారణముగా నన్నొక్క వెఱ్ఱి బాగుల వానిగా తలతురు. నేను కూడ దానికి బాధపడి యుండవలెను. ఏలన నాకు తెలిసినట్లు నేను వెఱ్ఱివాడను కాను. అయిన నీ విషయమున దీనికి నాకు కారణ మగుపడుట లేదు. ఏలయన వారు నన్ను కంటె కొంతవరకు మేలుగను, గొప్పగాను నిన్ను గూర్చి అనుకొందురు. అందువలన, నీవు కూడ అట్లాలోచించుట సరికాదు.

---

41. నిన్ను పరీక్షింపదలచు నభిప్రాయము నాకు లేదని విశ్వసింపుము. ఎన్నడైనను నిన్ను పరీక్షింప కోరినట్లయిన, అది నన్ను పరీక్షించుకొని నట్లగును. సంశయముండినపుడే పరీక్షించుట అను ప్రశ్న ఉదయించును. కాని నాయందు దేనిని గూర్చి సంశయము లేదు. ఈ స్థితిని నిలుపుకొనినచో, ఎలక్ట్రానులమాటేమి, ప్రతి సమస్య నీ అవగాహనకు బాగుగా స్పష్టమగును, అనుదానిని నిస్సంకోచముగా నీ వంగీకరింపవచ్చును.

---

42. నీ యనుభవములను కొన్నింటిని గూర్చి, నీ మనోదృష్టికి గోచరమైన వ్యక్తిని గూర్చిన దానితో సహా, వ్రాసితివి. ఆ వ్యక్తి యెవరో తెలుపుడని నీవు నన్నడిగితివి. నేను చెప్పలేదు. కాని, యింతమట్టుకు నేను ధ్రువపఱచగలను. ముక్తిని పొందిన ఆత్మలు తఱచు ఒక అభ్యాసి యందు కొంత ప్రకాశము తమకు కనవచ్చి నపుడు వానిని ఆశీర్వదించవలెనని ఉత్సాహపడుచుందురు. అది, గురుదేవుని ప్రేమలో అభ్యాసి గాఢముగా నున్మత్తుడై యున్నప్పుడు విశేషించి యట్లు జరుగును. లాలాజీ మహనీయుని రూప దర్శనము వాస్తవము. అటుపై నది నాదిగా మాఱుట, వారు వారి యందును నా యందును భేదము ఏ మాత్రము వదలియుండ లేదనుటను సూచించును. అభ్యాసకులలో అధిక సంఖ్యాకుల కప్పుడప్పుడు అట్టి అనుభవములు కలుగును.

---

43. నీ ప్రేమ నన్నెంత మంత్రముగ్ధునిగా చేసినదన, నీ లేఖ ప్రతిదియును నాకధికోత్సాహమును కలిగించినది. నీ లేఖ నందుకొని నప్పుడు నీవు కూడ అట్టి స్థితినే అనుభవించుచు నుండవలెనని నా విశ్వాసము. ఈ భావమున మనమిరువురము ఒకరి నొకరు చాలా పోలియుంటిమి. అందుచే నేను ప్రేమోన్మత్తత ననుభవించు చుండినచో, నీవు కూడ మైకము యొక్క ప్రభావములను అనుభవించుచు నుండవలెను. నీవు దేనిని కూడ అనుభవించుటలేదని అనుచుంటివి. నీ ఎరుకలోనికి నేను కూడ వచ్చుచుంటినో లేదో తెల్పుము. అట్లయిన, నేను దానిని అతి చిన్న విషయముగా పరిగణింపను. ఈ ఊబి నుండి నిన్ను రక్షింపుమని నన్ను వేడుకొంటివి. సాధారణముగా ఊబిలో చిక్కుకొనినవాడు ఊబిని గాక మరిదేనిని ఎరిగా యుండడు. సంపూర్ణ ఆత్మ నిరసన పొందిన వాని స్మరణ ఎప్పుడో యొకనాడట్టి స్థితినే తీసికొని రాకుండ యుండుట ఎన్నటికైనను సాధ్యము కాగలదా? ఊబి యందు చిక్కుకొని యుండుటకు మారుగా, నీ హృదయము ప్రేమలో మునిగి యుండుటను నీవనుభవించుట లేదా ? అందువలన, ఊబి ప్రశ్న ఎన్నటికిని ఉత్పన్నము కాదు.

---

44. నీ మిత్రుని గూర్చి నేను జార్చిన మాట నీ యందుగల ప్రేమాతిశయపు మైకము వలననే. అయినను నేనొక విధముగా దానికి విచారింపవచ్చును. కాని యొక ముల్లు విపరీతముగ శక్తివంతముగా పెరిగినపుడు దానిని ఖండించివేయవలసి యున్నదని గుర్తించుకొనుము. సాధారణముగా స్వార్థము దాదాపు ప్రతియొక్కరియందును కొంత పరిమాణము వరకు కనబడును. అయినను దాని కుండవలసిన పరిమితులను మీరినపుడు అది తీవ్ర దోషమగును. ఆధ్యాత్మికతకు సంబంధించినంతవరకు, అది లేశమైనను అసంఖ్యాకములగు దోషములను సృష్టించును. ఈ విషయమున నా అభిప్రాయములను చక్కగా సరిపోయినవిగా గైకొనవచ్చును. నేనుపయోగించిన "సంకుచిత స్వభావము" అను పదము మతోన్మాదుల స్వాభావిక లక్షణమును సూచించును. అది బాహ్యముగా ప్రదర్శితము కానంతవరకు తీవ్రమైనట్టిదిగా భావింపబడకపోవచ్చును. కాని, ఆధ్యాత్మికతకు సంబంధించినంతవరకు అది ఏమైనను బంధనమే అగును.

---

45. అత్యధిక ప్రశాంతతకు, సౌఖ్యములకై తమ కోరికలను భగవంతు డనుగ్రహింపవలెనని ప్రజలపేక్షింతురు. ఆయన అట్లు చేయనిచో, తమను అన్యాయముగా ఉపేక్షించినాడని వారాయనను నిందింప మొదలిడి, పూర్తిగా అలక్ష్యము చేయ నారంభింతురు. దాని ఫలితముగ వారు సదా అసంతృప్తి, నిరాశలకు గురి అగుదురు. మానసిక ప్రశాంతత అన్న ప్రశ్న వారికి ఉండదు. కాని కొన్ని సమయములలో ఈ స్థితియే వృద్ధిఅయి, వారి ఆలోచనలను, కొన్ని సందర్భములలో మాత్రము – భగవంతుని వైపునకు మరల్చుట కాధారమగును. అదియే వారి మనస్సున భగవంతుని యందు విశ్వాసమును సృష్టించును.

---

46. ఇప్పుడున్న మహాపురుషునితో ("సత్యోదయము"లోని మహాపురుషుడు) అంతస్సల్లాపము లాడ గోరుచుంటివని చెప్పితివి. మంచిది; నేను నీ కిదివరకే విధనమును చెప్పయుంటిని. దానికొఱకు భగవంతుని మనఃపూర్వకముగా ప్రార్థించుచు కొంతసేపు ధ్యానమున కూర్చొనుము. ఆ పురుషుని భౌతిక రూపము నీ దృష్టికి రావచ్చును. నీవు నీ భౌతిక చక్షువులతో ఆయనను చూడగోరినచో, ఆయనను గుర్తించుటకు తీవ్ర ఆతురతను కలిగినవాడై యుండిన, అదికూడ సాధ్యము కాగలదు. తగిన పురోగతిని సాధించిన పిమ్మట మాత్రమే ఆయనేతో అంతస్సల్లాపము చేయుట సాధ్యమగును. ఆయన నెచ్చట అన్వషింపవలయునను నీ ప్రశ్నకు సమాధానముగా నీ చుట్టు ప్రక్కలనే అనిగాని, లేక నీ ఆలోచనా ధార ఎంత అత్యున్నత స్థాయివరకు ప్రవహింపగలదో అచ్చట యనిగాని చెప్పుదును. "దయయుంచి ఆయనను నాకు చూపుడు" అనికూడ నీవు భావావేశమున అడుగవచ్చును. దానికి నేను చెప్పవలసిన దేమన నా ఆలోచన ఇప్పుడును, ఇదివరకును, ఎల్లప్పుడును దానివైపునకే మొగ్గియున్నది. ఆ పురుషుని దర్శనము దాని ప్రభావము లన్నిటితో కూడ నీకు సాధ్యమగునట్లు చేయుటకు నేను ప్రయత్నించుచుంటిని.

---

47. నీవు సందర్భవశమున శ్రీ అరవిందుడు లేదా రమణ మహర్షి ఆలోచనా భావములను అధ్యయనము చేయవలచ్చును. కాని నీవు దేని నన్వేషించుచుంటివో దానినికూడ కొనసాగింపవలయును. "మహాయోగము"ను నేను కూడ చదివితిని. రమణమహర్షి అనుయాయులు ఈనాటికి కూడ మానవ శరీరమునందు హృదయము యొక్క కచ్చితమైన స్థానము – అది కుడివైపున నున్నదా లేక ఎడమవైపున నున్నదా – అను అభిప్రాయమును గూర్చి వాదోపవాదములు చేయుచు, దానియందు మిక్కిలి విచారకరముగా చిక్కుకొని యుండునటుల కనబడుచున్నది. ఏది ఏమైనను దానిని గూర్చి ఎట్టి నిగూఢ రహస్యము లేదు. భౌతిక హృదయ నిర్మాణము నంతటిని విచారణలోనికి తీసికొనినచో, అది పూర్తిగా స్పష్టమగును. రమణమహర్షి "నే నెవరిని?" అను దానిని విచారింపుమని దృఢముగా నొక్కి చెప్పుదురు. దానికి మారుగ "నే నెవరు" అను దానిని మరచుటకే ప్రయత్నించుట అత్యంత శ్రేష్ఠమని నా వినమ్రోద్దేశ్యము. దైహిక ప్రజ్ఞ, ఆత్మ ప్రజ్ఞ రెండును పోవుట ఆవశ్యకము. ఈ అభిప్రాయము నా స్వానుభవముపై నాధారపడినట్టిది. నేనెల్లప్పుడును స్వేచ్ఛగా నాలోచించు వాడను. కావున స్పష్టముగను, మొహమాటము లేకుండగను నా భావములను వ్యక్తపరచుటకు నాకెట్టి సంకోచమును లేదు. అభ్యాసకులకు నేను ప్రవేశమునీయగలిగిన పరిమితికి అతీతముగా నింకను పైకి కొనిపోగల వారికెవరికైనను స్వాగతము నిచ్చుటకు సదా సంసిద్ధముగ నున్నాను. దైవపథమున నీ వొకనిని గురువుగా స్వీకరించియుండి, అటుపిమ్మట ఏ దశలోనైనను అంతిమ లక్ష్యమువరకు నీకు తోడ్పడుటకు అతి అసమర్థతను కనుగొనినచో, అతడు నీ కాలమును, శక్తిని వృధా చేయుటకును మరియు చేరుకొనగల అంతిమ స్థితిని నీవు శాశ్వతముగా పోగొట్టుకొనుటకే తప్ప మరిదేనికి ప్రయోజనకారియో నీకు నీవే నిర్ణయించుకొనుము. నీ పిల్లవానికి ఒక పాఠ్య విషయమునందు శిక్షణమునిచ్చుట కొక ఉపాధ్యాయుని నియమించుదువు. కాని, ఆ పిమ్మట అవసరమైనట్టి ప్రయోజనమును నెరవేర్చుటకు అత డా విషయమున అంత సమర్థుడు కాడని కనిపెట్టుదువు. అప్పుడు అతని స్థానమున ఆ పనికి మరింత తగినవాడైన ఇంకొకరిని నియమించుట తప్ప నీవేమి చేయుదువు? ఈ విషయమున కూడ విధానము అట్టిదిగానే యుండవలెను.

---

48. జపమును అభ్యసించు సరియైన విధానము బహుశః కొద్దిమందికే తెలిసియుండ వచ్చునని నా వినమ్ర పూర్వకమగు అభిప్రాయము. నా యొద్దకు వచ్చుట తటస్థించిన వారియందనేకులు తప్పుడు అభ్యాస విధానముచే కఠినమైన ముడి నొక దానిని వారి హృదయమున సృష్టించుకొనినట్లు కానవచ్చును. దాని ఫలితము, వారి హృదయమున ఘనత్వము, స్థూలత్వముల యొక్క రూపమున స్థిరపడి యుండును. దానిని తీసి వేయుట నాకు మిక్కిలి దుష్కర కార్యమగును. కొన్ని సందర్భములలో నేను దానిని సంవత్సరముల పర్యంతమున కూడ కడిగివేయలేక పోతిని – సాధనా విధానము సూక్ష్మము కానంతవరకు, అత్యంత సూక్ష్మమైన దాని సాక్షాత్కార మెన్నటికిని సాధ్యము కాజాలదు.

దుఃఖ పూరితమైన ఒక మనఃస్థితి సాధారణముగా నీ వనుభవించుచున్నావని చెప్పుకొంటివి. ఇది ఒక ఆధ్యాత్మిక స్థితి కూడ కావచ్చును. నీవు దానిని గూర్చి యింకను వివరముగా వ్రాసిన నేనింకను బాగుగా నిర్ణయింప గలిగిన స్థితిలో ఉండవచ్చును. ఈ దుఃఖపూరిత మనఃస్థితితో పాటు నీవు తేలికదనమును కూడ అనుభవించుచుండిన దానికి నేను నిన్ను అప్పుడు అభినందించి తీరవలెను.

---

49. నిరంతర స్మరణము నభ్యసించుటకు నీ వనుసరించుచున్న పద్ధతి మిక్కిలి సరియైనదే. దానికి నేను నాకుగా ఉపయోగించిన పద్ధతి కొంచెము మందమైనదిగా – బహుశః భావింపబడవచ్చును. కాని, అది నా కత్యంత సంతోషప్రదమైనట్టిది. నేను దాని నుండి అత్యధిక ప్రయోజనమును పొందితిని. నేనెల్లప్పుడు నా మనోదృష్టియందు గురుదేవుని భౌతిక రూపమును సంపూర్ణముగా చూచుటకు ప్రయత్నించితిని. ధ్యాన కాలమున దానిని నా హృదయమున ఉంచి ఎల్లప్పుడు ఆయన రూపముపై ధ్యానము చేసెడి వాడను. ఈ అభ్యాసము పరిపక్వమయినప్పుడు, ఆ తరువాతి దశ దానంతట అదియే వచ్చును. లయమునకు చెందిన ఒక స్థితి దాటబడినదని దాని అర్థము. ఆచార మర్యాదలచే నిన్ను బంధించి వేసితినని ఆరోపించితివి. అది నీ స్వంత యోగ్యతయే యనియు, దాని ప్రభావముచే నీవు ఆరాటపడుట మాని ప్రేమ బంధములోనికి వచ్చితివనియు నా భావము. కాని, ఈ బంధము కూడ దాని అంతిమ స్థితిని పొంది ప్రేమ కూడ లయమైనట్లనిపించి నప్పుడు ధ్యేయము సిద్ధించును.

---

50. "నేను మీ యందు జీవించవలెనని నా కోరిక" అను నీ వాక్యము నిజముగా బంగారముతో తూచదగినట్టిది. ప్రియసోదరా, నేను జీవించి యుండుట యదార్థమునకు మీ అందరి వలననే; ఏలయన, నా కార్యము చాలకాలము క్రితమే సంపూర్తియైన దగుటచే, నే నీపాటికి ఈ భౌతిక ప్రపంచము నుండి పోయి యుండెడి వాడను. ఇప్పుడు మీరందరును సంస్థను తేజోవంతముగా ప్రకాశించునట్లు చేయువరకు నేను వెళ్ళి పోవుటను గూర్చి తలపను కూడ. దాని పరిమితులను దాటిన అనంతరము లయావస్థ అభిన్నతా రూపమును పొందినప్పుడు ఏ ఆలోచనలు వచ్చినప్పటికిని, అవి హృదయము నుండి మాత్రమే ఉత్పన్నమగును. "బాబూజీకి ఏవైనను హృదయ

మున్నదా?" అని శ్రీ ఈశ్వర్ సహాయ్ నిన్ను ప్రశ్నించుటకు బహుశః కారణ మదియే అయి యుండవచ్చును. కాని, ఆ ప్రశ్నకు ప్రత్యుత్తరముగా "దయయుంచి నా హృదయమును మీతో ఉంచుకొనుడు," అని చెప్పుచు నీ వత్యంత యుక్తమైనట్టి నివేదన చేసితివి. నీ హృదయము ఇప్పటికే నాతో ఉండకుండిన, నే నెన్నటికిని నిన్ను జ్ఞాపక ముంచుకొని యుండెడివాడను కానని స్పష్టము చేతును.

---

51. ఉత్తర కాశిని గూర్చిన నా మనో భావములను ఈక్రింది విధమున సంగ్రహముగా వివరింపవచ్చును. అది హిమాలయపు లోయలలో నొక దాని యందు గల ఒక చిన్న ఊరు. దాని చుట్టును అన్ని వైపుల ఎత్తైన పర్వతములున్నవి. ప్రక్కనే భాగీరథీ నది శిలామయ ప్రదేశమున దొరలుచు, ఘోషించుచు ప్రవహించుచున్నది. సుమారు మూడు వేలకు సమానమగు జనాభా – ముఖ్యముగా సాధువులు వారి అనుయాయులను, పరిచారకులను – కలిగియున్నది. వివిధ ఛ్చాయలు, వర్ణములు గల స్వంత ఆశ్రమములను కలిగియుండి వారు భిన్నమైన పీఠములకును, సంస్థలకును చెందిన వారై యున్నారు. యాత్రికులకు ఆశ్రయ మిచ్చు ధర్మశాలలు పెక్కు గలవు. సుమారు ఏబది ఏడు మైళ్ళ దూరమున గల గంగోత్రికి వెళ్ళు యాత్రికులకు వారి మార్గమున రాత్రి వసతిగా కూడ ఆ స్థలము ఉపయోగపడుచున్నది. గంగా నదికి ఆదిమ మూలమైన గోముఖము గంగోత్రి నుండి ఇంకను పదునాలుగు మైళ్ళు ఉన్నది. గోముఖి శిల వెనుక ఆ నదికి నీరు ఇచ్చునట్టి ఒక పెద్ద హిమ ఖండము కలదు. ఆ స్థలము యొక్క ప్రకృతి దృశ్యము, ముఖ్యముగా ఆ స్థలము నుండి ఏడు మైళ్ళ దూరమునగల హర్సల్ యొక్క ప్రకృతి దృశ్యము, చాల ఆకర్షణీయమైనది.

ఇది పవిత్ర స్థలముగా తెలియబడుచున్నది. కావున గొప్ప మహాత్ములు, పేరెన్నిక గన్న సాధువుల నివాస స్థలముగా భావింపబడెను. మహాత్ముడుగా ప్రచారము నొందిన వాని నిర్దిష్టమైన దుస్తులనట్టి కాషాయ వస్త్రములను వారందరు ధరించినప్పటికిని ఆ సాధువులు, విరాగుల సమూహమంతటి యందు భగవంతుని నిజముగా నన్వేషించు వారొక్కరు కనపడకుండుట నాకు తీవ్ర నిరాశను కలిగించినది. దాదాపు ప్రతి యొక్కరును ఆసన ప్రాణాయామ వ్యాయామాభ్యాసములను సంపూర్ణశక్తి, ఉత్సాహములతో చేయుటలో తీరిక లేకుండి, తమ అసాధారణ ప్రయత్నములకు దర్పముతో ఉప్పొంగిపోవుచు కనపడెదరు. ఈ వైహిక శ్రమయే గాక, వారు ధ్యానము, భక్తి మొదలైనవానిని శారీరకముగా అభ్యసించుచు ఎక్కువ కాలమును వినియోగింతురు. వారికి భగవంతుని తెలిసికొనుట అను ప్రశ్నయే లేదు. సాక్షాత్కారమను పదము, నిఘంటువులోని అర్థమునకు తప్ప, వారి అవగాహనకు చాలా అతీతమైనది. ధ్యానమనగా కేవలము మెదడుయొక్క మందకొడితనమని వారి అర్థము. వారిలో అనేకులు వెఱ్ఱిగా కాంక్షించు సమాధి అనునది కేవలము శారీరక ప్రజ్ఞా హీన స్థితియని అర్థము. వేరుమాటలలో చెప్పవలెనన్న, వారియందు దాదాపు అందరును భగవంతుని అన్వేషించుటకు బదులుగ, ప్రత్యక్షముగా స్వార్థమునే అన్వేషించెదరు. రాజయోగముయొక్క మూల సత్త్వమైనట్టి ప్రాణాహుతి వారికి పూర్తిగ అన్యమైనట్టిది. ప్రాణాహుతి నవగాహనము చేసికొనుట లేక అనుభవించుట అటుంచి, దానిని గూర్చిన మాట నొక్కదానినైనను వారు వినిపించుకొనరు. అది వారి అహంకారము, ప్రతిష్టలకు తీవ్ర అఘాతమై ఉండెడిది.

ఆ స్థలము యొక్క అద్భుతము లిట్టివి. మనుష్యుని రెండు కండ్లు చూడగలిగిన దానికన్నను అవి నిజమునకు అక్కడ ఎక్కువగా ఉన్నవి. ప్రతి వస్తువును మరియు అన్నిటిని చూచుటకు బదులు దేనిని చూచిన సర్వము దానంతట అదియే దృష్టికి గోచరమైయుండునో దానిని మాత్రమే చూచియుండిన ఎంతయో బాగుండెడిది. ఆ ప్రదేశముయొక్క ప్రకృతి సౌందర్యమునందు నా కాసక్తి లేదు. అది నాకెట్టి ఆకర్షణను కలిగించలేదు. ఏలయన, నేను అనంతముయొక్క ఘోరమైన మరుభూమి అప్పటికే చూచియుంటిని. అదియే నా దృష్టియందు వికసించిన వృక్ష సంపద సారము. దానికే నే నలవాటు పడియుంటిని. అది నా హృదయపు గాయములకు ఉపశమనకారిగా నాకు ఉపకరించును. సంతోషకరమైనట్టి ఈ గాయములు ప్రేమ యొక్క గ్రుచ్చుకొను చున్నట్లుండెడి వేదనతో పీడింపబడు వారికి మాత్రమే.

---

52. మానసిక చంచలత మన జీవితమున ఒక అంతర్భాగమయి పోయినది, ఏలయన మన వ్యక్తిగత మనస్సు నా మార్గమునకే త్రిప్పితిమి. మనము ప్రపంచమున మొట్టమొదట వచ్చినప్పుడు ఆ విషయమట్లు కాదు. పరిసరములు, వాతావరణము, మన అలవాట్లు వాని ప్రభావమును అవి కలుగచేసినవి. దాని ఫలితముగ మనము పూర్తిగ చెడితిమి. కాని, వాస్తవమునకు మనము మాత్రమే దీనికంతటికి బాధ్యులము. కావున, దానిని సరియగు మార్గమునకు మరల త్రిప్పి తీసికొనివచ్చుట మనపై ఆధారపడి యున్నది. కేవలము దీనికొరకే మనస్సును దాని చంచల స్వభావమునుండి నివారించుటకు మనము ధ్యానము నభ్యాసము చేయుదుము.

---

53. ఈ విధానమున గల సామాన్య పద్ధతి ప్రకారము నీ వ్యక్తిగత మనస్సును, ఊర్ధ్వముగా, అనగా భగవంతుని వైపునకు, మరల్చితినని నేను నీకు వెల్లడింప వచ్చును. ధ్యానకాలమున కాని, తదితర సమయములలో కాని, లేక ఆకస్మికముగానైనను నీవు దాని కొఱకు చూచినచో, దాని ప్రతిబింబము కొంచెము బహుశః నీ అనుభవమునకు వచ్చును. నేను నీకొరకై ఏమి ఏర్పాటు చేయుచుంటినో భగవంతునికి మాత్రమే తెలియును. నీ వింకొక మారు నావద్దకు వచ్చునప్పుడు, నాతో నీకు గల సంబంధమును మరింత గాఢముగను, బలీయముగను చేయుటకు వీలుగా నీయందు తగినంత ప్రగతిని నేను కనుగొనునట్లు భగవంతుడనుగ్రహించు గాక. దైవకృప యొక్క మూల భాండారముతో మరింత సన్నిహిత సంబంధమును చేకూర్చుటకు కూడ నిన్ను సిద్ధము చేయుచున్నాను.

---

54. తన తండ్రి ఐశ్వర్యము తనదేయని నిరంతరము భావించు ఒక పసి బిడ్డవలెనే నా గురుదేవుని అపార ఆధ్యాత్మిక సంపద నాకు చెందదని నా ఆధ్యాత్మిక జీవితమున ఎన్నడు ఒక్క క్షణమైన ఊహింపలేదు. నేను దానిని సంపూర్ణముగా కలిగి యుంటిని. అయినను నాతో సంబంధము కల యితరులకు దానిని ప్రసాదించుటలో నేను లోభత్వమును చూపను. కాని, సాధకుడు దానిని తన స్వంతము చేసికొనుటకు ప్రయత్నము చేయనప్పుడు మాత్రము కష్టము కలుగును. ఈ కారణమున నేను ఏమియు లేని స్థితికి కొనిరాబడినట్లు తెలిసికొనినప్పుడు, నిజమునకతడు దాని నేల అపేక్షింప

వలయును ? ఎచ్చట ఆధ్యాత్మికత సమృద్ధిగా నున్నదని తెలియునో, ఆ ప్రదేశమునకే అన్వేషకుడు ఎల్లప్పుడు వెళ్లును. నేను దానిని పూర్తిగా లేనివాడనై యుండుట వలన వారి ప్రయోజనమునకు నేను సంపూర్ణముగా తగని వాడను. ఇతరులను నావైపు ఆకర్షించునది నాయందు మరి యింకేమి కలదు? బహుశః అది వారి యెడల నాకుగల ప్రేమవలననే కావచ్చును. కాని, అది కూడ నాయందు గుర్తు పట్టరానిదిగ నున్నది. ఏలయన, తారతమ్యముల నన్నిటిని కోల్పోయి దాని వివిధ వర్ణములనన్నియు ఒక దాని యందే లయమై ఉన్నవి. కావున, అది బహుశః వారి విశ్వాసమున కూడ కావచ్చును. ఆ విశ్వాసము నా హృదయాంతర్భాగమున వారికి ఒక సూచన నీయవచ్చును. ఉనికి యొక్క ఎరుక భగవంతుని భావమును మనస్సునకు తెచ్చుననుట స్పష్టము. కాని, ఉనికియే శూన్యము కావింపబడినపుడు పరిష్కారము ఏమైయుండవచ్చును? ఆ స్థితికి వచ్చిన వ్యక్తిని ఎఱుకలోనికి తీసికొన గలవాడు నిజమైన ప్రేమికుడై, శూన్యస్థితిని యధార్థముగ నన్వేషించు వాడు మాత్రమే. ఆ సందర్భమున, అతడు తనను పూర్తిగ శూన్యము మరియు ఖాళీ చేసికొనుటకు ప్రతి దానిని వదలివేయుచునే యుండును. శూన్యస్థితి యొక్క చరమావస్థయే 'భూమ'గా తెలియబడు అంతిమ స్థితి. కాని, ఆ ఉనికి లేని స్థితిని దృష్టియందిడుకొనుట సాధ్యము కానందువలన గుణభేదములు దానియందు ప్రవేశపెట్టబడినవి. మానవుడు స్వాభావికముగ భౌతికతవైపునకు మొగ్గియున్నాడు. కావున తన స్థాయికి సమానముగ భగవంతుని క్రిందకు తీసికొని వచ్చును. తన జాతికి చెందినవానినే మానవుడు ప్రేమించ గలడని చెప్పుదురు. ఇప్పుడు 'గురువు' తన జాతి వాడు కావున మూర్తీభవించిన భగవంతునిగ భావింపబడును. దాని ఫలితముగ, కేవల సత్యతత్త్వముతో సంబంధమును కలిగిన అతడు వానికి ఆలోచనా లక్ష్యమగును. కాని, సూర్య కిరణములన్ని చోట్ల ఒకేరీతిగా పడుచున్నప్పటికిని, తమ స్వభావము, సామర్థ్యముననుసరించి విభిన్న భాగములు వేర్వేఱు ఫలితములను గ్రహించును. అట్లు సూర్యకిరణములను సూటిగ గ్రహించుటకు గాను మానవుడు భూమధ్య రేఖా స్థానమును పొందవలెను. ఆ ప్రభావమును తనలోనే ఉంచుకొనుటకు అతడు శుద్ధముగను, నిర్మలముగను కూడ ఉండవలయును.

---

55. ఆధ్యాత్మిక ఔన్నత్యమునకై దహించివేయుచున్న ఆకాంక్ష నీకున్నదని చెప్పుచుంటివి. అది సరిగా అట్లే ఉన్నదని నేను కూడ విశ్వసించుచుంటిని. కాని, ఆ మండుటకు మూడు అంశములు కలవు. మొదటిది, అణచిపెట్టబడిన మంటతో రగులుచు దట్టమైన పొగను వెలిగ్రక్కును. రెండవది, అప్పుడప్పుడు నిప్పు కణములను కలిగియుండును. కడపటిది ప్రకాశవంతముగ మండు జ్వాలగ అయి క్షణకాలముననే ప్రతిదానిని భస్మము కావింపు శక్తి గలది. మొదటి రెండు దశలును తేమ, ఘనత్వముల ప్రభావమునకు గురికాబడియుండగా, కడపటిది గాలిలో నున్న మండునట్టి పదార్థముతో సంపర్కమునకు గురి అయినది. మండుటను ఆటంకపరచు తేమ లేక స్థౌల్యము లోపలి వేడెక్కించు ప్రభావము చేత తొలగింపబడగా, కడపటి క్రియ సంపూర్ణ శక్తితో ప్రారంభమగును. కాని, మొదటి రెండు దశలను అధిగమించి, చివరి దశయందు మాత్రము అగపడునట్టి ఎట్టి పొగ, ఆవిరిలేని విద్యుద్వహ్ని కూడ అచ్చట కలదు. నీయందట్టి అగ్నిని రగుల్కొలుప గలిగినచో నీ పురోగమనము మిక్కిలి శీఘ్రతరము కాగలదు. కాని తేమ, ఘనత్వములనుండి నీకు నీవే విముక్తడవు కావలసియున్నది. అది దేనివలన అయి యుండవచ్చును? అది ప్రస్తుత

భౌతిక రూపమునకు మనలను తీసికొని వచ్చినట్టి ప్రకృతి కార్యముల ఫలితము. మీ కా విషయమున నేను తోడ్పడగలనని మీరు భావించిన నేను మీ సేవకు సిద్ధముగా నున్నాను. మీ యందెవ్వడైనను తన అలవాటులను సరిదిద్దుకొనుటకై స్వల్ప అసౌకర్యమును అనుభవించుటకు నిష్టము లేకుండిన, అతడు దానిని అనుభవించ నవసరము లేదు. కాని, అతడప్పుడు తనయందు తీవ్ర ఆకాంక్షను పెంపొందించుకొని, ధ్యేయసిద్ధికై సరియగు ఉపాయములను కనుగొనుటకు కనీసము అభ్యాసము నైనను చేయవలయును.

---

56. సంస్థ సభ్యులను నేను సామాన్యముగా "సోదరులు" అని సంబోధించెదను. కాని, అది సరి కాకపోవచ్చును. దానికి బదులుగా "నా హృదయము" లేక "నా ఆత్మ" అను మాటను వారికి ఉపయోగించి యుండవలసినది. కాని, వానిని వాడుటకు తగు శ్రద్ధనేల వహించనో నా కసలు అర్థము కాకున్నది. అది అట్లుండుటకు కారణము వారు నన్నామేరకు ప్రేమింపకుండుటయే యని నే ననిన, అప్పుడది పొరపాటే యగును. ఏలయన వారు నన్ను గాఢముగా ప్రేమించు చుండుటను స్పష్టముగా చూచుచుంటిని. మరి, అప్పుడు దోషమేమైన యుండును? వారి కంఠధ్వనులు నా హృదయమును తాకునట్లు నన్ను చేరవని నా నమ్మకము. దీనిపై నీకు నీవే ఆలోచించి, స్వయముగ నిర్ణయింపుము.

నా లేఖలలో కొన్నిటియందు నా గురుదేవునికి "నా హృదయము" లేక "నా ఆత్మ" అను పదమును తరచు వాడియుంటినని చెప్పుట అప్రస్తుతము కాకపోవచ్చును. అది చాల సహజరీతిని ఉండెను. అలంకార ప్రాయముగా నా ఏకైక ప్రేమవస్తువు ఆయనే అని చెప్పవచ్చును. వాస్తవ విషయమునకు కేవలము ఆయనను, ఆయననే తప్ప, విముక్తినిగాని లేక అట్టిదానిని దేనినైనను గాని ప్రేమించినవాడనుకాను. ఇతరులను అదే మార్గము ననుసరింపుడని ప్రోత్సహించినట్లైన, అది నాయొక్క దురహంకరాపు చర్య కాదా? ఏలయన, ఆరాధింపబడవలెను, పూజింపబడవలెను అను కోరిక నా హృదయమున నుండుటను అది సూచించునట్టిదిగా కనపడవచ్చును. నా గురుదేవులు ధ్యానింప బడుటకు అత్యంత యోగ్యులు. కావున దానికి వారు నిస్సంశయముగా అర్హులు. ఆయన సంపూర్ణముగా అహంకార భావములు, కోరికలు, ప్రాపంచిక బంధనములనుండి విముక్తి నొందిన పరిపూర్ణ ఆత్మనిష్ఠులు. "ఆత్మనిష్ఠులు" అను పదము సామాన్యముగా మానవునకు ప్రసాదింపబడని అత్యున్నత తరగతికి చెందిన ఒకానొక ఆధ్యాత్మిక స్థితికి సంబంధించినది. ఈ కారణముననే నే నాయనను సాధ్యమైనంత గాఢముగా ప్రేమించితిని. ఆయనయందు సంపూర్ణ ముగా నన్ను లయము చేసికొనుటకు హృదయపూర్వకముగా ప్రయత్నించితిని. అదియే నాకు జీవిత సాధన అయినది. దానికి కారణము అద్వితీయుడును. సాటిలేనివాడును అయినట్టి గురుదేవుని నేను పొందియుండుటయే. దాని నుండి సాధించిన ప్రయోజనములను వివరించుటకు నాకు మాటలు చాలవు. ఒక్కమాటలో చెప్పవలెనన్న మనమందరము లీనము కావలసిన అనంత కృపాసాగరము ఆయన. అది ప్రస్తుత పరిస్థితులలో ఎట్లు సాధ్యము కాగలదో ఈ క్రింది దృష్టాంతముచే స్పష్టము చేయవచ్చును. నిన్ను "సి"గను, నన్ను "బి"గను భావింపుము. ఇప్పుడు "సి" అనునది "బి" యందు లయమైయున్నది. "బి" అనునది అప్పటికే "ఎ" యందు లయమైయుండెను. దానివలన అప్పుడు "సి" అంతిమ లక్ష్యమైన "ఎ" యందు తన లయమును సాధించినట్లు కాదా? కావున, నా

గురుదేవుని వంటి అత్యంత గొప్ప పురుషుడు దొరకడు, అందుబాటులో లేడు కావున, మనము మనకు అందుబాటులో గల ఆయన తరవాతి ఉత్తమ వ్యక్తిని సంపూర్ణముగ వినియోగించుకొనవలయును.

---

57. దూరము నంతటిని ఒక్క అంగలో దాటవలెనన్న కోరిక గలదని అంటివి. అది మిక్కిలి ప్రోత్సాహకరమగు విషయము. కాని దానికి అత్యున్నత పరిమితి వరకు నీకు సహాయకరము లయినట్టి తగు ఉపాయములను అనుసరింపవలయును. ఈ సందర్భమున హనుమంతుని దృష్టాంతమును నీ స్మరణకు తెచ్చుకొనుము. ఆయన భారతదేశము, సింహళముల మధ్యగల సాగరమును ఒక్క గంతులో లంఘించినాడని చెప్పబడుచున్నది. అది ఆయన కెట్లు సాధ్యమయి యుండెను? వాస్తవమేమన, సాధారణముగ ఆయన ఎల్లప్పుడును మరచిన స్థితి యందుండెడి వాడు. దాని ఫలితముగ అవసరమయినట్టి సమయమున తన సామర్థ్యములను గూర్చి జ్ఞాపకముచేయబడువరకు ఆయనకు అవి తనకు కలవను ఎరుకయే ఉండెడిది కాదు. సీతను గూర్చిన సమాచారము కొనివచ్చుటకు సింహళము పోవలసినదిగా ఆయన ఆజ్ఞాపింపబడెను. ఆయన ఆ ఆలోచనయందే (యజమాని ఆజ్ఞను పాటించు) గాఢముగ లీనమయి యుండి ఆయన దృష్టియందు మరేదియు గాక ఆ ఒక్క విషయమే యుండెను. ఆయనకు దూరమును, మహా సాగరమును. మరి ఏ ఇతర కష్టమును గూర్చిన భావములేదు. ఆయన మనస్సునందు తన సమార్థ్యములను గూర్చిన స్ఫురణ పునరుజ్జీవింపబడి, ఆ సాహస కార్యమున కాయన ఉద్యుక్తుడాయెను. అప్పుడాయన మార్గమున కేదియు అడ్డుగ నిలువ లేకుండినది. లంకను ఒక్క గంతులోనే చేరినాడు. కావున, నీవు నీయందట్టి మరచిన స్థితిని కల్పించుకొని నడుమనున్న విషయములపై గాక గమ్యము పైననే నీ సంకల్పమును దృఢముగా నిలిపియుంచినచో, ఒక్క గంతులోనే దాని కడకు చేరగలవు. సీతామాతయే హనుమంతుని ఆలోచనా లక్ష్యము. దైవీయ మార్గముననుసరించు మీకు మిమ్ములను భగవంతుని వఱకు కొనిపోవు మీ తల్లివంటి గురువే మీ ఆలోచనా లక్ష్యము కావలసియున్నది. కావున మీ గురువువరకు మీరు చేరుకొనగలిగినచో, భగవంతుని కడకుకూడ మీ దారిని మీరు తెలిసికొనగలరు. మీ గురువు వఱకు మిమ్ములను కొనారగల విధానముకూడ అట్టిదే, అనగా మీ యందు మరచిన స్థితిని పెంపొందించుకొనుట.

---

58. మన సమాజము యొక్క అత్యంత విచిత్ర లక్షణమేమన, సంపూర్ణ వికాసములో నున్నప్పుడది అంతయు నిర్జనత్వముతో ఆవరింపబడి యుండి ఆపైన అరణ్యముగా పరిణామము చెందును. ఈ కారణముగ అది ఎట్టి రమ్యతగాని, ఆకర్షణగాని లేనిదై యున్నది. అది కొంత ఆహ్లాదకరమైనట్టి దని నేను వర్ణించిన, అప్పుడది రుచిలేనిదై యుండును. ప్రతిదశయందు రమణీయతకు అలవాటుపడి పరమానందము నన్వేషించుచుంటినని చెప్పుకొనువాడు దాని కడ కే విధముగా ఆకర్షింపబడగలడు? ఏది ఏమైనను, ప్రేమతో పిచ్చెత్తి తనకు తెలియని దానికై పరితపించుచు, రోదించు వానిచే మాత్రమే ఈ స్థితి గ్రహింప బడగలదు. అట్టి అవస్థయందున్నవాడు, తాను వేడుకలు, వినోదముల మధ్య ఉండియున్నను, అదే స్థితిని అనుభవించుచుండును. నా వరకు, నేనచ్చట యుండుట తటస్థించినను అచ్చట పరిసరములన్నియు నా ఉనికి వలన నిర్జన స్థితిచే

ఆవరింపబడి యుండును. చమత్కారి యగువాడు నవ్వు పుట్టించెడు రీతులలో దానికి అర్థము తీయవచ్చును. కాని, బహుశః అది మాత్రమే నా స్థితియొక్క సముచిత వర్ణనము. వాస్తవమునకు, మనస్సు యొక్క వర్ణమయ స్వభావము సంపూర్ణముగ మారినపుడు మూలమున గల విషయము బహిర్గతమగును. భౌతిక ప్రపంచము దృష్టిలో లేనప్పుడే, సహజముగ ఆలోచన ఇంకొక దానిపై నిలుచును. నిరంతర సాంగత్యముచే దాని కలవాడుపడిన వారికి తప్ప ఇతరులకు, అనేకులకు నా ఈ వర్ణహీనత ఎక్కువ ఆమోదకరము కాకపోవచ్చును.

శారీరక రుగ్మత యధార్థమునకు ఆధ్యాత్మిక వ్యాధులను నివారించుట కుద్దేశింపబడినది. ఏలయన, దానివలన అది సంస్కారములను కొన్నింటిని దహించివైచి, సహన శక్తినికూడ పెంపొందించును. సరియైన విధానమున ముందునకు పోవువాడు, వ్యాధి ప్రభావమున తన ఆధ్యాత్మికత స్థితి అధికముగా వృద్ధియగుటను గమనించును. ఇంతేకాక, వ్యాధి కాలమున నిరంతర భగవచ్చింతన అతనికి సుఖకరమైన కాలక్షేపమును కూడ నిచ్చును.

మానవుడు దేహమును, ఆత్మను కూడ కలిగి యున్నాడు. అతని ఉనికికి రెండును ఆవశ్యకాంశములే. ఆత్మ ప్రకటితమగుట దాని ఆధారమగు దేహములేనిదే సాధ్యము కాజాలదు. ఆ రెంటికి వాని ప్రాముఖ్యము వానికి గలదు. ఆ రెంటిని ఉచిత రీతిని గుర్తించుటకు మానవుడు కర్తవ్య బద్ధుడై యున్నాడు. తగు పోషణ ఉండుట దేహమునకు అవసరము; తన మూలమును యుక్తముగా గుర్తించుట ఆత్మకు అవసరము. సహజముగా వ్యాధి కాలమున దేహమును గూర్చిన జాగ్రత్త అంతటిని తీసికొనవలయును. కాని, అదే సమయమున రెండవ విషయమును కూడ అలక్ష్యము చేయరాదు.

---

59. జనక మహారాజు కాలమున గొప్ప మహాత్మునిగ ఆయనకు గల సరియైన స్థానమును గూర్చి పునర్విమర్శన చేయుటకు కొన్ని మాటలు. ఆయన మహాత్ములలో ఒక ఉన్నత స్థానమును కలిగియుండెను. ఆ కాలమునందలి మహాఋషులు అత్యున్నత శిక్షణము కొరకై తమ పుత్రులను, శిష్యులను ఆయన కడకు పంపెడి వాడరు. కాని, మహాత్మునిగ ఆయనకు గల ప్రాముఖ్యమంతయు కేవలము ఆయన ఆధ్యాత్మిక సిద్ధుల వలననే గాక, ఆయన రాజుగ ఉండుటవలనకూడ, ఆయన ఆధ్యాత్మిక ఔన్నత్యమును గూర్చి చెప్పవలెనన్న, ఆయన హృదయ స్థానమును దాటి అవ్యక్త గతిని పొంది, మనోమండలమున అప్పుడే ప్రవేశించియున్నాడు. మనోమండలమున గల పదునొకండు వృత్తము లన్నిటియందు, ఆ కాలము నాటికి ఆయన మొదటి దానిని మాత్రమే దాట గలిగి ప్రథమ, ద్వితీయ వృత్తముల మధ్యనుగల ప్రదేశమున తిరుగులాడుచు నుండెను.

హృదయ స్థానమున కావలనున్న మనోమండలము అహంకార గోళము. దానిని దాటినవాడు అహంకారము సూక్ష్మదశను పొందు స్థాయికి చేరును. ఇంకను ముందర కేంద్ర మండలమున ప్రవేశించినప్పుడు, అహంకరాము సారూప్యముగా రూపాంతరము నొందును. ప్రాథమిక దశలలో, ఈ సారూప్యము స్థూలస్వరూపమున ఉండును. కాని, ఆ మండలమునందు వృత్తముల పరంపర గుండా పోవుచున్నప్పుడు తన పరిపూర్ణ స్థితిని పొందునంతవఱకు అది మఱి మఱి సూక్ష్మమగును. దానిని దాదాపు అహంకారముయొక్క సంపూర్ణ నిర్మూలనముగా భావింపవచ్చును.

---

60. అభ్యాసమునకు నిర్లక్ష్యము విషతుల్యము కావున దానిని ఏ విధముగానైనను వర్జింప వలయును. గురుదేవుని గొప్పతనము మనస్సుపై స్థిరపడి ఆయనతో సన్నిహిత సంబంధమును కలిగియుండిన, నిర్లక్ష్యము ఎన్నటికిని ప్రవేశింప శక్యము కాదు. అయినను, ఆ విషయమున కావలసిన ప్రామణమునకు తక్కువగా నుండినవాడు ప్రార్థనకు పూనుకొన వలయును. వాస్తవమునకు ఈ విషయములు లయావస్థ పథమున ప్రాథమిక సోపానములై యున్నవి. తగినంతగా పురోగమించిన వారికి, పతనమునకు అవకాశము చాలమేరకు తగ్గును. పతనము నివారించు ఫలప్రదమైన సాధనము గురువు – నిజమునకు వాస్తవార్థమున గురువు – రూపముపై ధ్యానము మాత్రమే. ఈ పద్ధతి సారూప్యమును పొందుట కెక్కువ సహాయకరమగును. అది మార్గమున గల అత్యున్నత సిద్ధులలో నొకటి. లయము యొక్క ఉన్నత స్థితిగా అది వివరింపబడ నగును కూడ.

---

61. "సత్యోదయము"న రేఖాచిత్రమున చూపబడిన విధముగ మాయా వలయమునకు సంబంధించిన మొదటి ఐదు వృత్తములు అవ్యక్తగతి స్థితి వరకు వ్యాపించి యున్నవి. ఆపై పదునొకండి వృత్తములు అహంకారపు చివరి పరిమితి వరకు గల వివిధ స్థితులకు విస్తరించి యుండును. అహంకార వలయము తర్వాత వచ్చు కేంద్ర మండలము కూడ, ఏడు వలయములను కలిగియున్నది. అర్థమగుటకు వానిని ప్రకాశ వలయములన వచ్చును. ఏడు వృత్తములగుండా పయనము చేసినవాడు అంతిమ స్థితియగు పూర్ణ స్వాతంత్ర్యమును పొందును.

మానవుడు కేంద్ర మండలమున ప్రవేశించుట, తన జీవితకాలముననే అందు ఈదులాడుట ఇంతవరకు అసాధ్యమయినట్టిదిగ తెలియబడినది. భౌతిక దేహముతో అట్లు చేయుట స్వప్నమునందు కూడ ఆవశ్యకమైనదిగ భావింపబడినది. అది నా మహోన్నత గురుదేవులు, ఫతేగఢ్ వాస్తవ్యులయిన సమర్థగురు మహాత్మ రాంచంద్రజీ వారి అత్యంత మహత్తరమైన నూతన పరిశోధన. ప్రపంచమున తన భౌతిక అస్తిత్వమును కాపాడుకొనుచు ఆ అత్యున్నత స్థానము కడకు తనప్రవేశమును సిద్ధింప చేసికొని, దానిని సాధించుట, ఇతరులకు కూడ సాధ్యమగును, ఆచరణ యోగ్యముగను చేసినట్టి ప్రప్రథమ పురుషుడు ఆయన.

హృదయ మండలము, కేంద్ర మండలముల నడుమనున్న పదునొకండు వృత్తములు అహంకారపు దశలను తెలియ చేయును. దాని ద్వారా పురోగమించు కొలది స్థితి మరి మరి సూక్ష్మతరమగును. ఈ వృత్తములలో ప్రతిదాని యందు అసంఖ్యాకముగ బిందువులు, గ్రంథులు కలవు. ఆశ్చర్యకరమగు ఈ ప్రాణాహుతి యోగపద్ధతియే లేకుండిన, సామాన్యముగా ఒక బిందువు నుండి మరియొక బిందువునకు పోవుటకు ఒక సంపూర్ణ జీవితకాలము కావలసియుండెడిది. పరతత్త్వము కడకు మానవుడు చేరుకొనగల అంతిమ పరిమితిని గూర్చి స్థూలముగ అంచాన వేయుటకు ఇది తోడ్పడగలదు కూడ. ఆపైన సప్త ప్రకాశ వలయములను దాటిన పిమ్మట అనంతము యొక్క విశాలము, అపరిమితము అయిన విస్తరణయందు ప్రవేశించి ఈదులాడుటను ప్రారంభింతుము.

నిద్రాణమై యున్న కేంద్రము కూడ వలయమువలె నుండు ఏదో యొక దానిచే ఆవృతమై యున్నట్లు కనిపించును. బహుశః ఈ వలయమే చిట్టచివరిది. అనుభవమునకును, పరిశోధించుటకును, నేనొక

పర్యాయము దాని యందు ప్రవేశింప యత్నించితిని. కాని, ఆకస్మికమై నట్టిదియు, బలమైనదియు, శక్తివంతమైనదియునగు త్రోపు ఒకటి నన్ను దాని నుండి వెనుకకు విసరివైచినది. అయినను క్షణమాత్రము దానిలోనికి తొంగి చూడ గలిగితిని. మానవుడు చేరుకొన సాధ్యమగు అంతిమ పరిమితి అదియే అయి యుండగలదను తీర్మానమునకు నన్నది తీసికొని వచ్చినది. ప్రతియొక్కరును దీని వరకును, మరియు మానవ మాత్రునకు సాధ్యమయినట్లయిన దాని కతీతముగా కూడ ప్రవేశమును పొందవలెనని నాకోరిక.

---

62. కేంద్రమని మనము దేనిని పిలుతుమో అదియే నిస్సందేశముగ సృష్టికి అంతిమ కారణము. తత్త్వవేత్తలు దానిని తార్కికముగను, ప్రామాణికముగను వివరించుటకు ముందు రానిందు. కాని, అది సరియైన ఆధారము కాజాలదు. అనంతము యొక్క "నిర్జన శూన్యము" నందు ఈదులాడుచుండిన ప్రతిభావంతుని ప్రత్యక్షానుభవము. అవరోక్ష జ్ఞానముల ద్వారా మాత్రమే దానిని సరిగా అవగాహన చేసికొనుట సాధ్యము కాగలదు. ఇది నాగురుదేవుని వంటి అపురూప మహాపురుషుల ప్రత్యేక విశేషాధికారము కాగలదు. ఇంతవర కెవ్వరును భగవంతుని ఉనికి మూలమును గుర్తింప ప్రయత్నింపలేదు.

సృష్టికి పూర్వమంతటను ఆకాశమే ఉండెను. భగవంతు డుండుట అనునది తరువాతి పరిణామము. అది కనపడుటకు కొంతకాలము పట్టినది. ఆకాశము అనంతము మరియు శాశ్వతము కావున భగవంతుడు కూడ శాశ్వతుడని తీర్మానింతుము; భగవంతుడు ఉనికి లోనికి వచ్చిన పిమ్మటనే కాలము ఏర్పడినది. ఇట్లు భగవంతుని పుట్టుకకు ఆకాశమే తల్లి అయినది. కాలము దాని అభావస్థితి. ప్రతివస్తువు అనంతమున అంతము కావలసియుండును. చలనము ఎంత సూక్ష్మమగను, అదృశ్యముగను ఉండినప్పటికి, ప్రతివస్తువునందు కూడ ఉన్నది. "ఆకాశము నెవరు సృష్టించిరి" అను ప్రశ్నకూడ ఒక రడుగవచ్చును. ఇందులకు వీలగు సమాధానము ఏమన దైవము. విశ్వము సృష్టింపబడవలసిన అవసరమే ఆకాశముయొక్క ఉనికికి కారణము అని అనుట. అది ఉన్నది, ఎల్లప్పుడును ఉండబోవునది, అందుచే నిత్యము. అయితే, దానికి మారుగ ఆకాశమునే ఏల పూజింపకూడదు? ఋగ్వేదము (అందువలననే పురు–ఈశః చతుర్వేదము లన్నిటియందును కానవచ్చు పురుష సూక్తము) నందు దీనిని గూర్చిన నిశ్చయమగు సూచన ఒకటి కలదు. కాని, సరిగా విశదీకరింపకుండుట వలన అది అపరిష్కృతమైన నిగూఢ రహస్యముగనే ఉండి పోయినది. ఎవరైనను తనయందు ఆకాశపు స్థితి వంటి దాని నభివృద్ధి చేసికొనినట్లయిన, అతడు అత్యున్నత స్థితిని చేరుకొనినట్లే. అది శూన్య స్థితియొక్క చివరిదశకు సమాన మగుచున్నది. దానినే ప్రతియొక్కరు యుక్తముగ కోరవలమును. ఈ పరిష్కారము నిస్సందేశముగ ఆశ్చర్యకరమైనట్టిది; అంతేగాక, పూర్తిగ సరైనదికూడ. ఆకాశము లేక బయలు మాత్రమే పరిపూర్ణము. అది అణువులచే కూడియున్నది కాదు. అందు ఎట్టి క్రియయు లేదు. అది అత్యంత స్వచ్ఛము, అమిశ్రమమునైనది. అయితే అది అందరి మనస్సులకు గోచరమగునట్లు తెలుపుట మిక్కిలి కష్టము. పాశ్చాత్యుల పడక కుర్చీ తత్త్వజ్ఞానమునకు ఈ సిద్ధాంతము సరిపోకపోవచ్చును. న్యాయముగా దీనిని వేదములకు ఒక నూతన అనుబంధముగా భావింపవచ్చును.

---

63. ఆకాశము బయలు అయిన, అవకాశము కాలమగును. ఈ రెండును ఒకదానితో నొకటి విస్తారమైన వైవిధ్యము కలవి. ఆకాశముచే సృష్టింపబడిన కాలము, ఆకాశముయొక్క స్థూలరూపముగ భావింపవచ్చును. వాస్తవమునకు ఈ విశ్వము కాలము లేక అవకాశము యొక్క ప్రత్యక్ష రూపము. భగవంతుడు ఆకాశము లేక బయలునకు ప్రత్యక్ష రూపము. అంతర్ వృత్తము భగవంతుని సృష్టికి, బాహ్యావృత్తము విశ్వము యొక్క సృష్టికి దారితీసినవి. రెంటికిగల మధ్యభాగమే కాలవ్యవధి. మహా ప్రళయ కాలమున జరుగునట్లుగ బాహ్య ఆవరణము ఆ మధ్యనున్న భాగముతో లీనమయినపుడు ఆకాశము లేక బయలు మాత్రమే మిగిలియుండును. అనగా సారూప్యము ఆకాశముగా పరిణతి నొందును. వేరుగ చెప్పవలెనన్న సారూప్యమే ఆకాశము.

---

64. గాఢమైన భక్తి ఎట్టి విచక్షణకు తావీయదు. ఆ దశకు కొద్దిగా పైన మానవ హృదయములోనికి దైవీయ ప్రేరణలు అవతరించు బిందువు కలదు. ప్రాచీన ఋషులలో చాల తక్కువమంది దానివరకును ప్రవేశమును కలిగియుండిరి. ఇంకను పైనగల ప్రదేశములను గూర్చి చెప్పనవసరము లేదు. నిజమునకు భగవంతుని ఉనికి లోనికి కొనివచ్చిన ప్రక్రియ అదియే. దీనిని నేను "అదృశ్య చలనములు"గా పేర్కొంటిని. అవియే ఆ పిమ్మట సృష్టి కారణమునకు దారి తీసినవి.

---

65. మాయా వలయమును దాటినట్టి ఉన్మతాత్ములు ఉండవచ్చును. కాని, వారియందు అహంకారపు పదునొకండు ఆవరణముల నన్నిటిని ధ్వంసము చేసికొనిన వాడొక్కడుండుట అరుదు. వారి యందనేకులు స్థూలతరమైన వానినుండి కూడ తమను తప్పించుకొనలేక పోయిరి; సూక్ష్మతరమును, అత్యంత సూక్ష్మమును అయిన వానిని గూర్చి చెప్పనవసరము లేదు. ఏది ఏమైనను అహంకారము నుండి పూర్తిగ నివృత్తియగుట అసాధ్యమే. ఏలయన భగవంతునకును, మానవునకును మధ్య నామమాత్ర భేదముండవలసిన అవసరము కలదు. వాస్తవమునకు మానవుని భగవంతునినుండి వేరుగనుంచు తెర అదియే. ఈ తెర అథమ స్థాయిలలో స్థూలముగను, సాంద్రముగను ఉండి ఆ మండలమున ముందునకు పోవుకొలది మరిమరి నిర్మలముగను, సూక్ష్మముగను అగుచు చివరకు అది దాదాపు నామమాత్ర మగును. ఈ చివరి దశను పరిపూర్ణత్వము యొక్క చిహ్నముగా దాదాపు తీసికొనవచ్చును. ఇచ్చటనే సాధకుడు అనంతమున లయము నొందినట్లు లేక పరిపూర్ణత్వములో ఐక్యమును సాధించినట్లు తీసికొనవచ్చును. కాని అట్టివాడు నిజమునకు అరుదైనప్పటికిని, బహుశః అనేక యుగములం దొక్కమారు ఉనికి లోనికి వచ్చును. అదికూడ ప్రకృతి తన కార్య నిర్వహణకై భూమిపై ఆయన ఉనికిని కోరినప్పుడు మాత్రమే. దీనిని వ్రాయుటలో నా ఏకైక ఉద్దేశ్యమేమన అహంకార ప్రజ్ఞయొక్క చివరి దశను పొందుటకు మీరు ప్రయత్నము చేయవలెనని ప్రోత్సహించుట మాత్రమే. అచ్చటనే ఉనికి దాదాపు శూన్యప్రాయమగును. ఆ అత్యున్నత దశను పొందుటకు మార్గమున మన ప్రగతికి ఆటంకమగు పరిమితులను ధ్వంసము చేయుట ఆవశ్యకము. ధ్యేయము మనస్సున గాఢముగా స్థిరపడినచో, అనావశ్యకమైన ప్రతి వస్తువు తన ఆకర్షణను కోల్పోవును. సాధకుడు దాని బంధనముల నుండి విముక్తుడగును.

66. “సారూప్యము” ఒక సూక్ష్మమైన భావముగ ఊహించుటయే మేలని దానిని గూర్చి నేను చెప్పవచ్చును. అది తర్వాత సంకల్పముగ పరిణమించును. దానియొక్క సరియైన భావమును తెలియజేయుట కష్టము. ఎట్లైనను, మూలము యొక్క ప్రజ్ఞను మన ఎరుకలోనికి ఏది తీసికొనివచ్చునో దానినిగను లేక మూల ప్రజ్ఞ యొక్క ఇంచుక స్థూల రూపముగనైనను దానిని భావింపవచ్చును. మరియొక విధముగ చెప్పవలెనన్న, అది ఏ కొద్దిగానో స్థూలమైన ఆవరణముచేత కప్పబడియున్న సత్యమని చెప్పవచ్చును. స్థూలరూపము తన ఉనికికి కారణమైన అతీత వస్తువు ఏదియోయొకటి ఉండ వలయునను భావమును మన హృదయమునకు స్ఫురింపజేయును. అదికూడ తన వంతునకు, తనకు కారణమైన దేదియో ఒకదానిని కలిగియుండి తీరవలయునను నిర్ణయమునకు దారితీయవచ్చును. ఈ కారణ కార్య పరంపర ఆ విధముగ కొనసాగుచుపోయి, అది కూడ మన ఎరుకనుండి తొలగిపోవు స్థితికి సాధకుడు రావచ్చును. సకారణముగా దీనికి సైత మొక కారణ ముండవలయునని కూడ యొకడు చెప్పవచ్చును. కాని, అప్పుడది మానవుని ఊహ కతీత విషయమగును. అత్యంత సూక్ష్మదశ యందది సారూప్యముగా సూచింపబడునని చెప్పిన చాలును. దేహధారియగు ప్రతి ఆత్మ ఇట్టి సారూప్యమును కలిగియుండవలయును. అది మరియు నున్నత స్థాయిలలో అతి సూక్ష్మముగను, అతి సరళముగను అగును. సారూప్యము ఎంత సూక్ష్మమగునో, మానవుడు కూడ తన జీవితమున అంత శక్తిమంతుడగను.

అవతారములకు సారూప్యము లేదని కొంది అభిప్రాయము. నేను వారితో ఏకీభవింపను. ఏలయన, వారియందు సారూప్యము లేకుండెనేని తమకు నియోగింపబడిన కార్యము నెరవేర్చుటకై వారు శరీరముతో పనిచేయుట సాధ్యము కాకుండెడిది. తమ కార్యమునకు వారికి పెరిగి పెద్దదగు భౌతిక శరీరము ఆవశ్యకము. కావున నితరులకు వలెనే వారికిని సారూప్యము పూర్తిగ అవసరము.

మహా ప్రళయ కాలము వరకును సారూప్యము నిలిచి యుండును. అప్పుడది తన వ్యక్తిత్వమును లేక సారూప్యమును వీడి సమష్ఠి సారూప్యమునందు లీనమగును. తరువాత అది పునఃసృష్టికి కారణమగును. ఆవిధముగ అంతమొందునది వ్యక్తిత్వమే కాని సారూప్యము కాదు. అది అట్లుండుట మూలము లేక కేంద్రమున నిద్రాణమై యుండిన క్రియ వలననే. అచ్చట “ఉన్నది”, “లేనిది” అను వానికి మధ్య వ్యత్యాసము కేవలము నాకు మాత్రముగా నుండును.

---

67. వ్యక్తిగత ఆత్మ అయినట్టి జీవము వ్యక్తిత్వమును ధరించినపుడు తన ఉనికిని తెలిసికొనును. అదియే దాని ఉనికికి ఆధారము. ఆదియందు జీవము. బ్రహ్మము సరిపోలి యుండినవి. ఈ రెంటికిని మధ్య భేదమును కలుగచేసినది జీవము యొక్క వ్యక్తిత్వమే. ఇప్పుడు. ఆత్మగానున్న జీవము, అహంకారము లేక వ్యక్తిత్వమున బంధింపబడి ఉనికి లోనికి వచ్చెను. అది యుండిన మండలముకూడ తన ప్రభావమును ప్రసరింప నారంభించెను. వివిధ వర్ణములు, ఒకదాని వెనుక మరియొకటిగ, దాని చుట్టును స్థిరపడి దానికొక క్రొత్త వన్నెను సమకూర్చినవి. ఒక విధముగ దానియందు వివిధత్వము స్థిరపడ నారంభించినది. అహంభావము క్రమక్రమముగ దట్టమైనదిగను, సాంద్రముగను వృద్ధిఅయి పెరుగనారంభించినది. భావములు, మనోవికారములు, కోరికలు వాని వంతునకు అవి దీని స్థౌల్యము నెక్కువ చేయ నారంభించెను. ఇట్లు జీవము,

బంగారు పక్షివలె, శరీరమనెడి లోహపంజరము నందు పూర్తిగ నిర్బంధితమయ్యెను. ఇది అంతయు అహంకార వలయము నందలి సంకల్పములు, మనోవికారములు, కోరికల యొక్క క్రియ, ప్రతిక్రియల ఫలితముగ సంభవించి, దాని మందత్వమును పెంచుచు పోయినది. నీ జీవము యొక్క చరిత్ర అంతయు సంక్షేపముగ నిదియే. అది అదృష్టవశమున తన మూలమును గుర్తింప చేయగల వానితో చుఱుకైన సంబంధమును కలిగియుండుట తటస్థించిన, అప్పుడది తన ఆవరణముల నన్నిటిని ఒకదాని వెనుక మరియొకటిగ త్రోసివేయుట నారంభించును. కాని, జీవము చలనమును కలిగియుండుట వలన అది తన సృష్టికర్తను, అనగా బ్రహ్మమును, గుర్తెరిగి యుండును. ఇట్లు "జీవ" శబ్దము తనయందు చలనమును, యోచనాశక్తిని కూడ కలిగియున్నది. జీవమునందీ రెండును సమానాంతరములు. ఆ విధముగ జీవము, బ్రహ్మముల రెండింటి చర్య ఇంచుమించు సమానము. బ్రహ్మము విశ్వవ్యాప్తమై యుండ, జీవము తన సంకుచిత పరిధికే నియమితమై యుండుటయే ఈ రెంటికిని గల తారతమ్యము. ఈ విషయమున బ్రహ్మము కూడ జీవము వలెనే తన స్వీయ బంధనముల యందు చిక్కుకొని యున్నదని చెప్పవచ్చును. తేడా ఏమన బ్రహ్మము యొక్క బంధనముతో పోల్చిచూచిన, జీవ బంధనము సాంద్రమును, స్థూలమును అయియున్నది. రెంటికిని పరిమితులు కలవు. ఇదియే బ్రహ్మమును గూర్చిన సరియైన భావన.

మనయందు చలన, కంపనముల ఉనికి బ్రహ్మముతో మన సంబంధమును స్థిరపరచును. కాని, క్రమేణ అదియే మనకు బంధనముగ పరిణమించును. మన అంతియ ధ్యేయము గాలి కాని, వెలుతురు కాని ప్రవేశింప వీలు లేనిది. అది యెట్టి క్రియా చలనము లేని సంపూర్ణ ప్రకాశ రహిత స్థానము. ప్రజలు ప్రకాశమును గూర్చి యెక్కువ ఆర్భాటము చేయుదురు. నేను చెప్పినట్లుగ అది అనంతము కడకు మన యాత్రా మార్గమున ఒక తాత్కాలిక అవస్థ మాత్రమే. గమ్యమునకు మనము చేరునప్పటికి అది పూర్తిగ అంతమొందును. ప్రకాశమునై ఆక్రోశించుట తన వర్ణపూరిత్వమును ప్రదర్శించు ఒక పిచ్చిభ్రమకు ఏమియు తక్కువకాదు. దీనికి తోడు ఆ భావమునందు సాధకుడు తరచు ఒక విధమైన మనోరంజనము ననుభవించును. కాని, మనోరంజనతా భావమున్నంత వరకును అది గుఱికన్నను తక్కువై యుండును. అది, అప్పుడతి సున్నితమైన స్థితి యందుండినను, మాయ యొక్క ప్రతిబింబము మాత్రమే. ఏది ఎటులైనను మిమ్ముల నందరిని ఊహాతీత మయినట్టియు, మానవుడు చేరుకొన సాధ్యమగు అంతిమ పరిమితి అయినట్టియు నిర్జన శూన్యప్రదేశమునకు తీసికొన పోవ ప్రయత్నించుచున్నాను.

---

68. "మహాత్ముడు" అను పదము పలు విధములుగ నిర్వచించబడియున్నది. అది బహుశః సకారణమగు ఆధారము లేకుండి కాదు. కాని, దానికి నా నిర్వచనము "స్థితి రహితవ్యక్తి". అది కొంత వింతగ నున్నను, సార్థకమే అగును. ఇది ఆధ్యాత్మికతతో "అతీతముగా" పోయిన వానికి సంబంధించునని కూడ అర్థము తీయవచ్చును. కాని, ఆధ్యాత్మికతను కాంక్షించు వారికది అంగీకారము కాకపోవచ్చును. దీని నిజమగు భావ విశేషమును వివరించుటకు నేను మరికొంత లోతునకు వెళ్ళినచో అది అర్థము కాదేమో అని నా భయము. కావున ఈ విషయము నింతటితో ఆపివేయుట మంచిది.

---

69. మానవుడు బలహీనుడు. నిజమైన అర్థమున అసలైన బలహీనతా భావమే ఒక బలము. 'బలము' (Power) 'శక్తిహీనము' (Powerless) అను రెండు పదములను ఉచ్చరించునపుడు వాని శబ్ద విషయమును పరిశీలించెదము. 'బలము' (Power) అను పదమునందు ఉచ్చారణయొక్క స్వరము ఒక బిందువున హెచ్చు గావింపబడును. దాని ఫలితముగ అది పొట్టిదైనది. 'బలహీనము' (Powerless) అనుపదమునందు అది రెండు స్థానములందు, అనగా ప్రారంభమున మరియు అంతమున కలదు. 'బలహీనము' (Powerless) అనుపదము రెట్టింపు శక్తిని కలిగియున్నదను నిర్ణయమునకిది మనలను కొని వచ్చును. ఇప్పుడు మనము 'బలయుతము' (Powerful) అను పదమును కూడ తీసికొందము. మూడు శబ్ద విభాగములను కలిగియుండి, ఇది కూడ ఉన్నతముగ ధ్వనించును. అందు రెండు శబ్ద విభాగములు 'బలహీనత' (Powerless) వలెనే సమానశక్తిని కలిగి యున్నవి. ఒకటిగా నుంచబడిన సమానశక్తులు పరస్పర వ్యతిరేకముగ పనిచేయుచు ఒకదాని కొకటి దూరమగును. కావున, ఆ క్రియ ప్రభావహీన మగును. 'బలహీనము' (Powerless) అను పదము సామాన్యముగా భగవంతునికి, కేంద్రమునకు ప్రయోగింపబడును. దానియందు ఏ బలము నిజముగ లేదు. కేంద్రము నందున్నట్లుగా, బలహీనత తనయందు బలముయొక్క భావమును అచల స్థితలో కలిగియున్నది. ఇప్పుడు, కేంద్రము బలము అంతటికిని మూలముగా తెలియబడుచున్నది. దాని అర్థమేమన బలహీనతగా వివరింపబడు అచలస్థితియే బలమును నిజముగా ఉత్పత్తిచేయునట్టిది. సంక్షిప్తముగా ఒక్కమాటలో చెప్పవలెనన్న కార్యరూపమున గల శక్తియే బలము; అచలస్థితియందు అది బలహీనము. ఆ విధముగ బలహీనతయే బలమునకు మూలము లేక ఉత్పత్తి స్థానము లేక ఒక అర్థమున అత్యంత అపరిచితమైన బలము అదియే అను తీర్మానమునకు మనము వత్తుము.

బాహ్యక్రియను కాని, వేరు మాటలలో బలముయొక్క బాహ్య ప్రవాహమును కాని, ఏ విధముగానైనను అరికట్టగలిగినచో అది సమత్వమగును. దాని ఫలితముగా నది అత్యంత ప్రభావవంతమగును. మూలమున అచలితమైయుండి, ఇచ్చానుసారముగ క్రియాశీలకమగు ఆ అంతిమ స్థితియందు మీ రందరును లయము పొందెదరని నా అపేక్ష. కాని, తన సంకల్పమును సంపూర్ణముగ రహితము గావించుకొనియుండి, వ్యక్తిగత మనస్సును యుక్తముగా క్రమపరచి, సమత్వమును పొందునట్లు చేయగలిగినప్పుడు మాత్రమే అది సాధ్యము కాగలదు. అప్పుడతని యందు మిగిలి యుండునది "శూన్యము" తప్ప మరేమియు కాదు.

---

70. దేవుళ్లు, దేవతలను గూర్చి చెప్పవలెనన్న, దేవుళ్లు మరణము నొంది మన రూపమును పొందుచుండ, మనము మృతినొంది దేవుళ్ళ మగుదుమని చెప్పవచ్చును. వారుకూడ జనన మరణ బంధనముల నుండి ముక్తిని పొందినవారు కారని దాని అర్థము. ఆ ప్రకారముగ దేవుళ్ళ నారాధించుట ఎన్నటికిని జనన మరణ బంధనముల నుండి ఒకనిని బయటికి తీసికొనజాలదు. దాపటికము లేకుండ పలుకవలెనన్న, నిజమునకు దేవుళ్ళు మన సేవకే యుండిరిగాని, మనము వారి సేవకు కాదు. ఈ నిజమును సరిగా లక్ష్యపెట్టినచో, ఈ దేవుళ్ళు తామే సాక్షాత్కారమునకై ఆకాంక్షించుచుండగా, మన సాక్షాత్కార సాధనయందు వారు మన కెంతవరకు సహాయకారు లగుదు రనుదానిని ఎవరికి

వారే నిర్ణయించుకొనినిండు. దేవుళ్ళ సేవయే ఈ ప్రయోజనమునకు సరిపోయిన యెడల వేరు ఉపాయములకై సాధకుడు అన్వేషింపడు. అందువలన, సాక్షత్కారమునై దప్పికగొని యున్నవాడు తన దప్పికను తీర్చుకొనుటకు తగిన ఉపాయములను కనుగొనుట ఆవశ్యకము.

---

71. భగవంతుడొక్కడే, కేవలము ఒక్కడే. కావున, కేవలము ఆ ఒక్కనిని సాక్షాత్కరించుకొనుటకు మనము ఒక్కదానినే చేపట్టవలయును. త్రిమూర్తిత్వ భావము నిన్ను అనేకత్వము కడకు కొనిపోవుట నిశ్చయము. దానివలన ధ్యేయము పోగొట్టుకొనబడును. కాని, ఒకడు సరియగు ఉపాయములు తన దృష్టియందు  లేకుండునంతవరకు దేవుళ్ళ ఆరాధన కంటిపెట్టుకొని యుండవచ్చును. సరియగు మార్గము నాతడు కనుగొనినప్పుడు, అంతకంటెను శ్రేష్ఠమైనది, ఉన్నతమైనది అయిన దానికై వానిని త్యజించి, పరతత్త్వ సాక్షాత్కారమునకై సూటి మార్గము ననుసరింపవలయును.

---

72. అవతార సిద్ధాంతమునందు నాకు విశ్వాసమున్నది. వారి యందు శ్రీరామచంద్ర ప్రభువు ఒకడు. తన పరిపాలన కాలములో ఆయన అపార సహాయకారిగా నుండెను. కాని, శ్రీకృష్ణ భగవానుని ఆగమనముతో రాముని పరిపాలన అంతరించినది. ఇప్పుడున్నది శ్రీకృష్ణ భగవానుని ఆధిపత్యము. తరువాతి అవతారము ప్రపంచము లోనికి వచ్చువరకును ఇది కొనసాగును. ఇది ప్రకృతియొక్క గోచర విషయము. మీ అవగాహనకై నేను దీనిని వెలుగులోనికి తెచ్చితిని.

---

73. నా వరకు చెప్పవలెనన్న, దేవుళ్ళు వారిప్పుడుండునట్లే నేను నా గురుదేవునికి నన్ను సమర్పించుకొనుటకు ముందుకూడ యుండిరి. కాని, వారియందొక్కరైనను నన్ను ఔన్నత్యమునకు లాగుట కెన్నడైనను సుముఖముగ లేకుండిరి. అభ్యాసమునందు సహాయము చేయుటకై నా గురువు మాత్రమే నన్న తీసికొనిరి. ఇప్పుడు నే నెవరికి ఋణపడి యుండవలయును -- దేవుళ్ళకా లేక నా సమర్థ గురుదేవులకా ?

వాస్తవమునకు దేవుళ్ళు, ప్రకృతి తన ఉద్దేశ నిర్వహణమునకై నియమించబడిన వివిధ శక్తులు మాత్రమే. కావున, ఆ విషయమునందు వారు ఒక యంత్రమున గల వేర్వేరు భాగముల వంటివారు. అవతార పురుషులు కూడ భగవంతుని పూజింపుడని జనులను ప్రోత్సహించిరి. వారి ననుసరించువాడు వారి ఉపదేశమును  అక్షరాల పాటింపవలసినదే. భగవంతుని స్తుతించుచు కీర్తనములను గానము చేయుట భక్తి భావమును పెంపొందింపవచ్చును. ఆ విధముగ నవి కొంతవరకు ఉపయుక్తము కావచ్చును. కాని, నీయొక్క నిజమైన సమస్యను పరిష్కరించుటకు అవి యెన్నడును నీకు సహాయకరము కావు. అందువలన, నీ తీరిక సమయములందు భగవంతుని సర్వవ్యాపిత్వముపై నీ ఆలోచనను నిలిపి, నీకు సమయ మున్నంతవరకు ఆ ఆలోచనయందే ఉండుటకు ప్రత్నింపుము. ఇది నిరంతర స్మరణము మరియు వినోద కాలక్షేపము అను రెండు ప్రయోజనములకు ఉపయోగపడవచ్చును. దీనిని ప్రతియొక్కడు మిక్కిలి శ్రద్ధతో  అనుసరింపవలయును.

---

74. పండితులైనట్టి మత బోధకులు సామాన్యముగా దేవుళ్ళను, దేవతలను ఆరాధింపుడని జనులను పురి కొల్పుదురు. కాని, తా నే విషయములను గుర్తించియున్న అనుభవశీలియగు మనుష్యుని విషయము అట్లు చేయుట ఎన్నటికిని జరుగదు. పండితులు కేవలము గ్రంథముల నధ్యయనము చేసియుండగా అనుభవజ్ఞుడు గ్రంథముల సారమును రుచి చూచి యుండును. ఆ ప్రకారము వారిమధ్య అపారమగు వ్యత్యాసము కలదు. మార్గమున అంతిమ బిందువు వరకును పయనించిన వాడు మాత్రమే ఇతరులను విజయవంతముగ నడిపింపగలడు. పండితులైన గురువులు అధికముగా, దారి ఎచ్చటకు కొనిపోవునో తెలిపెడు దారి ప్రక్కని గుర్తు స్తంభముల వంటివారు. వారు చేయగల పని అంతయు నిదియే. భౌతికత్వమునుండి విముక్తిని పొందుటే లక్ష్యముగా కలిగిన వారు భౌతిక రూపములపైనను, స్థూల సిద్ధాంతముల పైనను ఆధారపడుట నిస్సందేశముగా మిక్కిలి వింతగ నున్నది. తమకే కొరత అయినట్టి మహోన్నత స్థితికి దేవుళ్లు నిన్ను ఎన్నటికిని కొనిపోలేరనుట నిశ్చయము. నీవు నీ సూక్ష్మమైన ఉనికిని కూడ అంతము కావించుకొనవలసి యుండగా, మొదట వివరించినట్టి ఉపాయములచే నీ భౌతికమైన ఉనికిని బలీయమగునట్లు చేయుచుంటివి. వేరు మాటలలో అది ఆధ్యాత్మిక మరణమే.

---

75. యోగమార్గము ననుసరించినట్లయిన, జీవితాంతమువరకు తీవ్ర క్లేశములను, కష్టములను ఎదుర్కొనవలసియుండునని కొందరు చెప్పుదురు. అది దుర్బలత్వమును, మూఢ విశ్వాసమును కలిగియున్న జనుల అభిప్రాయముమ. అనుభవపూర్వక ఆధారములపై అది ఎన్నటికిని ఒప్పుకొనబడరానిది. అయినను, ఒకే జన్మయందు క్లేశముల ననుభవించినట్లయిన, తరువాత జన్మలన్నిటియొక్క దుఃఖములనుండి రక్షింపబడు నవకాశ మున్నది కావున, అట్లు జరిగినను అందు తప్పేమి కలదు? కావున దయయుంచి నీ స్వీయ విచక్షణా జ్ఞానము నుపయోగించి నచ్చినట్లనిపించు నదేదియో దానిని చేయుము; లేనియెడల, అనుభవ జ్ఞానమును కలిగిన ఒకనిపై ఆధారపడుము.

---

76. జపమునకు నేను వ్యతిరేకిని కాను, కాని, సాధారణముగా అనుష్ఠింపబడు విధానములను నే ననుమతింపను. వాస్తవార్థము యొక్క అవగాహన లేకుండ సంకల్పముతో జోడింపబడకుండ, కొన్ని పదములను గాని లేదా పదసముదాయములను గాని రామచిలుకవలె వల్లించుట జపము కాదు. మన విధానమునందు కూడ అవసరమయినప్పుడు, కొన్ని సమయములందు, జపము నిర్దేశింపబడును. కాని, అది భిన్న ప్రకృతి కలిగినట్టిది; పూర్తిగా భిన్నమైన పద్ధతిలో నది అభ్యసింపబడును. ఉదాహరణమునకు, సామాన్య సాధనయొక్క ఆవశ్యక లక్షణములలో గాయత్రి జపమొకటి. కొన్ని సందర్భములలో నుపదేశింపబడు ఇతర జనముల ప్రవేయము లేకుండగనే అది అనేకులచే అనుష్ఠింపబడుచున్నది. దానిని చేయవలసిన విధానము ఈ క్రింది విధముగా నున్నది. అభ్యాసి ధ్యాన భావమున కూర్చుండి దాని అర్థమును దృష్టియందిడుకొని మానసికముగ రెండు, మూడు పర్యాయములు ఉచ్చరింపవలయును. అప్పుడతడు దాని భావముపై ధ్యానించుటను మొదలిడవలెను. పదములు సహజముగ అతని ఎరుకనుండి తొలగిపోయి, భావము మాత్రమే

అతని మనస్సున మిగిలియుండును. కొంతకాలము తర్వాత దానియందు లీనమైనప్పుడు ఆ భావము కూడ అదృశ్యమైన ప్రార్థనకూడిన మనోభావమందు లీనమగుట తప్ప యింకేమియు నుండదు. అదియే సరియైన విధానము. ఈ పద్ధతిలో అనుష్ఠింపబడు జపము అత్యున్నత మూల్యము కలది మరియు అభ్యాసియొక్క ఆధ్యాత్మికాభివృద్ధికి అపార సహాయకారి.

---

77. భగవత్ప్రేమకు బదులుగ గురుప్రేమకు సంబంధించిన నీ అభిప్రాయము సూటిగ సరిపోవునట్టిది. ఒకమారు, ఒక అభ్యాసిలో భగవత్ప్రేను పెంపొందించుచు ప్రాణాహుతి నిచ్చుచుండగా, నా గురు దేవులు దానికి మారుగ అతనియందు గురుప్రేమను నిపుమని నన్నాదేశించిరి. నా బిడియపు స్వభావము నన్ను అట్లు చేయనివ్వదు. ఏలయన, నేనా విధముగ పూజింప బడుటకు అపేక్షింతునని ఎవరైనను అనుకొనవచ్చునని నా భయము. ఇతర సంస్థలు చాలవానిలో గురువేషధారులు, కుహనా గురువులు కూడ దీనిన సంకోచము లేకుండ బోధింతురు. అంతేకాదు, విధింతురు కూడ. సిద్ధాంతరీత్యా దానియందెట్టి దోషము లేకుండినను, ఆచరణము నందు బహుశః కొదిమంది మాత్రమే ఈ పద్ధతికి అర్హులు. అట్టి సందర్భములన్నిటిలోను ఫలితము సాధారణముగా గురువు, శిష్యుడు ఇద్దరును మరి మరి స్థూలత్వముచే నింపబడి యుందురు. అత్యంత పతనకరమైనట్టి ఈ దౌష్ట్యము నుండి నా సమర్థ గురుదేవులు నన్ను కాపాడిరి. ఆయన మనల నందరిని దానినుండి ఎల్లప్పుడు రక్షించుగాక !

---

78. సాధనయందనాసక్తి కలుగుట ప్రేమ, భక్తి లేకపోవుట వలననే అను నీ అభిప్రాయము సరియైనది. కాని ప్రేమించుటకును, కొనియాడుటకును ఈ ప్రపంచమున అనేకములుండగా, భగవంతుని ప్రేమించుటకు వారిని ప్రోత్సహించుటెట్లు అనునది సమస్య. ప్రోత్సాహము ద్వారా వారు దీనికి రావచ్చును. కాని, స్వల్పకాలము తర్వాత మరల దానిని వదిలివేయుటకు మాత్రమే. వారి హృదయములను వశపరచుకొని, ఈ పథమునందు వారిని బద్ధులుగా నుండునట్లు చేయుటకు ఇచ్చట ఎట్టి ఆకర్షణ కాని, రమ్యతకాని, ఆనందము కాని లేవు. ఏమైనను వారి బాధ్యతనంతయు నాపైనను వేసికొని సమస్త బంధనముల నుండి వారిని విముక్తి కావించుటయే నాకు గల మార్గాంతరము. కాని అది నాకు మితిమీఱినది కావచ్చును. ఉన్నతస్థితిని పొందిన నా సహచరులలో కొందరిని నాకు సహాయము చేయుటకై తీసికొని వారుకూడ నావలెనే మితిమీఱిన భారమును మోయవలసి యుండును. అందువలన, ప్రతియొక్కరు కర్తవ్యమున తన భాగమును గుర్తించి, దానికి చిత్తశుద్ధితో అంటిపెట్టుకొని యుండుట ఆవశ్యకము. సంస్థకు సేవ, ప్రతి అభ్యాసియొక్క కర్తవ్య భాగమేకాక, అతనికి ఆధ్యాత్మికముగ అత్యంత లాభదాయకమని గుర్తించిన వారు కొద్దిమంది మాత్రమే ఉండునట్లగపించుచున్నది. ఇంతేకాక ఏది అభ్యాసికి ధ్యేయమై యుండవలసి యున్నదో అది గురువునకు కూడ ప్రతికరము కావచ్చును. కాని, ఈ అత్యంత సామాన్యాంశమును జనులు గణనలోనికి తీసికొననప్పుడు చేయవలసినదేముండును ? దురదృష్టవశమున తమ అభిరుచులకు, ఇచ్ఛలకు సరిపడని దానిని దేనినైనను పొందియుండి అది న్యాయమును, యుక్తమును అయినప్పటికిని దానికి విసుగుచెంది వారు కొందరుండవచ్చును.

---

79. అభ్యాసి మొట్టమొదటి నుండియు శ్రద్ధ మరియు పట్టుదలతో అభ్యాసమునకు తాను అంకితము కావలెనని నేను నీతో అంగీకరింతును. నీ అభిప్రాయము మెచ్చుకొన తగినది. మీ సత్సంగమున నీవు దీనిని ప్రవేశపెట్ట వలయునని నా అభిమతము. సామాన్యముగ సమయము చిక్కుటలేదని మొరపెట్టుకొను వారిని నేను చూచెదను. పూజయందు నియమమును పాటింపక పోవుటకు అది వారికి తగినంత సాకు. పూజ (సజీవధ్యానము)కు తప్ప తమకు ఇష్టము, అభిరుచి ఉన్న ప్రతి విషయమునకు ప్రతియొక్కరును ఏదో విధముగా సమయమును దొరుకునట్లు చేసికొనెదరని నా అభిప్రాయము. దీనికి కారణము ఆసక్తిలేకుండుటయే కాని, సమయము లేకుండుట కాదనునది స్పష్టము. కాని దానికెక్కువ కాలమును నాకు నేను యెన్నడును వినియోగింపనప్పుడు నేనీ సందర్భమున ఏమి చెప్పగలను? అయినను, నేను దానిని ఏ రోజునను వీడలేదు. నా గురుదేవునికిది తెలియును. కాని, నేనన్నివేళలయందు నిరంతర స్మరణముతో తీరిక లేకుండి, ఒక్క క్షణమైనను దానిని విడిచి యుండలేదు. ఈ కారణముననే ఆయన ఎన్నడును నా స్వల్పకాల అభ్యాసమునకు అభ్యంతరము చెప్పలేదు. నేనెక్కువ కాలము ధ్యానమునకు కూర్చొనక పోయినప్పటికిని, వాస్తవమునకు నేనెన్నడును, క్షణముకూడ దాని నుండి దూరము కాలేదు. తత్ఫలిగముగా నా గురుదేవునిచే దైనందిన పూజనుండి నేను విముక్తుడనైనప్పుడు నేను అపరిమితమైన ఆనందము ననుభవించితిని. అయినను, ఆచరణార్థమున అది మినహాయింపు కాదు. కాని, విధానము నందు మార్పు మాత్రమే.

---

80. నిజమైన శిష్యుడు తన గురువు ననుకరించుటకు ప్రయత్నింప వలయునని చెప్పబడినది. కాని అదే సమయము, శిష్యుడు గురువు తనను చేయుమని ఆజ్ఞాపించిన దానినే అనుసరించవలెననియు, నిజమునకు గురువు చేయుదాని ననుకరింప కూడదనియు చెప్పుదురు. ఈ రెండు ఆదేశములను సమన్వయపరచు టెట్లు అను ప్రశ్న ఉదయించును. నిజమైన గురువు తన బాహ్య విషయములకును, అంతర్విషయములకును సంబంధించిన అసాధారణ సద్గుణములను కలిగిన వానిగ తెలియబడును. ఆ సద్గుణములను అభ్యాసి అనుకరించినచో అతడు అదేరీతిని పరివర్తనము నొందును. ఈ దృష్టితోనే అభ్యాసి గురువు ననుకరించవలెనని చెప్పబడెను. రెండవ ఆదేశము కూడ ఉచితమే. అభ్యాసిని గురువు చర్యలను గాక ఆజ్ఞలను అనుకరింపవలెనని అది ఆదేశించును. గురుని ఆజ్ఞ ఎల్లప్పుడును అభ్యాసియొక్క హిత ప్రయోజనమునకే అగుననుట నిశ్చయము. కావున, దానిని ప్రశ్నింపక అనుసరించుటయే సముచితము. ఇప్పుడు దాని తదుపరి భాగము వాస్తవమునకు అదియట్లు లేకున్నను కొంచెము తికమగ పెట్టునదిగ అగపడుచున్నది. కారణమేమన కొన్ని అసాధారణ సందర్భములలో గురువు సామాన్య క్రమశిక్షణ నియమములకు వ్యతిరేకముగా నడువవలసి వచ్చు పనిని చేపట్టవలసి యుండును. ఉదాహరణమునకు నేనొకమారు వేశ్యావాటికగుండా వెళ్ళవలయునని ఆజ్ఞాపింపబడితిని. దాదాపు ప్రతియింటిని శ్రద్ధతో చూచుచు, నేను ఆ వాటికగుండా పోవలసి యుండెను. ఎవడైనను నన్నాస్థానమున చూచియుండిన, అతడు నన్నుగూర్చి ఎట్టి దురభిప్రాయము నేర్పరచుకొన యుండెడి వాడు? అట్టి సందర్భములనేకము

లున్నవి. ఇతరులయెడ కూడ ఇది తరచు సంభవించుచుండును. కాని ఆ కారణమున వారియందెవ్వరును పతనమైనారని అర్థము కాదు. మాలిన్యత, అపవిత్రత నుండి విముక్తి కాబడిన పథమున మీరందరును పయనింపవలయునని నా కోరిక. విధి యిచ్ఛానుసరణమున, నామార్గము ముఱికి, రోతలగుండా యున్నది. అచ్చట ఆద్యంతము కాపాడుటకు ఉత్కృష్ట భగవచ్ఛక్తి లేకుండెనేని అసహ్యము సులభముగ కలుగును. నా ప్రపంచమట్టిది. అందు నేనుండవలసియున్నది. అందు ప్రశాంతత ఎంతయో కొరవడియున్నది. అయినప్పటికిని, దానికి మారు మీరందరు ప్రశాంతతలో నుండవలెనని నా కోరిక. క్లుప్తముగ నాకుండినదిదియే – కేవలము మురికి కాలువలను, కూపములను చూచుచు, వ్యధిత హృదయముతో తిరుగులాడుట. బయట పడుటకు కష్టమగునంతగా నేనీ స్థితియందు చిక్కియున్నాను. వేరు మాటలలో ఇది నా జీవితములో ప్రాథమిక లక్ష్యమైనది. నా గురుదేవులు, ఒకమారు నా స్థితిని గూర్చి వ్యాఖ్యానించుచు, మానవుడు ఔన్నత్యమునకు పోవుకొలది అతని దృష్టియందల్పత్వము అధికమగునని పలికిరి. కాని, ఇది యుగముల పర్యంతమున కూడ మానవునికి అరుదుగ ప్రసాదింపబడు అత్యంత గొప్ప వరము.

81. ప్రగతి పతమున అభ్యాసిని పైకి త్రోయుటలో తగని తొందర మానుకొనవలయును. ఈ విషయమున నా గురుదేవులు కూడ ముందు జాగ్రత్త తీసికొనిరి. బహుశః ఆయన ఎన్నడు నావిషయమున అట్లు చేసియుండరు. అయినను, ఈ భౌతిక ప్రపంచము నుండి వెడలిపోవు విశేష సందర్భమున ఆయన తన శిష్యులకు ఎంతయో ధారపోసిరి. ఇంత సుదీర్ఘ కాలము వరకు కూడ వారు దానిని జీర్ణించుకొనలేక పోయిరి. ఆయన కృపాకటాక్షముచే నా అంతరికదృష్టి తెరవబడినపుడు నేను దీనిని కనుగొంటిని. తత్ఫలితముగ, నితరులందు ఒక్కరును దానిని జీర్ణించుకొను సామర్థ్యము లేకుండిరి. కావున అది అంతయు నాయందే మిళితము అయిపోయెను.

కొన్ని అసాధారణ సందర్భములను మినహాయించిన, దాదాపు అన్ని విషయములందును వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి అవసరమయినట్టి ప్రతివస్తువును వారియందు నేను చొప్పింపవలసి యుండినదని నా అనుభవము నాకు తెలుసుచున్నది. అయినను ఒక్క క్షణమైనను నా దృష్టిని మళ్ళించిన, ప్రతియొక్కరు దిగజారి పోవుచున్నట్లుగ పడెడిది. ఇది ఆసక్తి లేకుండుట వలననే కాని మరిదేని వలన కాదు.

సామాన్యముగా నుండు ఈ దోషముల వైపునకు నీ దృష్టిని లాగి, వానిని తొలగించుటకు తగు ఉపాయముల ననుసరిప చేయుటకు మాత్రమే నే నిది వెల్లడించితిని.

---

82. సృష్టి కార్యమునకు పూర్వమంతటను పరిపూర్ణమై ప్రశాంతత వ్యాపించి యుండెను. బలము లేక శక్తి కూడ దాని మూలము నందు ఘనీభవించి యుండెను. కాని, మార్పునకు సమయము వచ్చినది. చలనము జాగృతమై వస్తువులను క్రియాత్మకము కావించెను. ఫలితముగ, ప్రకృతి ఇచ్ఛానుసారము రూపములు, ఆకృతులు ఏర్పడినవి. దేనిని మనము క్రియాత్మక శక్తి అని పిలువ వచ్చునో అట్టిది ఏదోయొకటి దీనికంతటికి మూలమున నుండెను. ఏది లేకుండగ అది పని చేయలేక పోవునో అట్టి ఆధారము దానికి కూడ కావలయును. అదియే అంతిమ సత్యము. ఆవిధముగ సృష్టి చలనము యొక్క ఫలితమని, ఆ చలనము ఆధారము యొక్క ఫలితమని తీర్మానమునకు వత్తుము.

---

83. మానవుడు, వ్యక్తతయందుఒక భాగముగ ఇతర జీవులన్నిటి వలెనే, మూలశక్తి యొక్క ప్రభావమునకు లోనైయున్నాడు. అవతారములు కూడ అట్లే. సామాన్య మానవునికి అవతారమునకు తారతమ్యమేమన మానవుడనేకములగు ఆవరణములచే ఆచ్ఛాదింపబడియుండ, అవతారము వానిని చాల తక్కువగా కలిగియుండును. వారి గ్రహణ శక్తి యందు దివ్యత్వముండగా, మానవుడట్టిదిలేనివాడుగ నున్నాడు. ఆవిధముగ మానవుడు, అవతారముల మూల మొక్కటియే అయినను, అవతారము దివ్యతముతో ఎక్కువ సంబంధమును కలిగి యుండును. అవతారమునకు కావలసిన దంతయు శాశ్వత భాండారము నుండియే వచ్చును. తన కార్యమున తనను నడిపించుటకు దివ్య ప్రేరణములుగను, దివ్యవాణిగను సామాన్యముగా తెలియబడు దివ్యాదేశముల నాతడు పొందు చుండును.

మానవునికి కూడ దివ్యాదేశములను పొందుట సాధ్యము, కాని అతడట్టి ఉన్నత స్థితినే పొందినపుడు మాత్రమే. మానవుని మూలము విశ్వము యొక్క మూలము వంటిదే. అదియే క్షోభము (ప్రథమ చలనము) అని తెలియబడునది. అది చలనమును, క్రియను రేకెత్తించినది. క్షోభము యొక్క ప్రతిబింబము మానవుని యందును, ఇతర ప్రాణుల యందును కూడ ఉన్నది. అది అచ్చటలేని యెడల ఎట్టి క్రియయును సాధ్యము కాదు. క్షోభయొక్క ఈ ప్రతిబింబము మానవునియందు మనస్సుగా తెలియబడుచుఉన్నది. అది ఉనికి యొక్క అత్యావశ్యక అంశము. క్రింది ప్రదేశమున లేక పిండదేశమున అది పిండ మనస్సు గాను, బ్రహ్మాండ మండలమున అది బ్రహ్మాండ మనస్సుగాను తెలియబడుచున్నది. ఇంకను ఉన్నత స్థాయిలలో అది మరింత సూక్ష్మమగుచునే యుండును. ప్రతిస్థాయి యందలి స్థితులు ఇతర స్థాయిలలోని వానికి భిన్నమగును. అవి అసంఖ్యాకములు కావచ్చును. అవతారములు క్రియా చైతన్యమును కలిగియున్నారు. కావున మనసుసను కలిగియుండుట వారికి కూడ అవసరమైనది. కాని వారికి శుద్ధతరమును, మఱింత సమత్వమును కలది. వారి చర్యలు భగవదిచ్ఛకు కచ్చితముగా అనుగుణముగా నుండును. అవతారములు వనస్సును కలిగియుండవని భావించుట తప్పు.

---

84. ఉన్నత సిద్ధులను కలిగియున్న మహాత్ములు సామాన్యముగ మనోమయ కోశమునుండి విముక్తి నొందుదురు. వారికి మనస్సు లోపించునని దాని అర్థము కాదు. క్రింది ప్రపంచమునకు వారిని బద్ధులుగా నుండునట్లు చేయు ఆవరణను వారు ఛేదించిరని దాని అర్థము. ముక్తి అవస్థయందు మనుష్యుడు ఐదుకోశము లన్నిటినుండి విముక్తి నొందును. అట్లు గాకుండిన అతని అసలు స్వరూపము దృష్టిలోనికి వచ్చుట అసాధ్యము. సాక్షాత్కారమునకు ఈ కోశములనుండి పూర్తిగా విముక్తి నొందుట ఒక ఆవశ్యకాంశము. అది ఒక మనిషి జీవితకాలముననే కూడ సాధ్యము. ఒకడు తన అంతిమ ధ్యేయము లేక లక్ష్యమునకు దృఢముగా అంటిపెట్టుకొని యుండినట్లయిన, ఇవన్నియు క్రమముగా వచ్చును. ఈ కోశములను ధ్వంసము చేయుటకు ప్రయత్నము నుపయోగించుట తీవ్రమైన పొరబాటు. ఏలయన ఆ సందర్భమున వాస్తవోద్దేశము నుండి అతడు దూరముగా తప్పిపోవును.

---

85. మహాత్ములు ధ్వంసము లేక నాశనము కావింపబడిన మనస్సును కలిగియుందురా అను నీ ప్రశ్న విచిత్రమైనది. కృత్రిమమైన వస్తువు మాత్రమే ధ్వంసము కావింపబడగలదని నా నమ్మకము. స్థూలతరమైన పొరలచే కప్పబడి యుండునట్టిదే కృత్రిమ వస్తువు. ఒక భవనము పడగొట్టబడినచో దాని నేల దెబ్బ తినకుండ యుండును. ఇప్పుడు, మనస్సు నిజముగా నాశనము చేయబడినదా లేక పరివర్తనము చెందినదాయని నీకు నీవే నిర్ణయించుకొనుము. నేను దానిని మనస్సు సక్రమము కావింపబడుట యని అందును. దానిపై నిర్మింపబడిన కట్టడము తొలగింపబడెనని మాత్రమే దాని అర్థము. కాని, దానిని పూర్తిగ లేకుండ చేసికొనుటను కోరినట్లయిన, అప్పుడతడు క్షోభము – అనగా ఉనికికి ఆధారమైన మూలశక్తి – నుండి తాను తప్పని సరిగా విముక్తిని పొందవలసి యున్నది. మనస్సు లేనిదే ఏ క్రియయు సాధ్యము కాదు. ప్రకృతి యందే వస్తువును తన ఉనికిని పోగొట్టుకొనదు. కేవలము రూపము, క్రియ మాత్రమే అప్పుడప్పుడు మారుచుండును. ప్రతి మనిషికి తెలివియున్నది. దానికి ఒకడు మంచి ప్రయోజనమునకు ఉపయోగించవచ్చును. మరియొకడు దుష్ప్రయోజనమున కుపయోగింప వచ్చును. ప్రగతి యొక్క ఉన్నత దశలలో నింద్రియములు క్రమబద్ధములై, సమత్వము నొందినవై, ఒక పరిశుద్ధ స్థితిని పొందును. వాని కార్యములు నిద్రాణమగును. అప్పుడతడు ఎట్టి కార్యమునకు తాను కర్తగా నుండడు. తత్ఫలిగముగ, సంస్కారము లేర్పడుట ఆగిపోవును. సరియైన మార్గదర్శకత్వమున, సక్రమ పద్ధతిలో, అభ్యాసము ననుసరించినట్లయిన నిది సులభముగా పొంద బడగలదు.

---

86. అవతారములు ఒక నిశ్చిత ఉద్దేశముకై తమ కప్పగింపబడిన కార్యమును పూర్తి చేయుటకు అవసరమైన శక్తిని పొంది అవతరింతురు. వేరు మాటలలో, అదియే వారిని ప్రపంచములోనికి తీసికొని వచ్చినట్టి సంస్కారముగా పనిచేయును. వారి కార్యము ముగిసిన పిమ్మట ఆ శక్తి ఉపసంహరింప బడును. అవతారముల భోగమునకు చెందిన సిద్ధాంతమును గూర్చి నీ ప్రశ్నకిది సమాధానముగా సరిపోవచ్చును.

---

87. శక్తి వేరు విధములలో కూడ నుపయోగింపవచ్చును. ఉదాహరణమునకు, గానకళకు సంబంధించిన బిందువులను మేలుకొలుపుటకు అది ఉపయోగింప బడగలదు. ఎడమ చనుమొనకు కొంచెముపై భాగముననే దీపక్ రాగము యొక్క కేంద్రము, కుడి చనుమొనకు కొంచెము పైన మేఘరాగము యొక్క కేంద్రము కలదు. ఈ రాగములలో పాటలను గానము చేయుటకు కావలసిన స్వరస్థాయి ఈ బిందువులు లేక ఉపచక్రములతో సూటిగా సంబంధము కలిగియున్నది. దానికి కొంచెము పైన కంఠచక్రము (దుర్గాసనము)గా తెలియబడు నింకొక బిందువు కలదు. నవ్వు, ఏడ్పు స్వభావమును అధికము చేయుశక్తి అచ్చట అపారముగానున్నది. గాయకుడు ఒక నిర్దిష్ట ప్రభావమును కలుగచేయ కోరినప్పుడు తన స్వరమును ఆ ఉద్దేశమునకై నిర్దేశింపబడిన బిందువు యొక్క శక్తితో కలుపును. చివరగా చెప్పబడిన బిందువు దుర్గ శక్తితో నిండియున్నది. దానిపై ఆధిపత్యము కలవాడు దానికి సామాన్యముగా అపాదింపబడినట్టి అదేరకమైన చర్యలను ప్రదర్శింపగలడు. ఈ బిందువు కూడ మాయ యొక్క స్థానముగా తెలియబడుచున్నది. మానవుని యోచనా ప్రవృత్తి

దీనితో సామీప్యమును పొందిన అతనికి స్వప్నములు కలుగుట ఆరంభమగును. ధ్యానము నందు కొన్ని సమయములలో అభ్యాసి దీనిని స్పృశించుట తటిస్థించినచో అతడు మెలకువ తోడి కలలు కనమొదలిడును. ఈ బిందువు లేక ఉపచక్రము యొక్క అద్భుత కార్యమట్టిది. ప్రాణాహుతి పద్ధతి ద్వారా మాత్రమే అది పనిచేయుట క్రమబద్ధము కావింపబడగలదు.

---

88. ప్రగతిని సాధించిన మానవుని ఆధ్యాత్మికస్థితిన మహా సాగరముతో పోల్చినట్లయిన, అలలు పైకెగయుటచే నీటి పైభాగమున ఏర్పడిన నురుగుయొక్క పెచ్చులుండునట్లే, ఒకానొక మండలమున నెలకొని యుండిన స్థితియొక్క ఉపరితల స్థాయిపై ఆలోచనలు, భావములు రూపమున తెలియాడుచున్న అట్టి విషయము లనేకము లుండునని నేను చెప్పవచ్చును. అవి దానియందు ఈదులాడు వానికి తాకుచు ప్రక్కగా పోవుచుండును. అవి ఎన్నడును అతని దృష్టిని కొంచమయినను ఆకర్షింపవు. అదేవిధముగా తమ ఈదులాడుచున్న ఆధ్యాత్మిక స్థితిలో లీనమైఉన్నప్పుడు కేవలము క్షణికమే అయినట్టియు, అలల చర్యలచే మరల మరల ఉత్పన్నమై నాశనము పొందునట్టియు, ఆ నురుగు పెచ్చుల నుండి అతని దృష్టి దూరముగా మరల్చబడుటను చూచుట ఆశ్చర్యకరముకాదు. ఎట్లయినను, అవి ఆ మండలముయొక్క నిర్మలత్వ మృదుత్వములపై నెట్టి ప్రభావము కలిగింపవు. బ్రహ్మాండ మండలము లేక విరాట్ స్థితి అట్టిది. ఆ మార్గమున మనస్సు నందుత్పన్నమగు తాత్కాలిక ఆలోచనలు ఆ ప్రదేశమున గల అలలయొక్క క్రియ, ప్రతిక్రియలచే సృష్టింపబడిన నురుగు పెచ్చులవలె నుండును. అవి క్షణికములు మాత్రమే. మఱియు ఎట్టి ప్రాముఖ్యము లేనివి. అవి అక్కడ ఉండుటకు కారణమేమన మొట్టమొదటి దినమునుండియు మనము ఎడతెరిపి లేకుండ ఆలోచనా పరంపరను తయారు చేయుచునే యుంటిమి. అవి అన్నియు ఆ మండలమున తేలుచు, ప్రక్కన పోవువాని నన్నిటిని తాకుచుండును. ఇది సహజమే. కాని, వానిని తనవిగనే భావింప మొదలిడినప్పుడు అత్యంత తీవ్రమైన పొరబాటు. వేరువిధముగా, అది అతనియందు గల “నాది” అను భావము యొక్క ప్రాముఖ్యమును సూటిగా ప్రతిబింబించును. ఈ భావము ప్రస్తుతము జ్ఞానులమని చాటుకొను వారియందు అతి సామాన్యమై యున్నది.

---

89. ఒక పదమునకు ముందు ‘మహా’ అను శబ్దమును చేర్చుట వలన, అది ఆ పదమున నిమిడియున్న దానికన్నను ఉన్నతమయిన స్థితిని సూచించును. ఉదాహరణమునకు ‘మహా’ అను శబ్దమును ‘మాయ’కు చేర్చినట్లయిన, మాయయొక్క సాధారణ స్థాయికి అతీతముగా నున్న స్థితిని సూచించును. ‘మాయ’ను ఒకానొక మండలముయొక్క పరిమితులలో నున్న ఏదోయొక దానినిగ తీసికొనవచ్చును. కాని, ఒకడు అతీతముగా వెళ్ళినచో మాయ కరిగిపోవును. అప్పుడది ‘మహామాయ’గా తెలియబడును. ఎట్లయినను దానిని గూర్చిన సరియైన భావము అసాధ్యము. వాయుమండలపు చివర హద్దునకు అతీతముగా వెళ్ళినప్పుడు మాత్రమే వాయు ప్రదేశమును గూర్చిన సరియగు భావము సాధ్యము కాగలదు. కాని. అప్పుడు కూడ హద్దులను తెలుపు కచ్చితమైన రేఖను నిర్ణయించుట చాల కష్టమగును. ఏలయన, ఆ స్థితి క్రమముగా కరిగిపోవుచు రూపాంతము నొందును. నీ వొక బంతిని గాలిలోనికి ఎత్తుగా పైకి విసరితి వనుకొనుము. అది బాగుగా నీ

దృష్టియందు ఉండినను అచ్చట దాని కచ్చితమైన స్థానమును నీ వెన్నడును నిశ్చయింపలేవు. అనంతమునుండి వచ్చున దేదియయినను, కనీస మేదియో ఒక విషయమున, దాని ఛాయను కలిగియుండి తీరును. ఇప్పుడు, నీవు దానిని గ్రహించుకొనునట్లు చేయునది నిస్సందేశముగా ఆలోచనయే యని సాధారణముగా చెప్పుదురు. కాని, అత్యంత నిష్కర్షభావమున, అది ఆలోచన కూడ కాదు; దానికి నిశ్చయముగ దూరమైనది ఏదో యొకటి. స్థూలముగా, అది చాలవరకు 'విచారితము'నకు సరిపోవును. వేరు మాటలలో ఈ రెండును – అనగా "విచారము", "విచారితము" పరస్పరమును ఏకీభవించుచు పోవును. వ్యవహారానుకూలమునకై దానిని గ్రహించునది ఆలోచనయే యని చెప్పుదుము. కాని, అప్పుడు దాని యధార్థ స్థాయిని నిర్దేశించుట మిక్కిలి కష్టమగును. మన మట్లు చేయుటకు ప్రయత్నించినచో అపరిమితమయిన దానిని పరిమితమయిన దానినిగా మార్చుటయే మన ఉద్దేశ్యమగును. అటువంటి యప్పుడు మహామాయ మండలము యొక్క కచ్చితమైన స్థానమును గుర్తించుట ఎట్లు సాధ్యమో నీకు నీవే ఆలోచించుకొనుము. అర్థము చేసికొనుటకొఱకు అది యొక మండలము మాత్రమే అనుట సరిపోవును.

---

90. కచ్చితముగా చెప్పవలెనన్న సృష్టికి ఆధారమయిన పదార్థములను మనమే సిద్ధపఱచి సృష్టిని స్థాపించితిమి. క్షోభను కదలించిన సంకల్పముయొక్క ప్రాథమిక ఆఘాతము తప్ప ఇందు భగవంతుని ప్రవేయము కేవలము నామమాత్రమే. భూమి అడుగునగల ముడి ఇనుము యంత్రపరికరము లన్నింటికి మూలము అయినట్లే, సృష్టియందు గల నిఖిల వస్తువుల అసలు మూలము సారరూపమున నుండిన పదార్థమే. సంకల్పముయొక్క ఆఘాతము తీవ్ర వేగముతో నిండియున్నది. అది అచ్చట ఇంకను నున్నది. అంతేకాదు, అది అంతము వరకును కొనసాగును. ఈ విషయమున సృష్టి ప్రారంభము, అంతము ఒకే వేగము యొక్క రెండు కొనల వంటివి. అసలు శక్తిని లోన కలిగియున్న మధ్యభాగము విశ్వనిర్మాణము యావత్తును ఉనికి లోనికి కొనివచ్చుటకు ముఖ్య పరికరమైనది. అది అపార శక్తిని కలిగియున్నది. అది విద్యుత్ప్రవాహమువలె ఆఘాతముల నిచ్చును. మధ్యభాగము కేంద్రముగా పనిచేయును. కొంచెము క్రిందుగా ప్రధాన క్రియాశీలక శక్తి యున్నది. ఇదియే కారణముగ పనిచేయును. ఇంకొక బిందువుకూడ కలదు. అచ్చట సరియైన మితత్వముగల ఒక చైతన్యదాయక శక్తివంటిది ఏదో కలదు. చాలదూరము నుండి పరిశీలించినచో నేను దానిని కొద్ది మిల్లీమీటర్ల దూరము మాత్రమే యని చెప్పుదును. కాని తన శారీరక పరిమితులను అధిగమించిన అనంతరము, దానిని సమీపమునుండి చూచినట్లయిన, ఆ దూరమప్పుడు అతనికి అపరిమితమయినదిగా కనబడును. కేంద్ర బిందువునకు పైకి పోగాపోగా, శక్తి తక్కువగా గోచరమగును. ఇది సత్యవస్తువుతో మన సన్నిహిత సామీప్యమును సూచించును. కేంద్ర బిందువు యొక్క లక్షణములతో పూరింపబడిన అవతారముల వంతునకు దాని యొద్దనున్న బలవత్తర శక్తి వచ్చుచుండగా, మానవుని వంతునకు అల్పశక్తి వచ్చును. శ్రీకృష్ణ భగవానుడు అవతారముగా కేంద్ర బిందువు యొక్క మండలమునుండి అవతరించగా, శ్రీరామచంద్ర ప్రభువు అవతలి చివరినుండి వచ్చెను. ఈ కారణముననే ఆయనయందు మానవ సారూప్యము ఎక్కువగా నుండినది. మానవుడుగా తాను కలిగి యుండుటకు ప్రయత్నింప వలయునట్టి ఆదర్శ జీవితమును ఆయన మనకు చూపెను.

నా పరిశీలనము వెళ్లునంతవరకు ప్రస్తుతము పనిచేయుచున్న వర్తమాన మహాపురుషుడు కేంద్ర బిందువున కతీతమయినట్టి మండలమునుండి అవతరించినాడని నేను చెప్పగలవాడను. అందువలన, ఆయన అత్యున్నత శక్తులు కలిగియున్నవాడు. మన బాహ్య దృష్టికవి తక్కువగా కనపడవచ్చును. భూమిపై నింతవరకు అవతరించిన ఏ అవతారము కూడ ఎన్నడును మూలముయొక్క శక్తిచే అనుగ్రహింపబడలేదు. విషయములను నిజముగా నెఱిగినవాడయిన భగవంతుని కృపచే ప్రకృతిని పరిశీలించుట వలన నేను గ్రహించిన దానిపై నాధారపడి దీనిని వెల్లడించుచున్నాను.

---

91. ప్రేరణ వచ్చుట దివ్యభాండారము నుండియా, లేక ఆధారము నుండియా లేక ఇంకే యితర స్థాయి నుండియా అనునది అస్పష్టమైన ప్రశ్నగా కనబడుచున్నది. సమాధానముగా నావంతు వచ్చినప్పుడు, నీవు ఊపిరి తీయుట కోసమై ఏ పొరనుండి గాలిని పీల్చుచున్నావని నేను నిన్నడిగినట్లయిన దానికి సరిగా సమాధానమును నీవు ఈయలేవు. వాస్తవమునకు ఈ ప్రశ్నయొక్క సమాధానము సహజ మార్గతత్వము నంతటిని విశదీకరించును. ఒక్కమాటలో చెప్పుటకు, ప్రేరణను గ్రహించుట, అది ఆధారమునుండి గాని, ఇంకే యితర స్థాయినుండి గాని, అన్వేషకుని వ్యక్తిగ సామర్థ్యముపై నాధారపడును. దీనిని ప్రత్యక్ష పరిశీలనము ద్వారా మాత్రమే నిర్ణయింపగలము. బహుశః వేదములు దానికి ఏదో సూచనను ఈయవచ్చును. కాని, పండితులచే నివ్వబడిన అనేక వ్యాఖ్యానములు, భాష్యములు, విషయములనెంత హీనముగా జటిలము చేసిన వన, ఎట్టి నిశ్చిత నిర్ణయమునకు గాని వచ్చుట చాల కష్టమగుచున్నది. తత్ఫలితముగా అంతి పరిష్కారము నింకను కనుగొనవలసి యున్నది. వాస్తవమునకు సమస్యను విజయవంతముగ పరిష్కరించుటకు ఆవశ్యకమైనది ఆచరణపూర్వక ప్రయత్నము మాత్రమే. దురదృష్టవశమున జనులు దేనిని గాని సాధింపలేకుండియే పరిష్కారములను సూచించుచునే యుందురు. బహుశః దీనికన్నను ఎక్కువ అసంగతమైనది ఏదియు నుండ జాలదు.

భాండారమను పదము విస్తారతా భావ మిమిడియున్నది. కేంద్రము మరియు అదృశ్యచలనము లన్నిటితో కూడ భగవన్మండలమున అంతటను అది వ్యాపించియున్నది. దానిని గూర్చి సరియైన ఉద్దేశ్యము కలిగియుండుట మిక్కిలి కష్టము. విశ్వమంతటను ఒక చివరినుండి మరియొక చివరి వరకును ఉన్న వివిధములైన పొరలు మరియు వృత్తములను సూక్ష్మాతి సూక్ష్మమగు ప్రతి అణువు పొందియున్నది. ఆ విధముగ, ప్రతి అణువు పూర్ణవస్తువు యొక్క గుణములను కలిగియున్నది. అందువలన ప్రతి అణువు ప్రధాన భాండారమువలెనే అట్టి ప్రేరణను ఈయగలదు. కాని, రాయియందు ఆ అణువులే ఉన్నవి కావున రాయితో చేయబడిన విగ్రహముకూడ అదే విధముగ ఫలప్రదమగునని అర్థముకాదు. నిజమేమన పరమాణువుతో సన్నిహిత సారూప్యమును పొందినవాడు మాత్రమే అణువు నుండి ప్రేరణను గ్రహింపగల సామర్థ్యము కలవాడగును. చుఱుకుదనము సహజముగ దైవకృపకు మాధ్యమముగ పనిచేయును. చుఱుకుదనము దాని పరిపూర్ణ స్థితిని తిరిగి పొందినచో, దానినుండి గ్రహించిన ప్రేరణ కూడ అత్యంత శుద్ధ, సూక్ష్మ స్వభావము కలిగియుండును. దానియందు విస్తరణను పొందినప్పుడు అతని సంలక్పబలము గుప్తశక్తి వైపునకు నింకను పురోగమించును. అన్వేషకుడు ఇంకను తన పయనమును కొనసాగించి నట్లయిన అతడు గుప్తశక్తి కతీతముగపోయి జీవన్ముక్తి స్థితిని పొందును.

---

92. ప్రేరణ అత్యున్నతాత్ముని మాధ్యమము ద్వారా వచ్చుచున్నచో అది, ఆ పదముయొక్క కచ్చితమగు అర్థమున, యధార్థమైనది అగును. ఏలయన, అతని ఉనికి యొక్క ప్రతి అణువు అంతిమ స్థితియందు లీనమై ఆ పరిపూర్ణ స్థితిని పొందియుండును.

కొన్ని సందర్భములలో అభ్యాసి దైవకృపను సూటిగా గ్రహించుట కూడ తటస్థించును. కాని, తన హృదయముయొక్క మార్గముల నన్నిటిని ఎవరితో అతడు కలుపుకొనినాడో ఆ గురువు అభ్యాసియొక్క సంకల్పపు కుదుపు ఫలితముగ దానికి ప్రోత్సహింపబడి నప్పుడది ఎక్కువగా అట్లగును. అతనికి తన గురునియందు కల ప్రేమ, భక్తుల ఫలితముగా కుదుపు దానంతట అదియే వచ్చును. అభ్యాసి గురునియందు సంపూర్ణముగా లీనము నొందిన, గురువునకు వచ్చునదంతయు అభ్యాసికి తానంతట అదియే మార్చబడును. అందువలననే గురునియందు లయమగుట అత్యున్నతమైన విలువ గలది. దానిని పొందుటకు అత్యంత ఫలప్రదమైన ఉపాయము ఆత్మ నిరసనయే.

---

93. దైవకృప విశ్వమును ఉనికి లోనికి కొనివచ్చిన క్రియాత్మక శక్తియా లేక అంతకన్న తక్కువ తరగతికి చెందిన శక్తియా లేక తేజోపహయా లేక అట్టి యితర వస్తువు ఇంకేమైన ఉన్నదా అని నీ వడిగిన ప్రశ్నకు సమాధానముగా నేనిట్లు అడుగవచ్చును : అది కేవలము సృజనాత్మక శక్తియే అయినచో ప్రళయమున కదియెట్లు కారణభూతమగును ? దానికి ఏదైనను వేరొక శక్తి ఉన్నదా? ఈ విధముగా, రెండు శక్తులు పనిచేయుచున్నవా? నేనావిధముగ అనుకొనుట లేదు. నీవనినట్లు దానిని సృజనాత్మక శక్తిగానే తీసికొనిన, అప్పుడు మనము ప్రతిక్షణమును పెరుగుచు, వృద్ధియగుచునే ఉండవలయును. ఆ సందర్భమున ఫలితమేమి కాగలదు? మనము వివిధత్వము లోనే ఎల్లప్పుడును ఉందుము. ఏకత్వ భావమే మనదృష్టియందు ఏ మాత్రము ఉండదు. దానిని అత్యున్నత మూల్యము గలదిగను, నీ అంతిమ ఉద్దేశమునకు గొప్ప ప్రయోజనకారిగను నీవు భావించినచో అందువలన నీకు కలుగు ఇబ్బంది ఏమియో నే నర్థము చేసుకొనలేకుంటిని.

ప్రతియొక్కరు తమ సామర్థ్యము, అర్హతలకు అనుగుణముగా దానిలో పాలపంచుకొనుట నిశ్చయము.

---

94. తన గురువును భక్తిపూర్వకముగా ప్రేమించువాడు తన వస్తువు ప్రతిదియును అతని అధీనమునకు అంకితము చేయును. గురునియందు తాను సంపూర్ణముగ లయమునొంది లోపల మరియు వెలుపల అంతటను గురువునే ఎల్లప్పుడు చూచును. అదేవిధముగ ఒక్కటియే అయినట్టి సత్యమున లయమును పొందినవాడు ఎల్లెడలను భగవంతుని వ్యక్తతను దర్శించును. ఏలయన, అతని ప్రతి ఆలోచనా ధారయును, యధార్థ ధారతో మిళితమై సత్యవస్తువు ప్రతిదానినుండి వెలువడుచున్నట్లు అనుభూతి గాంచును. సత్యవస్తువులో లయము అనగా దేనిని గూర్చిగాని తనదను ఎఱుక లేకుండుట. తన శరీరము, మనస్సు, ఆత్మలేక అతనియందున్న మఱి దేనిని గూర్చి కాని ఎఱుక ఉండరాదు. వాస్తవమునకదియే యధార్థమైన భగవత్ స్థితి. ఏమయినప్పటికిని పరిమితులు కొంత వరకుండును. అది సహజమే కూడ. ఏలయన, వస్తువులను చెక్కు చెదరకుండ నుంచు

ఇచ్ఛాశ్రక్తియే సృష్టింపబడిన గ్రంథి పని చేయుచునే యున్నది. అది తీసివేయబడి నట్లయిన ప్రపంచము తన ఉనికినే పోగొట్టుకొనును. నీ శరీరముండగనే ఆ అస్తిత్వ స్థితిని నీవు పొందినచో జీవితమున అదేస్థితి ననుభవించెదవు. ప్రస్తుతము కూడ ఉన్నతస్థాయి యందుండిన ఒక యోగి ఆ అంతిమ స్థితికి వచ్చినట్లయిన, అతడు దానిని దర్శించుట సాధ్యము. ఏమయినను, హృదయ చక్షువుతో చూడబడని వస్తువులను గూర్చి మాట్లాడుట చాల అనుచితమగును.

అద్వైత సిద్ధాంతమునకు మొట్టమొదటనే అంటుకొని యుండువాడు వివిధత్వములో ఏకత్వమును అత్యంత అపరిష్కృత రూపమున చూచును. ఆ స్థితిలోనికి ఒకడు యధార్థముగా వచ్చినప్పుడు, ఆ ప్రశ్న తానంతట అదియే అంతరించును. ఆ పదవికి రాకుండ ఎవరైనను తాను భారతదేశ ప్రధాన మంత్రినని చెప్పుకొనుట ఎన్నడైనను ఉచితమా ?

---

95. ఒక డీ దినమున జన్మించును. అతని ఇంద్రియములు, సామర్థ్యములు క్రమముగా వృద్ధియగును, అతడు పెరుగుచునే యుండును. జ్ఞాన, అజ్ఞానములు రెంటియందును అతడు పరిపక్వమగు సమయము వచ్చును. తన అంతిమ ఉద్దేశమును నెరవేర్చుకొనుటకై తానేమి చేయవసలి యున్నదో దానిని గూర్చి ఒక నిశ్చితమైన నిర్ణయమును తీసికొనవలసిన సందర్భము ఎప్పుడో ఒకనాడు ఉత్పన్నమగును. విషయములను వివిధ వర్ణములలో చిత్రీకరింపగల పండితులు, జ్ఞానులు అతనికి తటస్థపడుదురు. వారు ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతముల యొక్క తత్త్వమును గూర్చి మాట్లాడుదురు. అతడు వారు చెప్పినది విని వాని నుండి కొన్ని భావములను గ్రహించును. భగవంతుడు, మనుష్యుడు, విశ్వసము మరియు మాయ, జీవుడు బ్రహ్మములను గూర్చి కూడ అభిప్రాయములను తన అవగాహన లోనికి తీసికొనును. ఆ చర్చలు, వ్యాఖ్యానములు అన్నియు అతని దృష్టిలోనికి ఒకే వస్తువును అనేక విభిన్న వర్ణములలో తీసికొనివచ్చును. విషయములయొక్క నిజమైన జ్ఞానమును పొందితినని, అనేక భిన్న రీతులలో తాను ఒక విషయమును వివరింపగలనని అతడు భావించును. కాని, అదంతయు అసలు వస్తువుయొక్క ప్రత్యక్ష సాక్షాత్కారమున కెట్టి సంబంధములేని పైపై జ్ఞానము మాత్రమే. ఆచరణ రంగమున అజ్ఞానమేమి ఉపయోగకరము కాగలదు? సాధారణముగా అత్యధికులు విషయ మిట్టిదే.

---

96. బాహ్యమునకు వేదములలో వైరుధ్యము లున్నట్లగపడును. ఫలితముగా షడ్దర్శనము లేర్పడినవి. ఈ విధముగ ఒక్కొక్కటి ఆ వైపునకు తనకుగల జ్ఞానము, గ్రాహ్యము, ప్రవేశముపై నాధాపడి తన స్వీయ సిద్ధాంతమును రూపొందించినది. వేదములందేభాగము సకారణమైనదో అది మాత్రమే యధార్థ విషయమున వేదమని మనుమహర్షి చెప్పుట సమర్థనీయమైనది. అందుల కాయన నిస్సంశయముగ మిక్కిలి శ్లాఘనీయుడు. ప్రపంచము నందలి శాస్త్రములన్నిటియందు, వేదములు మాత్రమే అట్లు స్పష్టమైన రీతిలో చెప్పును. కాని ప్రత్యక్ష సాక్షాత్కార విషయమున వేదాధ్యయనము ద్వితీయ ప్రాధాన్యము గలది. అధ్యయనము అను పదము అడుగున నున్న సత్యమును ప్రత్యక్షముగా సాక్షాత్కరించుకొనుట అను భావమును సూచించును. అది పఠనముచేగాని, నమ్మకముచేగాని, తర్కముచే గాని, వాదముచేకాని పొందబడదు. కేవలము ప్రజ్ఞాతీత గ్రాహ్యముచేతనే అది

పొందబడగలదు. తెచ్చిపెట్టుకొనిన వర్ణములను త్యజించుచు, చివరకు మనము వర్ణ రహితులమగువరకు విభిన్న స్థితుల ద్వారా పోవుచునే యుందుము. మనము నిత్యము కల్పించు కొనుచున్న సుఖదుఃఖముల సంస్కారములు మన ఆలోచనలయొక్క వివిధములైన వర్ణపూరిత చ్ఛాయలు మాత్రమే. అవి పరస్పర భిన్నములు కావు; అవి ఊహాజనిత మానసిక శక్తుల కార్యముచే కేవలము వర్ణమును పూరించుకొనినవి. ఉదాహరణమునకు నిజమైన లేక కల్పించుకొనిన దయ్యములను గూర్చిన విషయములు ఒకరిని భయపెట్టును; కాని, వేరొకరిని భయపెట్టలేవు. ఎవరు దయ్యములను గూర్చి భయపడుదురో, వారు వానిచే హానికి గురి యగుటను తరచుగా చూచెదము. కాని, వాస్తవమేమన, దయ్యముద్వారా వారు తమకు తామే యథార్థమునకు హానికి కలిగించుకొనుచున్నారు. అదేవిధముగా మాయను దయ్యముగా భావించినచో మనకు హానికి కలిగించునది మాయగాక మాయయొక్క కర్తృత్వము ద్వారా మనము మనమే నిజముగ హానిని కలిగించుకొనుచున్నాము. మన ఈ నావ మాయయొక్క స్నిగ్ధమైన ఉపరితలముపై తేలుచు పోవుచున్నది. ఈ మాయయే గురుదేవునకు బహూకరించుటకై మనలను లోనికి తీసికొనుటకు తన రెండు రెక్కలను చాచుచున్నది. ఈ మాయాజాలమే లేకుండిన, ప్రపంచమున మన ఉనికియే సాధ్యము గాకుండియుండును. యోగ్యమైనది, విలువైనది అయిన యట్టి వస్తువు నెన్నడైనను దూషించుట, శపించుట తగునా? అట్లు చేయువారు దాని విలువ, ఉపయోగములను గూర్చిన సరియైన అవగాహన లేనివారు. ఈ కారణమున మాత్రమే అది వారికి తన వికృత రూపమును కనపరచును. దాని ప్రకాశవంతమైన వైపునకు మన మంటిపెట్టికొనియుండినచో అది మనల నింకను ప్రకాశవంతముగా చేయును. మాయనుండి విడివడిన తరువాత నిచ్చట నుండవలసిన అవసరమేమియు లేదు. తీవ్ర ప్రాముఖ్యము కలది కాదని ప్రతి ఇతర విషయమును ఉపేక్షించుచు, ఒక్కటే అయినట్టి ఆ సత్యమునకే గాఢముగా అంటుకొనియుండుటయే సరియైన మార్గము కాగలదు. ఈ విధముగా మన ఉద్దేశమున కవసరమగు ప్రతిదియును దానంతట అదియే అనుసరణమునకు వచ్చును. ఈ సమస్య కదియే అత్యంత సులభమైన పరిష్కారము.

---

97. సాధారణముగ జనులు ఏదో యొకరకమైన ఉపవ్యాసంగముననో, మరియొక దానియందు నిమగ్నులై యుందురు. పండితులకు గ్రంథాధ్యయనము నుండి పొందిన మానసికాహ్లాదము; ఆరాధకునకు ఆరాధన యందలి యానందము; భక్తునకు భక్తి యందలి ఆకర్షణలు సిద్ధునకు సిద్ధులయంది సంతోషము; సన్యాసికి ఏకాంత జీవనము; ఉన్నత స్థితులను పొందిన వానికి పరిపూర్ణుడుగా నుండుట యందలి తృప్తి. ఆవిధముగ ప్రతియొక్కడు ఏదో యొక ప్రత్యేకరకమైన ఆనందము కలిగి యుండుటలో ఒక ప్రత్యేక ఆకర్షణను కలిగి యుండి దానియందే తగులుకొని యుండును. అదియే అతని ముఖ్య అన్వేషణ మగును. దైవమార్గమును నిజముగా అనుసరించు వానికి నివియేమియు ఎట్టి ఆకర్షణను కలిగి యుండవు. అతని ఏకైకధ్యేయము అనంతుడైన భగవంతునితో ఐక్యమును పొందుటకు ఆ పరమగురుని యెదుట తన స్వచ్ఛరూపమున అగపడుటయే. తనను చుట్టుకొని యుండిన ఆవరణములనన్నిటిని వర్జించిన పిమ్మట మాత్రమే ఇది సాధ్యము కాగలదు.

నా సమర్థ గురుదేవుని పవిత్రపాదముల దరిచేరినప్పుడు నేనీవిషయములన్నిటి యెడ అంధునిగా నుంటిని. గ్రంథములు నిరుపయోగములని భావించి దూరముగా నుంచితిని. ఆయనయందు మాత్రమే నేనాసక్తుడనైతిని. ప్రపంచమునకు చెందినది ఏదియును నన్ను ఆకర్షించ లేక పోయినది. ఈ ప్రపంచము నందాసక్తులమై, దాని నాహ్వానించు చున్నంతవరకును, అందు మరల మరల జన్మించుటను ఎన్నటికిని అధిగమింప జాలము. కాని ప్రపంచము నుండి తెగద్రెంపులు చేసికొనుటకు బలవంతముగ విధించు కొనినట్టి శారీరక వైరాగ్యము దానికి ఏ విధముగను పరిష్కారము కాదు. రెంటిలో ఏ యొక్క దానిని మనము అలక్ష్యము చేసినను మన ఉద్దేశ్యమెన్నటికి నెరవేరదు. మన అంతిమ విజయమునకై ప్రాపంచికము మరియు పారమార్థికము అయిన ఈ రెండు జీవితములు ప్రక్క ప్రక్కనే ఒకేవిధముగా దేదీప్యమానముగా సాగవలయును. మనము రెండు రెక్కలను బయటకు చాచి ఎగుర వలసియున్నది. భగవంతుడు కేవలము అరణ్యవాసి యను నట్లు, ఆయన అరణ్య మధ్యముననే అన్వేషింప బడగలడను ప్రజావిశ్వాసము వ్యర్థము మరియు అర్థ రహితము. ఎవరి హృదయాంతరాళమున వారే భగవంతుని అన్వేషింప గలరని నా విశ్వాసము. కాని, అందులకు రణరంగము నుండి డాలుతోడ గాని లేక డాలుపైన గాని మాత్రమే తిరిగివచ్చెడి స్పార్టనుల మనస్తత్వము అవసరము.

---

98. ఆధ్యాత్మిక జీవితమున నా అనుభవము దాదాపు పరిపక్వమైనది. దీనివలన, ప్రపంచమునందలి అనేక విషయములను నేను చవిచూడ లేకుండుట మీ దృష్టియందు నాయొక్క దురదృష్టము కావచ్చును. నా గురువు పాదములపై పడియుండి నేను పూర్తిగా మూగ వాడనైతిని. కాని, నిశ్చయముగ అప్పటి నుండియే నా దుఃఖములు పోయినవి. నా ప్రాపంచిక జీవితము పూర్తిగ పరివర్తనము నొందినది. నా చుట్టును అంతటను ఆనంద మహాసాగరమును వీక్షింప మొదలిడితిని. అది గురుదేవుని దయానుగ్రహము వలనను, ఆయన యందు నాకు గల తిరుగులేని విశ్వాసము వలననే. ఆయన హృదయము నుండి నాలోనికి ప్రవహించుచుండిన దివ్య ప్రవాహము యొక్క ప్రభావము వలన నా యందు నేనే అంతరించినట్లనుభూతి చెందితిని. ఇదంతయు నన్నాయనకు మరిమరి సమీపమునకు చేర్చినది. ఆయనయే నాసర్వస్వము. భగవంతుడు సమీపమున ఉండినాడను భావము నా ఆలోచన యందేవిధముగానైనను వచ్చినదా అని నీవు ప్రశ్నింప వచ్చును. దీనికి సమాధానముగ, ఆయనకు నాకును మధ్యగల సంబంధ మట్టిదని మాత్రమే నేను చెప్పగలను. నిజమైన ప్రతి అభ్యాసికి అట్లుండుట అవసరము. శాస్త్రములు కూడ అట్టి అభిప్రాయమునే తెలుపును – "నీ గురువును బ్రహ్మముగా తెలియుము." వివేకానందస్వామి కూడ ఈ విధముగ చెప్పినాడు : "ఆయన తనకైవల్య పరిపూర్ణత్వములో ఎట్లుండెనో అట్లు భగవంతుని గూర్చి మనము చెప్పునపుడు మనము అత్యంత విఫలుల మగుదుము. ఏలయన, భగవంతుని మానవుడుగా భావించుటకు మనము మన ప్రస్తుత స్వభాముచే పరిమితులమై, బద్ధులమై ఉంటిమి". మానవుని ('మానవుడు' అనగా మానవుని భౌతిక రూపమునన్ను గురువని అర్థము) భగవంతుడగా భావించుట అపచారమనుట కుఱ్ఱతనపు అభిప్రాయము. నిజమునకు మనము ద్వైతము నుండి ప్రారంభమై మనకు మనమే అద్వైతమును చేరుదుము. దానిలో మనము లయము నొందినపుడు సత్యతత్త్వ ముదయించును. ఏది ఏమైనను, ఇది నా అనుభవము.

అందువలన, ప్రియసోదరా, అనుభవ జీవితమే కలిగి యుండనర్హమైనది. చదువుట లేక వ్రాయుట ఏమియు ప్రయోజన కరము కాదు. శ్రద్ధ, భక్తి విశ్వాసములు మాత్రమే విజయమును సాధింపగలవు. నీవు నిజముగా భగవంతుని వెదకు చున్నచో, అప్పుడు నిన్ను బంధనముల నుండి విముక్తుని కావించు కొనుటకు ఒక సమర్థుని అన్వేషించుము.

---

99. మన సంకల్పము విపరీతముగ బలహీనమై పోయినది. అది మరల బలమైనదిగా చేయుటకు, ఏది దాని సంపూర్ణశక్తి మంతముగా కలిగియున్నదో దానితో కలుపుటను మాత్రమే మనము చేయవలసిది. దాని అర్థమేమన బలహీనమై పోయిన మన క్రింది కేంద్రములు క్రియాత్మకముగా శక్తిమంతములయినట్టి ఊర్ధ్వకేంద్రములతో కలువ బడవలయును. తత్ఫలితముగా మన క్రింది కేంద్రములు కూడ బలము నొంది శక్తిమంతములగును. వేరు మాటలలో, క్రింది కేంద్రములను ఊర్ధ్వ కేంద్రముల అధీనమున కందిచ్చుటనే చేయవలెను. కాని, అది కూడ వాని సంపూర్ణ ప్రజ్ఞాస్థితికి తీసికొనివచ్చిన అనంతరమున మాత్రమే.

---

100. మనము గుణము నుండి దానిని కలిగి యున్న వస్తువునకును, అచ్చట నుండి మూలమునకును పోవుదుము. అందు వలన స్మరణమును అభ్యసించుటకు మనము గుణమును గైకొని దానిపై మన ఆలోచనను ఉంచెదము. దాని భావ మేమన గుణమును కలిగియున్న వానిని చేరి అప్పుడింకను అతీతముగా మూలము కడకు పోవుదుము. ఇది సహజ విధానము; మిక్కిలి ఫలప్రదమైనది కూడ.

---

101. కామ వికారములు నిర్మూలింప బడినప్పుడు మేధాశక్తి పూర్తిగ నశించును. కారణ మేమన కామ వికారములే ప్రేరణను సృష్టించును, ప్రేరణ మేధాశక్తిని సృష్టించును. అందువలన, అవి క్రమబద్ధము కావింప బడవలసి యున్నవి. వేరు మాటలలో చెప్పవలెనన్న పాశవిక కామము, మానవీయ కామముగా పరిణతి నొందవలెను.

---

102. ప్రతి వస్తువునందును, సూక్ష్మాతిసూక్ష్మ అణువు నందు కూడ త్రిమూర్తిత్వము కలదు. ప్రతి బీజాణువు తన యందీ మూడు గుణములను కలిగియున్నది. అవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కార్యములను పోలి యుండును. అనగా ఒకటి తన యందు సృష్టించు శక్తిని; రెండవది పెంపుచేయు, వృద్ధి చేయు శక్తిని; మూడవది విధ్వంసక శక్తిని కలిగియున్నది. ఒక్కొక్క దాని కార్యములోను సరియైన పొందిక గలదు. దాని నుండి ఒక్కొక్క దాని క్రియ, ప్రతి క్రియలను పరిశీలించి వాని ఫలితములను గుర్తింపగలము.

---

103. శాస్త్రములు ఒక దాని నొకటి వ్యతిరేకించు కొనుచున్నవి. కాని, అవి యోచించి ఒక పరిష్కారమునకు వచ్చుటకు అవకాశమిచ్చును; గాన అవి మనకు ఉపయుక్తములు. ఇంతియేగాక అవి ఇంకొక సుగుణమును కలిగియున్నవి. ఇవి ప్రతి అభిరుచి, మనస్తత్వము మనఃస్థాయిని కలిగిన మనుష్యులకు వారి ఆధ్యాత్మిక పురోగమనమునకు ఉపాయములను పద్ధతులను ఈయగలవు. ప్రతియొక్కరు శాంతి నపేక్షింతురు. సాక్షాత్కారము వారిధ్యేయము కాదని దాని అర్థము. ఆ సందర్భమున ఒకడు శాంతిని మాత్రమే పొందగలడు కాని సాక్షాత్కారమును కాదు. కాని, సాక్షాత్కారమే ధ్యేయమైనచో శాంతి తనకు తానే దాని వెంటనే వచ్చును. సాక్షాత్కారమున నేమియో తెలిసికొనుటను మాత్రమే అపేక్షింపరాదు, దానిని పొందుటకు కూడ ప్రయత్నింప వలయును.

---

104. పాపాత్ములకు నరకము; అజ్ఞానులకు స్వర్గము; అమాయకులకు బ్రహ్మలోకము కలవు. కాని విజ్ఞులకు, పండితులకు వారు స్వయముగా నిర్మించుకొనిన కృత్రిమ స్వర్గము; దుర్బలులకు ఈ అశాశ్వత ప్రపంచము. ఈ దుర్బలు లెవరై యుండవచ్చును? వారు తమపై తామాధారపడని వారును, ఆత్మ విశ్వాసము లేనివారును మాత్రమే.

---

105. మానవుడు భగవంతుని ఏ రూపమున ఆరాధించిన ఆయనను అదే రూపమున పొందగలడని గీత చెప్పుచున్నది. కాని సామాన్యమగు నిబ్బంది ఏమన జనులు ఏ రూపమునందునను భగవంతుని ఆరాధింపక, దానికి బదులు కేవలము రూపమునే ఆరాధింతురు. దానివలన మూలముననున్న సత్యతత్త్వము పూర్తిగ అదృశ్యమగును. నిజమునకిదియే పెద్ద తప్పు.

---

106. తనను దర్శించియుండి కూడ తనకు దూరముగ నుండు వానిని మాత్రమే భగవంతుడు ప్రేమించును. అనగా తన మానవత్వము యొక్క అంతస్తును పూర్తిగ ఎరిగియుండి, భక్తివలయమునందే నిరంతరము ఉండుచు, హృదయమునందు భగవంతుని స్మరణమును సజీవముగా నుంచుకొని తీరవలెనని దాని అర్థము.

---

107. మనస్సు యొక్క క్రియారంగమే హృదయము. మనస్సు ఎల్లప్పుడును అది ఉండినట్లుగనే ఉన్నది. మనస్సుయొక్క క్రియారంగముగ హృదయము సరిదిద్దబడవలసి యున్నది.

---

108. హిందువుల ఆధ్యాత్మికతకును, ముస్లిం సూఫీల ఆధ్యాత్మికతకును మధ్య విస్తార భేదము కలదు. సూఫీలది ఆధ్యాత్మికత మరియు పదార్థము యొక్క సమ్మిశ్రమము. హిందువులది సత్యతత్త్వమున కత్యంత సమీపము.

---

109. సిద్ధాంతపరమైన తత్వజ్ఞానముయొక్క ఫలితమే విభ్రమము. తత్త్వజ్ఞానము నాశ్రయించువాడు విభ్రమములో తననే పోగొట్టుకొనును. సత్యతత్త్వమునందు విభ్రమము ఎంతమాత్రము లేదు.

భగవంతుని వివరించి చెప్పుట మిక్కిలి కష్టము. ఏలయన, ఆయనతో పోల్చతగినదేదియు లేదు. అందువలన, వ్యత్యాస పద్ధతినే విధిలేక మన మనుసరింపవలసి యున్నది.

---

110. సామాన్యముగ మోక్షమే అత్యధిక మతధర్మ సాధనములకు అంతిమ బిందువుగ భావింపబడు చున్నది. కాని, మోక్షము రెండు విధములుగ – ముక్తిగను, విమోచనముగను – తెలియబడుచున్నది. జనన మరణముల సామాన్య క్రమమునందొక తాత్కాలిక విరామస్థితికి సంబంధించి నట్టిది ముక్తి. ఈ తాత్కాలికమగు నిలుపుదల భిన్న సందర్భములలో ఒకడు పొందిన దాని కనుగుణముగ భిన్నమైన కాలావధులకు విస్తరించి యుండును. ఆ అవధియందు ఆత్మ పునర్జన్మమునుండి స్వేచ్ఛ ననుభవించును. కాని, ఆ గడువు ముగిసిన అనంతరము అది మరల భౌతిక రూపమును పొందుటకు ప్రపంచములోనికి వచ్చును. కాని విమోచన విషయమున, అది ఒకమారు సాధింపబడినప్పుడు, ఆత్మ మరల భౌతిక రూపమునకు వచ్చుటకు నవకాశమే యుండదు. విమోచనము అక్షరాల జన్మ, పునర్జన్మల క్రమముయొక్క అంతమే.

---

111. మరణించినవాడు సామాన్యముగా మరల జన్మించి తీరవలెననుట నిజము. కాని, ఉన్నత పురోగతిని పొందిన మహాత్ములు, ప్రవక్తల యొక్క ఆత్మల విషయమున నిది నిజము కాదు. ఏలయన, వారు శారీరకముగా మరణించినట్లు పైకగపడునది, ఆ పదముయొక్క యధార్థ భావమున, మరణము కాదు. వారి ఉనికి స్థూలతర స్థాయినుండి సూక్ష్మతర స్థాయికి రూపాంతరము నొందుట మాత్రమే, అది. కావున స్థూలతర భౌతిక రూపమునకు వారు తిరిగివచ్చుట అను ప్రశ్నయే లేదు. వారు ఆత్మనిరసనమును ఫలింపచేసికొని అప్పుడే మరణావస్థను (ఒక ప్రత్యేక విధమైన భౌతికరూపము యొక్క అంతము, అను సామాన్యార్థమున) అనుభవించిరి. వేరు మాటలలో అది, మానవుడు గాఢముగా మునిగియున్న భౌతికత్వము యొక్క ఫలితమునుండి విముక్తి అని అర్థము. దాని ఫలితముగ వారు భౌతిక దేహమును అట్లే కలిగియుండుచునే, తాము మరణించి వెడలిపోతి మను భావమును అనుభవింప మొదలిడుదురు. ఇది ఒక నిర్దిష్టమైనట్టి ఆధ్యాత్మిక స్థితి. చాలినంత ప్రగతి అనంతరముననే దీనిని పొందవచ్చును. ఇది బీజ దగ్ధ స్థితిగా తెలియబడును. శబ్దార్థ ప్రకారము వారు మరణింపరు. తత్ఫలితముగా, వారి విషయమున పునర్జన్మ యను ప్రశ్నయే ఉత్పన్నము కాదు.

---

112. జీవన్ముక్తి, విదేహ ముక్తి అను పదములు సామాన్యముగ అనేక భిన్నార్థములలో నుపయోగింపబడు చున్నవి. రామాయణ గ్రంథకర్త తులసీదాసు 'విదేహ' అను పదమును జనక మహారాజు విషయమున ఉపయోగించెను. అది కులనామము మాత్రమే. అతని ఆధ్యాత్మిక సిద్ధులతో దాని కెట్టి సంబంధము లేదు. ఈ రెండు పదములు ప్రత్యేకమైనట్టి ఆధ్యాత్మిక స్థితులను సూచించును. అవి ఒకే విధముగ

ఉండును. 'జీవన్ముక్తి' శారీరక ప్రజ్ఞనుండి విముక్తి అయినప్పుడు కలుగు స్థితిని సూచించును. ఈ స్థితి పక్వము నొందుటకు పురోగమించినప్పుడు అది 'విదేహ ముక్తి'గా పిలువబడును.

---

113. శ్రీ అరవిందులు 'అతీత మనస్సు'ను గూర్చి ఎక్కువగా చెప్పిరి. దాని నాయన భూమిపైకి దింపి తీసికొనివచ్చుచుంటినని చెప్పుకొనిరి. ప్రపంచమున మహాపురుషుని రూపమున అతీతశక్తి ఉనికిలో నున్నప్పుడు అది వాస్తవమునకు ఎల్లప్పుడు భూమిపైకి వచ్చుచునే యుందురు. ప్రపంచ స్వరూపమును మార్చుటకై తానంతటదియే పనిచేయు శక్తి వాస్తవమునకు 'అతీత మనస్సు' కాదు. కాని, అంతకంటెను బలమైనట్టి అత్యంత సూక్ష్మ స్వభాముగల శక్తి. అర్థము చేసికొనుటకు నేను దానిని "అతి–అతీత మనస్సు" అని పిలువవచ్చును. అది సత్వరజస్తమో గుణముల స్థాయికి పైనున్నట్టిది. బాగుగా పైన నింకను అధికమైన శక్తి యున్నది. ప్రకృతియొక్క ప్రత్యేక కార్యము కొరకవతరించిన మహాపురుషునిచే అది ఉపయోగింపబడుచున్నది; మరియు ఉపయోగింప బడగలదు కూడ. సహజమార్గ ధ్యేయమగు అత్యున్నత లక్ష్య మిదియే.

---

114. సహజముగా, భగవంతుని భావము దానితోపాటు అత్యున్నత శక్తియొక్క భావమును కొనివచ్చును. మన యందే విధమైన శక్తిని పెంపొందించుకొనుటకు దాని నంటుకొని యుందుము. ఇది నిస్సందేహముగా సహజము, అదే సమయమున, ఆవశ్యకము కూడ. తారతమ్య పద్ధతులచే కూడ ఈ తేడా మన అవగాహనకు తీసికొనిరాబడును. మనకన్నను గొప్పదైనది, శక్తిమంతమైనది ఏదోయొకటి మన దృష్టియందుండిననే కాని మనకంటెఎన్నడును పైకి పోజాలము. ఈ వస్తువే పరోక్షముగా మన దృష్టికి కేంద్రమగును. ఆధ్యాత్మిక పథమున నున్న అన్వేషకుడు, భగవంతుడు అత్యధిక శక్తి యన్న భావమును తుడిచివేసి నట్లయిన, అతడు దానికడ కెన్నడును ముందునకు నెట్టుకొని పోజాలడు. కావున, ఆ దృష్టియుండుట ఆవశ్యకము. కాని అదియు కూడ, దాని మూలమున ఏమి కలదో తెలిసికొనునంతవరకు మాత్రమే ఉండిన చాలును. శక్తి ఎచ్చట నుండి ప్రారంభమగునో ఆ మూలమున ఎట్టి క్రియయు లేదు. అచ్చట క్రియయే ఉండినచో వెలుపలకు వచ్చు వస్తువులు ధ్వంసమైన స్థితిలో ఉండియుండును. ప్రస్తుతము మన కుండినట్లుగా సృష్టి ఉనికిలోని కెన్నడును వచ్చియుండెడిది కాదు. ఈ వాస్తవముల నన్నిటిని దృష్టియందు కలిగియుండి భగవంతుని పరిపూర్ణ స్థితిలోని తొంగిచూచినట్లయిన అచ్చట క్రియాతీత కేంద్రము నతడు చూచును. అది శూన్యత్వమునకు సమానము. మూలమునగల "శక్తిరహిత శక్తి" యందు పాలు పంచు కొనినట్లయిన మానవుడు అత్యంత శక్తిమంతుడు కావచ్చును. ప్రతి యొక్క క్రియకు చెందిన క్రియాతీత కేంద్ర మెల్లప్పుడును క్రియాహీనముగా నుండును. ఇది ప్రకృతియొక్క యధార్థ స్థితి. ఇది కొన్ని రంగములందును అన్వయించబడగలదు.

---

# దశ నియమములు

1. ప్రొద్దు పొడవక ముందే నిద్రలెమ్ము, నిర్ణీత సమయమున – సూర్యోదయమునకు ముందయినచో మంచిది – ఒకే ఆసనమున కూర్చొని ప్రార్థన, పూజాదికములను కావింపుము. మానసిక శారీరక పారిశుద్ధ్యమును ప్రత్యేకముగా పాటింపుము.

2. ప్రేమ, భక్తి పూర్వకమైన హృదయముతో ఆధ్యాత్మికోన్నతి కొఱకు ప్రార్థన జరిపి, పూజ నారంభింపుము.

3. భగవంతునితో సంపూర్ణ ఐక్యము పొందుటయే నీ గమ్యముగా నిర్ణయించుకొనుము. వానిని సాధించునంత వఱకు విశ్రమింపకుము.

4. ప్రకృతితో సారూప్యము పొందుటకు నిష్కపటముగాను, నిరాఢంబరముగాను ఉండుము.

5. సత్యసంధత కలిగి యుండుము. దుఃఖములను దివ్యమైన దీవెనలుగా భావించి, అవి నీ మేలు కొఱకే కలుగచున్నవని కృతజ్ఞతా భావముతో నుండుము.

6. అందఱిని సోదరులగా భావించి, అట్లే వారి నాదరింపుము.

7. ఇతరులు కీడు చేసినచో ప్రతీకార బుద్ధి పూనకుము. దానిని దివ్య బహుకృతిగా కృతజ్ఞతతో స్వీకరింపుము.

8. ఋజువర్తన తోడను, భక్తి భావము తోడను ఆర్జించిన దానితో తృప్తి చెంది, నిరంతర దివ్యభావముతో దాని నారగింపుము.

9. ఇతరులలో భక్తి, ప్రేమ భావముల మొలకెత్తించునట్లుగా నీ జీవనము మలచుకొనుము.

10. పడుకొన బోవు సమయమున, దైవసాన్నిధ్య భావనతో, నీ వొనర్చిన తప్పులను గూర్చి పరితప్తుడవుకమ్ము. వాటిని మఱి చేయనని వినమ్ర భావముతో భగవంతుని క్షమాపణ కోరుము.